# బ్రహ్మజిజ్ఞాస

ప్రథమ భాగము

మట్టిబోయిన రామసుబ్బయ్య



తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

# బ్రహ్మజిజ్ఞాస

## అద్వైత బోధ

అను

## ప్రథమ భాగము

రచయిత

**మట్టిబోయిన రామసుబ్బయ్య**

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**2001**

# BRAHMA JIJÑĀSA - Part - I

(A Study on Advaita Philosophy)

by
MARRIBOYINA RAMASUBBAIAH

T.T.D. Religious Publications Series No. 241

© All Rights Reserved

T.T.D. First Edition : 2001

Copies : 2,000

Published by
Dr P Krishnaiah, I A S ,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507.

Printed at
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507.

# ముందుమాట

వేదాంత విజ్ఞానాన్ని సామాన్యులకు అందించాలనే ఉదాత్తమైన ఆశయంతో రచింపబడిన ఉద్గ్రంథం 'బ్రహ్మజిజ్ఞాస'. సహజమైన ఈశ్వరచింతన, వైరాగ్యధోరణి, బహుగ్రంథ పరిశీలన, అనేక సంవత్సరాల అనుభవం - ఇవన్నీ ఏకత్ర సమన్వయం పొందిన జ్ఞానవయోవృద్ధులు శ్రీమల్లిబోయిన రామసుబ్బయ్యగారి లేఖిని నుండి ఈ గ్రంథం అపూర్వంగా రూపొందింది!

ఈ గ్రంథం నాలుగు భాగాలుగా వింగడింపబడి ఉంది. ఇందులో మొత్తం పదహారు ప్రకరణాలు ఉన్నందున, దీనిని ''వేదాంత షోడశి'' -- అనే నామాంతరంతో పేర్కొనవచ్చునని ఇందలి ఉపోద్ఘాతంలో సూచింపబడింది. ప్రశ్నోత్తరాల రూపంలో సంభాషణాత్మకంగా కొనసాగటం ద్వారా, ఈ రచన ప్రాచీన ఆధ్యాత్మిక గ్రంథాల సంప్రదాయాన్ని చక్కగా పుణికిపుచ్చుకొన్నది.

ఇపుడు ప్రచురింపబడిన ఈ సంపుటం 'బ్రహ్మజిజ్ఞాస' - అనే ఈ బృహద్గ్రంథంయొక్క ప్రథమ భాగం. ఇందులో మూడు ప్రకరణాలు ఉన్నాయి. ఈ మూడు ప్రకరణాలలోని విషయం ప్రధానంగా అద్వైతసిద్ధాంతానికి సంబంధించింది. ఇది తరువాతి భాగాలకు - అనగా అనుష్ఠానమార్గాలను తెలిపే ద్వితీయభాగం, ఆ యా దర్శనాలను, మతాలనుగూర్చి వివరించే తృతీయభాగం, అచలమతంయొక్క స్వరూప, స్వభావాలను విశదీకరించే చతుర్థభాగం - అనే మూడు భాగాలకు విపులమైన అవతారికవలె విలసిల్లుతూవుంది.

ఈ ప్రథమ భాగంలాగే తిరుమల తిరుపతి దేవస్థాన ధార్మిక ప్రచురణల కార్యక్రమం ద్వారా ఈ గ్రంథంయొక్క ద్వితీయ, తృతీయ, చతుర్థభాగాలు సైతం త్వరలోనే వెలువడనున్నాయి.

ఈ చరాచర సృష్టికి అధిపత్యంవహించి ఉండే పరమాత్మ (బ్రహ్మ)ను గూర్చి తెలిసికోవలెననే ఆసక్తి (జిజ్ఞాస) గలవారందరూ విశిష్టశైలిలో విలసిల్లుతూవున్న ఈ 'వేదాంతషోడశి'ని చక్కగా పఠించి, ఆత్మోన్నతినీ, ఆనందాతిశయాన్నీ పొందగలరని మా ఆశయము; ఆకాంక్ష!

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

ఓమ్
శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః

# ఉపోద్ఘాతము

పరమేశ్వరానుగ్రహమున ఈ 'బ్రహ్మజిజ్ఞాస' రచన సంపూర్ణమయినది. ఈ గ్రంథము రచించుటకు గల కారణము తెలుపునపుడు నన్ను గుఱించి కొంత చెప్పుకొనుట అవశ్యకమై యున్నది.

## పరమార్థ చింత

నాకు బాల్యముననే వేదాంతమును తెలిసికొనవలెనను నిచ్ఛకలిగెను. కడపజిల్లా కమలాపుర వాస్తవ్యులు బ్రహ్మశ్రీ విద్యానంద కైప శేషయ్యగారి పరిచయభాగ్యము లభించెను. వీరు గొప్ప మేధావులు, కవులు, పండితులు, బ్రహ్మవిదులు. అన్ని మతములకంటె అద్వైతమే శ్రేష్ఠమైనదని వారు నాకు బోధించిన మహనీయులు. దురదృష్టవశమున ఆ పిమ్మట కొలది కాలముననే వారు కైవల్యమును చెందిరి. ఇది ఇప్పటికి సుమారు 43 సంవత్సరముల క్రిందటి మాట.

తరువాత కొంతకాలమునకు చిన్నతనమున నాకుగల వైరాగ్యము, ఆత్మవిచారము సన్నగిల్లెను. లౌకికములగు వ్యాసంగము లెక్కువయ్యెను. వెలుగు నీడలతో జీవితమునందు నాకు 45 సంవత్సరముల వయస్సు గడచెను. నా యేకైక పుత్రునకు వివాహము చేసి నాకుమార్తెను, భార్యను అతని సంరక్షణకు ఒప్పగించి ఏ యాశ్రమమునందైన జీవిత శేషమును గడుపనెంచితిని. తానొకటి తలచిన దైవమొకటి తలచునన్న సామెత నాయెడ సార్థకమయ్యెను.

## వ్యాధి

నా కుమారునికి వివాహము చేసిన నాలుగు మాసములకే 1949వ సంవత్సరమున డిశెంబరు నెలలో నేను జబ్బుపడితిని. ఆ వ్యాధినుండి ఇప్పటికిని పూర్తిగా విముక్తి పొందలేదు. వైద్యులు నరముల దౌర్బల్యమనిరి.

దాని లక్షణములివి : సుమారు అఱగంటకంటె ఎక్కువకాలము కూర్చుండలేను. సుమారేబది గజములు నడచినంత మాత్రముననే అధిక శ్రమ కలుగును ఒక పంక్తి అక్షరములు చదివినను, వ్రాసినను అంతటితో ఏపని చేయుటకును శక్తి యుండదు ఒకగంటసేపు గ్రంథమును వినుటకైనను శక్తి లేకుండును సుప్రసిద్ధ వైద్యులచే చికిత్స పొందితిని లాభమేమియు లేకపోయెను ఇదియును ఒకవిధముగ నామేలునకే యనుకొంటిని. ఎట్లనగా· బడికిపోవుట మాని యథేచ్ఛగా తిరుగుచుండు బాలుని, వాని తండ్రి పట్టితెచ్చి స్తంభమునకు కట్టివేసి పుస్తకము వాని చేతికిచ్చి చదువుమని దండించినట్లు, చిన్నతనమున నాకున్న ఈశ్వర చింతనమును, వైరాగ్యమును పోగొట్టుకొని లౌకిక విషయ లాంపట్యమున తిరుగుచుండునట్టి నేను ఆత్మలాభము పొందలేదని తలచి నా యిష్ట దైవమగు శ్రీరామచంద్రుడు నన్నిట్లు వ్యాధితో కట్టివైచెనని తలచితిని ఈ స్థితి నాకు మిగుల కష్టమయినను ఇదియే నాకు సంసార తరణోపాయ మని తలచి అన్ని చింతలు వదలి ఆత్మవిచారమునందే కాలము గడుపుచుంటిని. అట్లే సుమారు తొమ్మిది సంవత్సరములు గడచిన పిమ్మట నాకు కొంతశక్తి కలిగెను.

## గ్రంథ రచన

అట్టి స్థితిలో ఈ గ్రంథము వ్రాయవలెనను సంకల్పము కలిగెను ఇందువలన నేను అధ్యాత్మ విషయములను మననము చేసికొనుటకును, సంస్కృతమున పాండిత్యము లేని నావంటి జిజ్ఞాసువులకు సులభముగా వేదాంత విచారము చేసికొనుటకును ప్రయోజనకారిగా నుండగలదని తలచితిని స్వయముగ వ్రాయుటకు నాకు శక్తిలేనందున లేఖనమునకు ఇతరుల సహాయ మవసరమయ్యెను నేను గ్రంథము ఆశువుగా చెప్పుచుండగా తీరిక కలిగినపుడు చి|| సౌ|| నా కుమార్తె, చి|| నా కుమారుడును, వ్రాయుచుండిరి ఇట్లుండ నా కుమారుడు న్యాయవాదివృత్తి వదలి ఉద్యోగమున ప్రవేశించెను. గిద్దలూరునకు కుటుంబ సహితముగ పోయితిమి. గిద్దలూరునుండి పుంగనూరునకును, అచ్చటనుండి నెల్లూరునకు బదిలీయయ్యెను చిత్తుప్రతియందు కొన్ని విషయములు పూరింపవలసి యుండెను భగవదనుగ్రహమున నాకు మఱికొంత ఆరోగ్యము కలిగెను. గ్రంథమునం దచ్చటచ్చట శ్లోకములు, పద్యములు వ్రాయుటకు శ్లోకముల సంఖ్యలు వేయుటకు

స్థలము వదలియుంటిని. వాటిని పూరించుటకు కావలసిన గ్రంథము లన్నియు నావద్ద లేకుండెను నెల్లూరులో తిక్కన గ్రంథాలయమున కొన్ని గ్రంథములు లభించుటచే నా కార్యము సులభమయ్యెను.

ఆంధ్రప్రదేశమున అచలవాద మచ్చటచ్చట ప్రచారమునందున్నది. అచలబోధ అద్వైతమునకంటె పై మెట్టని అచలవాదులు చెప్పుదురు. అచలవాదులు కాని కొందఱు పండితులు సహితము అట్టి అభిప్రాయమే కలిగియున్నారు అచలవాదముయొక్క స్వరూపము మొదట నేవిధముగ నుండి యెట్టి పరిణామమునొంది యిప్పటి స్వరూపము ధరించినదో ఆ వివరమును నాకు తెలిసినంతవఱకు ఈ గ్రంథముయొక్క తృతీయభాగమున FNలో వివరించితిని. అద్వైత మిట్టిదని తెలిసిన యెడల అచలమతమును సులభముగ తెలిసికొనవచ్చును ఆ కారణమువలన అద్వైత సిద్ధాంతమును తెలుపు ప్రకరణములు ప్రథమ భాగమనియు, తరువాత అనుష్ఠాన మార్గమును తెలియజేయు జ్ఞానయోగ, రాజయోగ, కర్మయోగ, భక్తియోగములు నాలుగును ద్వితీయ భాగమనియు, అచల బోధను తెలుపు ప్రకరణములు తృతీయ భాగమనియు - ఈ గ్రంథమును మూడుభాగములు చేసితిని

కొన్ని కారణములవలన గ్రంథమంతయు ఒక్కసారి అచ్చువేయించుటకు వీలుపడనందున ప్రథమభాగమును మాత్రమే ప్రస్తుతము అచ్చు వేయించితిని ఈశ్వరానుగ్రహమున్నచో ద్వితీయ, తృతీయ భాగములు రెండును ఒక్క సంపుటముగనో లేక వేఱు వేఱుగ రెండు సంపుటములుగనో అచ్చు వేయించదలచితిని వేదాంత గ్రంథము వ్రాయుట నావంటివానికి తలకు మించిన పనియని నాకు బాగుగ తెలిసియుండియు నే నీ కార్యమునకు పూనుకొంటిని ఇది భగవంతుని ప్రేరణయని అనుకొంటిని ఈశ్వరుడే నానోట ఈ గ్రంథమును పలికించెనని నా నమ్మకము ఈ ప్రథమభాగము వ్రాయునపుడు తృతీయభాగమున వ్రాయవలసిన అచలవాదమును మనస్సులో నుంచుకొని వ్రాయుటవలన కొన్ని కొన్ని ఘట్టములను కొంత హెచ్చుగ వ్రాసితిని అచలబోధ యిట్టిదని ఈ భాగమును చదివిన పాఠకులకు స్థాలీపులాక న్యాయము (కుండెడు అన్నము ఉడికినదా లేదా అని ఒక మెతుకును పట్టిచూచి తెలిసికొనునట్టి పద్ధతి) ననుసరించి తెలియజేయుటకుగాను ఈ భాగమునం దచ్చటచ్చట పుటలయొక్క క్రింది భాగము (Foot Notes) లో

అచలమత స్థాపకులగు శివరామ దీక్షితులవారి వాక్యములను కొన్నింటి నుదాహరించితిని

నా ప్రార్థన మన్నించి శ్రమయని తలంపక, ఈ గ్రంథమును చదివి అభిప్రాయములను వ్రాసియిచ్చిన పూజ్యులును, తత్త్వవిదులును నగు పండితులకు కృతజ్ఞతా పూర్వక వందనము లర్పించుచున్నాను

ఈ గ్రంథ రచనకు సహాయపడిన గ్రంథములయొక్క పట్టిక నొక దానిని ఇచట చూపితిని. తద్గ్రంథ కర్తలకును ప్రకటన కర్తలకును నాకృతజ్ఞ తను తెలుపుచున్నాను.

## పండితులకు విన్నపము

గ్రంథముయొక్క చివఱ అచ్చుతప్పులను తెలియచేయునట్టి తప్పొప్పుల పట్టికను చూపితిని ఈ గ్రంథమునం దింకనుగల అజ్ఞాన కృతములగు దోషములను పొరపాటున కలిగిన దోషములను మన్నించి పండితులు దయతో నాకు తెలిపిన యెడల కృతజ్ఞతతో వందన పూర్వకముగ గ్రహించి మఱియొక ముద్రణమునందు సవరించుకొందును.

పరాభవ ఫాల్గుణ శుద్ధ 3 లు
14-3-1967.

ఇట్లు
గ్రంథకర్త

# ద్వితీయ ముద్రణము

ఈశ్వరానుగ్రహమున 'బ్రహ్మజిజ్ఞాస' ప్రథమ భాగము 1967 వ సం|| మార్చినెల యందును, ద్వితీయ భాగము 1969 వ సం|| ఏప్రెల్ నెలయందును, తృతీయ భాగము 1976 సం|| సెప్టంబరు నెలయందును చతుర్థభాగము 1980 వ సం|| జూలై నెలయందును ముద్రింపబడినవి

ఈ గ్రంథమంతయు నాలుగు భాగములు, పదునాఱు ప్రకరణములు 314 అధ్యాయములు, (ఉపోద్ఘాతములు, పలువురి అభిప్రాయములుగాక) గ్రంథభాగము మాత్రము సుమారు 2200 పుటలకు అయినది గ్రంథమంతయు షోడశ ప్రకరణములు కలదగుటవలన ఈ గ్రంథమునకు 'వేదాంత షోడశి' అను నామాంతరము చెల్లును

ఈ భాగము ప్రథమ ముద్రణమున చాల అచ్చుతప్పు లుండినవి వాటిని నీ ముద్రణమునందు సవరించితిని ఐనను ప్రూఫులు దిద్దునప్పుడు పొరపాటున నిలిచిన అక్షర లోపములు మొదలగు స్వల్పదోషములు కొలదిగా నిందును కలవు అవి అంతగా పాటింపదగినవి కాకపోయినను సవరణ పత్రమున వాటిని చూపితిని అందును చూపక జారిపోయిన తప్పులున్న పాఠక మహాశయులను మన్నింపగోరుదును ప్రథమ ముద్రణమున విపులముగా చర్చించియుంటిని ప్రస్తుతము వాటియందు కొంత చేర్చి వ్రాసితిని. అవియు కొంచెమే కాని, క్రొత్త అధ్యాయములుగాని క్రొత్త సిద్ధాంతములు గాని యిందు చేర్చలేదు

ప్రథమ భాగము వెలువడిన ఒక సంవత్సరమునకే దాని ప్రతులు అయిపోయినవి అప్పటినుండి పలువురు జిజ్ఞాసువులు ప్రతులకొఱకు ఉత్తరములు వ్రాయుచుండిరి వ్రాసిన వారికెల్ల, నావద్ద ప్రతులు అయిపోయినవి అని బదులు వ్రాయుచుంటిని ద్వితీయ ముద్రణమును చేయింపుడని కొందఱు కోరుచుండిరి. కాని గ్రంథమంతయు పూర్ణముగ వెలువడినగాని ఈ భాగమును రెండవమాఱు ముద్రించుటకు నా కిష్టము లేదు. ఇందుకు ద్వితీయ భాగమును, ఈ భాగముయొక్క ద్వితీయ ముద్రణమును ఒకసారి సాగించుటకు నా అనారోగ్యము, ధనాభావమే కారణములు వర్తమానకాలమున గ్రంథ రచనమునకంటె గ్రంథమును అచ్చువేయించుట మిగుల కష్టము ధనమున్నను

ప్రెస్సువారి సహకారము ఉండదు ప్రస్తుతము ఎటో వ్యయప్రయాసలతో గ్రంథమంతయు (నాలుగు భాగములు) అచ్చువేయించితిని - శ్రీహరికృప

ఇప్పటికి ద్వితీయ భాగముయొక్క ప్రతులుకూడ దాదాపు అయిపోయినవి కనుక ప్రస్తుతము 1-2 భాగములు పునర్ముద్రణము చేయించవలెనని సంకల్పము కలిగెను కాని చిరకాలమునుండి నన్ను పీడకయుండు నరముల దౌర్బల్యమను వ్యాధికితోడు ఎడమకంట శుక్లము ముదిరినది ఆ కన్ను ఆపరేషను చేయించుకుంటిని కంటిచూపు పోయినది

(ఒంటి కంటిచూపు, అదియును పూర్తిచూపు కాదు వయస్సు నాకిప్పుడు 77 సంవత్సరములు)

ఈ చతుర్థ భాగము ముద్రణము పూర్తి అయిన వేంటనే "శ్రీరామావతార రహస్యము" అనుగ్రంథమును వ్రాయదలచి కొంతవరకును వ్రాసితిని ఇప్పుడు కంటిచూపు తగ్గినందున దానిని పూర్తి చేయగలనో చేయలేనో చెప్పలేను

ఈ బాగము ప్రథమ ముద్రణముయొక్క ఉపోద్ఘాతమున బ్రహ్మజిజ్ఞాస మూడు భాగముల గ్రంథమనియు అందు తృతీయ భాగము అచలబోధను తెలుపునట్టి దనియు వ్రాసితిని ద్వితీయ భాగముయొక్క రచన ముగిసిన వేంటనే రామడుగు శివరామ దీక్షితుల అచల మతబోధకు సంబంధించిన గ్రంథ భాగమును చిత్తుప్రతిని వ్రాసియుంటిని. దానిని తృతీయ భాగముగా ముద్రింపదలచితిని కాని, దీక్షితులవారి అచల బోధను చక్కగా అవగాహనము చేసికొనవలెనన్న పాఠకుల కందఱకు మఱికొంత వేదాంత విషయము తెలిసియుండిన మంచిది కనుక షడ్దర్శనములు, షణ్మతములు - వీటిని గుఱించి తెలుపుట మంచిదని వాటిని వ్రాసి తృతీయ భాగమనియు, అచలబోధను తెలుపు గ్రంథ భాగమును చతుర్థ భాగమనియు ఆ విధముగా 3-4 భాగములు రెండు సంపుటములుగా ముద్రించితిని

'బ్రహ్మజిజ్ఞాస' రచన ప్రారంభించునపుడు నాశరీరోపాధి యేస్థితితో నుండెనో యీ భాగములో ప్రథమ ముద్రణముయొక్క ఉపోద్ఘాతమున తెలిపియుంటిని. అప్పటిలో కొందఱు మిత్రులు సన్నిహితులు "ఇతడేమి ఈస్థితిలో గ్రంథమును వ్రాయుటేమి" అని సంశయించిరి. వారి భావమును నా యెదుట ప్రకటించిరి గ్రంథమంతయు వ్రాయగలనను నమ్మకము నాకును

లేదు ఈశ్వరానుగ్రహమున్న అసాధ్య మేమున్నది! అనారోగ్య మెక్కువైనపుడు గ్రంథ రచన నిలిచిపోవుటయు, కొంచె మారోగ్యము కలిగినపుడు కొంత భాగము ఆశువుగా చెప్పుచు నావారిచేత వ్రాయించుటయు, కూర్చుండుటకు శక్తి కలిగినపుడు కొంత స్వయముగా వ్రాయుటయు - ఈ విధముగా గ్రంథము పూర్తి అయినది

గ్రంథమునువ్రాసి అచ్చు వేయించుటకు పూర్వము పెద్దల కెవరికైన చూపుట కొందఱికి అలవాటు నేనీ గ్రంథమును సరిచూచి ఇమ్మని యెవ్వరికి చూపలేదు భగవంతునిపై భారము వైచితిని గనుక తప్పో - ఒప్పో వ్రాసిన దానిని ప్రచురించితిని తప్పులను పెద్దలు మన్నింతురని నమ్ముచున్నాను

## కృతజ్ఞత

ఈ గ్రంథముయొక్క ప్రథమ ద్వితీయ భాగముల పునర్ముద్రణలో తిరుమల తిరుపతి దేవస్థానమువారు ద్రవ్య సహాయ మొనర్చిరి ఈ విషయమున భగవంతుడగు శ్రీ వేంకట రమణస్వామి వారికిని తి తి దేవస్థానపు కార్య నిర్వాహణాధికారి శ్రీ పి.వి ఆర్ కె ప్రసాద్, ఐ ఎ.ఎస్ గారికిని, పబ్లిక్ రిలేషన్సు ఆఫీసరు శ్రీ రావుల సూర్యనారాయణమూర్తి, ఎం ఏ, బి ఇడి గారికిని, సప్తగిరి పత్రికా సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు, ఎం ఏ గారికిని, కమిటి సభ్యులు శ్రీ ధూళిపాళ అర్కసోమయాజులు, ఎం ఏ గారికిని నా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలుపుకొనుచున్నాను

సర్వే జనాః సుఖినో భవంతు
పరమేశ్వరార్పణమస్తు
శుభమస్తు

ప్రస్తుత నివాసము
చిత్తూరు
10-10-1981

ఇట్లు
గ్రంథకర్త

*

## శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య
## శ్రీశ్రీ రామకృష్ణానందస్వాములవారి
## (పరిచయవాక్యము)

# సాధుప్రశంస

(శ్రీ రామకృష్ణానందస్వామి, "గీతావాణి" పత్రికా సంపాదకులు, అఖిలాంధ్ర సాధు పరిషత్తు ప్రధాన కార్యదర్శి, భూమానందాశ్రమం, కడపజిల్లా)

బ్రహ్మమనీషి శ్రీ మట్టిబోయిన రామసుబ్బయ్య గారు రచించిన "బ్రహ్మజిజ్ఞాస" అను గ్రంథమును తీరుబడి లేని నా పర్యటనలలోనే ఉన్న ఓపికతో, చేసికొన్న తీరికతో అమూలాగ్రము పఠించితిని అగాథమగు వీరి గ్రంథ పరిశ్రమకు, అసాధారణమగు ధారణాశక్తికి, గడించిన అనుభవ ధీరతకు అంతరంగము మహదాశ్చర్యనిమగ్న మైనది ఆంధ్రభాషయందు నీ విధమున స్వతంత్రముగ వేదాంత విషయకమై వ్రాయబడిన గ్రంథము ఇదియే ప్రప్రథమమని అనుకొనుచున్నాను

ఇంతకును నిది మొదటిభాగమట. ఇంకను వెలువడవలసిన భాగములు మరి రెండున్నవని గ్రంథకర్తగా రనుచున్నారు. ఈ మొదటి భాగమును చదివిన తరువాత ఆ రెండు భాగములనుకూడ నెప్పుడెప్పుడు చదువుదుమా యనెడి ఆతురత పాఠకులకు కలుగక తప్పదు.

"బ్రహ్మము అందరికి ఆత్మ అది ప్రతివానికి అసలు స్వరూపము తన స్వరూపమును తాను తెలిసికొనుటకు దాని ననుభవించుటకు ప్రతివానికిని జన్మహక్కై యున్నది బ్రహ్మవిద్య ప్రతివాని సొత్తు అది త్రోసిపుచ్చరాని హక్కు. తత్ప్రాప్తికి కావలసినది బ్రహ్మజిజ్ఞాసయే కాని జాతి వర్ణ కుల సామగ్రులు కావు"- అని మొదటి ప్రకరణములో వర్ణ వ్యవస్థను విమర్శించుచు వీరు చేసిన నిరూపణము సత్యానుకూలము, విచారసహము, నిష్పాక్షికమునై యున్నది

ఈ ప్రకరణములో వీరు సామాన్యముగ అందరికి తెలియని కొన్ని క్రొత్త విషయములను వెలువరించి కూడ ఉన్నారు. "యజ్ఞము చేయు బ్రాహ్మణులు పూర్వకాలమున యజ్ఞమును ప్రారంభించు నప్పుడు నడుమునకు

జింకతోలును కాని, వస్త్రమునుగాని బిగించి కట్టుకొందురు ఇప్పటివలె జన్నిదము వారికి లేదు ఇందువలన బ్రహ్మవిద్యను విచారించుటకు సూత్రముతో పనిలేదు. బ్రాహ్మణ కులమునందు చేరుటకు (మాత్రము) సూత్రమవసరము" ఈ విధమున కాలప్రవాహమున మునిగిపోయిన రహస్యములను వీరు బైటవేసినారు

బ్రహ్మవిద్యాప్రాప్తికి ఉదారపుణ్యశీలత, అగాధశ్రద్ధ, సర్వార్పణ భావసంపదయే కావలెను కాని జాతి వర్ణములతో పనిలేదని నిరూపించుటకు ఛాందోగ్యోపనిషత్తులోని జానశ్రుతి కథను దృష్టాంతముగ తెలిపినారు అట్లే జాతి వర్ణములే కాదు, వయస్సుతోకూడ పనిలేదని తెలుపుటకుగాను శ్రీ వివేకానంద రవీంద్రుల నాకర్షించిన సత్యకామ జాబాలుని పాఠకుల ఎదుట నిలిపియున్నారు.

ఇక రెండవ ప్రకరణము మాట ద్వితీయము అద్వితీయమని చరితార్థము చేసిన ప్రకరణమిది గూఢమైన వేదాంత విచారముల నింత విస్పష్టముగ వివరించిన గ్రంథము మరొక్కటి కానరాదు. నూట పదునాఱవ పేజీలోని మిథ్యాత్వ నిర్వచనమును, నూటా ముప్పదియైదవ పేజీలోని మిథ్యాత్వమును గురించిన విచారమును అద్భుతమైనవి ఈ విషయములీ గ్రంథమును ప్రౌఢవేదాంత ప్రకరణ గ్రంథముల స్థాయికి చేర్చినవి

"స్వర్ణ కారునివద్ద అయిదు తులముల బంగారపు ముద్దనిచ్చి సువర్ణ కంకణము చేయించగా అది అయిదు తులముల తూకము మాత్రమే యుండెను మొదట నిచ్చిన అయిదు తులముల బంగారమే యుండెను. కాని కంకణ సంబంధమగు బంగారమేమియు దానియందు లేదు తిరిగి దానిని కరిగించగా అది మొదటివలెనే ముద్ద అయ్యెను ఆద్యంతములయందు లేని కంకణ నామమును, కంకణ రూపమును మిథ్య యాయెను "వాచారంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యం" కారణ సత్తకంటె వేఱుసత్త లేక పోయినను వ్యవహారము కొఱకు ప్రత్యక్షముగ కనబడు కార్యజాతమంతయు వాచారంభణ మనబడును. అనగా 'ఘటమునందు అంతటను మృత్తిక తప్ప వేఱుపదార్థము లేక పోయినను మృత్తికను కుండయని వ్యవహరించినట్లే' యని శ్రుతి తాత్పర్యము ఇట్లు 'బ్రహ్మ సత్యం జగన్మిథ్యా' అను వాక్యముయొక్క అర్థము పూర్తిగ చెప్పబడెను.

సరళ పద్ధతిలోని వీరి నిర్వచనములకు నిదొక్క. మచ్చుతునుక.

మరొక్కచోట చూడవలసిన పనిలేకుండునట్లు పంచీకరణ మీ ప్రకరణమున చెప్పబడినది పంచకోశ విచారము, కూటస్థ చిదాభాసుల

లక్షణము, అగామి సంచిత ప్రారబ్ధముల విమర్శ, మహావాక్య వివరణమును సమగ్రముగ చర్చింపబడినది

"అనందమయ మనగా అనందము ఎక్కువ కలదని అర్థము అనందము విస్తారముగ నున్నదని చెప్పిన యెడల అనందము కానిది కొంత కలదని అర్థమగు చున్న" దని అనందమయకోశమున వారుచూపిన సూటి సూటియైనది

"తురీయమే తురీయాతీతము" అని సమర్థించుచు సోదాహరణముగ వ్రాసిన వ్రాత హృదయంగమమైనది

మూడవ ప్రకరణములో జన్మాంతర సిద్ధాంతమును గూర్చిన వివిధ విషయములు, జీవుని యుత్క్రాంతికి సంబంధించిన దేవ, పితృ యాన గతులు, బ్రహ్మజ్ఞానికి ఉత్క్రాంతి లేదను విషయమును చర్చింపబడినవి

వేదాంత జిజ్ఞాసువులకు కల్గెడి అనేక విధములగు సంశయములను నీ గ్రంథము నివారించగలదు. "మా మతము అద్వైతమునకు పైది" అని అచల వేదాంతులనెడి మాటలకు వారి యుక్తులకు సున్నితముగ సమాధానము లిచ్చియుండుట గమనించదగిన విషయము

శ్రీ రామకృష్ణ పరమహంస స్మరణతో ఈ గ్రంథమునకు మంగళాచరణము ప్రారంభమైనది. ఆ ప్రభువు గ్రంథమునకు, గ్రంథకర్తకు సర్వమంగళ ప్రదాతయగుగాక!

విద్యాతపస్సులతో పూతాత్ముడైన ఈ మహనీయుడు తన అగాథ పరిశ్రమకు ఫలితముగ నీ అద్వైత వేదాంత ప్రకరణ గ్రంథమును వెలువరించి ఆంధ్రమాతను గైసేసి ఆంధ్ర జిజ్ఞాసులోకమును అలరించినందుకు అనంత ధన్యవాదములు.

"వర్ధతాం బ్రహ్మవిద్యా చ-లోకేభ్య స్సుభ మేధతామ్"

— అని ఆశిసూ.

గండిక్షేత్రం
భూమానందాశ్రమం
9-5-67

ఆశీస్సులతో అభినందిస్తూ
(సం) శ్రీరామకృష్ణానందస్వామి

# FOREWORD

**Dr. K. C. VARADACHRI,**
M A , Ph D

Sri Raja Griha,
B G CAR STREET,
TIRUPATI

Date March 17th 1969

Dear Sir,

I thank you very much for sending me your two volumes of Brahma Jijnasa for opinion and foreword, through Mr V.K Rajagopala Aiyangar, Advocate Chitoor I must confees that on persuing your first part, which you sent earlier, I feel that one who is an advaitic scholar should attempt to write on the volumes. My own work has been confined to Visistaadvaita and though on the general phenomenal stand points, there cannot be difference between the several schools of Vedanta on the ultimate questions, there are serious diffrences. The concept of a undifferentiated one substance as Self is not accepted by the Visistaadvaitin. The nature of Bhakti again is something that comes after Knowledge not as a preparation for it Saranaagathi is a means for direct intuition of God but it is not so mainly as it is intended to be a means to seek the favour of God to save the individual from misery, fear and so on The attainment of the Brahmic condition is not anything more than Saamipya and Saannidhya. Your acquaintance with the general points of view of Visitstaadvaita and Saranaagati or Prapatthi is very helpful.

I fully appreciate the standpoint of the Achala to which the Advaita of Sankara leads according to you. I also appreciate your view that the fourth way of direct mergence of God is not to be considered to be a kind of Utkraanti but realisation here itself, for then both space and time and all differences vanish or melt away

leaving the Brahman alone. The motion less experience is according to you Turıyaatiita beyond the Turiiya of the Maandukya-which you eqaate with Sankara's Advaita experience. It is something that is Nirguna Your fine advocacy of this view similar to some similar doctrines of Akaal (Timeless), Akaas (Spaceless may be the high water mark of Yoga of the transcendental kind. It is something that stands apart from even the texts of the Srutis. I believe that your must have a gleam of these experience or are on the brink if it.

Your work will be welcomed by scholars who have carefully studied the advaitic texts and have practised the saadhana that leads to the achala-anubhava

While I feel honoured by your request, I feel that I am hardly capable of doing justice to thes exposition by way of appreciation or evaluation. Your deep sincerety and piety will be amply repaid. What we do require today is not the reading of the old texts alone, but the quest to realise their truths or prove them. That is why a man like Ramana was accepted but it would require that every one should not only admire and worship such men but themselves undertake this heroic (Dhiira) method of proving within themselves the truths of the Srutis or the transcendentalists.

May God bless you with the realisation

With best wishes,

*Yours sincerely,*
(Sd.) D. C. VARADACHARI.

# ఉపోద్ఘాతము

డాక్టరు. కె. సి. వరదాచారి, శ్రీ రాజగృహ, బి జి తేరువీథి, తిరుపతి
ఎం ఎ, పి హెచ్ డి 17-3-1963

ఆర్యా !

చిత్తూరు న్యాయవాది - శ్రీ వి కె రాజగోపాల అయ్యంగారి ద్వారా, మా "బ్రహ్మజిజ్ఞాస" రెండుభాగములను అభిప్రాయము ఉపోద్ఘాతములను వ్రాయు నిమిత్తము, నాకు పంపినందుకు కృతజ్ఞుడను. ఇంతకు ముందే మీరు పంపియుండిన 'బ్రహ్మజిజ్ఞాస' ప్రథమ సంపుటిని చదివి యుండినందున, ఈ గ్రంథమును గూర్చి అభిప్రాయము వ్రాయుటకు అద్వైత పండితుడే తగునని, అందులకు నేను చాలనని ఒప్పుకొనవలసి ఉన్నది నా స్వయం కృషి విశిష్టాద్వైతమునకు మాత్రమే పరిమితమైనది సామాన్య లౌకిక దృక్పథములను పురస్కరించుకొని భిన్నవేదాంత సంప్రదాయము లందును భేదాభిప్రాయములు లేకున్నను, చరమ సిద్ధాంతములను గుఱించి మాత్రము తీవ్రములైన భేదము లున్నవి ఆత్మ అనునది అవిభాజ్యమైన ఏకైక తత్త్వమను భావమును విశిష్టాద్వైతులు అంగీకరింపరు. ఇట్లే భక్తి స్వరూపమును గూర్చిగూడ మతాంతరము గలదు. జ్ఞానానంతరము భక్తి కలుగుచున్నదిగాని, జ్ఞానమునకు భక్తి సాధనము కాదు భగవంతుని గూర్చిన అంతర్ జ్ఞానమునకు శరణాగతి ఒక సాధనమేగాని, వ్యక్తిగత దారిద్ర్య భయభీతులను పోగొట్టుటకును, భగవంతుని అనుగ్రహమును పొందుటకును మాత్రమే అది సాధనమను అభిప్రాయము సరియైనది గాదు బ్రాహ్మీస్థితియొక్క సిద్ధి అనునది సామీప్య సాన్నిధ్యములకన్న భిన్న మైనది కాదు

విశిష్టాద్వైతమునకు సంబంధించిన సామాన్య సిద్ధాంతములను, శరణాగతి, లేక ప్రపత్తి విషయములందును మీకున్న పరిజ్ఞానము మిక్కిలి ఉపయోగకారియై యున్నది

శంకరాచార్యుల అద్వైతముకూడ "అచలము" నకే దారితీయునన్న మీ అభిప్రాయమును నేను సంపూర్ణముగ సమాదరింతును దైవ సాయుజ్యమును ప్రాపింపజేయు తురీయ పథము ఒక విధమైన ఉత్క్రాంతిగా భావించరాదనియు, అది ఇహలోకమున పొందు ఆత్మసాక్షాత్కారమే అనెడు మీ అభిప్రాయమును

అంగీకరించి కొనియాడుచున్నాను ఏలయన - తురీయావస్థలో ఆకాశ, సమయాది విభేదము లన్నియు లయమైపోయి, కేవలము ఒక్క బ్రహ్మమే భాసించుచుండును మీ అభిప్రాయమున, అచలానుభూతి మాండూక్యుడు పేర్కొనిన తురీయమున కన్న అతీతమైనదియును, శంకరుని అద్వైతానుభూతితో సమానమైనదియు అగుచున్నది అచలానుభూతి నిర్గుణమైనది అకాలము, ఆకాశములకు సంబంధించిన సిద్ధాంతములకు సమానమైన ఈ అచలానుభవమును గూర్చి మీరు గావించిన ప్రతిపాదనము రమణీయమై అతీతయోగ విధాన వివరణమున శిఖరాయమానముగ నున్నది. శ్రుతిప్రమాణములకన్న మీ సిద్ధాంతము విలక్షణముగా నున్నది ఆ అచలానుభూతి యొక్క సాక్షాత్కార తేజోకిరణమును ఒక దానిని మీరు పొందియో, లేక దాని తటమునకు దరిసియో యుందురని నా దృఢవిశ్వాసము

సమగ్రముగా అద్వైత దర్శన గ్రంథ పఠనము గావించిన వారును, అచలానుభవమునకు దారితీయు సాధనమును అనుష్ఠించిన సుధీమణులును మీ రచనలను అత్యంతము సమాదరింపగలరు. ఉపోద్ఘాతము వ్రాయుమనిన మీ అభ్యర్థనము నాకు గౌరవ ప్రదమైనప్పటికిని, మీ వివరణముల అంతస్సార మెఱిగి, విలువగట్టి సమ్మాన్యత చేకూర్చగలుగు నంత శక్తి నాకు లేదేమో అని భావింతును.

మీ యగాధ ఋజుత, భక్తి తత్పరతలకు తగిన సత్ఫలితములు లభించగలవు. ప్రాక్తన శ్రుతుల పఠనము మాత్రమే నేడు మనకు జాలదు, తదంతర్గత సత్యార్థానుభవ గవేషణము, నిరూపణములే మనకు ముఖ్య ఆచరణయోగ్యకార్యములై ఉన్నవి అందులకే శ్రీరమణునివంటి మహాపురుషుడు ఇప్పుడు శరణ్యుడై యున్నాడు. అట్టి మహర్షిని స్తుతించుట, పూజించుటతోనే తృప్తిపడక, ప్రతివ్యక్తియు తన జీవితావధిలో శ్రుతిప్రోక్తమైన, యోగీశ్వరులు బోధాతీత శక్తితో ప్రవచించిన సత్యదర్శనమును స్వయముగా సమకూర్చుకో గలిగిన ధీరకార్యమును చేపట్టవలసియున్నది

భగవంతుడు మీకు సాక్షాత్కారమును ప్రసాదించుగాత !

శుభాకాంక్షలతో

ఇట్లు, హృదయ పూర్వకముగా

(సం) కె. సి. వరదాచారి

(ఇది ఆంగ్ల మూలమున కనువాదము)

# Opinion of Ubhaya Vendantha pravarthaka

Sreeman
**M. Ananthasayanam Ayyangar,**
former governor of Bihar
and former speaker of parliament

31 G M STREET,
TIRUPATI,
4-4-69

I have gone through both the parts of "Brahma Jijnasa" written by Sri Marriboyina Ramasubbayya Garu. They are both interesting and instructive. Both of them deal with the knowledge of Brahman or the Creator of the Universe. The same title has been used to both parts. The title to both the parts has been taken from the first Sutras, the Brahma Sutras. The language is simple and is in an easy flowing style

The first part deals mainly with the philosophy of Advaitha the points for and against the same and also the principles of their schools of philosophy and emancipation from birth and death. At the outset, the author tries to establish that even in the early days, all casteds were competent to read the Vedas and Upanishads I agree with him that every one who wants to attaian Moksha can read all the pramanas today, whatever might have been practice or the injunctions in the earlier periods It is necessary that every one should know our religion. Hinduism based on the Upanishads and the Brahmasutras is the most cosmopolitan system and is fully based on philosophical researches. The need of the hour is the spread of knowledge of our ancient philosophy, religion and culture, and, Sri Rama subbayya has done a great service by printing this book in an easy flowing style and putting it within the reach of the ordinary man.

The second part deals with what we call the Upaayaas or the means of attaining Brahman. It deals with the details of Gnaana Yoga, Raaja Yoga or Dhyaana Yoga, karma Yoga, Bhakti Yoga, or Devotion and Prapathi or the Doctrine of Surrender He describes in detail the principles of Devotion and the Doctrine of surrender according to the Raamaanuja philosophy. These two parts contain the knowledge and information necessary to understand the various systems of Vedic Philosophy prevailing in India

I am sure that the readers will greatly benefit by reading these books.

**(Sd) M. Ananthasayanam Ayyangar**

శ్రీ వ్యాసాశ్రమ పీఠాధిపతులగు

# శ్రీశ్రీశ్రీ విమలానందస్వాములవారి అభిప్రాయము

| | |
|---|---|
| శ్రీ వ్యాసాశ్రమం-పోస్టు, | మకాం, |
| ఏర్పేడు మార్గము, | ఓంకార సత్రయాగము, |
| చిత్తూరు జిల్లా (ఆం.ప్ర) | దువ్వ - (పోస్టు) ప.గోదావరి జిల్లా |
| | 14-4-69 |

**పరిశుద్ధాత్మ స్వరూపులగు,**

శ్రీ మణిబోయిన రామసుబ్బయ్యగారిచే రచింపబడిన 'బ్రహ్మజిజ్ఞాస' అను గ్రంథముయొక్క ప్రథమ, ద్వితీయ భాగములు రెండు చేరినవి పూర్తిగ చదువుట కవకాశము చిక్కినది కాదు. అయినను సంచారములో వెంట ఉంచుకొని వీలు చిక్కినపుడెల్ల స్థాలీపులాకన్యాయముగ నచటచట చూచుట జరిగినది శ్రీ రామసుబ్బయ్యగారు చాల పరిశ్రమచేసి యీ ఉద్గ్రంథమును రచించిరి వారి వివిధ గ్రంథావలోకనమునకు, దీర్ఘకాల పరిశ్రమకు సాక్షి యీ 'బ్రహ్మజిజ్ఞాస' అందులోను స్వయముగా వ్రాయుటకు ఓపిక లేకపోయినా తాము చెప్పుచు నితరులచే వ్రాయించిరట దీనివలన గూడ వారి ప్రజ్ఞ సూక్ష్మేక్షిక, వివిధ విషయ పరిజ్ఞానము సువ్యక్తమగు చున్నది మొత్తానికి ఈ రూపేణ వారు తెలుగు భాషలో లేని లోటును దీర్చిరి సంస్కృత భాషలో వివిధ వేదాన్త గ్రంథములను పఠించి సారమును గ్రహించలేని ఆంధ్ర సాధకులకు, జిజ్ఞాసువులకు నీ రూపమున మహోపకార మొనర్చిరి. వీరి యీ సేవ చిరస్మరణీయము సంస్కృతాభిజ్ఞులకు గూడ ఇంతటి వ్యాపకజ్ఞాన ముండదేమో యనిపించుచున్నది ఇందు వర్ణవ్యవస్థాది విషయములు నవ్యదృష్టితో విమర్శింపబడియున్నవి.

ముముక్షువులకు, జిజ్ఞాసువులకు తప్పక పఠింపదగిన గ్రంథము శ్రీ రామసుబ్బయ్యగారికి పరమేశ్వరుడు ఇతోఽధికాధ్యాత్మికసేవ జేయుశక్తి సామర్థ్యముల ప్రసాదించి అనుగ్రహించుగాక!

ఓం జయగురుదేవ్

మీ

విమలానందస్వామి

ఆచార్య (ప్రొఫెసర్) డాక్టరు కొత్త సచ్చిదానందమూర్తిగారు 'బ్రహ్మజిజ్ఞాస' ప్రథమ - ద్వితీయ భాగములపై వ్రాసిన అభిప్రాయము

## Sri Venkateswara University

| | |
|---|---|
| Professor | Tirupati - 517502 |
| **K. Satchidananda Murthy** | Andhra Pradesh |
| Vice-chancellor | 18th January, 1976 |

Dear Shri Ramasubbaiah,

I have received copies of your Brahma-Jijnasa, 2 Pts Thank you very much.

I have read a few paragraphs here and there and I am happy to note that you have expounded Vedantas in the traditional way in clear Telugu.

I hope many mumukshoos are reading it and are being profited

Yours sincerely,

**(Sd. K. Satchidananda Murthy.)**

(పై అభిప్రాయమునకు ఆంధ్రానువాదము)

| | |
|---|---|
| ఆచార్య, | తిరుపతి - 517 502 |
| కె. సచ్చిదానందమూర్తి, | ఆంధ్రప్రదేశ్ |
| వైస్-ఛాన్సలర్ | 18 జనవరి 1976 |

ప్రియమైన రామసుబ్బయ్యగారూ !

మీ 'బ్రహ్మజిజ్ఞాస' గ్రంథముయొక్క రెండు భాగములు చేరినవి. అనేక వందనములు

అక్కడక్కడ కొన్ని ప్యారగ్రాఫ్‌లను చదివినాను. అందు మీరు వేదాంతమును సంప్రదాయక విధమున విస్పష్టమైన తెనుగులో వివరించినారు ఈ విషయము నాకు చాలా ఆనందమును తృప్తిని కలిగించినది

అనేక ముముక్షువులు దీనిని చదివి లాభపడగలరని ఆశపడుచున్నాను

సహృదయముతో

(సం) కె. సచ్చిదానందమూర్తి

## ఉభయవేదాంత ప్రవర్తకులు

# శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి అభిప్రాయము

శ్రీయుతులు మఱ్ఱిబోయిన రామసుబ్బయ్యగారికి నమస్సులు

నా విలంబమును మన్నింపుడు మీ "బ్రహ్మజిజ్ఞాస" రెండు సంపుటాలును మీరు విశ్వాసముతో పంపి పదునైదు దినములు దాటినవి. విషయమును విస్తరమును గొప్పవి వయోదోషముచేత ఆరోగ్యమును దృష్టిపాటవమును శిథిలములుగా నున్న నాకు ఆ గ్రంథములను తుదిదాక చూచుట కింత నిదానమైనది ఒకవిధముగా చదివి యిప్పటికి ముగింపగలిగినాను ఇంకను రెండు మారులైనను చదువుకోవలసి యున్నది. ప్రయత్నింతును

మీ గ్రంథమున అద్వైతసిద్ధాంతము సాంగోపాంగముగా విశదముగా వివరింపబడినది. వైశద్యము, సంయమము, నిర్మలత, అకృత్రిమధార - ఇవి మీ శైలిలో చూచి సంతోషింపవలసిన విషయ విశేషములు. గహనమైన విషయము లింత చక్కగా చిక్కు లేక వ్రాయగలుగుట సామాన్యముగాదు. ఇందుకు నావంటి చదువరుల కృతజ్ఞత మీయెడ చెల్లగలదు. విశిష్టాద్వైత ప్రక్రియను అట్టి నిర్మలశయ్యతోనే వివరించితిరి. కాని అది తెంగల సంప్రదాయమునే ఎక్కువగా ప్రతిఫలింపజేయుచున్నదని నా సందేహము; నేను వడగల సంప్రదాయమువాడను. ఈ రెండు సంప్రదాయములకును గల భేదము సాంఘికముగా నున్నంత తాత్త్వికముగా లేదని నా విశ్వాసము. తత్త్వవిషయమున శ్రీదేశికుల మహారచనల విలువ ఉదాసింపరానిది శ్రీ రామానుజ సిద్ధాంతమున కవి మూలాధారములుగా నున్నవన్నమాట యిరుతెగలవారును అంగీకరించినదే.

తిరుపతి, భవదీయుడు

17-3-69 (సం) రా॥ అనంతకృష్ణశర్మ.

### సంస్కృతభాషా ప్రచారిణీ సభ ప్రధాన మంత్రులగు
### ఉ॥ వే॥ శ్రీమాన్ సాహిత్యరత్న, విద్యాప్రవీణ, విద్వాన్,

# తి.కం. తిరువేంగడాచార్యులవారి అభిప్రాయము

శ్రీయుతులు జ్ఞానవయోవృద్ధులునగు శ్రీ మఱ్ఱిబోయిన రామసుబ్బయ్యగారు రచించిన 'బ్రహ్మజిజ్ఞాస' రెండవ భాగము ఆమూలాగ్రము పఠించితిని శుద్ధమైన భాషలో లలితమైన శైలిలో సరళాతిసరళముగ వేదాంత విషయములను వివరించిన వీరి ప్రతిభా విశేషము అభినందనీయము గహనమగు వేదాంత విషయములను అరటిపండొలిచి చేత నిడినట్లు ప్రతిపాదించిరి వాసనాక్షయ తత్త్వజ్ఞానములు, మనోనాశతత్త్వజ్ఞానములు, చిత్తముయొక్క స్థూల సూక్ష్మతలు మొదలగువాని వివరణములిందుకు నిదర్శనములు

మఱియు నీ రచయిత యద్వైత సిద్ధాంతమున నిష్ణాతృత్వమును వహించుటయే గాక విశిష్టాద్వైతమునందును తగినంత పరిజ్ఞానమును గడించి యుభయ సిద్ధాంతముల యందును దనకుగల యాదరమును దెలుపుటకే యీ భాగము రచించెనని తోచుచున్నది. వీరి గ్రంథ రచనమునకై యుపక్రమించి శతాధికములగు గ్రంథములను పరిశీలించిరి. అందును సుమారిరువది విశిష్టాద్వైత గ్రంథములను ఆకళించుకొనిరని తెలియుచున్నది వీరు చాలవరకు అద్వైత విశిష్టాద్వైత మతముల సమన్వయమునకే యత్నించిరి. కొన్ని చోట్ల గల యాంతరంగికాభిప్రాయ భేదములకును తమ వ్యాఖ్యానమును జతపఱచి సమన్వయమును సాధించిరి ఉదాహరణమునకు (1) విదేహముక్తిని గుఱించి శంకర విద్యారణ్యుల భావభేదములకు సమన్వయమును 53 వ పుటయందు జూచునది. (2) రామానుజాచార్యులు వేదాధికారము లేనివారికి జ్ఞానకర్మలయం దధికారము లేదని శ్రీభాష్యమున ప్రతిపాదించిన దానికి వీరి సమన్వయము 225వ పుటయందు జూచునది. బ్రహ్మవిద్యాధికారమునకు జాతి యడ్డురాదని వీరు మహాప్రయత్నముతో సమర్థించిరి.

ప్రపత్తికి ఉపనిషత్తులయందు ప్రమాణము లేదనుటయు, ప్రపత్తి బీజములు మాత్ర మందు గోచరించుచున్న వనుటయు సరికాదు

ఈశావాస్యోపనిషత్తునందలి 'వాయు రనిల మమృతం' ఇత్యాది 17-వ మంత్రమును "అగ్నేనయ" అను 18-వ మంత్రమును చరమశ్లోకార్థకమే యని పూర్వాచార్యులు వ్యాఖ్యానించిరి. ఇంతయేల శ్రుతిస్మృత్యాది సకల ప్రమాణమలను శరణాగతి పర్యవసాయులుగా శ్రీవైష్ణవు లనుసంధింతురు.

విశేషానుగ్రహ విషయముననను వీరి యుద్దేశము వేరుగా నున్నది. వ్యక్తిగతాభిప్రాయము భేదించుట సహజము.

ఏతావతా వీరి బృహద్గ్రంథము బహుగ్రంథ పరిశీలన ఫలితమై స్వానుభవ సమ్మిళితమై సులభగ్రాహ్యమై ముముక్షువుల కుపాదేయమై జిజ్ఞాసువులకు సకల విషయ ప్రతిపాదకమై యలరారుచున్నది.

ఇట్లు

చిత్తూరు
28-3-69.

(సం) తి. కం. తిరువేంగడాచార్యులు,
ప్రధానమంత్రి
సంస్కృతభాషా ప్రచారిణి సభ.

## 'బ్రహ్మజిజ్ఞాస' ప్రథమ భాగముపై

# పత్రికల అభిప్రాయము

### 14-7-67 ఆంధ్ర సచిత్ర వారపత్రిక

అయా విషయాల్లో ప్రవేశమూ, ఉత్సాహమూ ఉన్న వారికి తప్ప శాస్త్రీయ గ్రంథాలు జనసామాన్యానికి నచ్చవు. అందులోను వేదాంతమంటే బొత్తిగా ఇష్టపడరు. కారణం అందులోని విషయం దురవగాహంగా వుండడమే. ఇలాంటి విషయాలను సులభమైన భాషలో సుబోధంగా వుండే రీతిని రచించబడిన గ్రంథాలు మనభాషలో అరుదు. అట్టి లోపాన్ని తీర్చడానికి యీ గ్రంథం మిక్కిలి ఉపయోగించగలదు.

రచయిత 'ఉపోద్ఘాతం'లో తెలిపిన విషయాలనుబట్టి ఆయన పరిశ్రమించి సంస్కృతభాషను నేర్చుకోలేదని పెద్దల అనుగ్రహంవల్ల వేదాంత విషయాలు అవగాహన అయాయనీ తనకు తెలిసిన విషయాలను గ్రంథ రూపంలో పెట్టడానికి భగవదనుగ్రహమే కారణమని తెలుస్తున్నది. తాము ఏళ్ళ తరబడి అనారోగ్యంగా ఉండి అణుమాత్రము ఓపిక లేని స్థితిలోనే యీ గ్రంథాన్ని తాను చెప్పుతూ ఇతరులచేత వ్రాయించారట ! విషయాలన్నీ కరతలామలకాలై ఎంతో అనుభవం ఉన్నవారే యిట్టి మహత్కార్యానికి పూనుకోగలరు. ఈ విషయంలో రచయిత కృతార్థులైనారనే చెప్పవలసి ఉన్నది.

ఇందులోని విషయాలన్ని సామాన్యులకు దురవగాహాలే అయినా రచయిత వీలగునంత సులభమార్గంలో సరళమైన భాషలో సామాన్యులకు కలిగే సందేహాలను ప్రశ్నరూపంగా చూపి వాటికి తగిన సమాధానాలను శ్రుతిస్మృత్యాది ప్రమాణాలతో వివరించారు. ఇందులోని విషయ వివరణనుబట్టి రచయితకు వేదాంతములోని విశిష్టజ్ఞానం వ్యక్తమగుచున్నది. ఈ గ్రంథాన్ని ప్రశంసించి బ్రహ్మవేత్తలు, విద్వద్వృతంసులు ఇచ్చిన సదభిప్రాయాలు అతిశయోక్తులు కావని నిర్ణయించవచ్చును. శ్రీ రామసుబ్బయ్యగారు తక్కిన భాగాలనుకూడ ప్రకటించిన యెడల బ్రహ్మజిజ్ఞాసువులకు ఎంతో ఉపకారం చేసినవా రగుదురు.

— అంగీరస

## 23-7-67 ఆంధ్రజ్యోతి దిన పత్రిక

వేదాంత గ్రంథాలు మనకు కోకొల్లలుగా వున్నాయి. కాని, వేదాంతాన్ని గురించి అధికారయుతంగా బోధించగల సప్రమాణ గ్రంథాలు బహుతక్కువ. వెలువడిన ఉత్తమమైన తెలుగు గ్రంథాలలో నిస్సంకోచముగా యిది యొకటి.

అద్వైత సిద్ధాంతాల వివరణంలో రచయిత సత్యాన్వేషణమే పరమ లక్ష్యంగా భావించారు. ముముక్షువులు, బ్రహ్మజిజ్ఞాసువులు తప్పక ఒకసారి పరిశీలించదగినట్టిది ఈ గ్రంథం.

శ్రీ రామసుబ్బయ్యగారు తమ బృహద్గ్రంథములోని మిగిలిన రెండు భాగాలను త్వరలోనే ప్రకటించగలరని ఆశిస్తున్నాము. వాటి రచన సందర్భంగా వీలయితే అన్యప్రాంతాలకు చెందిన ఇతర భాషలోని వేదాంత విషయక పరిశీలనలను ఒకసారి సమీక్షించడం సముచితం కాగలదు

— 'ప్రాచేతస'.

**HINDU SUNDAY APRIL 28, 1968**

BRAHMA JIJNASA, PART I

Though a lay reader of Indian Philosophy his thirst for knowledge spurred him to deeper studies, for a rational approach that caste or creed donot stand in the way of men for realising, the supreme Brahman. The historical background throwing light on the origin of castes, the beginnings of the "Yajnopavita" and the Brahmanical way of life are really interesting The author's simple and direct approach and clearity of expression are commendable

*Vedam Venkataraya Sastry.*

'బ్రహ్మజిజ్ఞాస' ప్రథమభాగమునం దుదాహరించిన గ్రంథ నామములును వాటి సంకేతాక్షరముల యొక్క వివరములును.

| సాంకేతాక్షరములు | గ్రంథ నామము | గ్రంథకర్త లేక గ్రంథమును ప్రచురించినవారు. |
|---|---|---|
| గీత. | భగవద్గీత | వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్సువారు |
| మ.భా. | మహాభారతము సంస్కృతము | ,, ,, |
| " | కవిత్రయమువారిది | |
| " | పు. రామమూర్తిగారి ఆంధ్రానువాదము | |
| బ్ర.సూ. | బ్రహ్మసూత్రములు | |
| ఆం.సూ.భా. | ఆంధ్రసూత్రభాష్యము | శ్రీ పురాణపండ |
| శ్రీ శంకరభాష్యమునకు-ఆంధ్రానువాదము | | మల్లయ్యశాస్త్రి |
| ఆంధ్ర శ్రీభాష్యము-శ్రీభాష్యమునకు ఆంధ్రానువాదము | | శ్రీమాన్ కందాడై శేషాచార్యులు |
| శ్రీమద్బ్రహ్మసూత్రభాష్యము శ్రీమధ్వాచార్యులవారి భాష్యమునకు ఆంధ్రానువాదము | | శ్రీహంది రామారావు పండితులు |
| సత్యార్థప్రకాశిక-ఆంధ్రానువాదము | | శ్రీదయానంద సంస్వతీస్వాములు |
| మను. | మనుస్మృతి | వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్సు |
| పరా | పరాశరస్మృతి | ,, ,, |
| గౌ సూ | గౌతమ ధర్మసూత్రములు | శ్రీ పం ఆదినారాయణ శాస్త్రిగారి తాత్పర్యసహితము |
| వేదకాలమునాటి స్త్రీలు | | శ్రీ జి. పురుషోత్తమరావు |
| స్మృతులకాలపు స్త్రీలు | | ,, ,, |

| | | |
|---|---|---|
| వేదకాల నిర్ణయము శ్రీలోకమాన్యతిలక్‌గారి గ్రంథము నకు ఆంధ్రానువాదము | | శ్రీమానికొండ సత్యనారాయణశాస్త్రి |
| జ్ఞా.వా | జ్ఞానవాసిష్ఠము | "వావిళ్ళ" |
| | ,, (వచనము) | శ్రీ వె సుందరరామశర్మ |

## శ్రీ శంకరాచార్యకృత గ్రంథములు

| | | |
|---|---|---|
| వివేకచూడామణి | | వా రామస్వామిశాస్త్రులు అండ్ సన్సు |
| మ ద | మహావాక్య దర్పణము | ,, ,, |
| ఉ సా | ఉపదేశసాహస్రి | ,, ,, |
| | దక్షిణామూర్తిస్తోత్రము | ,, ,, |
| | అత్మబోధ | ,, ,, |
| సర్వదర్శన సిద్ధాంత సంగ్రహము ఆంధ్రానువాదము | | శ్రీమల్లయ్యశాస్త్రి |
| అపరోక్షానుభూతి | | శ్రీ కోవూరి పట్టాభిరామశర్మగారి పద్యసహితము |
| దృగ్దృశ్య వివేకము | | విద్యానంద-శ్రీ కైపశేషయ్యగారి పద్యసహితము |
| వే డిం | వేదాంత డిండిమము | |
| స్వాత్మ | స్వాత్మప్రకాశిక-బ్రహ్మజ్ఞానావలీమాలా మనీషా పంచకము | |
| నై.సి | నైష్కర్మ్యసిద్ధి | "వావిళ్ల" |
| వే.పం | వేదాంత పంచదశి-శ్రీ విద్యారణ్యకృతము | ,, ,, |
| సాంఖ్య | సాంఖ్యకారికా సప్తతి | |
| భా త. | భారతీయ తత్త్వశాస్త్రము | శ్రీ డాక్టర్ యస్ రాధాకృష్ణన్‌గారి ఇండియన్ ఫిలాసఫికి ఆంధ్రానువాదము. |
| | విశ్వరూపము | శ్రీ కా కొండయ్య |

| | | |
|---|---|---|
| వి సా | విచారసాగరము | శ్రీ నిశ్చలదాసుగారి గ్రంథమునకు జనార్దనస్వామి చైతన్యుల ఆంధ్రానువాదము |
| బృహద్వా | బృహద్వాసిష్ఠసిద్ధాంతము - పూ | పూర్వభాగము |
| ఉ ఉత్తరభాగము పు. పుటలు | | శ్రీ రామడుగు శివరామ దీక్షితులు |

## శ్రీ వివేకానంద స్వాములవారి గ్రంథములు

| | |
|---|---|
| అనుష్ఠాన వేదాంతము | శ్రీ రామకృష్ణమఠమువారి ప్రచురణము |
| కులము; సంస్కృతి; సామ్యవాదము | ,, ,, |
| రాజయోగము | ,, ,, |
| జ్ఞానయోగము | ,, |

### ఉపనిషత్తులు

| | |
|---|---|
| బ్ర - బ్రహ్మ | ధ్యానబిందు |
| బృ - బృహ - బృహదారణ్యకం | అన్నపూర్ణ |
| శ్వే - శ్వేతాశ్వతర | ప్రశ్న |
| ముక్తి - ముక్తిక | ఆత్మ |
| ఛాం - ఛాందోగ్య (బచ్చు పాపయ్య శ్రేష్ఠిగారి ఆంధ్రానువాదము) | త్రిశిఖి బ్రాహ్మణ<br>సర్వసార |
| ఐత - ఐతరేయ | శుకరహస్య |
| కౌషీ - కౌషీతకి | సుబాల |
| తేజో - తేజోబిందు | కఠ |
| తై - తైత్తిరీయ | వజ్రసూచిక |
| ఉపనిషచ్చంద్రిక | నిరాలంబ |
| శ్రీ రా లింగనసోమయాజి | కేన- |
| మాం - మాండూక్య | ముండక |
| గౌ. కా - గౌడపాదకారికలు | సన్న్యాస |
| మాండూక్య రసాయనము | అక్షి |
| ద్వాదశోపనిషత్తులు (వచనము) | మహత్ - వరాహ |
| మహా నా - మహానారాయణ | పరమహంసపరివ్రాజక |

### మఱికొన్ని గ్రంథములు

RASHTRAPATI BHAVAN
NEW DELHI - 4
May, 2, 1967

Dear Sir,

I am desired to thank you for your kind thought in sending a copy of "Brahma Jignasa" I regret to say that the President does not offer opinion on books. So, it will not be possible to comply with your request.

Yours faithfully,

**Sd/ - K. R. GUPTA**

Addl Private Secretary to the
President of India

RASHTRAPATI BHAVAN
NEW DELHI - 4
May 4, 1967.

Dear Shri Ramasubbiah,

Thank you for your kind thought in sending me a copy of your book "Brahma Jignasa".

With best wishes,

Yours sincerely,

**Sd/ - S. RADHAKRISHNAN**

(S Radhakrishnan)

శ్రీ

# విషయసూచిక

## ప్రథమభాగము - మొదటి ప్రకరణము - ఉపక్రమము (1 నుండి)

1. ఆరంభము
2. వర్ణవ్యవస్థ
3. ద్విజులు
4. వేదములు - వేదాంతములు
5. ఉపనిషత్తులు - కులము
6. మహాభారతము - వర్ణసమీక్ష
7. భాగవతము - వర్ణసమీక్ష
8. ధర్మశాస్త్రములు (వర్ణసమీక్ష)
9 బ్రహ్మసూత్రములలో వర్ణప్రసక్తి
10. ఉత్తమ స్త్రీ పురుషులకు బ్రహ్మవిద్యాధికారము
11 ఉపదేశాధికారము
12. శ్రీ శంకరాచార్యులు
13 బ్రహ్మవిచారార్హత
14 మహాపురుషులు నడచినదే త్రోవ
15. అచలవాదము

## రెండవ ప్రకరణము - పరబ్రహ్మము - మాయ నుండి

1. అద్వైతము
2. పరుడు లేక జ్ఞేయము
3. మాయ
4. జగత్తు మిథ్య

5 దేశకాల నిమిత్తతలు
6 జగత్తు మిథ్య యనుటకు చెప్పిన దృష్టాంతములు
7 ఈశ్వర స్వరూపము
8 జీవస్వరూపము - భిన్నమతములు
9 జీవేశ్వరుల మూడు అవస్థలు
10 చిత్రపట దృష్టాంతము
11 ఆకాశ దృష్టాంతము
12 ఈశ్వరాస్తిత్వ లక్షణములు
13 ప్రపంచోత్పత్తి
14. పంచీకరణము
15 అధ్యాత్మ - అధిభూత - అధిదైవతములు
16 కాపిల సాంఖ్యము
17. ముఖ్యప్రాణము
18. కర్మసిద్ధాంతము
19. అపవాద -సృష్టియొక్క ఉపసంహారము
20. కాలము
21 భౌతిక విజ్ఞానవాదము
22. సచ్చిదానందములు
23. సత్తు - అసత్తు
24 చిత్తు - జడము
25 ఆనందము (సుఖము) - దుఃఖము
26. ఆత్మానాత్మ వివేకము
27. పంచకోశ వివేకము
28. తురీయము
29. కూటస్థ చిదాభాసులు
30. దృగ్దృశ్యవివేకము
31. సాక్షి విచారము
32. సాక్షి - భ్రాంతి విచారము
33. స్వప్నవిచారము

34 సుఖదుఃఖాదులు సాక్షికి విషయములు
35 స్మృతి, సంశయ, జ్ఞానముల విచారము
36. గౌడపాదుల అజాతవాదము
37 జ్ఞానసాధనములు లేక, ప్రమాణములు
38. జ్ఞానాజ్ఞానములు
39 విద్య
40. అవిద్య
41 జ్ఞానమును పరిత్యజించుట ఎట్లు
42 తత్త్వమసి మహావాక్యవిచారము
43 మహావాక్య విచారము
44. అజ్ఞానభూమికలు
45 జ్ఞానభూమికలు
46. తురీయాతీతము - సత్తాసామాన్యము


## మూడవ ప్రకరణము - సంసారము - ముక్తి
## ( నుండి )


1 మరణానంతరము జీవునియొక్క అస్తిత్వము
2. సోక్రటీసు
3. మృతులకు జరుగు శ్రాద్ధాదులు
4. పునర్జన్మ సిద్ధాంతము
5. పంచాగ్నివిద్య
6 దేవయానము
7 బ్రహ్మలోకము
8 పితృయానము
9 మూడవమార్గము
10 ఉత్క్రాంతి
11 బ్రహ్మవేత్తలకు ఉత్క్రాంతి లేదు
12 అధికార పురుషులు

ఓమ్

శ్రీ రామచంద్ర పరబ్రహ్మణేనమః

శ్రీ కృష్ణాయనమః

# బ్రహ్మజిజ్ఞాస

## ప్రథమ భాగము

### మొదటి ప్రకరణము - అధికారి - ఉపక్రమము

"అణువో కాక కడున్ మహావిభవుఁడో యచ్ఛిన్నుఁడో ఛిన్నుఁడో
గుణియో నిర్గుణియో యటంచు విబుధుల్ కుంఠీభవత్తత్త్వ మా
ర్గణులై యేవిభుపాదపద్మ భజనోత్కర్షంబునం దత్త్వ వీ
క్షణముం జేసెద రట్టివిష్ణుపరమున్ సర్వాత్ము సేవించెదన్."

(భాగవతము - పోతన.)

### (1) ఆరంభము

శ్రీ రామకృష్ణ పరమహంస సమాజమందిరమున నున్న ఒక వేదాంతివద్దకు వేదాంతజిజ్ఞాసగల ఒకవ్యక్తి వచ్చి నమస్కరించి యిట్లు ప్రశ్నించెను

**జిజ్ఞాసువు :** అయ్యా! తమవద్ద నేను సత్యమును తెలిసికొన వచ్చితిని అనుగ్రహించి సత్యస్వరూప మెట్టిదో బోధింపుడు.

**వేదాంతి :** నీ ఎదుట కనబడు ప్రపంచము సత్యము కాదా!

జి : ప్రపంచము సత్యమని నేను భావించుటలేదు ప్రపంచమునందలి ప్రతిపదార్థమును ప్రతిక్షణమును మార్పు చెందుచునే యున్నది మానవుడు పుట్టినపుడున్న రీతిగా నుండుటలేదు. క్రమముగా పెరిగి పెద్దవాడై వృద్ధుడై తుదకు మరణించి స్వరూపము లేకపోవుచున్నాడు ఈ లోకమునందు పుట్టిన ప్రతిప్రాణియు నట్లే యున్నది ప్రపంచము సైతము ఒకానొకప్పు డిట్లే పుట్టినది, ఒకప్పుడిట్లే నశింపవలసి యున్నది

వే : నీ వంటి మానవు లెందఱో పుట్టి నశించు చున్నను పంచభూతములు ఇట్లే యుండుటలేదా?

జి : పుట్టిన వన్నియు మార్పు చెందుచునే యున్నవి పశ్చిమఖండపు జ్యోతిశ్శాస్త్రజ్ఞులు వ్రాసిన కొన్ని గ్రంథములయందు భూమి సూర్యుని చుట్టు ప్రదక్షిణముచేయుచు సూర్యుని విడిచి నానాటికి దూరమైపోవు చున్నదని, అట్లు దూరమగుకొలదిని భూమియందు జీవసృష్టి నశించ వచ్చునని వ్రాసిరి, భూమిచుట్టు తిరుగుచున్న చంద్రుడు ప్రతిసెకండునకు .0044 అంగుళములు దగ్గఱకు వచ్చుచున్నాడు. ఎప్పుడో ఒకప్పుడు చంద్రుడు భూమిని ఢీకొనక తప్పదు. అప్పుడు భూమిపైనున్న జీవరాశియొక్క స్థితి యేమగును? మన పురాణములయందు సహితము ప్రపంచము ప్రళయమగునని చెప్పబడినది కనుక కనబడున దంతయు అసత్యమే కదా?

వే : అట్లయినచో సత్యమగు వస్తువొకటి కలదని ఎట్లు చెప్పగలవు?

జి : ఒకానొక పదార్థము అసత్యమని ఎప్పుడనుభవము కలిగినదో అప్పుడే సత్యమగు వస్తువొకటి కలదని ద్యోతకమగుచున్నది. అసత్యమనగా సత్యము కానిది. సత్యము కానిది మనకు కనబడుచున్నదనగా సత్యము మనకు కనబడలేదని యర్థము

వే: ధనము నార్జించి పుణ్యకర్మలను చేసి ఇహమును పూర్ణముగావించుకొని ఇహపరసుఖముల ననుభవించవచ్చునుగదా? ఈ సత్యాన్వేషణ మెందుకు?

జి : ఈలోకమెట్లు సత్యము కాదో పరలోకమును అట్లే అసత్యమే యగును. శరీరమా నీటిబుగ్గవంటిది. సత్యమును తెలిసికొనుటకంటె అవసరమైన కార్యము నాకు వేఱొకటి కనబడలేదు.

వే : దానివలన నీకు లాభమేమి?

జి : సత్యమును తెలిసికొనుటయే లాభము, నలు ప్రక్కలను, క్రిందను, మీదను అసత్యముచేత నేను బంధింప బడినట్లున్నాను. ఈ బంధమునుండి విడిపించుకొనుటకు సత్యాన్వేషినైతిని.

వే : నీ విదివఱలో దీనిగుఱించి ప్రయత్న మేమి చేసితివి?

జి : బంధవిముక్తికి మార్గము వేదాంతశాస్త్రములయందు చూపబడినదని వింటిని. నేను కొన్ని గ్రంథములు చదివితిని. తెలిసినవారి సహాయమున్న మంచిదని ఒక శాస్త్రిగారి నాశ్రయించి వారికి నా యభిప్రాయమును తెలిపితిని. వారిట్లు చెప్పిరి. "నీవు శూద్రుడవు. నీకు వేదాంతము వినుట కర్హత లేదు. అది మఱియొక జన్మమున లభించును." ఆ మాటలు విని మీవద్దకు వచ్చితిని. వేదాంతము తెలిసికొనుటకు నాకర్హత లేదా?

వే : శూద్రుడు వేదములను వేదాంతశాస్త్రములను చదువరాదని కొన్ని శాస్త్రములయందున్న మాట నిజమే. ఈ విషయము విస్పష్టముగా తెలియవలయునన్న, కొంత విస్తరించి చెప్పవలసి యుండును.

వేదమును పరమప్రమాణముగ అంగీకరించిన మహర్షి స్వామిదయానంద సరస్వతిగారు తమ సత్యార్థ ప్రకాశికయందు స్త్రీ శూద్రులకు వేదాధికారము కలదని చెప్పుచు ఇట్లు వ్రాసిరి.

"మనుష్యులందఱకు వేదాదిశాస్త్రములను చదువుటకును, వినుటకును బ్రమాణము యజుర్వేదము ఇఱువది యాఱవ అధ్యాయమునందలి రెండవ మంత్రమం దున్నది చూడుడు :

"యథేమాం వాచం కల్యాణీ మావదాని జనేభ్యః
బ్రహ్మరాజన్యాభ్యాగ్ం శూద్రాయ చార్యాయ చ స్వాయచారణాయ"
యజు|| అ. 26 మం. 2||

(య) ఎట్లు నేను (జనేభ్యః) మనుష్యులందఱకొఱకు (ఇమామ్) ఈ (కల్యాణీమ్) కల్యాణము ననగా సంసారసుఖమును, ముక్తిసుఖమును ఇచ్చునట్టి (వాచమ్) ఋగ్వేదాది చతుర్వేదవాణిని (అవదాని) ఉపదేశించు చున్నానో అట్లు మీరును జేయవలయును. స్మృత్యాది గ్రంథములయందు బ్రాహ్మణ, క్షత్రియ వైశ్యుల కీ వేదపఠనాధికారము వ్రాయబడియున్నదనియు, స్త్రీ శూద్రాదులకు లేదనియు, ఇక్కడ జన శబ్దముచే ద్విజులను మాత్రము గ్రహింపవలెననియు, కొందఱు ప్రశ్న చేసిరేని ఉత్తరము పరమేశ్వరుడే యిచ్చి యున్నాడు. చూడుడు :

"బ్రహ్మరాజన్యాభ్యామ్" నేను బ్రాహ్మణ క్షత్రియుల కొఱకును (అర్యాయ) వైశ్యులకొఱకును (శూద్రాయ) శూద్రులకొఱకును (స్వాయ) వారి భృత్యుల

కొఱకును, స్త్రీలకొఱకును, (అరణాయ) అతిశూద్రులకొఱకును వేదములను బ్రకాశపఱచితిని. అనగా మనుష్యులకొఱకును వేదములను జదివియు జదివించియు, వినియు, వినిపించియు విజ్ఞానమును వృద్ధిపరచుకొని, మంచివానిని గ్రహించి, చెడువానిని వదలి దుఃఖములనుండి దూరులయి ఆనందమును బొందుదురుగాక అని భగవాను డుపదేశించియున్నాడు. మీమాట నమ్మవలయునా? పరమేశ్వరునిదా? అవశ్యముగ మాననీయ మయినది పరమేశ్వరుని మాటయేకద! ఇక నిట్లుండుదానిగూడ నమ్మనివాడు నాస్తికుడగును. ఏలయనగా (నాస్తికో వేదనిందకః) వేదములను నిందించువాడును, నమ్మనివాడును నాస్తికుడు." ఈ విధముగా వేదమే సమస్తమానవులకు వేదాధికార మున్నట్లు అంగీకరించినది.

సామవేదమునందు బ్రాహ్మణాది నాలుగు వర్ణముల వారేగాక అయిదవ వర్ణము వారగు నిషాదులు సయితము యజ్ఞాధికారము కలవారని ఈ క్రింది ఋక్కువలన విదిత మగుచున్నది.

"భరద్వాజ ఋషి - బృహతీఛం ||ఇంద్ర||
మూడవ అధ్యాయము - మూడవ ఖండము ఋక్కు 262 -

"యద్వా పంచక్షితీనాం ద్యుమ్నమా భరసత్రా విశ్వాని పౌస్యా
యదింద్ర నాహు పిష్వా ఓజో విష్ణుంచ కృష్టిషు" ||

తా|| ఓ యింద్రా! మానవులగు ప్రజలందు ఏ తేజస్సు బలమును గలదో అదిగాక అయిదు జాతులయిన ప్రజల యొక్క ప్రకాశించు నన్నమును సర్వమును దెచ్చియిమ్ము గొప్పవయిన పౌరుషము లన్నింటిని మాకు నిమ్ము."

ఇదిగాక మహర్షి కల్పులగు బ్రహ్మశ్రీ బంకుపల్లె మల్లయ్యశాస్త్రిగారు బ్రహ్మశ్రీ రామవరపు కృష్ణమూర్తి శాస్త్రిగారు వేదములను తెనుగులిపిలో వ్రాసి తెనుగునకు అనువదించిరి. వారు వేదములను అనువదించిన స్త్రీ శూద్రాదులు చదువుదురు గనుక అట్లు చేయరాదని పలువురు వారి నాక్షేపించిరి. అందుకు బ్రహ్మశ్రీ బంకుపల్లె మల్లయ్య శాస్త్రిగారు అనువదించి ప్రకటించిన యజుర్వేద పీఠిక యందు నిట్లు వ్రాసియున్నారు :

"ఇక నొక విషయము విమర్శించి యుపోద్ఘాతము ముగింతును, వేదము తెనిగించి అచ్చువేయించి సర్వ సులభము చేయుటవల్ల స్త్రీలు శూద్రులుగూడ

జదువుదురు గదా? వారికి వేదాధికారము లేదుగదా? యని కొందఱు ప్రశ్నించిరి అందులో శూద్రులు వింటే చెవిలో సీసము మరగించి పోయుమని శిక్షకూడ విధించియున్నా రనుచున్నారు

అందుకు నా సమాధానము ·

వింటే సీసము పోయుమన్నారు గాని చదివితే పోయమనలేదందును. అదిగాక వేదములో వారు చదువుట కూడదని యొక్క వాక్యముతీసి యెవరయిన చూపితే నా వాదమును మార్చుకొందును. పౌరుషేయ గ్రంథముల వ్రాతలు దేశకాలముల ననుసరించి యుండును. 'నమశ్శివాయ, నమో నారాయణాయ' అను మంత్రాలు వేదము లోనివే. శివమతాచార్యులు, రామానుజ మతాచార్యులు పంచములకుగూడ నుపదేశింప వచ్చునని, వారు జపించవచ్చునని యిదివరకెన్ని శతాబ్దముల నుండియో సిద్ధాంతీకరించి చేయుచనే యున్నారు కావున దెనిగించిన నేనుగాని, ప్రకటించిన వినయాశ్రమము వారుగాని తప్పు చేయలేదు.

కాక అంధ్రలోకమున మాసేవ విధివిహితముగూడనందును. ఏమన·

**పురాకల్పే తు నారీణాం మౌంజీ బంధనమిష్యతే |**
**అధ్యాపనం చ వేదానాం సావిత్రీ వచనం తథా ||**

అని మాధవీయమందే శాతాతప వచనమున్నది. గోబిల గుహ్యామున - దుహితా మేఇ పండితా జాయేత? ఇత్యాదిగా స్త్రీల యుపనయనవిధి యున్నది అశ్వలాయన గుహ్యాసూత్రమున స్నాతక సంస్కారమున చందన లేపనమునందు స్త్రీల చందన సంస్కారమును వేరుగా నిరూపించినాడు. ఉపనయనమే లేకుంటే స్నాతక మెందుకు? ఇదంతయు నాచే ప్రకటింపబడిన "వివాహతత్త్వ" మను గ్రంథమున విపులముగా జర్చింతిని ఇచట ఆ విమర్శకు దావులేదు ఇక శూద్రుల విషయము -

ధర్మశాస్త్రములలో శూద్రుల కుపనయనము చెప్పని మాట నిజమే శూద్ర శబ్దమునకు 'శోకము కలవాడు' అని లింగాభట్టీయము వ్యుత్పత్తి వ్రాసియున్నది. దానింబట్టి యిప్పు డెవరు శూద్రులో ప్రాజ్ఞులు నిర్ధారించ నర్హులు. కాలానుసారము ధర్మశాస్త్రము లున్నవంటినిగదా! "న శూద్రాయ మతిం దద్యా"త్తని జ్ఞానము శూద్రున కుపదేశింపవద్దని కొన్ని గ్రంథములు గలవు. "నమస్కారేణ మంత్రేణ పంచయజ్ఞాన్నహాయే"త్తని యాజ్ఞవల్క్యుడు

- శూద్రులు నమస్కార మంత్రముతో పంచయజ్ఞములు తప్పక చేయవలె నన్నాడు. పంచయజ్ఞములంటె - పాఠము, హోమము, అతిథిపూజ, పిత్రాది తర్పణము, బలిహరణము, అనగా - వైశ్వదేవము. ఇవి పరస్పర విరుద్ధములు ఒకప్పుడు ధర్మములయిన వింకొకప్పు డధర్మములని పురాణములు చూచినచో తెలియును.

ఇదిట్లుంచుదు. వేదము పఠించుట కుపనయన మవసరము. ఉపనీతుడు - శిఖాయజ్ఞోపవీతములతో బఠింపవలెనని వేదమందుగలదు. అది లేనివాడు పఠింపరాదని తాత్పర్యము అందువచ్చును.

గుణకర్మలను బట్టి జాతి నిర్ణయమా? జన్మమునుబట్టి జాతినిర్ణయమా? నిర్ధారించిన తర్వాతనే కదా వీరు శూద్రులు వీరు ద్విజాలు అని నిర్ణయమగును! ఆ నిర్ణయమున కిది తావుకాదు. ఇంతయు నియమపూర్వకముగా వేదము పఠించు విషయమున జర్చ. తెనిగించిన మాకు దీనితో బనిలేదు. అర్థజ్ఞానమున కందఱు నధికారులే.

శ్రీ శంకరులవారు, శ్రీ రామానుజులవారునుగూడదమ సూత్రభాష్యముల యందు "అపశూద్రాధికరణము"లో వేదాధికారము లేనివారికికూడ ఉపనిషదర్థమును వేదమును తెలిసిన యధికారు లుపదేశింపవచ్చునన్నారు. కావున మా విధి మేము నెరవేర్చితిమి. "శ్రావయే చ్చతురో/వర్ణాన్" అన్న వచనమును నుదాహరించి ఇతిహాస పురాణములద్వారా శూద్రాదుల కధికార మున్నదని వారు వ్రాసినందున సంస్కృత గ్రంథములకే యధికారము శూద్రులకు గలప్పుడు మా యాంధ్ర వేదమున కధికార ముండకపోదు. కనుక పాఠక మహాశయులు నిస్సందేహముగా జదువగోరుచున్నాను."

సర్వవిధేయుడు,
బం|| మల్లయ్యశాస్త్రి

మల్లయ్యశాస్త్రిగారి పైన నుదహరించిన వాక్యములయందు సూక్ష్మముగ అనేక విషయములు చర్చింపబడినవి. దానికి వ్యాఖ్యానము వ్రాసినచో ఒక గ్రంథమగును.

కృతయుగమున వేదము ఒక్కటె యుండెను. వేదాధ్యయనమునకు అందఱు నధికారులే. ఈ యంశమును తెలియజేయుటకు శ్రీమదాంధ్ర మహాభారతము అరణ్యపర్వము తృతీయాశ్వాసమునందు నిట్లున్నది.

పాండవులు వనవాసముచేయు కాలమున భీమసేనుడు సౌగంధికా పుష్పములకు పోవు మార్గమున అతనికి హనుమంతుని దర్శనము కలిగినది వారిరువుర సంవాదమునందు హనుమంతుడు భీమునకు చతుర్యుగాచారముల చెప్పుచు నిట్లు చెప్పినట్లున్నది :

తే|| కృతమకాని కర్తవ్యంబు గృతయుగంబు
నందు లేదు. చతుష్పాదమగుచు ధర్మ
మనఘ వర్తిల్లు దచ్యుతుం డయ్యుగమున
శుక్లవర్ణుడై ప్రజలఁ గాచుచు వెలుంగు. (336)

వ|| ఇది నూతన ధర్మసనాథం బందుల బ్రహ్మక్షత్రియ వైశ్య శూద్రులేక వేదక్రియా యోగ్యులై యకామ ఫల సంయోగంబున బుణ్యలోకంబులు వడయుదురు....."

శూద్రులకు వేదాధ్యయనాధికార ముండెనని దృఢపడినది - మహాభారత యుద్ధకాలమునకు కృష్ణద్వైపాయన మునీంద్రుడు వేదములను నాలుగుగా విభజించెను పూర్వము వేదమంత్రములు నాలుగు విధములైన ధాన్యములు ఒక రాశిగా ఉన్నట్లుండియుండును. ఏయే మంత్రములు (ఋక్కులు) ఏ యే వేదముగా చేర్చవలెనో ఆ నిమిత్తముగా అవతరించిన సాత్యవతేయుడు నాలుగు విభాగములుగా చేయుటయేగాక వేదమునందు సయితము అష్టకములు, ఆశ్వాసములు, మండలములు, అనువాకములు, సూక్తములు, మంత్రములు లేక ఋక్కులుగా విభజించెను. ధర్మశాస్త్రములు రచింపబడిన కాలమున స్త్రీ శూద్రాదులకు వేదాధికారము లేదని కొందఱు చెప్పిరి. వృత్తి సంబంధముగా నేర్పడిన యీ వర్ణవ్యవస్థను గుఱించి ఇప్పుడు విచారింతము

## (2) వర్ణవ్యవస్థ

తొలుత కులతత్త్వములు లేవు. కృతయుగమునందు వర్ణవ్యవస్థ లేకుండెనని భాగవతమున కలదు. పిమ్మట బ్రాహ్మణాది వర్ణములను వారివారి గుణకర్మలనుబట్టి యేర్పరచిరి సత్త్వగుణ మధికముగా కలవారు బ్రాహ్మణు లనియు, రజోగుణ మధికముగా కలవారు క్షత్రియులనియు, రజస్తమోగుణములు కలిసి యెక్కువగా నున్నవారు వైశ్యులనియు (తమోగుణము గలవారు వైశ్యులని కొన్ని గ్రంథములయందు గలదు), తమోగుణాధిక్యము కలవారు శూద్రులనియు

నిర్ణయించిరి. వారికి గుణోచితమైన వృత్తుల నేర్పరచిరి. తమోగుణ మధికముగా కలవారికి బుద్ధి స్వచ్ఛమై యుండదు గనుక సూక్ష్మమైన విషయములను గురించి చక్కగా గ్రహించలేరు. ఆ కారణమువలన ఆ కాలమునందు శూద్రులు వేదములను చదువరాదనిరి. అది అప్పటికి సరియయిన నిర్ణయమే. ఒక గురువువద్ద నలుగురు శిష్యులున్నపుడు శిష్యులయొక్క బుద్ధిపాటవము ననుసరించి గురువు వారికి పాఠములు చెప్పునట్లు బుద్ధిమాంద్యము కలవారికి వేదములు చెప్పుటకు నిరాకరించిరి. కాని సూక్ష్మబుద్ధులగు జాతిశూద్రులకది యన్వయింపదు శూద్రులు వేదములు చదువరాదని చెప్పిన కాలమునందలి వర్ణవ్యవస్థకును, ఇప్పటి వర్ణవ్యవస్థకును చాల భేదము కలదు. పూర్వపు సంఘస్వరూపమే మారిపోయినది. సత్త్వాది గుణములబట్టి ఏర్పడిన వర్ణవ్యవస్థకు శాస్త్రములయందు ఈ విధమగు రూపకల్పన చేయబడెను:-

బ్రాహ్మణాది నాలుగు వర్ణములును వైరాజపురుషుని ముఖ బాహూరు పాదములయందు కలిగినట్లు కల్పింపబడినది*

ఇట్టి కల్పనయే ఆశ్రమంబులకుకూడా చేయబడినది ఎట్లనగా - వైరాజపురుషుని జఘనమునందు గార్హస్థ్యంబును, హృదయమున బ్రహ్మచర్యమును, వక్షఃస్థలంబున వానప్రస్థంబును, శీర్షంబున సన్న్యాసంబును పుట్టినట్లు చెప్పబడినది. (భాగ. 11-17-113 )**

వైరాజపురుషుని అవయవములనుండి పుట్టిన వనగా, స్త్రీ గర్భమునసుండి శిశువు జన్మించినట్లు, చెట్టునకు కాయ పుట్టినట్లు పుట్టలేదనియు; వర్ణాశ్రమములు సత్త్వాదిగుణముల బట్టి ఏర్పడినందుకు ఈ కల్పన అలంకారము మాత్రమే యనియు మన మెఱిగినదే. వర్ణమునకు తగినట్లు ఆ యా వర్ణములవారికి ఆ యా గుణములును గుణోచితమైన కర్మములును భాగవతమునందు చెప్పబడినవి (భాగ. 11-17-15, 16, 17, 18)

---

*శ్లో॥ విప్రక్షత్రియ విట్శూద్రా ముఖ బాహూరు పాదజాః ।
వైరాజాత్పురుషాజ్జాతా ఆత్మాచార లక్షణాః ॥ (భా గ. 11-17-12)
ప్రజాపతయో బ్రాహ్మణోఽస్య ముఖమాసీత్
బాహూ రాజన్యఃకృతః - 'ఊరూ తదస్య యద్వైశ్యః
పద్భ్యాగ్ శూద్రో అజాయత. (సుబాలోపనిషత్తు, ప్రథమఖండము)

** గృహాశ్రమోజఘనతో బ్రహ్మచర్యం హృదో మమ ।
వక్షస్థలాద్వనేవాసో న్యాసశ్శీర్షణి సంస్థితః ॥

త్రిగుణాత్మక ప్రకృతివలన కలిగిన సమస్తమానవులును సత్త్వరజస్తమో గుణముల సముచ్చయము కలవారై యున్నారు. అందులో సత్త్వగుణ మధికముగా కలిగినవారు జ్ఞానులగుటవలన శ్రేష్ఠులగుదురు. అట్లే దేహమునందలి అవయవములలో శ్రేష్ఠమయినది శిరస్సు (ముఖము). కనుక వారు ముఖమునందు పుట్టిరని కల్పింపబడెను సత్త్వగుణమునకంటె రజోగుణము తక్కువ శ్రేష్ఠత కలది యగుటచే దేహమునందు సహితము శిరస్సునకు క్రిందనున్న బాహువులతో పోల్చబడెను. అంతకంటెను తక్కువ రజోమిశ్రిత తమోగుణము లేక తమోగుణము బాహువులకంటె క్రింద నున్న యూరువులతోను, అధిక తమోగుణము పాదములతోను పోల్చబడెను. ఇట్లే ఆశ్రమములయొక్క ఉత్పత్తిని గూర్చిన కల్పనకూడ చేయబడినట్లు ఊహించుకొనవచ్చును.

ఈ కల్పన శ్రీమద్భాగవతమున ఏకాదశస్కంధము నందలి శ్రీ కృష్ణోద్ధవ సంవాదమునందేకాక తృతీయ స్కంధమునందలి విదురమైత్రేయ సంవాదమునందును, మహాభారతమున అనుశాసనిక పర్వమునందలి ఉమామహేశ్వర సంవాదమునందును చేయబడినది శాంతిపర్వమున భృగు భరద్వాజ సంవాదమునందు బ్రాహ్మణాది వర్ణములకు తెలుపు, ఎఱుపు, పసుపు, నలుపు రంగులును క్రమముగ చెప్పబడినవి.*

శ్రీయుతులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు వర్ణ విభాగమును గుఱించి యిట్లు వ్రాసిరి

"ఆదియందు వృత్తిసంబంధమైన యీ వర్ణవిభాగము క్రమముగా అనువంశికమైనది. మంత్రముల కాలములో వృత్తులు వర్ణముల ననుసరించి విభాగింపబడి యుండలేదు "

నిజమునకు వర్ణవిభాగము ఆర్యులవలనగాని, ద్రవిడులవలనగాని వచ్చినది గాదు భిన్నజాతు లొకచో గలసి జీవింపవలసి వచ్చిన సందర్భములలో నవసరార్థము వర్ణవ్యవస్థ యేర్పఱుపబడినది నేటి వర్ణపరిణామ మెట్లున్నను నా దది దేశముయొక్క అవసరమును జక్కగా దీర్చినది ..... దురదృష్టవశమున

---

* ఈ విషయ మీ గ్రంథముయొక్క ద్వితీయభాగము నందలి కర్మయోగ ప్రకరణమున చెప్పబడినది.

కార్శ్యనాశములనుండి జాతిని రక్షించుటకు నిర్మించిన సాంఘిక వ్యవస్థయే, కాలక్రమమయిన జాతి పరిణతికి యాటంకమయ్యెను. జాతిపురోగమన ప్రవాహము వేగముగా బ్రసరింపవలసి వచ్చినపుడుగూడ నీ వర్ణ విభాగములను నడ్డుకట్టలు త్రోవ నిచ్చినవి కావు. సంఘునిర్మాణమును జక్కగా నిలబెట్టి కాపాడినను మొత్తముమీద దేశాభ్యుదయము నీ వ్యవస్థ యరికట్టినది"

(*భా. త. 1-2-10)

## (3) ద్విజాలు

జి : ద్విజాలనగా నెవరు?

వే : ద్విజాలనగా రెండు పుట్టుకలు కలవారని అర్థము. పక్షులు పాములు మొదట తల్లి గర్భముననుండి గ్రుడ్డుగా పుట్టును. కొన్ని దినములైన పిమ్మట ఆ గ్రుడ్లనుండి పిల్లలు పుట్టును. అట్లు రెండుసార్లు పుట్టినందున అవి ద్విజా లనబడును. బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు వారి తల్లిగర్భమునుండి పుట్టుటవలన ఒక జన్మమును, తర్వాత ఉపనయన సంస్కారమువలన రెండవజన్మమును కలిగినట్లు చెప్పుదురు. రెండవ జన్మమున వారికి గురువు తండ్రియనియు, గాయత్రి తల్లి యనియు శాస్త్రము చెప్పినది. అందుచే వారు ద్విజా లనబడుదురు. రెండవసారి జన్మించిరనుట లోకాచారము ననుసరించి చెప్పిన మాటయేకాని యథార్థమైన జన్మకాదు ద్విజుడు యజ్ఞము చేసిన మూడవజన్మ కలుగునని మనువు (మను 2-169-170)

మొదటి జన్మముకంటె రెండవ జన్మమందు దేహమునందో, లేక అంతఃకరణమునందో మార్పు కలిగి యుండిన యెడల అది సహజముగా జన్మయని చెప్పవచ్చును ఏ మార్పును లేక కేవల యజ్ఞోపవీతధారణ మాత్రమున ద్విజత్వము కలిగెననుట కేవల లోకాచారము ననుసరించుటే ప్రపంచమున పుట్టిన ప్రతిప్రాణియు ఆహార నిద్రా భయ మైథునాదులందు ప్రవర్తించుచున్నది. సామాన్య మానవులు సైత మట్లేయున్నారు. కొందరు మాత్రము శమాదిగుణ సంపన్నులై ఐహికవిషయములయం దాసక్తులు కాక తత్త్వ వీక్షణులై యున్నారు. సామాన్యప్రాణి స్వభావముకంటె, వీరి ప్రవృత్తి భిన్నమగుటవలన తాత్త్వికదృష్టిచే వీరిని ద్విజాలని చెప్పవచ్చును. అట్టివారికి

* (భా త. అనగా : భారతీయ తత్త్వశాస్త్రము. డా రాధాకృష్ణ పండితులు రచించిన 'ఇండియను ఫిలాసఫీ'కి శ్రీ బులుసు వెంకటేశ్వర్లు గారి ఆంధ్రానువాదము)

వేదాంతమునం దధికారము కలదు ఇది పూర్వుల యభిప్రాయము, అనగా ఉపనిషత్తులయొక్క తాత్పర్యము.

జి : యజ్ఞోపవీత ధారణమున గల అర్థమేమి?

వే : ఈ విషయమున శ్రీ లోకమాన్య బాలగంగాధరతిలక్‌గారి అభిప్రాయమునే నీకు చెప్పెదను యజ్ఞోపవీతము పూర్వాచారమును సూచించుచున్నది యజ్ఞోపవీత మనగా (యజ్ఞ + ఉపవీత) యజ్ఞముయొక్క వస్త్రము అని యర్థము. ఉపవీత మనగా వస్త్రము యజ్ఞ కర్మకొఱకు ధరించు వస్త్రము. లేక యజ్ఞముయొక్క వస్త్రము అని చెప్పవచ్చును. యజ్ఞముచేయు బ్రాహ్మణులు పూర్వకాలమున యజ్ఞమును ప్రారంభించునపుడు నడుమునకు జింకతోలునుగాని, వస్త్రమునుగాని బిగించి కట్టుకొందురు. ఇప్పటివలె జన్నిదము వారికి లేదు లోకమునందు కొందఱు "నేనీ కార్యము చేయుటకు నడుముకట్టుకొన్నాను" అనుట అలవాటై యున్నది అట్లే ఈ యజ్ఞ కార్యమును పూర్తిచేయుదునని యజ్ఞదీక్షను పూనుటయే దీని తాత్పర్యము. యజ్ఞోపవీత మనునది దారము కాదు. అది క్రమముగా సూత్రమై (దారమై) నడుమున నుండునది భుజముపైకి వచ్చినది. ఇట్టి మార్పు ధర్మశాస్త్రముల కాలములో వచ్చినట్లు తోచుచున్నదని లోకమాన్య తిలక్‌గారు చెప్పిరి. ఇది యజ్ఞ కర్మకు సంబంధించినది. (దీని వివరమును గుఱించి తెలియగోరువారు శ్రీలోకమాన్య తిలక్ రచించిన 'మృగశీర్ష' లేక 'వేదకాల నిర్ణయము' అను గ్రంథము నందలి ఆఱవ అధ్యాయము చదివినచో తెలియును.)

ఆధ్యాత్మిక దృష్టితో చూచిన యెడల యజ్ఞోపవీతము పరబ్రహ్మమును తెలియజేయు సూత్రముగా చెప్పుదురు. బ్రహ్మోపనిషత్తునం దిట్లున్నది. (1) ఇంద్రియములు (2) ప్రాణము (3) తేజోరూపము - అను మూడు విధములుగా నున్న సూత్రాత్మయే సూత్రము.

**"సూత్ర మంతర్గతం యేషాం జ్ఞానయజ్ఞోపవీతినాం |**
**తే వై సూత్రవిదో లోకే తే చ యజ్ఞోపవీతినః" ||** (బ్ర 13)

పరబ్రహ్మజ్ఞానమే యజ్ఞోపవీతముగాగల యెవరికి యజ్ఞోపవీతము (సూత్రాత్మ) గలదో వారే ఈ లోకమున యజ్ఞోపవీతము నెఱింగినవారు, వారే యజ్ఞోపవీతము కలవారు.

"కర్మణ్యధికృతా యే తు వైదికే బ్రాహ్మణాదయః ।
తేభి ర్ధార్య మిదం సూత్రగ్ క్రియాంగం తద్ధి వై స్మృతమ్"॥ (బ్ర 16)

తా॥ వేదవిహితము లగు (సంధ్యావందన యజ్ఞాది) కర్మలయం దధికారముగల బ్రాహ్మణులు మున్నగువా రెవరుగలరో వారి యజ్ఞోపవీతమును బాహ్యదేహమునందు ధరించునది. ఆ యజ్ఞోపవీతమే బాహ్యకర్మలగు సంధ్యావందన యజ్ఞాదులకు సాధనముగా చెప్పబడినది

"ఏ సూత్రమునందు (దారమునందు) మణులవలె సర్వప్రపంచమును కూర్చబడియున్నదో, అట్టి సూత్రమును తత్త్వవేత్తయు, తత్త్వదర్శనుడును, యోగియు ధరింపవలయు" నని బ్రహ్మోపనిషత్తు చెప్పినది. (బ్ర. 11).

కనుక ఇందువలన బ్రహ్మవిద్యను విచారించుటకు సూత్రముతో పనిలేదు బ్రాహ్మణ కులమునందు చేరుటకు సూత్ర మవసరము.

## (4) వేదములు - వేదాంతములు

జి : వేద మనగానేమి? వేదము లెన్ని? వేదములకు వేదాంతములకు గల సంబంధ మెట్టిది?

వే : తాత్త్విక దృష్టితో చూచిన జాగ్రత్స్వప్నములయందు పదార్థములను గుర్తించు జ్ఞానమే వేదమనబడును. లోకాచారము ననుసరించి ఋగ్వేదాది గ్రంథములు వేదములు. ఋగ్వేదమే వేదమని కొంతకాలము వ్యవహారములో నుండెను. పిమ్మట ఋగ్యజుస్సామవేదములు మూడే వేదములని చెప్పబడినవి. (గీత 9-17) శివానందలహరిలో శ్రీ శంకరులవారు "త్రయీ వేద్యం హృద్యం త్రిపురహర మాద్యం" అని మూడు వేదములనే పేర్కొనిరి. తర్వాత అధర్వణమును కూడ వేదమని చెప్పిరి. అంతటినుండి వేదములు నాలుగని వ్యవహారములోనికి వచ్చెను అనేకులు నాల్గవ వేదమును వేదములలో చేర్చుటకు అంగీకరించలేదు. తరువాత కొంతకాలమునకు

"ఋగ్యజుస్సామాధ ర్వాఖ్యా వేదా శ్చత్వార ఉద్ధృతాః ।
ఇతిహాసః పురాణం చ పంచమో వేద ఉచ్యతే"॥ (భాగ. స్క. 6-4-20)

ఋగ్యజుస్సామాధర్వణములను నాలుగు వేదములే గాక ఇతిహాసము (మహాభారతము) పురాణములును పంచమ వేదముగా చెప్పబడెను.

కొందఱు ఇప్పుడు వేదములని చెప్పబడు నాలుగు వేదములు పూర్తిగా వేదములు కావనియు, అందులోని మంత్రభాగములు మాత్రమే వేదములనియు చెప్పుదురు

జి : వేదములు మానవ విరచితములు గావనియు, అవి బ్రహ్మదేవుని నిశ్శ్వాసములనుండి పుట్టినవని చెప్పుదురు కదా? దీని భావమేమి?

వే : వెనుక, వైరాజపురుషుని అవయవములనుండి చతుర్వర్ణములు పుట్టినవని చెప్పుట యెట్టి యలంకారికమో యిదియు నట్టిదే శ్రుతియందు కేవలము వేదములేగాక సమస్త శాస్త్రములు అట్లే పుట్టినట్లు చెప్పబడినవి * వేదము లీశ్వరకృతము కావని పౌరుషేయములే అని న్యాయ, వైశేషిక దర్శనముల సిద్ధాంతము. దీనిని పూర్వమీమాంసాదర్శన మంగీకరింపదు. వేదములు వాని స్వశక్తిచే నిత్యము లైనవేగాని అవి ఈశ్వరకృతములుగాని, మానవకృతములు గాని కావని వారి సిద్ధాంతము. వేదాంతులు సహిత మీ విషయమున పూర్వమీమాంసకులతో నేకీభవింపరు వేదములు ఈశ్వరకృతము లందురు

మనకుగల సమస్తజ్ఞానమునకు వేదములే మూలమనియు, అవియే ప్రమాణమనియును, మన పూర్వుల నమ్మకము. ఇచ్చట 'వేదములు' అని చెప్పినపుడు తత్త్వజ్ఞానమును బోధించునట్టి ఉపనిషత్తులు సహితము వేదములయం దంతర్భాగములను అర్థముతో చెప్పబడెను వేదముల పౌరుషేయములనగా వేదప్రతిపాదితమైన జ్ఞానము అనాది యనియును, కొందఱు అతీంద్రియజ్ఞాన సంపన్నులగు మహాత్ములచే వారి అంతరాత్మలనుండియే దానిని పొందగలిగి రనియు గ్రంథరూపములందున్న వేదములకు ఆది గలదనియును, పూర్వకాలమున గురుశిష్యపరంపరగ ఒకరినుండి మఱియొకరికి వేదములు కంఠస్థము చేయబడి బోధింపడెనేగాని గ్రంథరూపమున వ్రాయబడలేదనియు కొందఱు పెద్దల అభిప్రాయము

వేద కాలము క్రీ|| పూ|| 1200 సం|| కంటె నెక్కువ కాజాలదని మాక్స్ ముల్లర్ మహాశయుడు చెప్పెను. "వేదకాలము క్రీ|| పూ|| (1500 - 600) వఱకు ఆర్యులు ఇచ్చటికి వచ్చి స్థిర నివాసము ఏర్పఱచుకొని తమ

---

* "నిశ్శ్వసిత మేవైతదృగ్వేదో యజుర్వేదస్సామవేదోఽథర్వవేదశ్శిక్షాకల్పో వ్యాకరణం నిరుక్తం ఛన్దో జ్యోతిషా మయనం న్యాయో మీమాంసా ధర్మశాస్త్రాణి వ్యాఖ్యానా న్యుపవ్యాఖ్యానాని" (సుబాల)

నాగరకత సంస్కృతులను వ్యాప్తిచేసిన కాలము" అని శ్రీయుతులు డాక్టర్ యస్ రాధాకృష్ణ పండితులు చెప్పిరి శ్రీ లోకమాన్య తిలక్‌గారు "వేదముల యుత్పత్తికాలము బహుప్రాచీన మగుటచే ఇప్పటికి సుమారు 7,8వేల సంవత్సరములు అగుటచే వేదములు అనాదియని అలంకారమాత్రముగ చెప్పిన చెప్పవచ్చును" అనిరి 6000ల సంవత్సరములకంటె వేదకాలము తక్కువ యుండదని చెప్పిరి ఇందులో నేది సరియయినదను విచారము మనకిచ్చట అప్రస్తుతము పూర్వగ్రంథములయందు సహితము వేదములు అప్పుడప్పుడు మారుచుండునని యిట్లు చెప్పిరి :

శ్లో॥ యుగం ప్రతి ధియాం పుంసాం న్యూనాధికతయా మునే ।
క్రియాంగపాత వైచిత్ర్య యుక్తా న్వేదాన్ స్మరామ్యహం ॥
(జ్ఞాన. వాసి. నిర్వాణ ప్ర 22-19)

"యుగమునుబట్టి పురుషుల బుద్ధులు హెచ్చుతగ్గులు కలవియై యుండుటచే వానిననుసరించి పలువిధముల నిర్మింపబడిన కర్మంబులు, శాస్త్రములు, అధ్యయన క్రమంబును కలిగియున్న వేదంబుల నెఱుగుదును " అని భుసుండుడు వసిష్ఠునకు చెప్పినట్లు కలదు

ఇందువలన వర్తమాన కాలమునందున్న వేదములును, కొన్ని వేల సంవత్సరముల క్రితము నుండిన వేదములును వేఱువేఱని స్పష్టమగుచున్నది. అట్లుగాకున్నచో పురాణముల యందు చెప్పబడిన వ్యక్తుల (పురాణపురుషుల) నామములు వేదములయందున్నవి. ఆ నామములుగల పురాణపురుషులు వేదములు చదివియుండిన యెడల అవి యిప్పటి వేదముల కంటెను. భిన్నముగా నుండవలయునను సంశయము కలుగును. గీతయందు భగవాను డిట్లు చెప్పెను :

"సర్వ ప్రాణుల హృదయములయందు నేను ప్రవేశించి యున్నాను. కావున నావలన స్మృతియు, జ్ఞానమును, అజ్ఞానమును, ప్రాణులకు కలుగుచున్నవి. సమస్త వేదములను, వేదాంతములను చేసినవాడను, వేదములను తెలిసిన వాడను (చేసినవాడను) నేనే (గీ. 15 - 115). దీనివలన వేదములను వేదాంతములను భగవంతు డొక్కడే మహాత్ములనుండి వెలువడ జేసెనని విదిత మగుచున్నది. ఏమైనను నీ యంశమును మహాత్ముల తీర్పునకు వదలుచున్నాను.

వేదాంతములనగా ఉపనిషత్తులు అవి వేదముల చివర నుండునవి. వేదములయొక్క శిఖలని చెప్పుదురు ఇవి అనేకములు అందులో 108 ఉపనిషత్తులు ముఖ్యమైనవి అందులో పది అత్యుత్తమ మైనవని ముక్తికోపనిషత్తు చెప్పినది వేదములను, ఉపనిషత్తులను పరిశీలించినవారు నివి రెండును వేఱువేఱని చెప్పిరి వేదములు కర్మను విధించునట్టివి. వేదవిహితమైన కర్మానుష్ఠానమువలన కలుగుఫలము అల్పమైనది వేదాంతములు తత్త్వమును బోధించుచున్నవి తత్త్వజ్ఞానమువలన కలుగుఫలము నిరవధిక మైనది అదియే మోక్షము కనుక వేదములును వేదాంతములును ఒకటి కావు. గీతయందు భగవంతుడు అర్జునున కిట్లు చెప్పెను ·

"ఓఅర్జునా! సత్త్వరజస్తమో గుణములకు సంబంధించినవి వేదములు అనగా సంసారమే విషయముగా గలవి. కనుక వాటితో నీ కవసరము లేదు నీవు ఆత్మజ్ఞానము కలవాడవు, ద్వంద్వరహితుడవు, త్రిగుణాతీతుడవు"అగుము (గీత 2-45)

వేదములయందు చెప్పబడినది ద్రవ్యసంబంధమైన యజ్ఞము. ఉపనిషత్తులయందు చెప్పబడినది జ్ఞానయజ్ఞము. గీతయందు భగవానుడిట్లు చెప్పెను

"ఓ అర్జునా! ద్రవ్యసాధనమైన యజ్ఞము కంటె జ్ఞాన స్వరూపమైన యజ్ఞము శ్రేష్ఠమైనది. ఎల్లకర్మలు బ్రహ్మజ్ఞానమునందే లయ మగుచున్నవి." (గీ 4-33)

ఇదే విధముగా పురాణములయందును చెప్పబడెను . ప్రాచీనబర్హి యనురాజు అనేక యజ్ఞములు చేయుచుండెను. అతనియొద్దకు నారదమహర్షి వచ్చి 'రాజా! నీచేత యజ్ఞములయందు వధింపబడిన పశువులు లోహయంత్ర మయ శృంగములు ధరించి నీవు పరలోకమునకు రాగానే నిన్ను హింసించుటకు కాచుకొనియున్నవి" అని చెప్పి ఆ రాజుచేత యజ్ఞములు మానిపించెను. ఉపనిషత్తులు, భక్తిమార్గము, పాతంజల యోగమార్గము, భాగవత ధర్మములు - ఇవి ప్రచారమునకు వచ్చి, క్రమముగా వైదిక కర్మలయందు ప్రజలకు నిరుత్సాహము కలిగించెను. అప్పుడు వేదముల గౌరవము తగ్గకుండుటకై ఉపనిషత్తులను వేదములయం దొక భాగముగ చెప్పి యుండవచ్చునని ఊహించుట కవకాశమున్నది.

వేదము లపౌరుషేయములా? పౌరుషేయములా? అను నీ ప్రశ్నకు అందఱికి సంతృప్తికరమగు సమాధానము చెప్పునట్టి శక్తి నాకు లేదు. ఏలయన! మహర్షులని ప్రసిద్ధిచెందిన కణ్వ, గౌతమ, జైమిన్యాది దార్శనికులే యీ విషయమై ఒక అభిప్రాయమునకు రాలేక భిన్న భిన్న సిద్ధాంతములు చేసిరి. అయినను నాకు గల నమ్మకమును నేనిచట వ్యక్తీకరింతును.

"బ్రహ్మ వేద బ్రహ్మైవ భవతి" (ముం. 3-2-9)

శ్రుతివాక్యము ననుసరించి బ్రహ్మము నెఱిగినవారు బ్రహ్మమేయయి బ్రహ్మవేత్తకును బ్రహ్మమునకును అభేద మగుటవలన వేదములు ఈశ్వరకృతము లన్నను బ్రహ్మస్థితి నొందిన వారినోట వెలువడిన వనినను సారాంశ మొక్కటే- స్మృతి పురాణాదులు రచియించిన పండితులు (లౌకిక జ్ఞాన సంపన్నులు) వ్రాసినవి కావనుటయే తాత్పర్యము

ప్రతి ఉపనిషత్తును ఏదోయొక వేదమునకు సంబంధించినట్లే చెప్పబడినది వేదాంతములు స్వస్వరూపమును బోధించునట్టివి గనుక చదువుటకు సామర్థ్యముగల ప్రతి మానవుడు చదువవలయును, చదువుట కధికారము కలదు

## (5) ఉపనిషత్తులు - కులము

జి : జాతిశూద్రులయందు అర్హులగు వారికి నుపనయనము చేయించి వేదాధికారులనుగా చేయకూడదా?

వే : జాతిశూద్రులు ఉపనయన సంస్కారమున కర్హులు కారు. అందువలన వారికి వేదము చదువుటకు అధికారము లేదని స్మృతులు చెప్పినవి. ఎందువలన జాతిశూద్రులు ఉపనయనమున కర్హులుకారో ఆ కారణమును చెప్పలేదు ఉపనిషత్తుల తాత్పర్య మట్లుకాదు. ఛాందోగ్య శ్రుతియందు సత్యకాముడను ఒక బాలుని కథ గలదు. దానిలో కొంతభాగ మిపుడు చెప్పెదను. అందువలన నీకు యథార్థము బోధపడగలదు.

సత్యకాము డనుబాలుడు బ్రహ్మవిద్యను తెలిసికొనగోరి తల్లికడకు పోయి "బ్రహ్మవిద్యకొఱకు గురువు నాశ్రయింప పోవుచున్నాను. నాగోత్ర మేమో తెలుపు" మని యడిగెను. అందుల కామె యిట్లు చెప్పెను :

*"సాహైన మువాచ నాహ మేత ద్వేద
తాత యద్గోత్రస్త్వ మసి బహ్వహం
చరన్తీ పరిచారిణీ యౌవనే త్వా మలభే
సాహ మేత న్నవేద యద్గోత్రస్త్వ
మసి జబాలా తు నామాహ మస్మి సత్య
కామో నామ త్వ మసి సత్యకామ
ఏవ జాబాలో బ్రూవీథా ఇతి" (ఛాం 4-4-2)

తా॥ ఆమె సత్యకామున కిట్లు చెప్పెను. "నాయనా నీ గోత్రము నే నెఱుగను. నేను అనేక పరిచర్యలు చేయుచుండిన పరిచారికను, నా యౌవనకాలమున నిన్ను గంటిని నీవు ఏ గోత్రము వాడవైనది నే నెఱుగను. నాపేరు జబాల, నీపేరు సత్యకాముడు నీవు జబాలపుత్రుడ వగు సత్యకాముడవని నీ గురువునకు చెప్పుము" ఆ బాలు డంత హారిద్రుమంతుడను గౌతముని కడకుపోయి బ్రహ్మవిద్య నర్థించెను గౌతముడు నీగోత్ర మేమని ప్రశ్నింపగా తల్లి చెప్పినట్లే చెప్పెను. గౌతముడిట్లు చెప్పెను.

**"తగ్ం హో వాచ నైత దబ్రాహ్మణో వివక్తు
మర్హతి సమిధం సోమ్యాహరోపత్వా నేష్యే న సత్యాదగా ఇతి."

---

*టీక : "సా=ఆమె, ఏనం=ఇతనిని గుఱించి, ఉవాచ=పల్కెను, తాత=నాయనా, త్వమ్ యద్గోత్రః అసి=నీవు ఏ గోత్రము కలవాడ వైతివో, ఏతత్ అహం న వేద=దానిని నే నెఱుగను, అహం బహు చరన్తీ - నేను అనేక పరిచర్యలు చేయుచుండిన, పరిచారిణీ =పరిచారికను, యౌవనే=యౌవనమందు, త్వాం=నిన్ను, అలభే=కంటిని, (కనుక) త్వం యద్గోత్రః అసి=నీవు ఏగోత్రుడ వైతివో, ఏతత్=ఈ విషయమును, సా అహం=అట్టినేను, న వేద=ఎఱుగను, అహం=నేను, జబాలా నామ అసి=నీవు సత్యకాముడనువాడవు అయితివి, స హ=అట్టినీవు, సత్యకామః ఏవ జాబాలః=జబాలా పుత్రుడువగు సత్యకాముడను అని బ్రువీథాః=చెప్పుము"

**టీక : తమ్=అతనికి, ఉవాచ=గౌతము డిట్లు చెప్పెను ఏతత్=యిట్టి మాటలను, అబ్రాహ్మణః =బ్రాహ్మణుడు కానివాడు. వివక్తుమ్ అర్హతి=చెప్పజాలడు సోమ్య=సోమపానమునకు అర్హుడా, సమిధం=సమిధను, ఆహర=తీసికొనిరా, త్వా=నిన్ను, ఉపనేష్యే=ఉపనీతునిగా చేసెదను. సత్యాత్= సత్యవచనమునుండి, న అగాః=నీవు తప్పిపోలేదు. ఇతి=అని (చెప్పెను).

తా || ఇట్టిమాటలు (చెప్పుటకు లజ్జాకర మగుమాటలు) బ్రాహ్మణుడు కానివాడు ఇట్టి సత్యమును చెప్పడు కాని నీవు సత్యమును విడువలేదు కనుక సౌమ్యుడా! సమిధలను తీసికొనిరమ్ము, నీ కుపనయనము చేయింతును అని సత్యకామునకు ఉపనయనము చేయించెను

జబాల బ్రాహ్మణ స్త్రీయని "భర్తృసేవావ్యగ్రురాలగు నామె భర్తయొక్క గోత్రనామముల నెఱుగకయే సత్యకాముడను కుమారుని గని, ఆ బాలున కుపనయనము చేయించుటకు గౌతముని కడకు పంపె"నని ఒకరు వ్రాసిరి. జబాల వాక్యములను పరిశీలించిన ఆమె అవివాహిత యగుశూద్రస్త్రీ యని స్పష్ట మగును. ఆమె వాక్యము లివి "నేను అనేక పరిచర్యలు చేయుచుండిన పరిచారికను" పరిచారిక యనగా శూద్రస్త్రీ పరిచారికా, శూద్ర శబ్దములు రెండును పర్యాయ పదములు. ఇందుకు మహాభారతమునందలి ప్రయోగము. **"నరేంద్రసూదః పరిచారకో ఽస్మితే"** అని భీమసేనుడు విరాటుని కొలువునకు పోయినపుడు విరాటునితో చెప్పిన వాక్యము దీనిని తిక్కనగారు "దేవా నాల్గవజాతి వాడను" అని అంధ్రీకరించిరి. నాల్గవజాతి అనగా శూద్రుడని అంద ఱెరింగినదే కదా? కనుక జబాల శూద్రస్త్రీయే. బ్రాహ్మణస్త్రీ పరిచారిక యనుమాట ఊహింపరానిది.

"అనేక పరిచర్యలు చేయుచుండిన" అనుటవలన ఆమె అవివాహిత యనియు, యథేచ్ఛగా పురుషుల కామవాంఛను తీర్చుచుండెననియు విదిత మగుచున్నది. ఇచ్చట 'పరిచర్య' శబ్దము స్త్రీ పురుషునకు కలిగించునట్టి దేహసంబంధమైన సుఖమునకును అర్థమై యున్నది జ్ఞానవాసిష్ఠము నందలి దాశూరోపాఖ్యానమునందిట్లున్నది.

వనదేవత దాశూరుడను మునివలన పుత్రుని బడయగోరి అతనికడకు పోయి పుత్రు నిమ్మని యడుగగా ఆ ముని ఆమె కొక పుష్పము నిచ్చి పంపెను. దానివలన ఆమె పుత్రవతి యయ్యెను. కొంతకాలమైన పిమ్మట

తిరిగి మునివద్దకు వచ్చి పరిచర్య చేయుదు ననగా ముని నిరాకరించెను. ఆ సందర్భమున వనదేవత చెప్పిన వాక్యము లివి ·

"ఇత్యుక్త్వా స ముని స్త్రన్వీం ప్రసన్న ముఖమండలాం ।
పరిచర్యాం కరో మీతి ప్రార్థ నేక్తా వ్యసర్జయత్."॥ (జ్ఞా వా 17-169)

ఇదిగాక మహాభారతమున ఊర్వశి అర్జునుని కామించి యాతనిపొందు కోరిన, అట్టి కోర్కెను నాతడు నిరాకరించి "పురందరునకు బరిచర్య యొనర్చుటచే నాకు జనని వగుట సందియంబు లేదు" అని చెప్పినట్లు కలదు కనుక పరిచర్య యనుమాటకు దాంపత్య సౌఖ్య మని యర్థము

"నీవు ఏగోత్రము వాడవో నాకు తెలియదు" అనుట వలన నీతండ్రి యెవడో నేను చెప్పజాల నని యర్థము. బ్రాహ్మణ కుటుంబమున వివాహమునకు పూర్వమే గోత్రములను విచారించుకొందురు జబాల అప్పుడు చిన్నబిడ్డయై యుండిన కారణమున భర్తగోత్రము తెలిసికొనలేక పోయినను, వారున్న బ్రాహ్మణవాటికలో ఎవరినైనను అడిగి యుండిన తెలిపియుందురు లేదా వారి జ్ఞాతుల నడిగి తెలిసికొనియైన యుండవలయును గదా? జ్ఞాతులు లేకపోయిన జబాల పుట్టింటివారి నడిగినను చెప్పి యుందురు

"యౌవన కాలమునందు నిన్ను గంటిని" అనుమాట కర్థమేమి? ఈమాట జబాల చెప్పవలసిన పనియేమి? యౌవన కాలమునందు యుక్తాయుక్త వివేకము లేని దాననైతినని యర్థము ఇంతకంటెను కన్నకుమారునితో విశదముగా ఎట్లు చెప్పగలదు?

జబాల "నా పేరు జబాల, నీపేరు సత్యకాము డని చెప్పుము" అని చెప్పెను. ఆమె వివాహితయై యుండినచో ఆమె భర్తపేరు చెప్పియుండును భర్తృపరిచర్యలలో మునిగి యున్న జబాల భర్తపేరు తెలిసికొనుటకు వ్యవధిలేని దాయె నని చెప్పినచో అది లోకానుభవ విరుద్ధము భర్తను ఇతరు లనేకులు పేరుతో పిల్చుచుందురు అది ఆమె విని యుండును ఎంతటి పతివ్రతయైనను భర్తపేరును తెలిసికొనుటకు ప్రయత్నించని స్త్రీ యుండదు ఈకారణముల వలన జబాల అవివాహిత యని స్పష్టమగుచున్నది.

సత్యకామునికి తనతల్లియొక్క చరిత్ర తెలిసియు నీచమని దాచుకొనక తల్లి చెప్పినట్లే గౌతమునికి చెప్పెను గౌతముడు సత్యకాముని వాక్యములు

విన్నమాత్రముననే అతని పుట్టుకను గురించి తెలిసికొనెను. ఈ బాలుడు తల్లి యొక్కయు, తన పుట్టుకను గురించినట్టియు దోషమును దాచుకొనక సత్యము చెప్పెనని సంతోషించి "బ్రాహ్మణుడు కానివాడు ఈ సత్యమును చెప్ప జాలడని" ప్రశంసించి బ్రాహ్మణున కుండవలసిన లింగము (గుర్తు)లలో అతి ముఖ్య మయిన సత్యవాక్పాలనము ఆ బాలునియందున్నదని, కనుక బ్రాహ్మణకులములో చేర్చుకొనుటకు తగిన వాడని, ఉపనయనము చేసి బ్రాహ్మణకులములో చేర్చుకొనెను. సత్యకాముడు బ్రాహ్మణ దంపతులకు పుట్టియుండిన వాడైనచో గౌతముడు సత్యకాముని వాక్యములను ప్రశంసింపవలసిన అవసర ముండదు. సత్యకాముడు బాల్యముననే బ్రహ్మవేత్త యాయెను.

జబాల అవివాహిత, దాసి యని శ్రీ వివేకానందస్వాముల వారు ఇట్లు చెప్పియున్నారు -*"ఒక బాలుడు తల్లితో నిట్లనెను "నేను వేదముల పఠింపబోవుచున్నాను నాతండ్రి పేరేదియో నా కుల మేదియో తెలుపుము." వాని తల్లి వివాహము చేసికొనిన స్త్రీ కాదు భారతదేశములో వివాహముగాని స్త్రీయొక్క బిడ్డడు జాతిభ్రష్టుడుగ నెంచబడును. సంఘము ఇటువంటి వానిని స్వీకరించదు. అతడు వేదాధ్యయనమున కర్హుడు గాడు కావున పాప మా బాలునితల్లి "బిడ్డా! నీ గోత్రమును నెఱుగను, నేను దాస్యవృత్తి చేయుచు, పెక్కు తావుల చరించితిని నీ తండ్రి యెవరో, నే నెఱుగను కాని నా పేరు జబాల, నీ పేరు సత్యకాముడు" అనెను. ఆ బాలుడొక ఋషిని సమీపించి తనను శిష్యునిగా స్వీకరింపుడని వేడెను ఆ ఋషి "నీ తండ్రి పేరేమి? నీ కులమేమి?" అని ప్రశ్నించెను బాలు డంత తన తల్లివలన వినిన దానిని తెలిపెను. వెంటనే ఋషి యిట్లనెను. "తన్నుగూర్చి ఇట్టి అప్రియమగు ఉదంతముమ బ్రాహ్మణుడు తప్ప తదితరుడు పలుకలేడు నీవు బ్రాహ్మణుండవు. నేను నీకు విద్య గఱపుదును. నీవు సత్యమును వదలలేదు" అంతట ఆయన బాలుని తనకడ నిలుపుకొని విద్యనేర్పెను

శ్రీయుతులు డాక్టరు యస్. రాధాకృష్ణ పండితులిట్లు చెప్పిరి :

"వర్ణవిధులు సంఘమునకు జేయవలసిన కర్తవ్యములను నిర్ణయించునవి. తన కెన్ని యిడుములు కలిగినను మానవుడు తన విధులను నెరవేర్పవలెను.

* అనుష్ఠాన వేదాంతమునుండి అనువాదకులు శ్రీ తత్త్వానందస్వామి

విధులు వ్యక్తుల సామర్థ్యములపై నాధారపడి యుండును బ్రాహ్మణత్వము జన్మముపై గాక శీలముపై నాధారపడినది. ఈ క్రింది గాథ యీ సత్యమును నిరూపించుచున్నది

జబాలాసుతుడైన సత్యకాముడు తల్లిని సంబోధించి యిట్లు పలికెను "జననీ! నేను బ్రహ్మచారిని కాగోరు చున్నాను నే నేకులమునకు జెందినవాడను?" ఆమె యిట్లు చెప్పెను,"బిడ్డా! నీ వేకులమునకు జెందితివో నే నెఱుగను. నా యౌవనములో దాసీవృత్తిలో బెక్కుచోటుల సంచరించితిని అప్పుడు నీవు నాగర్భస్థుడ వైతివి. అందుచే నీకులము నాకు దెలియదు నాపేరు జబాల, నీవు సత్యకాముడవు కావున నీవు సత్యకామజాబాలి వనిచెప్పుము." (భా త 14-15)

సత్యకాముని కథవలన-కులము వ్యక్తియొక్క పుట్టుక వలనగాక, గుణమును బట్టియే నిశ్చయింపవలెనని, తక్కువ కులములో పుట్టినవారు సహితము ఉత్తమశీలముగల వారైనచో పై కులములో (అగ్రవర్ణమునందు) చేర్చుకొను నాచారము ఆ కాలమున నుండెననియు బోధపడుచున్నది

జి : సత్యకామునివంటి మహాత్ములు జబాల వంటి స్త్రీ గర్భమున పుట్టుదురా?

వే : పురాణ పురుషులయందు ప్రసిద్ధి కెక్కిన వారిలో కొందఱి జన్మకథనము లిట్లే యున్నవి వరూధిని యను అప్సరస గర్భమున మోసగాడగు ఒక గంధర్వువి వలన స్వరోచియు అతనికి స్వారోచిషమనువును పుట్టినట్లు చెప్పబడినది. మను వనగా చతుర్ముఖబ్రహ్మతో పోల్చదగినవాడు కదా? జీవులు వారివారి పూర్వసంచిత కర్మనుండి వచ్చిన ప్రారబ్ధ కర్మానుసార మాయాకులముల యందు అట్టి తల్లిదండ్రుల గర్భములయందు పుట్టుచున్నారు కాని వారి పూర్వపుణ్యము వృథాపోదు. వారు మహాత్ములగుటకు ఇవి యేవియు అడ్డు రాజాలవు. వారి తల్లిదండ్రుల పూర్వపుణ్యమువలన వారి గర్భమున మహాపురుష లుద్భవింతురు

వజ్రసూచికోపనిషత్తు కులమును గూర్చిన చర్చచేసినది. అందులో "కో వా బ్రాహ్మణో నామ" బ్రాహ్మణుడనగా నెవడు? ఆధ్యాత్మిక రహస్యములను చెప్పునట్టి ఉపనిషత్తులయందు ఇట్టి ప్రశ్న కలుగుటకు కారణమేమి?

"చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః" (గీ 4-13). తొలుత గుణములనుబట్టియు, కర్మలనుబట్టియు నాలుగు వర్ణములు ఏర్పడెను. ఆ కాలమునందు బ్రాహ్మణులందఱు బ్రాహ్మణులే అప్పుడు ఏ పునాదులపైన ఈ వర్ణసౌధము నిర్మింపబడెనో ఆ పునాదులు కదిలిపోయినవి అట్టికాలమున "అజ్ఞానమును ఖండింప నాయుధమును, జ్ఞానహీనులను దూషించునదియు, జ్ఞానదృష్టులకు నాభరణము పోలినదియు నగు వజ్రసూచికోపనిషత్తు ఇట్లు చెప్పినది. "**కో వా బ్రాహ్మణో నామ? కిం జీవః? కిం దేహః? కిం జాతిః? కిం జ్ఞానం? కిం కర్మ? కిం ధార్మిక? ఇతి.**

తా : బ్రాహ్మణుడనగా నెవడు? అతడు జీవుడా? దేహమా? వర్ణమా? జ్ఞానమా? కర్మమా? ధర్మము ననుష్ఠించువాడా?"

ఇట్లు జీవుడును, దేహము, బ్రాహ్మణుడు కాదని త్రోసివేసి తుదకు కులము సహితము కాదని నిరాకరించి "**తర్హిజాతి ర్బ్రాహ్మణ ఇతి చే త్తన్న: తత్రజా త్యన్తర్యజంతుష్వ నేకజాతి సమ్భవాత్ మహర్షయో బహవస్సన్తి, ర్యంజంతుష్వ నేకజాతి సమ్భవాత్ మహర్షయో బహవస్సన్తి. ఋష్యశృంగోమృగ్యాః కౌశికః కుశాత్, జాంబూకోజంబు కాత్. వాల్మీకో వల్మీకాత్, వ్యాసః కైవర్తకన్యాయాం, శశపృష్ఠా ద్గౌతమః, వసిష్ఠ ఊర్వశ్యాం, అగస్త్యః కలశే జాత ఇతి శ్రుతత్వాత్, ఏతేషాం జాత్యా వినాప్యగ్రే జ్ఞానప్రతిపాదితా ఋషయో బహవస్సన్తి తస్మా న్నజాతి ర్బ్రాహ్మణ ఇతి.**"

తా . అయితే వర్ణము బ్రాహ్మణు డనిన నదియుగాదు ఒక వర్ణములోనే యనేక వర్ణములు గలుగుచుండుట వలనను, అనేకులు మహర్షులు ఋష్యశృంగుడు లేడివలనను, కౌశికుఁడు దర్భవలనను, జాంబూకుడు నక్కవలనను, వాల్మీకుడు పుట్టవలనను, వ్యాసుడు చంబడి స్త్రీయందును, గౌతముడు కుందేటి వీపునను, వసిష్ఠు డూర్వశియందును, అగస్త్యుడు కుండయందును బుట్టినట్లును దెలియు చుండుటవలనను, వీరిలో జాతి లేకయు జ్ఞానము కలుగజేయు ఋషులనేకు లుండుటవలనను వర్ణము బ్రాహ్మణు డనకూడదు"

ఈ విధముగా చెప్పి తుదకు భగవంతుని అరచేతిలో ఉసిరిక కాయవలె చక్కగా ప్రత్యక్షము చేసికొని శాంతి మొదలగు ఉత్తమ గుణములు కలవాడై కృతార్థుడైన మహనీయుడే బ్రాహ్మణుడని సిద్ధాంతము చేసినది.

## (6) మహాభారతము - వర్ణసమీక్ష

ఉపనిషత్తులయందే గాక కులమును గుణించిన యీ ప్రశ్న మహాభారతమునందును, భాగవతమునందును కలదు మహాభారతమునందలి (వన) అరణ్యాపర్వమునందు ఇద్దరు మహాపురుషుల మధ్య జరిగిన సంభాషణము ఈ క్రింది విధముగా నున్నది వారియందు సర్పరూపమున నున్న నహుషుడు యుధిష్ఠిరు నిట్లు ప్రశ్నించెను

**శ్లో|| "బ్రాహ్మణః కో భవే ద్రాజన్ వేద్యం కిం చ యుధిష్ఠిర |"**

(మ భా 3-180-20)

బ్రాహ్మణు డనగా నెవడు? అతడు తెలిసికొనవలసిన తత్త్వమేది?

ఈ ప్రశ్నకు యుధిష్ఠిరుడిచ్చిన సమాధాన మిది

**సత్యం దానం క్షమా శీల నృశంస్యం తపో ఘృణా |**
**దృశ్యంతే యత్ర నాగేంద్ర స బ్రాహ్మణ ఇతి స్మృతః ||**

(మ భా 3-180-20,21)

తా . ఓ సర్పరాజా! సత్యము, దానము, ఓర్పు, శీలము, అహింస, తపము, దయ - యివి యెవనియందుండునో అట్టివాడు బ్రాహ్మణు డని శాస్త్రములు చెప్పుచున్నవి

సుఖదుఃఖములను సమానముగా చూచునట్లు మానవుని చేయగలది బ్రహ్మవిద్యయే. దానినే బ్రాహ్మణు డభ్యసింపవలసి యున్నది

**నహుషుడు :** యుధిష్ఠిరా! నీవు చెప్పిన సత్యాదిగుణములు శూద్రునియందును గలవు. మోక్షమును సాధించుటకు అన్ని వర్ణములవారికిని అభిలాషయును, అర్హతయును కలదు. సుఖదుఃఖములకు అతీతమైన స్థితిని కలిగించునది బ్రహ్మవిద్య యొక్కటియే. (మ భా. 3-180-23,24,25)

**యుధిష్ఠిరుడు :**

**శూద్రేతు యద్భవే ల్లక్ష్మ ద్విజే తచ్చ న విద్యతే |**
**న వై శూద్రో భవే చ్ఛూద్రో బ్రాహ్మణో న చ బ్రాహ్మణః ||**(మ భా.3-180-26)

తా . బ్రాహ్మణునియొక్క లక్షణములివి యని పైన నేవి చెప్పబడినవో అట్టి సత్యాద్యుత్తమగుణము లెవనియందుండునో అట్టివాడు శూద్రుడు గాడు ఈ లక్షణము లెవ్వనియందు లేవో అట్టివాడు బ్రాహ్మణుడుగాడు.

(పై శ్లోకమునందు చెప్పిన అర్థమునే తిరిగి ఈ క్రింది శ్లోకమునందు దృఢపఱచుచున్నాడు.)

**యత్రైతల్లక్ష్యతే సర్పవృత్తం స బ్రాహ్మణః స్మృతః ।**
**యత్రై త న్న భవేత్ సర్ప తం శూద్ర మితి నిర్దిశేత్** ॥ (మ.భా. 3-180-27)

తా : పైన చెప్పిన లక్షణములు గలవాడు బ్రాహ్మణుడుగాను అవి లేనివాడు శూద్రుడుగాను పరిగణింపబడును

ఎచ్చట మఱల పుట్టుక లేదో, యెచ్చట నెక్కువ తక్కువలు లేవో, ఏది శీతోష్ణ సుఖదుఃఖములకు అతీత మయినదో అదియే మోక్షము (మ.భా. 3-180 28, 29, 30) అందుకు నహుషు డిట్లు ప్రశ్నించెను.

"ఓ రాజా! ఈ విధముగా చెప్పిన యెడల వర్ణవ్యవస్థ వ్యర్థమగును గదా? అప్పుడు బ్రాహ్మణు నెట్లు గుర్తింపవలెను? కర్మహీనత ఏర్పడును కదా?" (మ.భా. 3-180-31)

అని నహుషు డనిన ధర్మరా జిట్లు చెప్పెను.

"ఓ సర్పరాజా! మానవుని జాతిని నిర్ణయించుట కష్టసాధ్య మైనపని ఇప్పుడే వర్ణ సంకరము ఏర్పడుచున్నది. స్త్రీ పురుషులు జాతిభేద రహితముగా సంగమము చేయుచున్నారు. అన్ని విషయములలోను సామ్యము కనబడుచున్నది. కనుక తత్త్వవేత్తలగు మహాత్ములు కులమునకు ప్రాధాన్యము నియ్యక శీలమును మాత్రమే ప్రధానముగ గ్రహించి ప్రమాణముగా ఆచరణలో పెట్టుచున్నారు." (మ. భా. 3-180-32, 33, 34)

మఱియు ఉపనయన సంస్కారము పొందిన తర్వాతనే వేదాధ్యయనమున కధికారము లభించునని, వేదాధ్యయనము చేయుచుండిన మాత్రమున బ్రాహ్మణుండు కానేర డనియు, సచ్ఛీల సదాచారములు వదలిన వర్ణసాంకర్య మేర్పడుననియు ధర్మరాజు చెప్పెను.

మహాభారత కారుడగు కృష్ణద్వైపాయన మునీంద్రుడు శ్రీమన్నారాయణుని అవతారము అయన యెఱుగని ధర్మము లోకమున లేదు మహాభారతమును తెనిగించిన వారిలో ప్రథముడగు నన్నయగారు పై ఘట్టమును మూలమునకు విరుద్ధముగ తెనిగించిరి. ఆ ఘట్టము నీ క్రింద ఉదాహరించుచున్నాను;

"వ|| అయినను నానేర్చు విధంబునం జెప్పెద నడుగు మనిన నజగరం బిట్లనియె.

ఆ|| ఘనుఁడ యేగుణములు గలవాఁడు బ్రాహ్మణుం,
డతని తెలుఁగఁదగిన యట్టివస్తు
వెద్ది, దీనినాకు నెఱిఁగింపుమనిన ని
ట్లనియెఁ జెప్పెఁ బాండవాగ్రజుండు. (అరణ్య - 4 - 27)

సీ|| సత్య క్షమా దమ శౌచ దయా తపో
దానశీలము లెందేనిఁగాన
నగు నట్టివాఁడు బ్రాహ్మణుఁడగు, సుఖము దుః
ఖములేని యెడ విమోహమును బొంద
కునికియె వానికి మత్రమంబగుఁ వేద్య
మనిన నీ చెప్పిన యుగ్గుణములు
క్రియ శూద్రునందుఁ గల్గిన నతఁడుత్తమ
ద్విజుఁడు గానేర్చునే నిజము విడిచి

ఆ|| నట్టులయిన బ్రాహ్మణాది వర్ణవిభాగ
మెట్లు గలుగువయ్య హీను లధికు
లను వివేకమంది యపార్థకంబగుఁగాదె
యనిన ననియె నంతకాత్మజుండు. (128)

వ|| ప్రమాదంబున వర్ణసంకరం బయినప్పుడు వర్ణపరీక్షార్థంబుగా బ్రాహ్మణాదులకు వృత్తంబు వేఱువేఱు స్వాయంభువుండైన మనువు సెప్పె సత్యాదిగుణంబులు శూద్రునందు గలిగెనేని (వాడు సచ్ఛూద్రుండగు గాక బ్రాహ్మణుండు గానేర్చునే) యవియు బాహ్మణునందు లేనినాడు శూద్రుండ యనంబడుం గావున వృత్తంబుల యుత్తమంబులు" (139)

"సచ్ఛూద్రుండగుగాక బ్రాహ్మణుండు గానేర్చునే" అను వాక్యమునకు మూలమున బీజమాత్రముగ (సూక్ష్మముగ) నైన ఆధారము లేదు అత్యంత ముఖ్యవిషయమున, ఇట్టి దోషము పొరపాటున వచ్చినదని తలచుట సరికాదు భగవంతుడగు వ్యాసభగవానుని అభిప్రాయము నన్నయ గారికి తెలిసియుండియు బుద్ధిపూర్వకముగనే అట్లు వ్రాసిరి. కృష్ణద్వైపాయన మునీంద్రుడు మహాభారతమున అనేక సందర్భములయందు పైన చెప్పిన యుధిష్ఠిరుని వాక్యముల యందలి యర్థమును వెదజల్లి యున్నాడు. ఆంధ్రుల కత్యంత పూజ్యుడును మహాకవియును నగు నన్నయ్యగారు పైవిధముగ సత్యమును మరుగుపరచుట దురదృష్టకరము ఆశ్చర్యమేమనగా-నన్నయగారు పై ఘట్టమును వ్రాసిన వెంటనే కీర్తి శేషులగుటయు, ఇతరులచే మహాభారతము ఆంధ్రమున పూరింపబడుటయు తలచుకొనిన న్నయగారివలన పంచమ వేదమగు మహాభారతము బూర్తి గావింపబడుట భగవంతునకు నిష్టము లేదని తలంచుట కవకాశమున్నది మహాకవులగు తిక్కన సోమయాజి, ఎఱ్ఱాప్రగడగారల అనువాదముల యందిట్టి దోషములు నేనెరిగినంతవఱకు లేవు.

ఎఱ్ఱాప్రగ్గడ అనువాదమున :

ఆ॥ పాపవర్తనుండు బ్రాహ్మణుం డయ్యును
నిజము శూద్రుకంటె నీచతముఁడు
సత్య శౌచ ధర్మశాలి శూద్రుండయ్యు
నతఁడు సద్ద్విజుండ యనిరి మునులు. (మ.భా.అ.అ. 5 137)

అని సత్యమునే అనువదించిరి.

(ఉపనయనసంస్కారము ఆచరణలోనికి ఎట్లు వచ్చినది యిదివఱకే తెల్పియుంటిని).

అరణ్యపర్వమునందు కౌశిక ధర్మవ్యాధ సంవాదమునందు కులమును గుఱించిన ప్రశంసయే వచ్చినది. అందు ధర్మవ్యాధునితో కౌశికుడు చెప్పిన వాక్యములివి.

శ్లో॥ బ్రాహ్మణస్తపనీయేషు వర్తమానోఽపి కర్మసు ।
దాంభికో దుష్కృతః ప్రాజ్ఞః శూద్రేణ సదృశో భవేత్ ॥

శ్లో|| యస్తు శూద్రోదమే సత్యే ధర్మే చ సతతోత్థితః ।
తం బ్రాహ్మణ మహం మన్యే వృత్తేన హి భవేద్ద్విజః ॥
(మ భా 3-216-1, 14)

తా|| బ్రాహ్మణుడు దాంభికుడును, దుష్కృత్యమును చేయువాడును అయినయెడల పతనమైపోవుచున్నాడు అట్టివాడు శూద్రునికంటెను హీనుడు శూద్రునియందు సత్యము, దమము, ధర్మము మొదలైన సుగుణములుండిన అట్టివాడు బ్రాహ్మణుడనియే నా అభిప్రాయము వృత్తమే కారణముగాని, ద్విజత్వముచేత బ్రాహ్మణుడు కాజాలడు

ఈ చర్చ అరణ్యపర్వమునందే మఱియొకచోట జరిగినది అచట యక్షరూపమున నున్న ధర్మదేవత యుధిష్ఠిరు నడిగిన ప్రశ్న యిట్లున్నది

శ్లో|| రాజన్ కులేన వృత్తేన స్వాధ్యాయేన శ్రుతేన వా ।
బ్రాహ్మణ్యం కేన భవతి ప్రబ్రూహ్యేతత్సునిశ్చితమ్ ॥
(మ భా. 3-312-105)

తా · ఓ రాజా! బ్రాహ్మణ్యము దేనివలన కలుగుచున్నది కులముచేతనా? గుణముచేతనా? అధ్యయనము చేతనా? (ధర్మములను) వినుటచేతనా? ఈ విషయమును యథార్థముగా చెప్పుము

పూర్వము నహుషు డడిగిన ప్రశ్నయే యీ రూపము ధరించినది నహుష ప్రశ్నలయందు బ్రాహ్మణు డెట్టివాడో నిర్వచనము చేయుమని యున్నది యక్షప్రశ్నయందు బ్రాహ్మణత్వమునకు కారణము కులమా? గుణమా? అధ్యయనమా? యని యున్నది. ఈ ప్రశ్నకు యుధిష్ఠిరుడిచ్చిన సమాధానము

శ్లో|| శృణు యక్ష! కులం తాత! న స్వాధ్యాయో న చ శ్రుతం ।
కారణం వా ద్విజత్వే చ వృత్త మేవ న సంశయః ॥
(మ భా. 3-312-106)

తా: ఓ యక్షుడా! ఓ తండ్రీ! కులము, వేదాధ్యయనమువలనగాని శాస్త్రములు వినుటవలనగాని కలుగనేరదు. మఱి యేమనగా గుణము (మంచినడవడి) చేతనే కలుగుచున్నది.

"కనుక బ్రాహ్మణునిచేత ప్రయత్నపూర్వకముగా వృత్తము రక్షింపబడ వలెను ఎవనియందు వృత్తము నశింపదో అట్టి బ్రాహ్మణుడు నశింపడు " (107)

"శాస్త్రము లితరులకు బోధించువారును, సర్వదా శాస్త్రవిచారము చేయువారును వృత్తవంతులు కానియెడల, వీరందఱు మూర్ఖులని చెప్పబడుదురు శాస్త్రములయందు చెప్పినట్లు నడుచుకొనువాడే పండితుడు " (108)

"వేదాధ్యయనము చేసి దురాచారపరు డైనవాడు శూద్రునికంటెను అధముడు, జితేంద్రియుడై అగ్నిహోత్రము నాచరించువాడు బ్రాహ్మణుడు " (109)

ఈ విధముగా మహాభారతమునందు ఎచ్చటెచ్చట కులప్రసక్తి వచ్చినదో అచ్చట గుణము ననుసరించి కులము నిర్దేశింపబడినది. జన్మకంటె గుణమునకే ప్రాముఖ్య మియ్యబడినది. మహాభారత కర్తయొక్క అభిప్రాయ మిదియే వేదపారంగతుడును తపస్వియు నగు బ్రాహ్మణునకు (కౌశికునకు, పతివ్రతవలనను. ధర్మడను వ్యాధునివలనను ప్రబోధము కలిగించుటయు, మహాతపస్వియగు జాజలికి తులాధారుడను వైశ్యునివలన ప్రబోధము కలిగించుటయును నను నిట్టికథలు మహాభారతమునం దుండుటవలన మహాభారతకర్తకు స్త్రీలయెడగాని శూద్రులయెడగాని గౌరవభావము లేకపోలేదని స్పష్టమైనది

## (7) భాగవతము - వర్ణసమీక్ష

కులతత్త్వములను గుఱించి భాగవతపురాణ మేమి చెప్పినదో విచారింతము. అందు ముఖ్యముగా ధర్మరాజునకు నారదమహర్షి వర్ణాశ్రమధర్మములను గుఱించి చెప్పినట్లున్నది. అందు ఏయే వర్ణములవారి కెట్టెట్టి గుణము లుండవలయునో వివరించి తుదకు నారదమహర్షి యిట్లు చెప్పెను.

శ్లో॥ యస్య యల్లక్షణం ప్రోక్తం పుంసో వర్ణాభిసూచకమ్ ।
యదన్యత్రాపి దృశ్యేత తత్తేనైవ వినిర్దిశేత్ ॥ (భాగ. 7-11-35)

తా ఏ వర్ణమువారికి ఏ లక్షణము లుండునని చెప్పబడెనో ఆ లక్షణములు ఇతరులలో కనబడినయెడల అట్టి వానిని ఆ లక్షణములు కలిగిన వర్ణమువానిగా నిర్దేశింపదగును

అనగా బ్రాహ్మణుల కెట్టిలక్షణము లుండునని చెప్పబడెనో అట్టి లక్షణములు శూద్రులయం దుండెనేని వాడు బ్రాహ్మణుడనియు, శూద్రుని కెట్టి లక్షణము లుండునని చెప్పబడెనో, అవి బ్రాహ్మణునియం దుండినయెడల అతడు శూద్రుడని నిర్దేశింపవలయు ననియు తాత్పర్యము ధర్మరాజు నహుషునితో చెప్పినవాక్యములే యిచట కనబడుచున్నవి

జి : సత్యకాముని బ్రాహ్మణ కులములో చేర్చినట్లు చెప్పితిరి ఒక కులమునందు పుట్టినవారు మఱియొక కులములో చేరినట్లు నిదర్శనములు శాస్త్రములయందున్నవా?

వే : పూర్వకాలమున నొకప్పుడు నాలుగు వర్ణములయందును క్రింది కులమున పుట్టినవాడు ఉత్తమశీలము గలవాడైన పై కులములలో చేర్చుకొనుటయు, పై కులమున పుట్టినవాడు శీలవంతుడు గానిచో క్రింది కులమునకు త్రోసి వేయుటయు ననుపద్ధతి ఆచరణలో నుండినంతకాలము వర్ణవ్యవస్థ సార్థకమై సంఘము మంచిస్థితి యందుండెను ఆ పద్ధతిని విడనాడిన పిమ్మట వర్ణవ్యవస్థ తారుమారై నామమాత్ర మయ్యెను పురాణేతి హాసములయందు ప్రసిద్ధికెక్కిన సూర్యచంద్రాన్వయములకు చెందిన క్షత్రియులు కొందఱు బ్రాహ్మణకులమునకును, వైశ్యకులమునకును చేరినట్లును, బ్రాహ్మణులు క్షత్రియులుగా గైకొనబడినట్లును భాగవతమునందు గలదు

ఋషభుని కుమారులు 81-రు తండ్రి ఆజ్ఞతో పరమవినయ సంపన్నులు, మహాశ్రోత్రియులు, యజ్ఞశీలురు, కర్మవిశుద్ధులు నగు బ్రాహ్మణులైరి
(భాగ 5-4 11, 12)

వైవస్వతమనువు వంశమున దృష్టువను రాజునకు దార్ష్టులను పుత్రులు గలిగి వారు బ్రాహ్మణులైరి (భాగ. 9-2-17)

దేవదత్తునకు అగ్నివేశు డనుకుమారుడు కలిగి కానీనుడు, జాతూకర్ణ మహర్షియు నన ప్రసిద్ధి కెక్కి అతనికులమునకు బ్రాహ్మణత్వ మాపాదించెను.
(భాగ. 9-2-21, 22)

దిష్టునకు నాభాగుడు కుమారుడై వైశ్యత్వమును పొందెను (భాగ 9-2-23)

(ఈనాభాగుని వంశమునందే మరుత్తుడు పుట్టి చక్రవర్తి యయ్యెను) అంబరీషుని వంశమునందు పుట్టిన దధీతరుని క్షేత్రమునందు అంగీరసుని వలన కుమారులు గలిగి, వారు బ్రాహ్మణులైరి (భాగ 9-6-1, 2,3)

శుకమహర్షి పరీక్షిత్తునకు చంద్రవంశపురాజుల యితిహాసము చెప్పుట ప్రారంభించి "అనేకులు బ్రాహ్మణులు, రాజర్షులు పుట్టిన పూర్వవంశమును చెప్పెదన"ని చెప్పెను (భాగ 9-20-1)

పురూరవునకు ఏడవవాడగు శునకునకు శౌనకుడు పుట్టి ఋషి యయ్యెను. (భాగ 9-17-1, 2,3)

పురూరవకుమారు డగు ఆయువను వానివంశమునందు కృతునకు బ్రాహ్మణులు పుట్టిరి (భాగ 9-17-11)

గర్గునకు (గర్గుడు భరతుని దత్తుకుమారునికి పుట్టినవాడు) గార్గుడు పుట్టి అతనివంశము బ్రాహ్మణకుల మైనది (భాగ 9-2-19)

భరతుని దత్తుకుమారుని కుమారుడగు మహావీర్యునకు ద్రయ్యారుణి మొదలగు కుమారులు పుట్టి బ్రాహ్మణులైరి. (భాగ 9-21-20)

హస్తికి (ఇతని పేరనే హస్తినాపురము నిర్మింపబడినది) అజమీఢుడు పుట్టెను. అతనికి ప్రియమేధావు లనుకుమారులు కలిగి బ్రాహ్మణులైరి (భాగ 9-21-21)

అజమీఢునకు నళినియందు పుట్టిన సంతతివారియందు ముద్గలుడు పుట్టెను. అతని సంతతివారు మౌద్గల్యగోత్రముగల బ్రాహ్మణులైరి (భాగ. 9-21-33)

ఈ దృష్టాంతములనుబట్టి గుణముల ననుసరించి కులము మారుచుండె నని విశద మగుచున్నది.

జి : అయ్యా ! గుణము ననుసరించి వర్ణము మారుచుండు నంటిరి అనేకులు వారు జన్మించిన కులమును వదలి వర్ణాంతరమున చేరిరనియు భాగవతము చెప్పినది. శూద్రుడు గుణములచేగాక యింకొక మార్గమున బ్రాహ్మణు డగునని శాస్త్రప్రమాణము కలదా ?

వే : కలదు పాండవులు వనవాసము చేయుసమయమున ధర్మరాజువద్దకు నారదమహర్షి యరుదెంచి యుధిష్ఠిరునిచే పుణ్యతీర్థ ప్రభావమును వినిపింపుమని ప్రార్థితుడై తొల్లి పులస్త్యునివలన భీష్ముడు విన్న తెఱగున యుధిష్ఠిరునకు చెప్పిన వాక్యములయందు ఈ క్రింద వివరించిన వాక్యములు గలవు

"బ్రహ్మతీర్థంబాడి వర్ణాంతరులు బ్రాహ్మణు లగుదురు,
బ్రాహ్మణులు బ్రహ్మలోకప్రాప్తు లగుదురు" (అ-2 ఆ-264)

"దర్భినిర్మితంబయిన యర్థతీర్థంబాడిన శూద్రులు
బ్రాహ్మణు లగుదురు. బ్రాహ్మణులు పరమసిద్ధు లగుదురు.* (అ-2 ఆ-368)

ఈ విధముగ క్రింది వర్ణములవారు పై వర్ణములవారు పై వర్ణములకు పోవుటకు దయామయుడగు కృష్ణద్వైపాయన మునీంద్రుడు అనేక మార్గములు చెప్పియున్నాడు

## (8) ధర్మశాస్త్రములు - వర్ణసమీక్ష

మహాభారత కాలము గతించి స్మృతికర్తలు వ్యక్తియొక్క గుణమునకు ప్రాధాన్యమియ్యక జాతికి మాత్రమే ప్రాధాన్యమిచ్చిరి. గౌతమ ధర్మసూత్రములయం దిట్లున్నది

"శూద్రుడు వేదములు వినిన సీసమును, లక్కను కరిగించి వాని చెవులయందు పోయించవలయును వేదవాక్కుల నుచ్చరించిన యెడల వానినాలుకను ఛేదింపవలయును ధారణచేసి పరోక్షమున ఉచ్చరింప గలిగినచో అతనికి శరీరచ్ఛేదన మొనరింపవలయును" (గౌ సూ 2-3-4)

ఈ విధముగా రాజు దండింపవలయునని తాత్పర్యము

"శూద్రుడు బ్రాహ్మణ శుశ్రూషా నిమిత్తమై బ్రహ్మచే సృజింపబడెను శూద్రునికి బత్తెము ఇచ్చి పోషించియు, అట్లు యియ్యక పోషింపకయునైనను శుశ్రూష చేయింప వలయును." (మనుస్మృతి. 8-413)

---

* ఈ యంశమును విపులముగ తెలియగోరువారు మహాభారతము నందలి ఆ ఘట్టమును చదువవలెనని విన్నపము

"శూద్రునకు దాస్యనివృత్తి లేదు." (మను 8-414)

"శూద్రుడు కుటుంబపోషణముకంటె మించిన ధనమును సంపాదింప రాదు " (మను 10-129)

"స్వాశ్రితుడైన శూద్రునికి భోజనానంతరము మిగిలిన అన్నము బ్రాహ్మణు లొసగవలయును " "ప్రాతగిలిన బట్టలు, ఉడుపులు, తరకలగు ధాన్యము నొసగవలయును " (మను 10-125)

"శూద్రుడు పాదములుగల స్మశానము వంటివాడు "

"శూద్రునివలన బ్రాహ్మణులు ధనము తీసికొనరాదు "

ఇట్టివెన్నియో శాస్త్రములయందు చెప్పబడినవి కాని శూద్రు డనగా నెవడు? ఈ ప్రశ్నకు సరియైన సమాధానము స్మృతులయందు లేదు. ధర్మశాస్త్రకర్తలు అనేక విషయములలో పరస్పర భిన్నాభిప్రాయములు కలిగియున్నారు. శూద్రు లెవరు? అను ప్రశ్నకు మనుస్మృతి యిట్లు చెప్పినది·

"పౌండ్రులు, ఓఢ్రులు, ద్రవిడులు, కాంభోజులు, యవనులు, శకులు, పారదులు, పహ్లవులు, చీనులు, కిరాతులు, దరదులు, ఖశులు, ఉపనయనాది సంస్కారములు లేమింజేసి శూద్రులైరి " (మను. 10-44)

"ఆంధ్రులకు అరణ్యమృగములను హింసించుటయే వృత్తి " (మను 10-48)

"ఎవడు వేదములను అధ్యయనము చేయక ఇతర శాస్త్రములందు పరిశ్రమ చేయునో అతడు బ్రతికియు, తన వంశ్యులతోకూడ శూద్రత్వమును పొందును " (మను 2 168)

ఈ విధముగా చెప్పియున్నందున ప్రస్తుతము శూద్రు డెవడో నిర్ణయించుటకు సాధ్యము కాదు

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులను నాలుగు కులములేగాని అయిదవజాతి లేదని మనుస్మృతి చెప్పినది. (మను 10-4)

బ్రాహ్మణాది నాలుగువర్ణముల వారియొక్క అన్యోన్య, స్త్రీ పురుష సమ్మేళనముచేత *(1) అనులోమ (2) విలోమ (3) సంకీర్ణ జాతు లేర్పడినవని చెప్పిరి వీరు గాక (4) వ్రాత్యు లనబడువారును గలరు వీరందరును చేరి యితర కులములవారైరని మనుస్మృతి చెప్పినది ఇది నమ్మదగినది కాదు ఇప్పుడు మన దేశమున శూద్రులనువా రెవ్వరును లేరనియే చెప్పవచ్చును అనగా ఎవని నైనను నీకులమేమని ప్రశ్నించిన "నేను శూద్రుడను" అని ఎవ్వరును చెప్పరు రెడ్డి, వెలమ, కమ్మ యిత్యాది కులనామములు చెప్పుదురు ఇప్పుడు శూద్రజాతి ఏమైనది?

ఏమైనను స్మృతులకు కాలదోషము పట్టినది కనుక వాటినిప్పుడు ప్రమాణముగా గైకొనరాదు మన్వాది స్మృతులు రచింపబడిన కాలమునందుకూడా వాటిని సంఘము పూర్తిగా శిరసావహింపలేదు అంతకు పూర్వము వాడుకలో నున్నయేవో కొన్ని విధులను మాత్రమే అనుసరించినది

జి : ధర్మశాస్త్రములకు కాలదోష మెట్లు పట్టును?

వే : ధర్మము కాలానుగుణముగా మారును ధర్మ శాస్త్రకర్తలే యిట్లు చెప్పిరి "కృతయుగ ధర్మములు వేఱు త్రేతాయుగ ధర్మములు వీటికంటె భిన్నములు అట్లే ప్రతియుగమునందును ధర్మము మారుచుండును "

(మను 1-85)

"కృతయుగమున మనుస్మృతి ధర్మమును, త్రేతాయుగమున గౌతమస్మృతి ధర్మమును, ద్వాపరయుగమున శంఖలిఖితస్మృతి విహితధర్మమును, కలియుగమున పరాశరోక్త ధర్మమును ప్రచురముగా చేయదగియుండును "

(పరా 1-24)

ప్రస్తుతము పరాశరస్మృతికి సహితము కాలదోషము పట్టినది ఈ ధర్మశాస్త్రములయందు చెప్పిన ప్రకారము అనులోమాది జాతుల విభాగమును పూర్వము సహితము మన్నించ లేదు సూర్యచంద్రాన్వయములకు చెందిన

---

* (1) అనులోమ = అగ్రవర్ణమునకు చెందిన పురుషునకు, అధమ వర్ణస్త్రీకిని పుట్టినవారును.
(2) విలోమ = అగ్రవర్ణమునకు చెందిన స్త్రీకిని, అధమవర్ణ పురుషునకు పుట్టినవారును.
(3) సంకీర్ణ = అనులోమ విలోమాది వర్ణముల స్త్రీ పురుష సంబంధమువలన పుట్టినవారును.
(4) వ్రాత్యులు = ఉపనయనాది సంస్కారములు లేక చెడిపోయిన ద్విజాలు
(మనుస్మృతి 10 వ అధ్యాయము)

రాజ వంశములయందు సంతానము లేనియపుడు బ్రాహ్మణులవలన సంతతి పొందినట్లు కలదు. అట్టివారు అనులోములుగా భావింపబడలేదు యయాతి యందు దేవయానికి కలిగిన యదుసంతతిని విలోమ జాతులుగా పరిగణింపబడ లేదు. ఈ రెండు వంశములయందు భగవంతుడు శ్రీరామ, శ్రీకృష్ణులుగా అవతరించెను. యయాతికి శర్మిష్ఠయందు కలిగినవారే పూరువు మొదలగువారు శర్మిష్ఠ రాక్షసరాజుకూతురు, రాక్షసులయందు చాతుర్వర్ణ్య వ్యవస్థ లేదు

జి : పరాశరస్మృతి కలియుగమునకు వర్తించును కదా? దానికి కాలదోష మెట్లు పట్టినది?

వే : దీనికొక దృష్టాంతము చెప్పెదను పూర్వము బ్రాహ్మణ వైశ్యకులముల యందు కన్యలకు రజస్వలలు కాక మునుపే వివాహము చేయుచుండిరి వారట్లు చేయుటకు కారణము ధర్మశాస్త్రములు చెప్పినవనియే ఈ విషయమున ధర్మ శాస్త్రము లిట్లు చెప్పినవి

"పది సంవత్సరములకంటె మించిన వయసుగల కన్య రజస్వల" (పరా 7-4)

"పెండ్లి కాకమునుపే కన్య రజస్వల యయినయెడల ఆ కన్య తలిదండ్రులు, జ్యేష్ఠభ్రాతయు నరకమును బొందుదురు " (పరా 7-6 7)

"తన పుత్రికకు 12 సంవత్సరములు వచ్చినను ఎవడు పెండ్లి చేయడో వాని పితృదేవతలు ప్రతిమాసమును ఆ కన్య యొక్క రజస్సును (ముట్టు రక్తమును) పానము చేయుదురు." (పరా. 7-5 6)

వర్తమానకాలమున రజస్వలాత్పూర్వ వివాహములు లేవనియే చెప్పవచ్చును. పూర్వము రజస్వలాత్పూర్వ వివాహములు చేయుచుండెడివారు అందువలన అనేక కష్టములు పడుచుండిరి ఇప్పటివారు సంతోషముతో వారి బిడ్డలను విద్యావతులను చేయుచున్నారు. ఇట్టి వనేకములు గలవు కనుకనే పరరాశరస్మృతికి కాలదోషము పట్టినదని చెప్పితిని

జి : వైవస్వతమనువు మొదలగువార లిట్టి ధర్మ శాస్త్రములు వ్రాయుటకు కారణమేమి?

వే : ఇప్పటి మనుస్మృతి మొదలగు ధర్మశాస్త్రములు మన్వాదులు రచించినవి కావు. ప్రస్తుతము మనము చూచు స్మృతులన్నియును బౌద్ధమతము

మన దేశమున ప్రచారమునకు వచ్చుటకు కొలదికాలము ముందుగనో, తర్వాతనో రచింపబడినవి *ధర్మశాస్త్రముల యందు ప్రజలకు గౌరవము కలుగుటకై మనువు, పరాశరుడు మొదలగు గొప్పవారు చెప్పినట్లు, లేదా రచియించినట్లు ఆయా గ్రంథకర్తలు వ్రాసిరి అంతేగాని మనువు లిప్పటి ధర్మశాస్త్రములకు ఏవిధముగను కర్తలు కారు మహాభారతమునందు స్వాయంభువమనువు ధర్మముల నేర్పాటుచేసెనని చెప్పబడినది. మహాభారత కాలమునాటి వారు చదివిన స్మృతులు ఇప్పటి స్మృతులేనా ? మనువు చెప్పిన మనుధర్మ శాస్త్రము, పూర్వము గద్యరూపమున నుండినదని చెప్పుదురు బహుశః దానియందలి ధర్మము కాలానుగుణముగ మారుచు వచ్చి ఇప్పటి మనుస్మృతి రూపముగ వ్రాయబడియుండును ఆ కారణమువలన ఇప్పటి మనుస్మృతి మనువే చెప్పెనని ఆ గ్రంథకర్త వ్రాయుట విపరీతముగాదు. అట్లే తక్కిన ధర్మ శాస్త్రముల విషయమును గూడ ఊహించవలెను స్మృతులు కాలానుగుణముగా మారుచుండును. మన దేశమునందు ప్రభుత్వము అప్పుడప్పుడు శాసనములు చేయుటయు పూర్వ శాసనములను సవరించుటయు మన మెఱిగినదే

ఎట్టి నియమాచరణమువలన సంఘ మత్యున్నత స్థితి నొందునో ఆ నియమమే ధర్మము. ధర్మము దేశకాలముల ననుసరించి మార్పు చెందును. మార్పు లేనిది మోక్షధర్మము. మారుచుండునది సాంఘిక ధర్మము. ఒక కాలమున ధర్మమని సంఘముచేత గౌరవింపబడునది కాలాంతరమున ఆ ధర్మము ననుష్ఠించుటవలన సంఘమునకు వినాశము తటస్థించు నేని అది ఆ కాలమునకు ధర్మము కానేరదు అప్పుడది అధర్మమని దానిని సంఘము

---

* జటావల్లభుల పురుషోత్తమరావుగారి "స్మృతులకాలపు స్త్రీలు" అను గ్రంథమునందు "ఆధునిక విమర్శకులు కొన్ని స్మృతులకు కాల నిర్ణయము చేసియున్నారు ఆ నిర్ణయము లిట్లున్నవి గౌతముడు క్రీ.పూ 600. బోధాయనుడు క్రీ.పూ. 550, హిరణ్యకేశి క్రీ.పూ 500, అపస్తంబుడు క్రీ పూ. 500, ప్రస్తుత మనుస్మృతి క్రీ.పూ. 200 మొదలు క్రీ.శ. 100 లోపున, సంవర్తుడు క్రీ పూ 200, యాజ్ఞవల్క్యుడు క్రీ పూ 100 కును, క్రీ.శ. 200 కును నడుమ, బృహస్పతి క్రీ శ 200, హారీతుడు క్రీ.శ. 400 కును 700 కును నడుమ, పరాశరుడు క్రీ శ 1200, పరాశరస్మృతికి పిమ్మట పుట్టిన ధర్మశాస్త్ర గ్రంథము లన్నియు వ్యాఖ్యానములో నిబంధన గ్రంథములో యై యున్నవి" అని వ్రాసిరి.

మనుధర్మశాస్త్రము రచింపబడిన కాలమును గుఱించి పండితులు భిన్నాభిప్రాయములు చెప్పిరి

త్రోసివేయవలెను. ధర్మ రహస్యము నెఱింగిన శ్రీ శ్రీ వివేకానంద స్వాములవారు మహాత్మాగాంధీ గారు మొదలగు మహనీయులు ఈ కాలమున భారతభూమియందు జన్మింపకయుండినచో, ఇప్పటికి హిందూసంఘమునకు హిందూమతమునకు నేగతి పట్టియుండునో వివేకులగు వారు కొందఱు మాత్రమే యెఱుగుదురు. స్వార్థపరులు సంకుచితబుద్ధులు ఇప్పటికి నెఱుగకున్నారు. ఏబది సంవత్సరముల క్రిందట సంఘమునకు నిప్పటి సంఘమునకు భేదమున్నది. ఈ పంక్తులు వ్రాయుచుండు కాలము (సమయము)న శూద్రుడు వేదములు చదువ రాదనువారు చాల అరుదు ఎవరో శాస్త్రజ్ఞానము లేని పౌరోహిత వర్గమునకు చెందినవారు తప్ప తక్కిన ద్విజాలు శూద్రాదులయెడ నీచభావమును చూపుట లేదు.

వేదాధికారము శూద్రులతో కాక స్త్రీలకును, బ్రహ్మ బంధువులకును (నామధారక బ్రాహ్మణులకు), ద్విజబంధువులకు లేదని చెప్పిరి. ద్విజాలు వేదాధ్యయనము చేయవచ్చును గాని, బ్రాహ్మణుడు దక్క నితరులు వేదాధ్యయనము చేయించ రాదని చెప్పిరి.

శి : బ్రహ్మ బంధువు లనగా నేమి ?

వే : "బ్రాహ్మణ కులమునందు పుట్టి సవితృదేవతాక మగు గాయత్రీజపమును, సంధ్యోపాసనమును,అగ్నికార్యము నాచరింపక వ్యవసాయము చేసికొని జీవించువారు నామధారక బ్రాహ్మణు లనబడుదురు." (పరా. 8-3)

ద్విజబంధువు లనగా బ్రహ్మ, క్షత్రియ, వైశ్యకులములయందు పుట్టి వేదాధ్యయనము లేనివారు.

స్త్రీల విషయమందు ధర్మశాస్త్రములు సరియైన అభిప్రాయము కలిగియుండ లేదు. స్త్రీలను గుఱించి మనుస్మృతి యిట్లు చెప్పినది

శయ్య, పీఠము, భూషణములను, కామక్రోధములను, కపటమును, పరద్రోహమును, పరహింస, కుత్సితపు నడవడిక కలిగియుండుట- వీని నన్నింటిని స్త్రీలకు మనువు మొదటనే కల్పించెను. కనుక వీరిని ప్రయత్నముతో రక్షింపవలయును. వీరు జాతకర్మాది మంత్ర సత్సంస్కారము లేని వారనియు, పాపరహితులు కారనియు, అందువలన వేదార్హులు కారనియు చెప్పిరి. స్త్రీలకు వ్యభిచార శీలత్వము స్వాభావికము-మొదలగు వాక్యములు చెప్పబడినవి.
(మను. 9-17, 18, 19)

శ్లో॥ తథా చ శ్రుతయో బహ్వ్యోని గీతా నిగమేష్వపి ।
స్వాలక్షణ్య పరీక్షార్థం తాసాం శృణుత నిష్కృతీః ॥ (మను 9-19)

తా॥ స్త్రీలకు వ్యభిచార శీలత్వము స్వాభావిక మని చెప్పబడినది అ విషయమున వేదవాక్యములు ప్రమాణముగా చెప్పబడుచున్నవి...

ఈ కారణమువలన స్త్రీలకు వేదాధికారము లేదనిరి. ఇది సరికాదని ఆధునిక పండితులయొక్కయు, విమర్శకుల యొక్కయు అభిప్రాయమై యున్నది. ఇందుకు కారణము స్త్రీలు ఋషులుగ నున్న సూక్తులు వేదములయం దుండుటవలననే. స్త్రీకర్తృత్వము లని చెప్పబడు ఋక్కులు, అవి స్త్రీలు మాత్రమే చెప్పవలసిన మాటలుగా కనబడుటవలన అట్టి అభిప్రాయము సరియైనదై యున్నది. రోమశ, లోపాముద్ర, విశ్వవార, స్వస్తి, శశ్వతి, శచి, ఊర్వశి మొదలగు వారిపేర్లు వేదములయందు గలవు. *వేదములు అపౌరుషేయములని చెప్పువారు సహితము పైన చెప్పిన స్త్రీలు వేదములు పఠించి రనియైనను అంగీకరింపక తప్పదు.

స్త్రీలు పూర్వకాలమున సంధ్యావందనము (గాయత్రీ జపమును) చేయు నాచార ముండినది. ఇందుకు ప్రమాణము శ్రీమద్రామాయణము నందలి సుందర కాండమున కలదు.

సీతాన్వేషణమునకై హనుమంతుడు లంకయందలి అశోకవనమున ప్రవేశించి అచ్చట పాఱుచున్న ఒక సెలయేఱును చూచి యిట్లు తలంచెను.

శ్లో॥ వనేచరాణాం సతతం నూనం స్పృహయతే పురా ।
రామస్య దయితా భార్యా జనకస్య సుతా సతీ॥ (5-14-48)

శ్లో॥ సంధ్యాకాలమనా శ్యామా ధ్రువ మేష్యతి జానకీ ।
నదీం చేమాం శివజలాం సంధ్యార్థే వరవర్ణినీ ॥ (5-14-49)

శ్లో॥ తస్యాశ్చా ప్యనురూపేయ మశోకవనికా శుభా ।
శుభాయా పార్థివేంద్రస్య పత్నీ రామస్య సమ్మతా ॥ (50)

* శ్రీజటావల్లభుల పురుషోత్తమరావుగారు వ్రాసిన "వేదకాలపు నాటి స్త్రీలు" అను గ్రంథమునందు స్త్రీలు ఋషులుగాగల వేదసూక్తులను చూపియున్నారు

శ్లో|| యది జీవతి సా దేవి తారాధిప నిభాననా ।
అగమిష్యతి సాఽవశ్య మిమాం శివజలాం నదీ ॥ (51)

తా|| వనమునందు సంచరించుటయందు ప్రీతి కలదియు, శ్రీరామచంద్రమూర్తికి భార్యయునగు సీతాదేవి ఈ వనమునందు సంచరించు మృగముల క్షేమ మరయుచుండును ఎడతెగక పారుచున్నట్టియు, శుభజలములు గలదియు (అశోక వనమునందు చిన్నపర్వతమునుండి సెలయేఱొకటి ప్రవహించుచుండెనని సుందరకాండమున వెనుక చెప్పబడియుండిన నది) అగు నీ నది యొద్దకు సంధ్యాకాలమున సంధ్యవార్చుటకు తప్పక రాగలదు రాజశ్రేష్ఠుడగు శ్రీరామచంద్రుని భార్యయగు సీతాదేవి విహరించుటకు శుభకరమగు నీ యశోక వనము తగియున్నది పూర్ణ చంద్రనిభానన యగు సీతాదేవి ప్రాణములతో నుండెనా ? ఈ శుభజలముల వద్దకు సంధ్య నుపాసించుటకు తప్పక రాగలదు.

పై వాక్యముల వలన ఉపనయనము స్త్రీలకు పూర్వముండినట్లే శూద్రులకు సహిత ముండినది తరువాత స్త్రీ శూద్రుల కిరువురకును దానిని తొలగించిరి

పూర్వ మొకప్పుడు వేదమాతయగు గాయత్రీదేవి గోపాలుర (యాదవుల) యింట అవతరించి బ్రహ్మదేవుని వివాహమాడినది. విష్ణు దేవుడు కన్యాదాన మొసంగెను.* గోపకులకు ఉపనయనాధికారము లేదని కొందఱు వితండవాదము చేయుదురు.

మనుస్మృతి మొదలగు స్మృతులయందు స్త్రీలు దుశ్శీల లనుటను నే నంగీకరింపను. ఇతర దేశములయందలి స్త్రీల విషయ మటుంచి మన దేశమునందలి స్త్రీలవలన పురుషులు చెడుచున్నా రనుట తప్పు. ఒక వేళ స్త్రీలవలన మన దేశమున నూటికి పదిమంది పురుషులు చెడినను, పురుషుల వలన నూటికి తొంబదిమంది స్త్రీలు చెడుచున్నారని లోక వృత్తమును చూచి తెలిసికొనవలెను.

పై కారణములవలన ధర్మశాస్త్రకారులు వారికంటె పూర్వమునందున్న సంప్రదాయములను, సిద్ధాంతములను మన్నింపలేదని చెప్పవచ్చును. ఇందుకు మఱియొక దృష్టాంతము చూడుడు.

---

* బ్రహ్మజిజ్ఞాస ద్వితీయభాగము నాలుగవ ప్రకరణమున 14వ అధ్యాయమున గాయత్రీ కథనమును వ్రాసియున్నాను చిత్తగింపుడు

శ్లో॥ "దుశ్శీలోఽపి ద్విజః పూజ్యో న తు శూద్రో జితేంద్రియః ।
కః పరిత్యజ్య గాం దుష్టాం దుహేత్ఛీలవతీమ్ ఖరీమ్ ॥ (పరా 8-25)

తా · బ్రాహ్మణుడు దుస్స్వభావుడైనను పూజింపదగినవాడు. కాని శూద్రుడు జితేంద్రియుడైనను పూజ్యుడు కాడు లోకమునం దెవడైనను చెడ్డయావును వదలి చాలా పాలిచ్చునట్టియు, సాధువైనట్టిదియు నగు గాడిద పాలు పితుకడు గదా?"

ఈ వాక్యములు పూర్వము నే నుదాహరించిన శ్రుతివాక్యములకును, పంచమవేద మగు మహాభారత భాగవతముల యందలి యుధిష్ఠిర వాక్యములయం దున్న అర్థమునకు, ఎంత విరుద్ధమున్నదో చూడుడు. ఈ శ్లోకమునం దుదాహరించిన యుపమానము సహితము అర్థశూన్యమై యున్నది కట్టకడపటిదై యీ స్మృతియందే యిట్లుండుట విచారకరము

మహాభారతమును భాగవతమును స్మృతులలోనే చేర్చిరి అందలి వాక్యములకు పరాశరస్మృత్యాదులకు విరుద్ధ మగునపుడు దేనిని స్వీకరింపవలెనను ప్రశ్న కలుగును శ్రీ శంకరులవారు ఇట్లు వ్రాసిరి

"స్మృతులకు బరస్పర విరోధమునందు నొకదాని పరిగ్రహము నింకొకదాని పరిత్యాగము నవశ్యకర్తవ్య మగుచునుండగా శ్రుత్యనుసారిణులు ప్రమాణములు, తక్కినవి యప్రమాణములు" (బ్ర సూ 2-1-1)(అం సూ భాష్యము)

ఈ కారణమువలన సహిత మీ పరాశరాదిస్మృతులు పరిత్యాజ్యములు

స్మృతికర్తలు ఏ కాలమునం దుండిరో వారి కాలమునందు సహితము వారు చెప్పిన ధర్మములు చెల్లుబడికాలేదు మనుధర్మశాస్త్రము "ఆచారధర్మములను నిరసించుచున్న దినములలో" వానిని పోషించుటకు వ్రాయ బడినట్లు శ్రీయుతులు డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు చెప్పిరి (భా త 2-8-12) ఆ తరువాత సహితము అందలి విధులను సంఘము పూర్ణముగ గౌరవింపలేదు ఎట్లనగా మౌర్య రాజులు క్షత్రియులు కారు ఆ వంశమువారు క్రీస్తుపూర్వము 321వ సంవత్సరమునుండి దాదాపు ఒక శతాబ్దికాలము చక్రవర్తులై ఆర్యావర్తమునే కాక దాదాపు భరతఖండమంతటిని పాలించిరి. ఆ కాలమునందే ముఖ్యమయిన స్మృతులు రచియింపబడెను

స్మృతులు శ్రుతులవలె సత్యమును నిరూపించునట్టివి కావు స్మృతులు ఊహలపై ఆధారపడిన రచియింపబడినవి శ్రుతి స్మృతులకు పరస్పర విరోధము కలిగినపుడు శ్రుతినే ప్రమాణముగా గైకొని స్మృతిని త్రోసివేయవలయునని, శ్రుతులయందు పరస్పర విరోధము కలిగినపుడు రెండునూ ప్రమాణముగా అంగీకరింపవలయునని మనుస్మృతియే చెప్పెను (మను 2-13, 14)

## (9) బ్రహ్మసూత్రములలో వర్ణప్రసక్తి

ఈ విధముగా స్మృతులయందు చెప్పబడిన సామాజిక వర్ణనియమములు వేదాంతశాస్త్రములోనికి సహితము చొచ్చుకొని పోయినవి 'బ్రహ్మసూత్రములు' ప్రస్థానత్రయములో నొకటిగా అంగీకరింపబడినది ఉపనిషత్తులు శాస్త్రములని భగవద్గీత అనుభవమని, బ్రహ్మసూత్రములు యుక్తియని పెద్దలు చెప్పిరి బ్రహ్మసూత్రములయందలి విషయము లేమనగా ఉపనిషత్తులయం దచ్చటచ్చట నున్న పరస్పర విరుద్ధాంశములను యుక్తిచేత సమన్వయము చేయుట

ఛాందోగ్యశ్రుతియందు (చతుర్థ ప్రపాఠకము 1, 2 ఖండములలో) జానశ్రుతి యను **జాతిశూద్రుడగు** ఒక రాజునకు రైక్వుడను ఋషి బ్రహ్మవిద్య నుపదేశించినట్లు ఒక కథ గలదు జానశ్రుతి శూద్రుడని యంగీకరించిన, శూద్రునకు బ్రహ్మవిద్యాధికారము లేదని చెప్పిన ధర్మశాస్త్రములకు ఇది విరోధ మగును శ్రుతిస్మృతులకు విరోధము వచ్చినపుడు శ్రుతియే గదా ప్రమాణము ఈ కారణమున స్మృతులవాదము పరిహరింపబడును స్మృతులను గౌరవించుట ఆ కాలమునందు ధర్మమని భావింపబడెను అందువలన బాదరాయణాచార్యులవారు ఈ యంశమును బ్రహ్మసూత్రములయందు ఒకటవ అధ్యాయము మూడవ పాదము నందలి అపశూద్రాధికరణమున (34 నుండి 38 సూత్రములలో) చర్చ చేసిరి. ఈ విషయముపై త్రిమతాచార్యులు భాష్యమును వ్రాసిరి

పౌత్రాయణుడగు జానశ్రుతి అన్నదానమున ప్రస్తుతి కెక్కినవాడు అత డొకనాడు మేడ పైభాగమున పరుండియుండగా కొందఱు సిద్ధులు అతనికి బ్రహ్మజిజ్ఞాస కలిగింపనెంచి హంసలై పై కెగసిపోవునపుడు అందులో ఒక హంస ముందు పోవుచున్న మఱియొక హంసతో "ఓ భల్లాక్షా! జాగ్రత్త! అక్కడ జానశ్రుతి పండుకొని యున్నాడు అతనిపై పోకూడదు" అని చెప్పెను

అంత భల్లాక్షుడనుహంస "అతడేమి ? శకటసహితుడగు రైక్వుడా? రైక్వుని యందలి ధర్మములలో నితనిధర్మ మేపాటి? ఆ రైక్వు డీ పట్టణమునందే యున్నాడు" అని అర్థ మిచ్చునట్లు మనుష్య భాషలో మాటలాడిన హంసల వాక్యములను జానశ్రుతి విని భత్రాజును[1] పంపి రైక్వుడున్న చోటును తెలిసికొనెను రైక్వునకు కానుకలుగా జానశ్రుతి ఆరునూర్ల గోవులను[2] నిష్కహారమును, కంచరగాడిదలను కట్టిన రథమును తీసికొని పోయి రైక్వునితో "ఈకానుకలు తీసికొని నీ వే దేవత నుపాసించుచున్నావో, ఆవిద్య నుపదేశింపు" నని ప్రార్థించెను రైక్వుడు నిరాకరించెను

ఆ సందర్భమున రైక్వుడు చెప్పిన వాక్యము లివి

"హారేత్వా శూద్ర తవైవ నహ గోభిరస్తు[3] (ఛాం 4-2-3)

ఓ శూద్రా! హారముతో కూడిన ఈ శకటమును గోవులను నీ వద్దనే యుండనిమ్ము - అంత జానశ్రుతి తిరిగి యింటికిపోయి, కుమార్తెను ఆ నిష్కహారమును, రథమును, వెయ్యిగోవులును తీసికొనివచ్చి "ఓ భగవంతుడా! ఈ కానుకలు తీసికొని నన్ను అనుగ్రహింపుము నాకుమార్తెను భార్యగా గ్రహింపుము[4] నీ వే గ్రామమునందు నివసించుచున్నావో ఆ గ్రామము సహిత మిచ్చితిని తీసికొమ్ము" అని ప్రార్థించెను అంత రైక్వఋషి ఆ కానుకలను గ్రహించు చున్నవాడై

"తస్యాహ ముఖ ముపోద్గృహ్ణ న్ను
వా చాజహారేమా శ్శూద్రాఽనేనైవ
ముఖే నాలాపయిష్యథాః" (ఛా 4-2-5)

తస్యాహ = ఆజానశ్రుతికుమార్తెయొక్క, ముఖమ్ = ఆ కానుకరూపమగు ఉపాయమును, ఉపఉద్గృహ్ణన్ = గ్రహించుచున్న వాడై, ఉవాచ = ఇట్లుపలికెను,

---

1 కొందఱు భత్రాజు అనుటకు బదులు సారథి, ద్వారపాలకుడు అని వ్రాసిరి

2 గోవు అనగా నాణెము లని భావింపవచ్చును

3 శూద్ర=శూద్రుడా! హారేత్వా = హారముతోకూడిన ఈ శకటము, గోభిఃసహ = గోవులతోకూడ, అస్తు తవ ఏవ = నీవద్దనే యుండనిమ్ము, ఇచ్చట 'శూద్ర' శబ్దమునకు టీకాకారులు "శూద్రా = శోకముచే పరుగిడినవాడా" అని అర్థమును వ్రాసిరి

4 శ్రీ వావిళ్ళ రామస్వామి శాస్త్రులవారి వచన ద్వాదశోపనిషత్తుల యందు కుమార్తె యనుటకు బదులు జానశ్రుతియొక్క భార్య అని వ్రాయబడియున్నది

శూద్రుడా; ఇమాః = ఈదక్షిణలను, అజహార = తీసికొని వచ్చితివి, అనేన ముఖేన ఏవ = ఈయుపాయముచేతనే, ఆలాపయిష్యథాః = నన్నుపదేశించువానినిగా చెయ్యగలవు ఇచట 'శూద్ర' = శోకముచేత పరుగిడినవాడా" అని టీకాకారులు అర్థమును వ్రాసిరి

తా "ఓ శూద్రా! ఈ యుపాయముచే నన్ను ఉపదేశించు వానినిగా చేసితివి" అని విద్య నుపదేశించెను. ఈ సందర్భమున రైక్వుడు జానశ్రుతిని శూద్రా! యని రెండు సారులు సంబోధించెను. జానశ్రుతి జాతిశూద్రు డగుటచేత రైక్వు డా విధముగా సంబోధించెను. "జానశ్రుతి జాతిశూద్రుడు కాదు ఇచ్చట 'శూద్ర' శబ్దమునకు* దుఃఖముచేత పరుగిడినవాడు" అని సూత్రకారులును, భాష్యకారులును 'శూద్ర' శబ్దము యొక్క రూఢ్యర్థము విడిచి వ్యుత్పత్తి అర్థమునే గ్రహించిరి

సూ : "శుగస్య త దనాదరశ్రవణా త్తదాద్రవణాత్ సూచ్యతే హి"
(బ్ర సూ 1-3-34)

తా · జానశ్రుతి హంస అనాదరణ చేసిన వచనములవలన దుఃఖము కలిగి అశోకముచే రైక్వుని సమీపమునకు వచ్చుటను లేక శోకము పొరలివచ్చుటవలన జానశ్రుతి దుఃఖము సూచింపబడుచున్నది."

జానశ్రుతికి దుఃఖము కలిగినట్లు శ్రుతియందు సూచన యేమియును లేదు. శ్రుతి యిట్లున్నది.

**"త దుహ జానశ్రుతిః పౌత్రాయణ**
**ఉపశుశ్రావ సహ సఞ్జిహాన ఏవ క్షత్తార**
**మువా చాఙ్గారేహ సయుగ్వాన మివ**
**రైక్వ మాత్థేతి యోనుకథగ్ సయుగ్వా రైక్వ ఇతి**** (ఛాం 4-1-5)

* శూద్రశబ్దమునకు పండితులు ఇట్లు వ్యుత్పత్తిఅర్థమును వ్రాసిరి 'శోచ తీతి శూద్రః = దుఃఖించువాడు కావున శూద్రుడు"

** "పౌత్రాయణఃజానశ్రుతిః=పౌత్రాయణుడగు జానశ్రుతి, తత్ఉ=ఆ హంసలమాటలను, ఉపశుశ్రావ=వినియెను; సంహా=అజానశ్రుతి, సంజిహానః ఏవ=(పడకను) విడిపించినవాడై, క్షత్తారమ్=భట్రాజునుగూర్చి; ఉవాచ=పలికెను; అంగఅరే=ఓరీ, సయుగ్వానమ్ రైక్వమ్ ఇవ=శకట సహితుడగు రైక్వుని గుణించివలె, ఆత్థఇతి=పలికితివి అని, సయుగ్వారైక్వః యఃఇతి=శకటసహితుడగు రైక్వుడు ఎవడు అన్ని"

తా  జానశ్రుతి హంసల మాటలను విని పడకనుండి లేచినవాడై భత్రాజును చూచి అతనితో "శకట సహితుడగు రైక్వు డెవరో, అతనిని గుఱించి విచారించుమని హంసలయొక్క సంభాషణమును అతనికి చెప్పెను (ఇది 5, 6 మంత్రములలో నున్నది) 7, 8 మంత్రములలో భత్రాజు పోయి రైక్వుని తెలిసికొన లేక తిరిగి వచ్చుటయు జానశ్రుతి భత్రాజును "బ్రాహ్మణు లున్నచోటు పరిశీలించవలసిన" దని తిరిగి పంపించుటయు, అతడు పోయి రైక్వుని చూచి ఆ సంగతి రాజున కెఱిగించుటయు కలదు (అంతటితో ప్రథమఖండము ముగిసినది ద్వితీయఖండము జానశ్రుతి కానుకలు తీసికొని రైక్వునివద్దకు పోవుటతో ఆరంభింపబడినది)

జానశ్రుతికి హంస వాక్యములను వినుటవలన రైక్వుడు ఏ విద్య నెఱుగుటవలన హంసచేత ప్రశంసింపబడెనో ఆ విద్యను తెలిసికొనలయు నను జిజ్ఞాస (తీవ్రమైన కోరిక) మాత్రమే కలిగిన దని అర్థమగుచున్నది కాని దుఃఖము కలిగినట్లు శ్రుతి చెప్పలేదు దుఃఖము కలుగుటకు ప్రియవస్తు వియోగము కాని, అత డాసించినది లభింపక విఫలమగుట కాని, కారణములు గావలయును  తనకంటె గొప్పవాడు ప్రపంచమున లే డని జానశ్రుతి భావించినట్లు చెప్పబడలేదు. కనుక దుఃఖము కలిగిన దనుటకు అవకాశము లేదు

ఇదిగాక జానశ్రుతిని 'శూద్ర' శబ్దముచేత సంబోధించుట హంసల వాక్యములు విని దుఃఖముచేత పరుగిడి వచ్చిన వాడను సంగతి రైక్వుడు తన పరోక్షజ్ఞాన*మును ప్రకటించుటకే యట్లు సంబోధించెనని శాంకరభాష్యమునందు కలదు. అట్లయినచో మొదటిసారి జానశ్రుతి వచ్చినపుడు మాత్రమే 'శూద్రా' యని సంబోధించి యుండునే గాని రెండవసారి వచ్చినపుడు సహితము 'శూద్రా!' యని అనవలసిన అవసరము లేదు

ఒకవేళ హంసల వాక్యములను విని దుఃఖము పొంగిపొరలి వచ్చిన వాడని భావించినను ఆ దుఃఖము శూద్రత్వమును సూచించునట్టి దుఃఖము కాదు. సంసార లాంపట్యమునం దున్న దుఃఖమే శూద్రత్వ సూచక మగునుగాని,

---

* పరోక్షజ్ఞాన మనగా తనయెదుట జరుగు చున్న సంగతి కాక యెచటనో జరుగుచున్న సంగతి తెలిసికొను నట్టిజ్ఞానము అనగా ఇచ్చట నుండి యే అమెరికాలో నేమిజరుగు చున్నదో తెలిసికొనునట్టి జ్ఞానము

సంసారమును తరింపవలయు నన్న దుఃఖము, బ్రహ్మజిజ్ఞాసువులకును పరమేశ్వర దర్శనాభిలాష గల భక్తులకును కలుగును అట్టి దుఃఖము ద్విజత్వమును (రెండవజన్మ కలిగినట్లు) సూచించును శ్రీ శంకరులవారి లక్ష్మీనృసింహ స్తోత్రమును చదివిన యెడల నీ భావము స్ఫురించును శ్రీరామకృష్ణ పరమహంస ప్రబోధము కలుగక మునుపు భగవద్దర్శనమునకు నిరంతరము దుఃఖించుచుండెడివా రని వారి జీవిత చరిత్రయందు వ్రాయబడినది

జానశ్రుతి క్షత్రియు డనుటకు మఱికొన్ని కారణములను చెప్పిరి వాటినిచ్చట సంగ్రహముగ చెప్పెదను

1 తృతీయఖండమున సంవర్గవిద్య మొదటి నాలుగు మంత్రములయందు చెప్పబడెను ఆ తరువాత నాలుగుమంత్రములయందు అభిప్రతారిని గుఱించి చెప్పబడెను ఈ అభిప్రతారి క్షత్రియుడనియు, జానశ్రుతి క్షత్రియుడు కానియెడల క్షత్రియు డగు అభిప్రతారితో కలిసి యొకచోటున (తృతీయఖండముననే) చెప్పి యుండరనియు, సమాను లైనప్పుడే చేర్చిచెప్పబడుదురనియు, ఆ కారణమున జానశ్రుతి క్షత్రియుడనియు చెప్పిరి

"సూ క్షత్రియత్వగతే శ్చోత్తరత్ర చైత్రరథే న లింగాత్"

(బ్ర సూ 1-3-35)

తా : రాబోవు వాక్యమునందు జానశ్రుతి క్షత్రియు డగు చైత్రరథునితో గూడ చెప్పబడినాడు ఆ సూచనవలన జానశ్రుతికూడ క్షత్రియు డని నిశ్చయింప బడవలెను."

ఇచట గమనింపవలసిన విషయ మిది అభిప్రతారి యనునతడు కాపేయునితో కలిసి భుజియించుటకు ప్రారంభించు చుండగా బ్రహ్మచారి యొకడు భిక్ష నడిగెను. అతనికి వారు అన్నము పెట్టరైరి. బ్రహ్మచారి యిట్లని చెప్పెను :

"నా కన్నము పెట్టనందున ఎవ్వరికొఱ కీ జగమంతయు అన్నమై యుండునో అతనికి మీరు అన్నము పెట్టనివారగుదురు "

దానియొక్క వివర మచ్చట అతడు చెప్పెను బ్రహ్మచారి చెప్పిన వాక్యములయందలి అర్థమును రైక్వుడు జానశ్రుతి కుపదేశించిన సంవర్గ

విద్యయందలి యర్థమును ఇంచుమించు సమానములే అనగా బ్రహ్మాండమునందేమి గలదో పిండమునం దదియే గల దను అర్థమును సూచించును ఆ కారణమువలన సంవర్గవిద్యావసానమున (తృతీయ ఖండమునందే) అభిప్రతారి విషయము చేర్చబడె నని చెప్పవచ్చును అభిప్రతారి క్షత్రియు దని అశ్రుతియందు చెప్పబడలేదు ఇతరత్ర చెప్పిన కొన్ని వాక్యములనుబట్టి క్షత్రియుడని వ్యాఖ్యాత లూహించిరి

అది గాక జానశ్రుతి శూద్రు డైనను రాజు గనుక "నావిష్ణుః పృథివీ పతిః". రాజు నారాయణాంశ సంభూతు డని నమ్మిన ఆదినములలో అభిప్రతారితో జానశ్రుతికి సమానత్వము ఘటించుట తప్పు కాదు

2 "ఉపనయనాది సంస్కారములు లేనందున శూద్రుడు యజ్ఞముచేయుట కెట్లు అర్హుడు కాడో ఆ న్యాయముచేతనే శూద్రుడు బ్రహ్మవిద్య కధికారి గా డని స్ఫురింప జేయుచున్నది అని మఱియొక కారణమును చెప్పిరి ఇందుకు సమాధానమిది శూద్రులు యజ్ఞములు చేయ వచ్చునా? అను ప్రశ్నకు "సర్వవర్ణములవారును యజ్ఞములు చేయవచ్చునని చెప్పు బాదరి మున్నగువారు లేకపోలేదు " (భా త. 3-6-14) అని శ్రీయుతులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పండితులు వ్రాసిరి. దీనివలన శూద్రులు పూర్వము యజ్ఞము చేయుచుండిరని యూహింపవచ్చును యజ్ఞాధికార మున్నప్పుడు వేదాధికారము లేకపోవు టెట్లు? బాదరి మహర్షి బ్రహ్మసూత్రకారు లగు బాదరాయణాచార్యుల వారికంటెను పూర్వికులు - అది యట్లుండ యజ్ఞమునకును బ్రహ్మవిద్యకు సంబంధము లేదని ముందే చెప్పితిని.

3 సత్యకామునకు గౌతముడు బ్రహ్మవిద్య నుపదేశించుటకు ముం దుపనయనము చేయుటచేత, ఉపనయనము లేనివాడు బ్రహ్మవిద్యాధికారి కాడు అనునది ఒక కారణము.

సూ. "తదభావ నిర్ధారణే చ ప్రవృత్తేః| (బ్ర. సూ 1-3-37)

శూద్రత్వము లేదని నిశ్చయించిన పిమ్మటనే గౌతమఋషి అతని (సత్యకాముని)కి ఉపనయనాది సంస్కారములు చేయుటకు ప్రయత్నించెను

ఇచట శూద్రత్వము లేనివ్యక్తి శూద్రుడు కాడు శూద్రత్వము గలవ్యక్తి శూద్రుడు శూద్రకులము వేఱు శూద్రత్వము వేఱు అని స్పష్టపడెను ఈ

ధర్మమే గౌతము డనుసరించెను. గౌతమ ఋషియును, రైక్వ ఋషియు నిరువురును జ్ఞానులు సంసారమునుండి తరించినవారు శాస్త్రములయందు చెప్పిన విధినిషేధములు భ్రాంతులగు సంసారులకే గాని జ్ఞానులకు వర్తింపవు. వారు సర్వస్వతంత్రులు వారిని శాస్త్రములు శాసింపలేవు వారు చెప్పినదే ధర్మశాస్త్రము నడచినదే ధర్మమార్గము కనుక జాతిశూద్రుడైన జానశ్రుతికి ఉపనయనము చేయకయే బ్రహ్మవిద్యనుపదేశింప రాదను నిషేధము రైక్వ ఋషికి వర్తింపదు

శ్రీ భాష్యకారులు అద్వైతమత విమర్శనము చేయు సందర్భమున నిట్లు చెప్పిరి ·

".... న చాస్యోపదిశే ద్ధర్మం" ఇత్యాది నిషేధశాస్త్ర ముండుటంజేసి వేదవేత్తలు శూద్రాదులకు ధర్మోపదేశము జేయరని చెప్పదగదు ఏలనగా, తత్త్వమస్యాది వాక్యమువలన బ్రహ్మాత్మభావము గలవారు వేదముయొక్క శిరస్సున నుండువా రగుటం జేసి వారియెడల నధికార నియయము లెవ్వియును వర్తింపవు గాన, నిషేధశాస్త్ర మేమియును చేయనేరదు ఇట్టి నిషేధముల నన్నింటి నతిక్రమించిన వారివాక్యమువలన నైనను శూద్రాదులకు జ్ఞానము తప్పక కలుగును " (శ్రీమదాంధ్ర శ్రీభాష్యము)

శ్రీ శంకరాచార్యులవారు సహితము బృహదారణ్యక శ్రుతిభాష్యమునం దొక చోట నిట్లు చెప్పిరి.

"ఆకాశమున పోవు పక్షులయొక్క కాలిజాడల నెట్లు మనము గుర్తెరుగ లేమో అట్లే మహాత్ములయొక్క నడవడిని గుర్తెరుగ లేము" అని

జానశ్రుతి క్షత్రియు డనుటకు సూత్రకారులు చెప్పిన మరియొక కారణమిది.

4 స్మృతులయందు వేదశ్రవణాదులను శూద్రునకు నిషేధించి యుండటచేతను -

శ్రుతులను శూద్రాదులు వినరాదని స్మృతులు నిరాకరించిన విషయము పాటించుటకు ఈ భరతఖండమున ఎవరికిని సాధ్యము కాదు ఏలయన రామ, కృష్ణ, శివ, గోపాల, నారాయణ - మొదలగు భగవన్నామములును శివపంచాక్షరీ, నారాయణ అష్టాక్షరి, వాసుదేవ ద్వాదశాక్షరి మొదలగు మంత్రములును ఉపనిషత్తుల లోనివే ఇవి వినరాదనిన శూద్రాదులు భరతఖండపు టెల్లలుదాటి దూరముగ పోవలసినదే.

జానశ్రుతి క్షత్రియు డనుటకు చెప్పిన యింకొక కారణము

5 జానశ్రుతి అన్నదానము చేయుటచేతను, ద్వార పాలకుని ఉంచుకొని యుండుటవలనను జాతి శూద్రుడు కాడు, క్షత్రియుడనియే చెప్పిరి

జానశ్రుతి భట్రాజును గాని, సారథిని గాని, ద్వారపాలకుని గాని యుంచుకొన్నంత మాత్రమున క్షత్రియు డని చెప్పుటకు వీలులేదు. శూద్రుడు రాజైనను నివియన్నియు నుండును శూద్రుడు రాజ్యార్హుడు కాడను ఆక్షేపణము సూత్రకారులుగాని, భాష్యకారులుగాని చేసి యుండలేదు కర్ణుడు సూతపుత్రుడని యెఱిగియు, ధృతరాష్ట్రుడు అతనిని అంగ దేశమునకు రాజుగా అభిషేకించెను

జానశ్రుతి జాతిశూద్రు డని రైక్వునికి బాగుగా తెలియును. పూర్వము వ్యక్తిని కులముపేరుతో పిలుచు ఆచారము సహిత మున్నట్లు తెలియు చున్నది "అమన్యమానః క్షత్రియ కించి దన్య" అని సనత్సుజాత మహర్షి ధృతరాష్ట్రుని 'క్షత్రియా'? అని సంబోధించినట్లు 'సనత్సుజాతీయమున' నున్నది "రోగములు పొందుకైవడి విప్రా?" అని భాగవతము కులము పేరున వ్యక్తిని పిలిచిన నిదర్శనములు గ్రంథములయం దనేకములు గలవు ఆ విధముగనె రైక్వఋషి రెండుసారులు జానశ్రుతిని "శూద్రా" యని సంబోధించెను

రైక్వుడు జానశ్రుతి ప్రార్థనను మొదట నిరాకరించినను జానశ్రుతి ఉత్తమశీలము గలవాడును, దానధర్మములు గలవాడును అగుటయే గాక అత్యంత ప్రేమాస్పద యగు కుమార్తెను సహితము, ఇల్లువాకిలి లేక గజ్జిచేత శరీరము గోకుకొనునట్టి తనకు (రైక్వునికి) సమర్పించుటవలన జానశ్రుతియొక్క త్యాగమునకు సంతసించి బ్రహ్మవిద్య నొసంగెను మొదట గౌతముడు సత్యకాముని పరీక్షించి సత్యమున్నదని తెలిసికొని కులములో కలుపుకొని శిష్యునిగా గైకొనెను. ఛాందోగ్యశ్రుతియందు జానశ్రుతి కథ ముగిసిన పిమ్మట సత్యకామునికథ ప్రారంభ మగుచున్నది. ఈ రెండును ఒక దాని వెనుక ఒకటి యుండుటవలన జానశ్రుతి సత్యకాము లిరువురును జాతిశూద్రులే యని బోధపడుచున్నది. ఛాందోగ్యోపనిషత్తు రచియింపబడిన కాలమున బ్రహ్మవిద్యకు కులమువలన అర్హతానర్హతలు నిరూపింపక గుణములచేతనే అధికారి యగునా? కాదా? యని పరీక్షించుచుండిరని యీ కథలవలనకూడ తెలియుచున్నది.

జి : అట్లయినచో సూత్రకారులు, భాష్యకారులును ఇట్లు వ్రాయుటకు కారణ మేమి ?

వే : స్మృతులను గౌరవించుటకే. స్మృతులను గౌరవింపకున్న సంఘవ్యవస్థ చెడిపోవునని, శూద్రుడు సేవ చేయుటయు, బ్రాహ్మణుడు వేదము చదువుటయు ననునవి వేఱు వేఱుగా నియమింప బడినపుడు అందఱును వేదములు చదివినచో భూమిదున్ని పైర్లను పండించు వారెవరను భయముతోనే శూద్రు లీజన్మమున సేవచేసి రాబోవు జన్మమున బ్రాహ్మణులై పుట్టి బ్రహ్మవిద్యను తెలిసికొని ముక్తులు కావచ్చునని వారి యభిప్రాయమై యుండిన నుండవచ్చు నేమో ఈ యర్థమును మనసులో నుంచుకొనియే మధ్యయుగమువారు గ్రంథములను భాష్యములను రచించి యుండవచ్చును. అదియునుగాక భాష్యకర్తలు తమకిష్టము లేక పోయినను సూత్రకారుల అభిప్రాయము ననుసరించవలసి యున్నది

శ్రీ రామానుజాచార్యులవారు శ్రీ భాష్యమునందు (అపశూద్రాధికరణమున) ఇట్లువ్రాసిరి. 'మోక్షసాధనముగా ఉపనిషత్తులయందు విధింపబడిన జ్ఞానము ఉపాసనారూప మనియు, అది భగవంతుని సంతోషపరచునటే యనియు దానిని శాస్త్రములనుండి మాత్రమే గ్రహింపవలయుననియు చెప్పు విశిష్టాద్వైతమతము ప్రకారము శూద్రులకు బ్రహ్మవిద్యాధికారము లేదనియు, అద్వైతమతము ననుసరించి వేదాధికారము లేని శూద్రులకు సహితము అద్వైత వేదాంతమును విచారించుటకు అధికారము కలదనియు చెప్పిరి అందుకు కారణము వారిట్లనిరి.

సాధనచతుష్టయము కలవారు శ్రవణాదులకు అర్హులని అద్వైతులు చెప్పియున్నారు. సాధనచతుష్టయము నలవరచుకొనుటకు వేదములతో గాని కర్మాంగములైన యుపాసనలతో గాని సంబంధము లేదు. సాధన లలవడిన తర్వాత వేదాంతశ్రవణముచేసి, శ్రవణము చేసిన దానిని మననము చేయవలెను మననము చేసినదానిని నిదిధ్యాస చేయుట. నిదిధ్యాస యనగా, బ్రహ్మాత్మ భూతమును తెలుపునట్టివాక్యము ఏయర్థమును ప్రతిపాదించునో ఆయర్థము విషయ మగుభావనయే; దానివలన జగద్భ్రాంతి నశించును. అంతటితో ముక్తి కలుగును - అని అద్వైతులు చెప్పిరి కనుక అద్వైతవిచారము చేయుటకు ద్విజేతరులకు అధికారము లేదని అద్వైతులు చెప్పుట యుక్తము

కాదనియు శూద్రులకు సహితము అద్వైతవేదాంతమునం దధికారమున్న దనియు చెప్పిరి

శ్రీరామానుజులవారు ఏభావముతో ఈ వాక్యములు చెప్పినను ఇది కొంతవరకు సరియయినదే ఇందుకు శాస్త్రములయం దనేక ప్రమాణములు గలవు మఱియు వారిట్లనిరి "బ్రాహ్మణుని ముందుంచుకొని నాల్గవ వర్ణము వానికి ఇతిహాస పురాణములు వినిపింప వలయును" "శూద్రుడు ఇతిహాస పురాణములను వినుట పాపక్షయముకొఱకే గాని ఉపాసనకొఱకు కాదు శూద్రుడు పాదములు గల స్మశాన మగుటచే వాని సమీపమున వేదాధ్యయనము చేయరాదు" ఇట్టి స్మృతివాక్యముల నుదాహరించిరి హరిజనుడగు తిరుప్పాణి యాళ్వారు, శూద్రకులములో పుట్టిన నమ్మాళ్వారు మొదలగు ద్విజేతరుల మాట యేమిటి?* వారు భక్తులు కాని బ్రహ్మవిద్య యెఱుగరని చెప్పుటకంటె పొరపాటు మఱియొక టేమున్నది?

మధ్వాచార్యులవారు అపశూద్రాధికరణమున వ్రాసిన భాష్యమున విదురుని, కర్ణుని పేర్కొనిరి కర్ణునకు ఉపనయన సంస్కారము లేకపోయినను అతడు శ్రుతులను వినె నని చెప్పియున్నారు వారిరువురకు పూర్వజన్మమునందు ఉత్పన్నమైన వేదజ్ఞానము కలిగియుండుటచేత శూద్రులకంటె విశేషము కలదని వ్రాసిరి ఇతిహాస పురాణములను స్త్రీ శూద్ర ద్విజ బంధువులు వినుట కధికార మున్నదని భాగవతము నందు (భాగ స్క 1 అ 4 శ్లో 25, 26) చెప్పియున్నను శ్రీరామానుజాచార్యులవారును, శ్రీమధ్వాచార్యులవారును ఇతిహాస పురాణము లను అచ్చటచ్చట మాత్రమే వినవచ్చునని చెప్పుటయును వారికాలమునకే కాలదోషము పట్టిన స్మృతులను ఉదాహరించుటయును ఆశ్చర్యకరము సంప్రదాయముగా వచ్చిన ఆచార మను ఒత్తిడి కింత గొప్పవారు సహితము లొంగిపోయిరని దీనివలన తెలియుచున్నది.

శ్రీశంకరాచార్యులవారు ఆ యధికరణమునందే యీ విషయమై వ్రాసిన భాష్యముయొక్క సారాంశ మిట్లున్నది :

---

* కొంద ఱాచార్యులు శూద్రాదులకు భక్తియందు సహితము అధికారము లేదని చేసిన వాదము సరికాదని ఈ గ్రంథముయొక్క ద్వితీయ భాగము నందలి 4-5 ప్రకరణములయందు విమర్శించితిని

విదుర ధర్మవ్యాధులు జ్ఞాను లెట్లయిరని శంక కలుగుటచే "జ్ఞానము నియమితమైన ఫలము కలది గావున విదుర ధర్మవ్యాధులగు నేవారికి పూర్వకృతమైన సంస్కారమువలన జ్ఞానోత్పత్తి యయ్యెనో వారికి ఫలప్రాప్తి వారింప శక్యము కాదు."(అం.సూ.భా) "శ్రావయే చ్చతురో వర్ణా" అనుస్మృతివలన నితిహాసపురాణముల నధిగమింప శూద్రున కధికారము గలదని చెప్పిరి శూద్రునకు బ్రహ్మవిద్యాధి కారము లేదని ఖండితముగ చెప్పియున్నను, ఈ కారణమువలన శ్రీ శంకరులవారు ప్రత్యక్షముగ కాకపోయినను, పరోక్షముగా నైనను ఆ పట్టును వదలి శూద్రునకు బ్రహ్మవిద్యాధికారమును అంగీకరించి నట్లయినది.

ఎట్లనగా · మహాభారతము పంచమవేద మని చెప్పిరి అట్లు గాకున్న మహాభారతాంతర్గతమగు భగవద్గీత ఉపనిషత్తుగా అంగీకరించుటకు వీలులేదు కదా? భగవద్గీత ఉపనిషత్తే. భగవద్గీతయొక్క ప్రతి అధ్యాయాంతమునందును "ఇతి శ్రీభగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే" యని చెప్పబడినది. కనుక మహాభారతము వేదము తదంతర్గతమగు గీత ఉపనిషత్తు అనుటకు సందియము లేదు. మహాభారతము చదువుటకు శూద్రుల కధికారము కలదని అంగీకరించినందున బ్రహ్మవిద్యాధికారము సహితము శూద్రులకు కలదని అంగీకరించినట్లే యగుచున్నది. మహాభారతమునందును భాగవత పురాణమునందును అచ్చటచ్చట బ్రహ్మవిచారము చేయబడినది

శ్రీయుతులు డాక్టరు రాధాకృష్ణన్ గారు భారతీయ తత్త్వశాస్త్రమున నీ విషయమై యిట్లు వ్రాసిరి. "...వేదాధ్యయనాధికారము దేవతలకు ఋషులకు నున్నత ద్విజవర్గములవారికే కలదను విషయమును శంకరు డంగీకరించినాడు [1] ఏవర్ణస్థుడైనను బ్రహ్మజ్ఞానమున కర్హుడని[2] శంకరు డంగీకరించును. బ్రాహ్మణ ధర్మము నంగీకరించు వారు మాత్రము వర్ణాశ్రమ విధుల ననుసరింపవలె నని శంకరు నభిప్రాయము." (భా.త. 3-8-40)

---

1 "రైక్వుడు శూద్రుడని చెప్పియు వేదము నుపదేశించిన జానశ్రుతి విషయమును ఛా.ఉ. 4, 1, 2 సత్యకామజాబాల విషయమును శూద్రుడు సంసార మార్గములో నున్నత వర్గమునకు వచ్చి జన్మించువరకు నాతనికి బ్రహ్మజ్ఞానార్హత లేదను నర్థముతో వివరింపబడెను "

2 "శం|| భా|| 3, 4, 38"

కనుక శ్రీ శంకరులవారు బ్రహ్మసూత్రముల ననుసరించి శూద్రునకు బ్రహ్మవిద్యాధికారము లేదని భాష్యము వ్రాసినను, శూద్రులు ఇతిహాస పురాణములను చదువవచ్చునను న్యాయము ననుసరించి శూద్రుడు బ్రహ్మవిచారము చేయుటకు అంగీకరించిరని చెప్పవచ్చును.

జి : బ్రహ్మసూత్రకారులును మహాభారత కారులైన వేదవ్యాసులును, ఒక్కరే కదా? ఈ రెండు గ్రంథముల యందును శూద్రుల విషయమై యిట్టి భేదాభిప్రాయ మేల కలిగినది?

వే : బ్రహ్మసూత్రములు రచియించినవారు వేఱు మహాభారతకారులైన కృష్ణద్వైపాయన మునీంద్రు లగు వేదవ్యాసులు వేఱు వీరు భిన్న వ్యక్తులు బ్రహ్మసూత్రకారులకు శూద్రులయెడ నున్న యభిప్రాయము వ్యాసమునీంద్రులకు లేదు వ్యాసభగవానుని తల్లియగు సత్యవతీదేవి ఒక పల్లెవాని (జాలరి) కూతురు ఆమె దాసరాజు గర్భమున జనన మందకపోయినను, ఆమెను జనన మాది పెంచి పెద్ద చేసినవాడు దాసరాజు అదిగాక వ్యాసభగవానుడు ఒక శూద్ర స్త్రీకి గర్భాధాన మొసగెను. ఆ శూద్ర స్త్రీయే మహాత్ముడగు విదురుని కన్నతల్లి. 'శూద్రుడు పాదములు గల స్మశాన' మని అసహ్యించుకొని యున్న యెడల ఆ శూద్రస్త్రీని దగ్గఱకు రానిచ్చి యుండునా ? వ్యాసభగవానుని ప్రపితామహుడగు వసిష్ఠమహర్షి ఒక 'అధమజాతి' స్త్రీని వివాహమాడెను. ఈ కారణ మిట్లుండగా, మహాభారతమునందున్న ధర్మవ్యాధుని కథవలన మహాభారత కర్తయగు వేదవ్యాసులకును బ్రహ్మసూత్రకారులకు గల మతభేదము స్పష్టమగు చున్నది

శ్రీ శంకరాచార్యకృత "సర్వదర్శన సిద్ధాంత సంగ్రహము"* అను గ్రంథమున పదుమూడవ ప్రకరణమున 'వేదవ్యాస మతము' ను చెప్పి అదియే మహాభారత మతమనియును చెప్పబడినది. అందు సత్త్వాది గుణములయొక్క లక్షణములు చెప్పి, బ్రహ్మణాది వర్ణములు ఆయా వ్యక్తుల సత్త్వాది గుణములను బట్టియే నిరూపింపదగినట్లు చెప్పబడెను. పదునాలుగవ ప్రకరణమునకు "వేదాంత మత"మని నామకరణము చేయబడినది. అది బాదరాయణాచార్యుల వేదాంతమని చెప్పుటవలన ఈ విషయమున

* సర్వదర్శన సిద్ధాంత సంగ్రహమును శ్రీ బంకుపల్లి మల్లయ్య శాస్త్రిగా రాంధ్రీకరించిరి

కృష్ణద్వైపాయన బాదరాయణ మతములు భిన్నములనియు వీరిరువురు భిన్నవ్యక్తులనియు శంకరులవారి అభిప్రాయము మహాభారతము రచయింప బడిన కొన్ని శతాబ్దములకు బ్రహ్మసూత్రములు రచియింపబడినవి బ్రహ్మ సూత్రముల కాలము బౌద్ధమతవ్యాప్తి తదనంతరమే యని ఆ గ్రంథమువలననే స్పష్టమగుచున్నది అందు బౌద్ధమతము ఖండింప బడినది "క్రీ శ 200 ల నుండి సూత్రయుగ మారంభమ"ని (భా త 1-1 ఉపోద్ఘాతము) శ్రీయుతులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితులు వ్రాసిరి కనుక 'బ్రహ్మసూత్రముల' రచన క్రీ శ 200 సంవత్సరములకు పిమ్మటనే జరిగినది ఆ గ్రంథము వ్యాసతాత్పర్యమును నిర్ణయించుట లేదని పండితు లనేకు లభిప్రాయపడి యున్నారు

## (10) ఉత్తమ స్త్రీ పురుషులకు బ్రహ్మవిద్యాధికారము

శ్రీ శంకరాచార్యులవారు వివేకచూడామణియందు ఇట్లు వ్రాసిరి

శ్లో॥ **"మేధావీ పురుషో విద్వా నూహాపోహవిచక్షణః ।**
**అధికార్యాత్మవిద్యాయా ముక్తలక్షణలక్షితః ॥"**

తా మంచి ధారణాశక్తి కలవాడును, పురుషుడు, తర్కవితర్కముల యందు సమర్థుడును అగువాడు ఆత్మవిద్యాధికారి, ముక్తుడునగు లక్షణములు గలవాడు

ఈ శ్లోకమున ద్విజులు మాత్రమే ఆత్మవిద్యాధికారులని చెప్పక పై లక్షణములుగలవా రెవరైనను ఆత్మవిద్యాధికారులనియే చెప్పిరి కాని పురుషశబ్దముచేత స్త్రీలు అనధికారులని అర్థము చేయవచ్చును పురుష శబ్దమునకు పౌరుషము (పట్టుదల) కలవారని అర్థము చేసికొన్నచో స్త్రీలకు సహితము ఆత్మవిద్యాధికారము అంగీకరించినట్లే యగును

శ్రీ మధ్వాచార్యులవారు బ్రహ్మసూత్రముల యందలి అపశూద్రాధి కరణమున ఉత్తమ స్త్రీలకు వేదాధికారము కలదని చెప్పిరి జిజ్ఞాసాధికరణము నందు శచీదేవి, ఊర్వశి, శ్యామల-మొదలగువారిని ఉత్తమ స్త్రీలనుగా పేర్కొనిరి వేదములయందు కొన్ని ఋక్కులు స్త్రీవిరచితములే యని చెప్పునపుడు ఇందులో ప్రత్యేకత యేమున్నది? బృహదారణ్యక శ్రుతి తృతీయాధ్యాయ షష్ఠ బ్రాహ్మణమునందు వాచక్నవి కుమార్తె యగు గార్గి యను నామె

జనక రాజసభలో యాజ్ఞవల్క్యుని ప్రశ్నించినట్లు కలదు ఆమె బ్రహ్మవాదిని యని యంగీకరించిరి యాజ్ఞవల్క్యుని భార్యలలో ఒకరగు మైత్రేయికి యాజ్ఞవల్క్యుడు బ్రహ్మవిద్యను ఉపదేశించినట్లు కలదు ఇది బృహదారణ్యక శ్రుతి 5-వ బ్రాహ్మణమునం దున్నది ఇచ్చట స్త్రీలకు బ్రహ్మవిద్యాధికారము కలదా? లేదా? యను ప్రశ్నయే కలుగలేదు

మాండూక్యకారికలయందు 4-95వ కారికకు వ్యాఖ్యానమున శంకరులవారు "అజము నిత్యము, సామ్యము నగు పరమాత్మ విషయమై సునిశ్చితజ్ఞానము కలవారు స్త్రీలైనను నిరతిశయ తత్త్వవిషయమును తెలిసికొనినవా రగుచున్నారు వారే పరమార్థము తెలిసికొనినవారు" అని వ్రాసిరి శ్రవణ మనన నిదిధ్యాసలకు స్త్రీల కర్హత ఉన్నట్లు అంగీకరించుచు 'ఉపనిషత్తులను పఠించుట' ఉచ్చరించుట మొదలగు వాటియందు వారికి అధికారము లేనట్లు కానవచ్చుచున్న'దనియు మఱియొకచోట చెప్పిరి అనగా గురుముఖమున వారు వినవచ్చునని తాత్పర్యము

కాని జ్ఞానవాసిష్ఠమునందు శిఖిధ్వజోపాఖ్యానమున చూడాల భర్తకు బ్రహ్మవిద్య నుపదేశించినట్లు కలదు ఏ కారణముచేత స్త్రీలకు మొదట వేదాధికారము లేదని చెప్పియు, పిమ్మట ఉత్తమ స్త్రీలకు బ్రహ్మవిద్యాధికారము కలదని చెప్పిరో, అట్టి కారణముచేతనే ఉత్తమ శూద్రాదులకు సహితము బ్రహ్మవిద్యాధికారము కలదని అంగీకరింపక తప్పదు

అనగా స్త్రీలకు స్త్రీసహజమైన చిత్తచాంచల్యాది గుణములు ఉత్తమ స్త్రీలకు లేకపోయినట్లే శూద్రులయందును, శూద్రత్వమును తెలుపునట్టి అజ్ఞాన జడత్వములు మొదలగు తమోగుణాధిక్యమును తెలియజేయు గుణములు లేకపోయినపుడు శూద్రులకు సహితము బ్రహ్మవిద్యాధికారము కలదనుట శాస్త్రవిరుద్ధము కాదు

జి : మధ్వాచార్యులవారు ఉత్తమ స్త్రీలను చెప్పిరి కదా? ఉత్తమ స్త్రీ లనుమాట కర్థమేమి? వారెట్టివారు ?

వే : ఉత్తమ శీలముగల స్త్రీలని అర్థము తక్కువ కులమున పుట్టిన స్త్రీలు సహితము ఉత్తముల సాహచర్యమున పూజనీయలైనట్లు మనుస్మృతి చెప్పియున్నది.

శ్లో|| "అక్షమాలా వసిష్ఠేన సంయుక్తా౽ధమయోనిజా ।
సారంగీ మదపాలేన జగామాభ్యర్హణీయతామ్ ॥" (మను. 9-23)

తా . "ఈ విషయమై మేలిమిం గూర్చిన దృష్టాంతము చెప్పబడుచున్నది అక్షమాల యనునొక నీచజాతి కన్యక వశిష్ఠునిఁ బెండ్లాడియు, చటక యనునది మందపాలుడను ఋషిని బెండ్లాడియు జనులలో మన్నన బడసిరి."

"వీరిరువురే కాక పెక్కండ్రు అధమజాతియందు పుట్టిన స్త్రీలు మేల్మిగుణంబులు గల భర్తలం గూడి వారి మేల్మి గుణములచే దాము గొప్పతనము నొందిరి." (మను. 9-24)

## (11) ఉపదేశాధికారము

వేదాంత గ్రంథములలో సుప్రసిద్ధి వహించిన జ్ఞాన (యోగ) వాసిష్ఠమునందు చూడాల తన భర్తకు బ్రహ్మజ్ఞానమును యోగమును ఉపదేశించినట్లును, ఒక కిరాతరాజు కర్కటి యను ఒక రాక్షసికి బ్రహ్మవిద్య నుపదేశించినట్లును చెప్పబడినది మహాభారత యుద్ధమందు అర్జునుని రథముపైనున్న హనుమంతునికి సహాయముగా కొన్ని పిశాచము లుండెననియు, శ్రీకృష్ణభగవానులు అర్జునునకు గీతోపదేశము చేయగా, పైనున్న పిశాచములలో నొకటి విని ముక్తి పొందెననియు, జైమినివిరచిత మహాభారతమున నున్నట్లు సురేశ్వరాచార్యులవారు నైష్కర్మ్య సిద్ధియందు వ్రాసిరి ఇట్లు పాపజన్ములగు వారెందఱో బ్రహ్మవిద్యను తెలిసికొనినట్లు వేదాంతశాస్త్రములవలన విశద మగుచున్నది.

పూర్వజన్మకృతమైన పాపమువలన శూద్రజన్మము కలిగెనని అంగీకరించినను పూర్వజన్మకృత పుణ్యపరిపాకముచేతనే బ్రహ్మమును తెలిసికొనవలెనను తీవ్రవాంఛతో దానికొఱకు ప్రయత్నమును పురుషుడు చేయుచుండును. ఏ క్షణమున బ్రహ్మము నెఱుంగ వలయునను వాంఛయు, ఆ ప్రయత్నమున పట్టుదలయు కలుగునో ఆ క్షణముననే జాతిశూద్రునియందున్న శూద్రత్వము తొలగిపోయినదని భావించవలయును. బ్రహ్మజిజ్ఞాస తీవ్రముగా కలిగిన జాబాల సత్యకామునకును, కామలాయనునకును, గురువులు, శాస్త్రములు లేకయే బ్రహ్మవిద్యను భగవంతుడే ఉపదేశించెను. సత్యకామునకు వృషభము, అగ్ని, హంస, నీటికోడి, బ్రహ్మవిద్య నుపదేశించెనని చెప్పిన దానియందలి

భావమేమి? భగవంతుడే చెప్పించెను లేదా సత్యకాముని తీవ్ర సంకల్పమే అట్లు వినియుండును కనుక బ్రహ్మజిజ్ఞాస కలిగిన వానిని బ్రహ్మవిద్య నెఱుంగకుండ అడ్డుపెట్టుట పాపకార్యము అడ్డగించుటకు సాధ్యము కాదు.

జి : జాతిశూద్రు డుత్తమగుణములు కలవాడైనను బ్రహ్మవిద్య నెఱిగియున్నను ఇతరుల కుపదేశింపరాదని చెప్పుదురు గదా?

వే : ధృతరాష్ట్రుడు విదురుని తత్త్వజ్ఞాన ముపదేశింపు మని కోరెను. విదురుడు శూద్రుడని తెలిసియు తత్త్వజ్ఞాన ముపదేశింపు మని ధృతరాష్ట్రుడు కోరుట శూద్రునకు తత్త్వజ్ఞానము తెలిసి యుండిన ఇతరులకు చెప్పుటవలన తప్పు లేదని అర్థ మగుచుండ లేదా? కాని విదురుడు అట్లు చెప్పుటకు నిరాకరించెను. బ్రహ్మజిజ్ఞాసువు ఎవరివలన ఆధ్యాత్మవిద్యను తెలిసికొనవలెనని కోరునో ఆవ్యక్తియందు గురుభావ ముండవలయును బోధించువానియందు వినువానికి (శిష్యునకు) గురుభావము లేకపోయిన బ్రహ్మవిద్య ఫలింపదు ఈ విషయమై జ్ఞానవాసిష్ఠమున ఇట్లు చెప్పబడినది. "బ్రహ్మము నెఱుగ గోరువానికి బ్రహ్మవిద్యకొఱకు ఎవని నాశ్రయించునో అతనియందు పూజ్యభావ ముండవలయును. అట్టి ఆప్తుడు (గురువు) బోధించు వాక్యములు వేసవికాలమున బాగుగా ఎండిన భూమియందు పడిననీరు భూమిలో నింకిపోవు నట్లు ఆప్తవాక్యములు శిష్యుని బుద్ధియందు ప్రవేశించు చున్నవి. ఎవనియందు గురుభావము కలుగదో అతని వాక్యములు వ్యర్థము లగును

ఈ అర్థమును తెలియజేయు ఒక కథ జ్ఞానవాసిష్ఠమున కలదు దానిని సంగ్రహముగా నిచట చెప్పెదను.

శిఖిధ్వజు డను రాజునకు చూడాల యను భార్య కలదు భార్యాభర్తల కిరువురకును బ్రహ్మజిజ్ఞాస కలిగెను. ఇరువురును బ్రహ్మము నెఱుగుటకై ప్రయత్నించిరి. చూడాల ప్రయత్నము సఫల మయ్యెను ఆమె బ్రహ్మము నెఱిగినదాయెను అంతమాత్రమే కాక ఆమె యోగము నభ్యసించి అణిమాది అష్టైశ్వర్యములు పొందెను. రాజు బ్రహ్మవేత్త కాలేక పోయెను భర్తను కృతార్థునిగా చేయుటకు చూడాల అనేకవిధముల బ్రయత్నించెను కాని రాజునకు ఆమె వాక్యములు తల కెక్కలేదు. మహాత్మశాలిని, సిద్ధయోగిని, అణిమాద్యైశ్వర్యయుతురాలు నగు చూడాలను అబలగను, విధేయురాలగు భార్యగానే యెంచెను. ఆమె మాటలను సరకుచేయక తపస్సువలన బ్రహ్మమును

సాధించుటకు అడవికిపోయి తపస్సు చేసెను. చూడాల భర్తస్థితి యంతయు గమనించి కొంతకాలము గడచినపిమ్మట ఆకాశ గమనమున మునికుమారుని రూపమున భర్తకడ కేగెను. శిఖిధ్వజుడు ఆమెను మునికుమారుడే యని యెంచి, భక్తిచే ఆమెకు శిష్యుడై బ్రహ్మవిద్య నెఱిగి జీవన్ముక్తు డాయెను చూడాల భర్తను అనేక విధముల పరీక్షించి జీవన్ముక్తు డాయెనని తెలిసికొని, నిజస్వరూపము చూపి, జరిగినసంగతి చెప్పి, అతనిని ఇంటికి పిలుచుకొని వచ్చెను. చూడాలయందు గురుబుద్ధి లేకపోవుటయే శిఖిధ్వజుడు అడవికి పోవుటకు కారణము.

వ్యాసభగవానునివలన బోధింపబడిన శుకమహర్షి విదేహరాజగు జనకునివలన ప్రబోధితుడై సంశయరహితు డాయెనని మహాభారత శాంతిపర్వమునందు చెప్పబడినది.

విదురుడు ధృతరాష్ట్రునకు అనేక ధర్మములు చెప్పెను ధృతరాష్ట్రుడు విని, విదురుని ప్రశంసించుటయే కాని ఆ ధర్మము లతనికి తలకెక్కలేదు ఆ ధర్మముల నాతడు ఆచరణయందు పెట్టలేదు ధర్మాధర్మము లన్నియు విన్నపిమ్మట అధ్యాత్మ తత్త్వమును బోధింపు మని విదురుని కోరెను విదురుడు ఆశ్రితుడు; ధృతరాష్ట్రుడు ఆశ్రయము, ప్రభువు. మఱియు మహాత్ముడగు విదురుని యందు గురుభావము కలుగలేదు. ఇది యెఱిగిన మహాత్ముడగు విదురుడు ధృతరాష్ట్రుని మేలు కోరినవాడై "నేను శూద్రస్త్రీయందు పుట్టితిని మృత్యువును గుఱించి అతి సూక్ష్మమగు అధ్యాత్మ రహస్యములను చెప్పజాలను సనత్సుజాత మహర్షిని అర్థింపు"మని చెప్పెను. సనత్సుజాతుడు బ్రహ్మ మానసపుత్రుడు. లోకవంద్యుడు. అట్టి మహాత్ముని బోధవలన ధృతరాష్ట్రుడు బాగుపడునేమో యని విదురు డట్టి సాకు చెప్పెను

"శూద్రుడు ధర్మశాస్త్రములు చదువరాదు" (మను. 2-16) "శూద్రునకు ధర్మ ముపదేశింప రాదు" అని స్మృతులు చెప్పినవి. శూద్రుడు ధర్మములను తెలిసికొనుటకే అధికారి కానపుడు ధర్మ ముపదేశించుట కధికార మెట్లు కలుగును? విదురుడు ధృతరాష్ట్రునకు అనేక ధర్మములు బోధించెనుగదా! అందులో కొన్ని అధ్యాత్మతత్త్వమునకు సంబంధించిన వాక్యము లున్నవి కనుక శూద్రు డైనను తనకు తెలిసిన దానిని బ్రహ్మవిద్యను సహితము ఇతరులకు చెప్పుటయందు తప్పేమియును లేదు. వేదాంతగ్రంథములను

చదువుటకు స్త్రీల కధికారము లే దనిరిగదా? చూడాల భర్తకు జ్ఞాన ముపదేశించి అతనిని జీవన్ముక్తుని చేసినది యేన్యాయము వలననో, అట్టి న్యాయము చేతనే శూద్రుడు సహితము బ్రహ్మజ్ఞానము నితరుల కుపదేశింప వచ్చును.

ఈ సందర్భమున శ్రీ వివేకానందస్వాములవారి యీ వాక్యములు గమనింపుడు

"ఎవడైనను - శూద్రుడుగాని, చండాలుడు గాని - బ్రాహ్మణునకు కూడ వేదాంతబోధ చేయవచ్చును సత్యమును అధమునియొద్దనుండి కూడా - అతడు ఏకులమునకు, ఏమతమునకు చెందినవాడైనను - గ్రహింప వచ్చును "*

ధర్మశాస్త్రములయందు చెప్పిన విధులను సంపూర్ణముగా (మార్పులేకుండా) అచరణలో పెట్టినట్లైన ఈ భూమియందు బ్రహ్మవిద్యాధికారియే లేకపోవచ్చును. అప్పటిలో అధ్యాత్మశాస్త్రమునకే ముప్పు కలుగును అచరణలో పెట్టు సంఘమున్నపుడే శాస్త్రమునకు నిత్యత్వము కలుగును అట్టి సంఘము లేనియెడల శాస్త్రము నశించిపోవును.

## (12) శ్రీ శంకరాచార్యులు

జగద్గురు శ్రీ శంకరాచార్యులవారిని గుఱించి కొంత చెప్పవలసి యున్నది. ఎంత చెప్పినను ఇంతటి గొప్పవా రని చెప్పుటకు నావంటివానికి సాధ్యముగాని విషయము. వారు ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు మొదలగు గ్రంథములకు భాష్యము రచియించి అవి సుబోధకము లగునట్లు చేసిరి వారి కాలమునందున్న పూర్వాచారములయందు కొన్నింటిని సంస్కరించక వాటిని యథాతథముగా గౌరవించిరి. స్మృతులు, స్త్రీ శూద్రాదులకు బ్రహ్మవిద్యాధికారము లేదని చెప్పిన వాక్యములను విధిలేక గౌరవించినను అచ్చటచ్చట అట్టి అధికారము గలదను భావమును వీరు వ్యక్తపఱచక పోలేదు. జాతిభేదము ఎవనియం దుండునో అట్టి వాని కవిద్య నశించియుండదని వా రచ్చటచ్చట చెప్పుచు వచ్చిరి ఉపదేశ సాహస్రియం దిట్లు వ్రాసిరి

శ్లో|| పూర్వదేహ పరిత్యాగే జాత్యాదీనాం ప్రహాణతః |
దేహస్యైవ తు జాత్యాది స్తస్యాప్యేవం హ్యనాత్మతా || (ఉ.సా.17-45)

* ఈ. స సా నుండి అనువాదకులు శ్రీ కందుకూరి మల్లికార్జునం

తా . దేహాభిమానము పోయినపుడు (దేహము నేను కానను నిశ్చయము కలిగినపుడు) దాని వెంటనే నేను బ్రాహ్మణకులమునకు చెందినవాడను నేను ఈ ఆశ్రమమునకు చెందినవాడను అను అభిమానము సహితము పోవును జాతి, దేహము మొదలగునవి కర్మకు హేతువు లగుటవలన అవి జ్ఞానికి నుండకూడదు.

మఱియు పెద్దలవాక్య మిట్లున్నది

శ్లో|| **యన్నసంతం నచాసంతం నాశ్రుతం న బహుశ్రుతం ।**
**న సువృత్తం న దుర్వృత్తం వేదకశ్చి త్స వై యతిః ॥**

తా "ఏ పురుషుడు మఱియొక పురుషుని ఉత్తమ జాతి కలవాడనిగాని, హీనజాతి కలవాడనిగాని, మూర్ఖునిగా గాని, పండితునిగాగాని, మంచి యాచారము కలవానినిగా గాని యెఱుగడో అట్టి పురుషుడే యతి యని, జీవన్ముక్తు డని చెప్పబడును."

శ్రీ శంకరులవారు గుణములకు ప్రాముఖ్య మియ్యక కులమునకే ప్రాముఖ్య మిచ్చుట వారివంటి మహనీయునకు అదియొక కళంక మగునని అట్టి కళంకము వారికుండరాదని భగవదిచ్ఛ. శ్రీ శంకరులవారు కాశీపట్టణమునం దుండగా ఒక దినము మార్గమున వారికి భగవాను డగు కాశీవిశ్వనాథ స్వామి అన్నపూర్ణా సహితుడై చండాల వేషమున కనబడెననియు అప్పుడు శ్రీ శంకరులు **"హే చండాలాధమ! ఇతో గచ్ఛ గచ్ఛేతి"** ఓచండాలుడా! దూరముగా తొలగిపొమ్ము అని చెప్పగా (హరిజన) అంత్యజవేషమున నున్న పరమశివుడు "ఓ ద్విజశ్రేష్ఠ! నీవు అన్నమయమగు శరీరమునుండి శరీరమును దూరముగా పొమ్మనుచున్నావా? లేక చైతన్యము నుండి చైతన్యమును దూరముగా తొలగిపొమ్మనుచున్నావా? మన యిరువురి శరీరములు అన్నమయములే ఇరువురియందున్న చైతన్యమును ఒక్కటే ఇట్లుండగా నేను విప్రుడను ఇతడు చండాలుడు అను నీ భేదభావము నీ కెట్లు కలిగిన"దని ప్రశ్నింపగా శంకరులవారు ప్రబోధము నొంది తన పొరపాటును సవరించుకొని

శ్లో|| **"జాగ్రత్స్వప్న సుషుప్తిషు స్ఫుటతరా యా సంవిదుజ్జృంభతే**
**యా బ్రహ్మాది పిపీలికాన్త తనుషు ప్రోతా జగత్సాక్షిణీ ।**
**సైవాహం న చ దృశ్యవస్త్వితి దృఢప్రజ్ఞాపి యస్యాస్తి చేత్**
**చణ్డాలోఽస్తు స తు ద్విజోఽస్తు గురురిత్యేషా మనీషా మమ"॥**

తా . "అవస్థాత్రయమునందు ఏ చైతన్య మతి స్ఫుటముగా ప్రకాశించుచున్నదో, ఆబ్రహ్మపిపీలికాంతము (వఱకును) సర్వదేహముల యందును ఏ చైతన్యము సాక్షియై యున్నదో అట్టి చైతన్యమే నేను నే నీ జడమైన దృశ్యము గాను అను నీ నిశ్చయజ్ఞాన మెవరికి గలదో అట్టివాడు చండాలుడే యగుగాక, ద్విజుడే యగుగాక, అతడు నాకు గురువు ఇది నా నిశ్చయము" అని మనీషాపంచకమును చెప్పిరి.

ఈ విధముగా శ్రీ శంకరులవారు జాత్యభిమానమును సహితము వదలివేసి జగద్గురు బిరుదమును సార్థకము చేసికొనిరి "ముక్తిసౌధమును ప్రవేశింప గోరువాడు శ్రీ శంకరులవారి అనుమతి లేనిదే ప్రవేశింపలేడని" డాక్టరు అనిబెసంటమ్మగారు అన్నట్లు నాకు జ్ఞాపక మున్నది అనగా శంకరులవారు చెప్పిన వేదాంతము తెలిసియుండెనని అర్థము భారతీయ తత్త్వశాస్త్రము కొంచెముగనో, గొప్పగనో చదివిన ప్రతివాడును శంకరులవారికి కృతజ్ఞతను తెలుప వలసినదే ప్రతివాడును ఆయన శిష్యులలో చేరినవాడననే భావించవలెను. శ్రీ రామానుజ, శ్రీ మధ్వాచార్యులు వారితో నేకీభవించక పోయినను దురవగాహములైన ఉపనిషత్తులకు భాష్యమును రచియించి శ్రీరామానుజ, శ్రీ మధ్వాచార్యులవారికి సహితము వారి మార్గమును కొంతవఱకై నను సుగమము చేసిరి.

## (13) బ్రహ్మవిచారార్హత

బ్రహ్మజిజ్ఞాస ఎవరికి కలుగునో అట్టివాడే బ్రహ్మవిద్య కధికారి. ఏలయన బ్రహ్మజిజ్ఞాస అందరికిని కలుగదు పూర్వజన్మ పుణ్యపరిపాకమున, ఈశ్వరానుగ్రహమున కలుగునే కాని "పరులు చెప్పిననైన నిజేచ్ఛనైన నేమిచ్చిననైన కానలకు నేగిననైన హరిప్రబోధములు" కలుగవని ప్రహ్లాదుని వచనము సాధన చతుష్టయమును సాధించిన పిమ్మట శ్రవణాదులు చేయవలయును బ్రహ్మసూత్రకారులు బ్రహ్మ సూత్రముల అరంభమునందే సూ. **"అథాతో బ్రహ్మజిజ్ఞాసా"** అనగా -

**టీక : అథ** = **అనంతరము. అతః** = ఇందువలన, బ్రహ్మజిజ్ఞాసా = బ్రహ్మవిచారము (కర్తవ్యా = చేయదగినది). అని వ్రాసిరి.

**అనంతర మనుటకు సాధనచతుష్టయ సంపత్తి కలిగిన పిమ్మట నని శ్రీ శంకరులవారు చెప్పిరి.**

శ్రీభాష్యమున నిట్లున్నది - వేదాధ్యయనము చేసి కర్మల నాచరించి పూర్వము చేసినట్టి కర్మలయొక్క ఫలములు అనిత్యములని తెలిసినపిమ్మట బ్రహ్మజ్ఞానమునందు నిచ్ఛ కలుగుచున్నది. పూర్వమీమాంస, ఉత్తరమీమాంసలు రెండును ("అథాతో ధర్మజిజ్ఞాసా"అను పూర్వమీమాంసా శాస్త్రముయొక్క మొదటిసూత్రము మొదలుకొని బ్రహ్మసూత్రమునందలి కడపటి సూత్రము అగు "**అనావృత్తి శ్శబ్దా దనావృత్తి శ్శబ్దాత్**" అను కడపటి సూత్రము వఱకును) ఒక్కటే శాస్త్రమని చెప్పిరి వర్ణాశ్రమోచిత కర్మములను (ద్విజాలు వేదవిహితమైన యజ్ఞాదికర్మలను) చేసిన పిమ్మటనే వేదాంత శ్రవణము చేయుట కధికారము కలుగునని శ్రీ రామానుజాచార్యులవారు వ్రాసిరి వేదాధ్యయనము, వేదచోదిత కర్మానుష్ఠానము-ఇవి చేసిన పిమ్మటనే కర్మఫలము అనిత్య మనువివేకము కలుగునను వీరి సిద్ధాంతము అనుభవవిరుద్ధము నిత్యానిత్య వస్తువివేకము గల ప్రతివాదును స్వర్గ సుఖము నిత్యము కాదని తెలిసికొనుచున్నాడు. బ్రహ్మవిచారము చేయుటకు వేదాధ్యయనముతోను, యజ్ఞాది కర్మల నాచరించుటతోను నిమిత్తము లేదు శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీ రమణమహర్షి మున్నగు మహనీయు లనేకులు వేదములను చదువకయు, సంస్కృత భాషాజ్ఞానము లేకయు బ్రహ్మవిదులైన సంగతి మన మెఱింగినదే

కర్మజ్ఞాన సముచ్చయ వాదమును శ్రీ శంకరాచార్యులవారును, శ్రీ సురేశ్వరాచార్యులవారును ఖండించియున్నారు. సాధనచతుష్టయ మున్నచో శ్రవణాదులు చేయవచ్చునని కొందరు చెప్పుదురుకాని దానివలన ముక్తి లభింపదని శంకరులవారి మతము.

పూర్వమీమాంస, ఉత్తరమీమాంసలు రెండును వేఱువేఱు శాస్త్రములు అవి రచింపబడిన కాలములు, కర్తలును భిన్నులు మొదటిది ధర్మమును కర్మను చెప్పును. రెండవది జ్ఞానమును చెప్పును. ధర్మాధర్మములకు అతీతమైనది జ్ఞానము. కర్మజ్ఞానములకు సముచ్చయము లేదు. ఈ రెండును తేజస్తిమిరములవలె పరస్పరవిరుద్ధము లైనవి ఈ రెండు శాస్త్రములయందు చెప్పబడిన విషయముల ననుష్ఠించినవారికి కలుగు ఫలములును భిన్నములు కనుక ఈ రెండును ఒకటి కావు. పూర్వమీమాంస, ఉత్తరమీమాంసలు రెండు ఒక్కటే శాస్త్ర(దర్శన)మైనచో దర్శనములు అయిదే అగుచున్నవి. దర్శనములు ఆఱు అని పూర్వకాలము నుండియు పండితులందఱును అంగీకరించి యున్నారు.

కొందఱు వేదాంతశాస్త్రము చదువవలయునన్నచో సంస్కృతభాషయందు పాండిత్య ముండవలయుననియు; తర్కము, వ్యాకరణము చక్కగ తెలిసియుండవలయు ననియు చెప్పుదురు ఇవి అన్నియు నుండినచో మంచిదే. కాని వైరాగ్యము, ఇంద్రియజయము కలిగి చెప్పిన వాక్యమును అర్థము చేసికొనగలిగిన భాషాజ్ఞానము, బుద్ధిసూక్ష్మత యున్నచాలును అట్టివారు శ్రవణాదులకు అర్హులు వైరాగ్యాదులు లేక, కేవల తర్కవ్యాకరణ శాస్త్రాదులయందు పండితుడై వేదాంతశాస్త్రము చదివినంతమాత్రమున గొప్ప వేదాంతి అనిపించుకొనుటకును, సభలయం దుపన్యసించుటకును వాదములయందు ప్రతిపక్షుల నోడించుటకును, కాలక్షేపమునకును అగునేకాని ముక్తినొందుట దుర్లభము

జ్ఞానవాసిష్ఠము ఇష్ట దేవతా ప్రణామముతో ప్రారంభ శ్లోకమును చెప్పి యీక్రింది రెండవశ్లోకముచే మోక్షాధికారిని నిరూపణము చేసినది

శ్లో|| **"అహం బద్ధో విముక్త స్స్యా మితి యస్యాస్తి నిశ్చయః ।**
**నాత్యంతమజ్ఞో నో తత్‌జ్ఞ స్సోఽస్మిన్ శాస్త్రేఽ దికారవాన్"** ||

తా - "నేను సంసార బంధము కలిగియున్నాడను ఈబంధమునుండి విమోచనము పొందుదునుగాక అని నిజమగు తలంపు ఎవ్వనికి కలదో, ఇక ఎవడు బొత్తుగా తెలియనివాడుకాని, బాగుగా తెలిసినవాడుకాని కాడో, అటువంటి వాడు ఈ వేదాంతశాస్త్రము చదువ అధికారము కలవాడగును"

ఈశ్లోకమునందు బ్రహ్మవిద్యాధికారికి కులముగాని స్త్రీ పురుష లింగ భేదముగాని పేర్కొనబడలేదు దీనినిబట్టి స్త్రీ శూద్రాదులకు సహితము బ్రహ్మవిద్యాధికారము కలదని శాస్త్ర మంగీకరించినది

## (14) మహాపురుషులు నడచినదే త్రోవ

ఇంతవఱకు మనము చర్చించిన దేమి? దానివలన మనము తెలిసికొన్న దేమి? అని సింహావలోకనము చేసిన యెడల చాతుర్వర్ణ్య వ్యవస్థ యనునది నేతిబీరకాయవలె నామమాత్ర మైనదని తేలినది. అది ఈ కాలమునందే కాక పూర్వకాలమునందును, అనగా ఇతిహాస పురాణములయందు చెప్పబడిన కాలములందు సహిత మీ వ్యవస్థ తారుమారై పోయినదని మహాభారత అరణ్యపర్వమునందలి మార్కండేయ యుధిష్ఠిర సంవాదమునందును, నహుష

ప్రశ్నల యందును, యక్షప్రశ్నలయందును, మఱియు పెక్కుచోట్లను పురాణములనుండియు తెలిసినది ఇట్టి వర్ణ వ్యవస్థ నాధారము చేసికొని జాతిశూద్రాదులకు బ్రహ్మవిద్యాధికారము లేదను విషయము సరియైనది కాదని, దానివలన సంఘమునకు శుభము లేదని తెలిసికొంటిమి శాస్త్రవాక్యములను చూపించిన పిమ్మట తేలిన నిర్ణయ మెట్టిదైనను ప్రస్తుతము మన కర్తవ్యమేమి? మనకు మార్గమేది? యను ప్రశ్నకు సమాధానముతో నీ ప్రసక్తి ముగియుచున్నది

మహాభారతము నందలి ఆరణ్యపర్వమున నహుష ప్రశ్నలయందు యక్షుడు ధర్మరాజును మార్గమేది? అని ప్రశ్నవేసెను ఆ ప్రశ్నకు యుధిష్ఠిరు డిచ్చిన సమాధానమే ఇప్పుడు మనకును సమాధానమై యున్నది

శ్లో॥ "తర్కోఽప్రతిష్ఠః శ్రుతయో విభిన్నాః
నైకో ఋషి ర్యస్యమతం ప్రమాణం ।
ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం,
మహాజనో యేన గత స్స పంథాః॥" (మ భా. 313-115)

తా .(మార్గమును చెప్పెద వినుము) తర్కమునకు ప్రతిష్ఠ (నిశ్చయ) యనునది లేదు. శ్రుతులు భిన్నభిన్న విషయములు చెప్పినవి. ఋషులు అనేకులు. ఏ ఋషియొక్క మతము ప్రమాణమో, యే మతమును గ్రహింపవలయునో నిశ్చయించుట కష్టము. పంచకోశములను గుహయందు పరమాత్మ గలడు. పరమాత్మను పొందుటకు పెద్దలు ఏ మార్గమున నడచిరో అదియే మార్గము.

పెద్దలనగా ప్రస్తుతకాలమునందు మహాత్ములగువారు; ఈ విషయమున నేమి చెప్పిరో అదియే ధర్మము. దాని ననుష్ఠించుటయే కర్తవ్యము

ఈ సందర్భమున శ్రీ వివేకానందస్వాములవారి సూక్తులను కొన్ని యిచ్చుట నుదాహరింతును.*

"కుల మనగా నిజముగా నేమో పదిలక్షలలో నొకనికైనను తెలియదు "

* శ్రీ వివేకానందస్వాములవారి ఉపన్యాసములనుండి "కులము సంస్కృతి సామ్యవాదము" అను గ్రంథము మద్రాసు రామకృష్ణ మఠాధ్యక్షులచే ప్రకటింపబడినది. అనువాదకులు శ్రీ కందుకూరి మల్లికార్జునం

"కులము సర్వదా మాఱుచున్నది కర్మకాండయు బాహ్యారూపములును అట్లే మాఱుచున్నవి మూలసత్త్వమే (మూలసూత్రమే) మార్పులొందనిది"

"కులమును విడనాడ రాదు కాలానుగుణముగా దానిని మార్చుకొన వలయును"

"మన కులములును, వ్యవస్థలును, మతముతోడి లంకె కలవిగా, కన్పించినను నిజముగా అట్టివానికి లంకె లేనేలేదు"

"మతమున కులమే లేదు కులము సాంఘికాచారము మాత్రమైనది"

"ఈ వర్ణాశ్రమములను గూర్చి మీకు నేమి తెలియును? నేడు ఈ దేశమున చాతుర్వర్ణ్యము ఎచ్చట నున్నది? బదులు చెప్పుడు నాకు కన్పించుట లేదు" అని చెప్పిరి

గౌతమబుద్ధుని తరువాత అంతవారని ప్రసిద్ధి కెక్కిన మహాపురుషుడు గాంధీమహాత్ముడు సత్యశీలుడు, అహింసా వ్రతుడు, స్వార్థత్యాగి, లోకకళ్యాణమునకై జీవితము నంకితముచేసి బారతజాతిని గాఢతమస్సులోనుండి వెలుగులోని కీడ్చినవాడు. ఇట్టి మహాత్ముడు ఈ చాతుర్వర్ణ్యవ్యవస్థ యుండరాదని, దీనిని పోగొట్టుకొనవలయునని చెప్పిరి అదియే మన కర్తవ్యము ఇప్పుడు ఈ కులతత్త్వములను సంస్కరించుటకు సాధ్యపడదు

భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస అవతారముతో ఆధ్యాత్మిక ప్రపంచమునకు నొక నూతనయుగము ప్రారంభమైనది బ్రాహ్మణులకే సన్న్యాస మియ్యవలెనని ద్విజులకే బ్రహ్మవిద్య ఉపదేశింపవలెనని యుండు అంధవిశ్వాసమును వారు పాటింపలేదు వారి మానసపుత్రులలో అగ్రగణ్యులగు శ్రీవివేకానందస్వామియొక్క దివ్యవాణిని ఇచ్చట నుదాహరించుచున్నాను

"ఇక మనతోడివారిలో ఈ జ్ఞానమును ప్రబోధింప గలము వారును ఆ పవిత్రాత్మయే యని మనము గ్రహించితిమి వారికిమాత్ర మది తెలియకుండెను. మనము వారికి దానిని దెలిపి వారును తమ యనంత స్వరూపముంగూర్చి ప్రబోధము గాంచునటుల చేయవలయును ఇప్పుడు ప్రపంచమందెల్ల జరుగవలసిన పని యిది యని నా భావము."

ఈ సిద్ధాంతములు చాల పురాతనములై యుండనోపు. సత్య మనంతము. సత్య మొకని స్వాస్థ్యము గాదు. ఏ జాతిగాని యే వ్యక్తిగాని అది తనదని

వాదింప వీలులేదు, సత్యము సర్వాత్మల యొక్కయు సహజలక్షణము. ఎవ డేది కేవలము తన దని వాదింపజాలును? కాని యీ భావనను అనుష్ఠాన యోగ్యముగ నొనరించవలయును. సుగ్రాహ్యముగ జేయవలయును అప్పుడు మహోన్నత సత్యము లన్నియు (ధర్మము లన్నియు) సుగ్రాహ్యములై వెలయును అప్పు డీతత్త్వము మానవ జాతియం దెల్లెడల వ్యాపించి, మహామనీషాగ్రగణ్యు లకును, సర్వసామాన్యులకును, స్త్రీకిని, బురుషునకును, శిశువునకును గూడ లభ్యమై వరలగలదు తర్కవాదములును, క్రతువులును, ఆయాకాలములందు మహోపకారకములే యైనవి. ఇప్పుడో సులభతరమార్గములు సమకూరి ప్రతినరుడును, సాధకుడై ప్రతినరునందలి సత్యస్వరూపమును పూజార్హవిగ్రహమునై పరగు సత్యయుగమును బ్రారంభింతుము గాక "*

వీరుగాక ఈ కాలమునందలి శ్రీ రవీంద్రనాథఠాకూరు, శ్రీ అరవిందయోగి మొదలగు మహనీయులు సహితము వీరి మార్గమునే అనుసరించిరి శ్రీ వివేకానందస్వాములవారి పై వాక్యములను అచ్చుటచ్చుట కొందఱు మహనీయులు ఆచరణ యందుంచిరి వారిలో శ్రీ మలయాళస్వాముల వారొకరు. వీరు ఎర్పేడునందు వ్యాసాశ్రమమును స్థాపించి కులవిచక్షణ పాటింపక వారి నాశ్రయించిన ముముక్షువులకు జ్ఞానభిక్ష నిడిరి. బ్రాహ్మణేతర కులములవారికి సహితము సన్న్యాసాశ్రమము నొసగిరి. శ్రీయుతులు డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణపండితులు భారతీయ తత్త్వశాస్త్రమును ముగించుచు అమూల్యములగు నీ క్రింది వాక్యములు వ్రాసిరి

"విశాలదృక్పథములో జాతీయ మతప్రబోధము చేయు కార్యక్రమ ముదయించలేదు అనుశ్రుతమై వచ్చిన ఆధ్యాత్మికసంపద యేకొలదిమందికో చెందిన గుప్తధనము కాదను విషయము గ్రహింపబడలేదు భావములు, శక్తులు, ప్రస్తుత జాతిజీవితము-మృత్యుగ్రస్తము గాకుండ గాపాడుట కీ భావములను నలుమూలల వ్యాపింపజేయవలెను "

సంప్రదాయముయొక్క యొత్తిడికి లొంగక సమస్త భారతీయ దర్శనములను నిష్పక్షపాతబుద్ధితోను, పూర్ణప్రజ్ఞతోను పరిశీలించి సత్యమును ప్రపంచమునకు చాటిన మహాపురుషులలో మొదట పేర్కొనదగినవారు శ్రీ వివేకానందస్వాములవారు. తరువాత గణింపదగినవారు శ్రీయుతులు డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణపండితులు మున్నగువారు. వీరి వాక్యములే మన

* అనుష్ఠాన వేదాంతము, అనువాదకులు శ్రీ తత్త్వానందస్వామి

కీవిషయమున ధర్మశాస్త్రములు కనుక సమస్త మానవకోటికిని సత్యమును తెలిసికొనుట కధికారము కలదు

కాలము మారిపోవు చుండును విదేశీయు లనేకులు మనదేశముపై దండెత్తి వచ్చిరి 'యవనులు, కుశానులు, హూణులు' ఈ దేశమున రాజ్యపరిపాలనము చేసిరి అందులో కొందఱు హిందువులైరి హిందూమతమును స్వీకరించిన వారియందు చతుర్వర్ణములయందు ఎవరెవరు ఏవర్ణమునకు తగుదురో వా రాయావర్ణములలో కలిసిపోయిరి మఱి కొందఱు విదేశీయులు బౌద్ధమతమును స్వీకరించిరి విదేశములనుండి వచ్చిన వారేగాక మనధేశమునం దుండువారును చాలవరకు చాతుర్వర్ణ్య వ్యవస్థతో విసుగెత్తి బౌద్ధమతమును శరణుపొందిరి పిమ్మట కొంతకాలమునకు ముసల్మానులు, క్రైస్తవులు ఈ దేశమునకు వచ్చి ఇచ్చట రాజ్యపరిపాలన చేసిరి కాని వీరు పైవారివలెగాక ఈ దేశప్రజలను తమ మతములలో చేర్చుకొనిరి. ప్రస్తుతము మనదేశమునందు, కొన్ని కోట్ల ప్రజలు ముసల్మానులుగాను, క్రైస్తవులుగాను ఉండుటకు కారణము లేమైయుండినను, మన పూర్వులు శూద్రాదులయందు అజ్ఞానము శాశ్వతముగా నుండవలయునని చేసిన ప్రయత్నమే ముఖ్యమని నమ్మవచ్చును

కాలానుగుణముగా మార్పుచెందని జాతి నశించి పోవును ఒకానొక కాలమునందు ఏవిధానము మానవ సమాజమునకు లేదా ఒక ప్రత్యేకమైన మానవజాతికి సుఖప్రదమై ఉభయలోక తారకమై యుండునో ఆ విధానమే ధర్మము ఒకప్పుడు ధర్మమైన ఆ విధానము కాలాంతరమున ఆ సంఘమునకే శ్రేయఃప్రదము కాదేని అది అధర్మమగును పూర్వము దానిని పెద్దలు ధర్మమని గౌరవించిరని మనమును గౌరవింపగూడదు. దానిని త్రోసి వేయవలయును

ప్రపంచమునందు క్రైస్తవ, ఇస్లాము మతములు విస్తరిల్లినవి భరతఖండమునందు అనేక మతములు వ్యాపించినవి మానవుడు చంద్రమండలములో అడుగుపెట్టుటకు సిద్ధముగానున్న యీ కాలమున* సంకుచితభావముల పోనాడి మూఢవిశ్వాసమును, అజ్ఞానమువలన కలిగిన భీతిని పారదోలి, అధ్యాత్మజ్యోతిని వెలిగించి, ఉపనిషత్ప్రతిపాదితమైన జ్ఞానమును నలుదెసలను విస్తరింప జేయవలసిన కాలమందు "వీడు శూద్రుడు," "వీనికి వేదాధికారము లేదు" అను మొదలగు వాక్యములకు విలువలేదు

---

* మానవుడు చంద్రమండలమునందు భారత కాలమాన ప్రకారము 21-7-1969న తొలిసారిగా అడుగిడినాడు

మన పూర్వులయొక్క సంస్కృతికి, ఔన్నత్యమునకు తగినరీతిగా మనము నడుచుకొని ఇతరులకు మార్గదర్శకులము కావలసి యున్నది

ఈ దేశస్థులకే కాక యితర దేశస్థులకు ఇతరజాతులకు ఈ ఆధ్యాత్మిక జ్ఞానము నిచ్చి వారివలన ఆధిభౌతిక విజ్ఞానము నార్జించి ఈ రెంటిని సమన్వయపఱచవలసిన సమయమిది. ఈ దేశమునందున్న ద్విజులు మాత్రమే ఋషుల సంతానమని తక్కినవారు కారని చెప్పుట సరికాదు గీతయందిట్లున్నది "ఎవరివలన లోకమునందున్న ఈ ప్రజలందఱును పుట్టిరో అట్టి యేడుగురు మహర్షులును (సప్త ఋషులు), నలుగురు మనువులును నావలననే పుట్టింపబడిరి" (గీత. 10.6) కనుక భూమియందున్న మానవులందఱును ఋషిసంతానమే.

## (15) అచలవాదము

జి : అయ్యా ! ఇప్పుడు నాకుగల సంశయ మంతయు తొలగిపోయినది నేను వేదాంతవిచారమునకు అర్హుడనేని నన్ననుగ్రహించి వేదాంతమును నాకు బోధింపుము

వే : నీవు వేదాంతము తెలిసికొనుటకు సరియైన యధికారివి నీకు నింకేవైనను సంశయములున్న అడుగుము

జి : ఇంకొక్క విషయము మిమ్ముల అడుగవలసియున్నది నాకొక పెద్దమనిషితో పరిచయమున్నది అతడు నాకిట్లు చెప్పెను.

"శివరామదీక్షితులను వారు అచలబోధను స్థాపించిరి అది అద్వైతమునకన్నను గొప్పది. దానిని తెలిసికొనుటకు కుల మత భేదములు గాని, లింగభేదము గాని అడ్డురావు. వారి అచలగురువు అనుగ్రహమున్న ఒక క్షణములో 'పరిపూర్ణము'ను తెలిసికొన వచ్చును వేదశాస్త్రపురాణములు, ఇతిహాసములు చదువవలసిన అవసరము లేదు. వీటివలన పరిపూర్ణ మెఱుగబడదు." అని వారి గురువును శరణుపొందు మని అప్పుడప్పుడు నాకు చెప్పుచుండును. దాని విషయ మేమి?

వే : శ్రీ శివరామదీక్షితులవారు స్థాపించి నట్లు చెప్పు అచలమత మొకటి కలదు. శ్రీ శివరామ దీక్షితుల వారును వారి శిష్యపరంపర లోనివారును రచించిన కొన్ని గ్రంథములను నేను పరిశీలించితిని. నీవు అద్వైత వేదాంత

ముము గుఱించి చక్కగా తెలిసికొనిన పిమ్మట అచలమత మెట్టి మతమైనది నీకు సులభముగా బోధపడును *పూర్వ ఋషులు పరమసత్యమును తెలిసికొనుటకై సమస్తప్రాణులను ఈ విధముగా ప్రబోధించిరి

"మూ: ఉత్తిష్ఠత జాగ్రత
ప్రాప్య వరాన్ని బోధత ।
క్షురస్యధారా నిశితా దురత్యయా
దుర్గం పథ స్తత్కవయో వదన్తి ॥ (కఠోపనిషత్తు 1-3-14)

తా॥ అజ్ఞానమునందు నిద్రించుచున్న (మునిగియున్న) ఓ ప్రాణులారా! లెండు. అజ్ఞాన నిద్రనుండి మేల్కొనుడు. ఆత్మ జ్ఞానాభిముఖులు కండు సద్గురువుల నాశ్రయించి వారి చేత ఆత్మతత్త్వ మిట్టిదని తెలిసికొనుడు ఆత్మతత్త్వము తెలిసికొనుట మిగుల కష్టతరమైన పని. పదునుగల కత్తి యొక్క అంచు పైభాగమునందు పాదములతో నడచుట ఎంత కష్టమో ఆత్మతత్త్వజ్ఞానమును తెలియు మార్గము కూడ అంత కష్టమైనదని విద్వాంసులు చెప్పుచున్నారు "

కనుక సమస్తలోక గురులగు హరిహర హిరణ్యగర్భులకును, లోకమున వేదాంతమును విస్తరింపజేసిన మహాత్ములకును, నమస్కరించి చెప్పుచున్నాను. శ్రద్ధాళువై వినుమని ఇట్లు చెప్ప దొడంగెను.

**యవన వ్యాధ పుళింద హూణ శక కంకాభీర చాండాల సం**
**భవులున్ తక్కిన పాపవర్తనులు నేభద్రాత్ము సేవించి భా**
**గవతశ్రేష్ఠుల డాసి శుద్ధతనులై కళ్యాణులై యుందు రా**
**యవికారున్ ప్రభవిష్ణు నాత్మమదిలో నశ్రాంతమున్ మ్రొక్కెదన్.**
(శ్రీమదాంధ్రభాగవతము)

ఇది పరమేశ్వరానుగ్రహమువలన మఱ్ఱిబోయిన రామసుబ్బయ్యచే రచియింపబడిన "బ్రహ్మజిజ్ఞాస" యందలి 'అధికారి' అను మొదటి ప్రకరణము సంపూర్ణము.

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః**

---

* **భగవదనుగ్రహమున ఈ గ్రంథముయొక్క చతుర్థ భాగమున "అచల మత పరిశీలనము" వ్రాసియున్నాము. చిత్తగింపుడు**

ఓమ్

# బ్రహ్మజిజ్ఞాస

## రెండవ ప్రకరణము

### పరబ్రహ్మము-విశ్వము

**పరుఁడై ఈశ్వరుఁడై మహామహిముఁడై ప్రాదుర్భవస్థాన సం**
**హరణక్రీడనుఁడై త్రిశక్తియుతుఁడై యంతర్గతజ్యోతియై**
**పరమేష్ఠిప్రముఖామరాధిపులకుం బ్రాపింప రాకుండు దు**
**స్తర మార్గంబునఁ దేజరిల్లు హరికిం దత్త్వార్థినై మ్రొక్కెదన్.**

(పోతన భాగవతము)

### (1) అద్వైతము

అవినాశి యగు పదార్థ మెద్ది! దానిని తెలిసికొను టెట్లు? అని ఉపనిషత్తులయందు చేయబడిన విచారమే వేదాంతము ఈ విషయము నెఱుగవలెనను ఇచ్ఛయే 'వేదాంత జిజ్ఞాస' లేక 'బ్రహ్మజిజ్ఞాస' యందురు లోకులు సామాన్యముగా దేవు డనుమాటకు వేదాంతులు పరతత్త్వము, పరబ్రహ్మము, నిర్గుణబ్రహ్మ మని చెప్పుదురు. సామాన్యముగా బ్రహ్మవిచారము యొక్క యారంభ మిట్లుండును నామ రూపాత్మకమగు నీ ప్రపంచ మెట్లు కలిగినది? ఈ సృష్టికి పూర్వ మేమి యుండెను ? ఎట్లుండెను ? నే నెవడను? దీనికి కర్త ఎవడు? ఉపాదానకారణ మేది?- అను ప్రశ్నలకు ప్రత్యుత్తరము వేదకాలమునాటి ఋషులు తెలిసికొనిరి. వారి యనుభవమును ఉపనిషత్తులయందుండి తెలిసికొనవచ్చును ఆ యుపనిషత్తులకు భిన్నభిన్న సంప్రదాయములవారు వేఱు వేఱు అర్థములను చెప్పిరి. అందు అద్వైతులు, విశిష్టాద్వైతులు, శుద్ధాద్వైతులు, ద్వైతులు ముఖ్యులు.

వీరిలో అద్వైతసంప్రదాయ మిది. ఈ మతోద్ధారకులు శ్రీ శంకరాచార్యులవారు.

"సదేవ సోమ్యేద మగ్ర ఆసీత్" ఓ సౌమ్యుడా! ఈ సృష్టికి పూర్వము సత్తుమాత్రమే యుండెను. "ఏక మేవాద్వితీయం బ్రహ్మ." ఒక్క బ్రహ్మము తప్ప రెండవది లేకుండెను.

నామరూపములు పుట్టుటకు ముందున్న ఆ వస్తువునందు నామరూపము లెట్లు కలిగెను? ఆ బ్రహ్మ మెట్టిది?

## (2) పరుడు లేక జ్ఞేయము

ఆదిమధ్యాంతములు లేనిదియు, రూపనామ క్రియా రహితమై సజాతీయ విజాతీయ స్వగత* భేదరహితమై దేశకాలభేదముచేత నపరిచ్ఛిన్నమై, జననమరణాది షడ్భావ వికారరహితమై, ఏకమై, సర్వవ్యాపకమై, పరిపూర్ణమై, అట్టిది యిట్టిది యనిచెప్ప రానట్టిదై, అవాఙ్మానసగోచరమై, శుద్ధచైతన్యమై, యుండునది, లేనిది యని చెప్పుటకు వీలు లేక యుండునట్టిది వస్తువు-వస్తువను నామము ఇతరులకు బోధించుటకొఱకు ఉపయోగింపబడినది. ఆ పిమ్మట ఆ వస్తువునకే-పరుడు, పరతత్త్వము, పరబ్రహ్మము, పరిపూర్ణము, చిత్తు, సత్తు, బ్రహ్మము మొదలగు నామములను మహాత్ములు బోధకొఱకు నేర్పరచిరి ఈ పరతత్త్వమే జ్ఞేయము. ఈ జ్ఞేయమగు పరబ్రహ్మమును గుఱించి గీతయందు చెప్పబడినయర్థ మిచట చెప్పుచున్నాను

ఆ బ్రహ్మ మంతటను హస్తములు, పాదములు కలదియు, నంతటను (అన్నివైపులను) నేత్రములు శిరోముఖములు గలదియు, నంతటను శ్రోత్రములు (చెవులు) కలిగినదై సర్వలోకమును వ్యాపించియున్నది (గీత 13-14) ఆ బ్రహ్మము సకలేంద్రియ వ్యాపారములచేత ప్రకాశించుచున్నదానివలె నుండినను, సకలేంద్రియరహిత మైనట్టిది. ఎల్లప్రపంచములు ధరించినదయ్యును, నెందుల దగులక యుండునది, సత్త్వ రజః తమోగుణములు కానిదయ్యును నాగుణములు ననుభవించునట్లు తోచుచున్నది (గీత 13-15) ఆ బ్రహ్మము సర్వచరాచర భూతముల లోపలను వెలుపలను ఉండునట్టిది, మిగుల సూక్ష్మమైనది. కావున నజ్ఞానులకు తెలిసికొన శక్యము కానిది అజ్ఞానికి దూరముగా జ్ఞానికి

---

* ఒక మనుష్యునకును ఇంకొకనికిని గల సంబంధము సజాతీయము వారిరువురియందు గల భేదము సజాతీయ భేదము మనుష్యునకు పశువు విజాతీయము మనుష్యునకు పశువునకు గల భేదము విజాతీయ భేదము ఒక శరీరమందే ఒక అవయవమునకు మఱియొక అవయవమునకు గల భేదము స్వగత భేదము

దగ్గరగా నున్నట్టిది (గీత 13-16) ఆ బ్రహ్మమపరిచ్ఛిన్న మయ్యును నెల్ల జీవకోట్లయందు పరిచ్ఛిన్నమైన దానివలె నుండునట్టిదియు, స్థితికాలమున భూతములను భరించునట్టిదియు, ప్రళయకాలమున భూతములను మ్రింగునదియు, సృష్టికాలమున సమస్తమును పుట్టించునదియును, ననగా కల్పించు నట్టిదియు నగు నా బ్రహ్మమే జ్ఞేయము (తెలియదగినది) (గీత 13-17) బ్రహ్మము జ్యోతిస్సులను (సూర్యుడు నక్షత్రములు మొదలగు వాటిని) ప్రకాశింప జేయునదియై యున్నట్టిదియు, అజ్ఞానమునకంటె (అంధకారమునకు పరముగా నున్నదియును) వ్యతిరిక్తమయినదియు, జ్ఞానరూపమైనదియు, జ్ఞేయమయినదియు, జ్ఞానముచే పొందబడదగినదియు, సర్వహృదయములయం దున్నట్టిదియునై యున్నది (గీత 13-18). ఈ యర్థమునే శ్వేతాశ్వతరశ్రుతి 3-14, 16, 17, 18, 19వ మంత్రములలో చెప్పినది

జి : పరబ్రహ్మము నిర్విశేషుడు కదా! పై చెప్పిన లక్షణము లన్నియు ఆయనకు విశేషణములే కదా!

వే : నిర్విశేషవస్తువును బోధించునట్టి వాక్య మొక్కటియు నుండజాలదు బ్రహ్మమును గురించి తెలుపుటకు వేదాంత శాస్త్రమునందు నేతి-నేతి (న +ఇతి=నేతి) "ఇది 'కాదు' "ఇదికాదు" అని భూమిమొదలు బ్రహ్మ మవధిగ సమస్త వస్తువుల స్వరూపమును విచారించి "ఇదికాదు" "ఇదికాదు" అని త్రోసివేయుటయే నిషేధపద్ధతి. సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ - బ్రహ్మము సద్రూపుడు, చిద్రూపుడు, అనంతరూపుడు అని శబ్దప్రయోగవిధిపూర్వముగా చెప్పుట విధి ఈ విధి నిషేధములు రెండును ఉపనిషత్తులయందు బ్రహ్మబోధకు ఉపాయములుగ గ్రహింపబడినవని విద్యారణ్యులవారు చెప్పిరి (వే.పం. 7-87)

శంకరాచార్యులవారు వేదాంత శాస్త్రములయందు విధి లేదనియు, నిషేధమువలననే బ్రహ్మము బోధింపబడుచున్న దనియు చెప్పిరి. (ఉ.సా 18-19). బ్రహ్మసూత్రములయందు సమన్వయాధికరణమున "తత్తు సమన్వయాత్" (1-1-4) సూత్రభాష్యమున ఈ విషయమును శంకరులవారు విపులముగ చర్చించిరి. అందు '**ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యో మైత్రేయి** (బృ. 4-5 6). **ఆత్మను దర్శింపవలయును. శ్రవణము చేయవలయును. మననము చేయవలయును. నిదిధ్యాస చేయవలయును**'

అను మొదలగు విధిపరములగు శ్రుతులు విధిచ్ఛాయలే గాని విధులు కావని చెప్పిరి మఱియు బ్ర. సూ 3-2-1 భాష్యమునందును "బ్రహ్మవాక్యము లవగతినిష్ఠములే (అవగతిని బోధించునవియే) కాని నియోగనిష్ఠములు (= విధి పరములు) గావు " అని చెప్పిరి

గీతయందు జ్ఞేయమగు బ్రహ్మమును గురించి చెప్పబడిన వాక్యములు లక్షణములేకాని గుణములు కావు లోకమునం దొక పదార్థము దూరమునం దుండెనేని సమీపమునం దుండనేరదు సమీపమునం దుండినచో దూరమునం దుండజాలదు. ఇట్టి పరస్పర విరుద్ధలక్షణములు పరబ్రహ్మమునకు మాత్రమే చెప్పవచ్చును బ్రహ్మమునకు ఇంద్రియములు లేవని చెప్పబడినది అనగా దీనియర్థమేమి ? మానవునికి గల పరిచ్ఛిన్న జ్ఞానేంద్రియ కర్మేంద్రియములవంటి యింద్రియములు లేవనియే కాని సర్వత్ర పాణిపాదములు శ్రోత్రములు కలవని చెప్పిరి. మనుష్యునియందు గల ఇంద్రియములు వాటివాటి నిర్దిష్టస్థానములయందు గలవు కాని సర్వత్ర లేవు సర్వత్ర పాణి, పాదములు నేత్రములు కలవని చెప్పు నీ వర్ణన మానవబుద్ధికి అగమ్యమైనది అయినను పరబ్రహ్మము భూతముల బహిరంతరములయందు వ్యాపించియున్నా డని చెప్పుటచేత గడ్డిపోచ మొదలు చతుర్ముఖ బ్రహ్మపర్యంతము గల సకల శరీరములయందు నున్నవాడై సమస్త ప్రాణికోట్ల యింద్రియముల ద్వారా వ్యాపించియుండుటచేత సర్వత్ర అనగా అంతటను పాణిపాదములు గలవాడని మన మూహింపవచ్చును

పరబ్రహ్మము అకర్తయని చెప్పబడినది ఇంద్రియ వ్యాపారము లన్నిటియందు ప్రకాశించుచున్నది. సువర్ణాభరణములయందు సర్వత్ర బంగారమే యున్నదనుటచేత ఆభరణమే బంగార మయినట్లు స్థావర జంగమములగు భూతములయొక్క వెలుపలను లోపలను వ్యాపించియున్నదని చెప్పుటచేత నవికూడ పరబ్రహ్మమే యని చెప్పవలయును గీతయొక్క 13-వ అధ్యాయమునందు ఏజ్ఞానముచేత 'నిది క్షేత్రము ఇతడు క్షేత్రజ్ఞుడు,' అను వివేకము కలుగుచున్నదో యట్టి సాత్త్వికజ్ఞానముచేత తెలియబడునట్టి జ్ఞేయమును పరబ్రహ్మమని చెప్పుటచేత పైన చెప్పినవన్నియును బ్రహ్మమునకు లక్షణములే యని చెప్పవలయును.

మౌనవ్యాఖ్యానమని యూరకున్నచో పరబ్రహ్మమిట్టిదని తెలిసికొనుటకు సాధ్యమే కాదు. మౌనవ్యాఖ్యానమునకు పైన చెప్పిన దంతయు వ్యాఖ్యాన

మనినచో అప్పుడు సరిపడును. మఱియు పరబ్రహ్మ మిట్టిదని చెప్పుటకు నుపక్రమించును. "ఓ అర్జునా! యేది తెలిసికొనిన పిమ్మట తెలిసికొనవలసిన దేదియు నుండదో (గీత 13-12), దేనిని తెలిసికొనుటవలన అమృతరూపమగు మోక్షమును పొందుచున్నాడో అట్టిదానిని చెప్పెదనని (గీత 13-13) పై జ్ఞేయమును గుఱించి చెప్పెను. అట్టిది యిట్టిది అని చెప్పుటకు అలవికాని పరబ్రహ్మమును ఇట్టిదని పైన చెప్పినవిధముగా చెప్పుటకు ఉపనిషత్కారులకును, భగవంతునకు మాత్రమే సాధ్యమగును. కాని, యితరులకు సాధ్యము కాదు. పైన చెప్పిన పరబ్రహ్మ లక్షణములు మనుష్యబుద్ధిచేత కల్పింపబడినవి కావు.

పరబ్రహ్మము అజ్ఞేయము కాదు. అనగా తెలిసికొనుటకు ఏవిధముగాను సాధ్యము కానివాడని కాని, యింత వఱకు ఎవ్వరును తెలిసికొని యుండలేదనిగాని చెప్పగూడదు. ఆయన జ్ఞేయము. జ్ఞానమునకు గమ్యము కనుక తెలిసికొనిరి. ఎవరు తెలిసికొనిరో వారే పైవిధముగా ఆయన స్వరూపమును వర్ణించిరి. సచ్చిదానందములు ఆయన స్వరూపమని చెప్పిరి

నామరూపములు లేని పరతత్త్వమునుండి నామరూపము లెట్లు కలిగెను? నిర్గుణమైన పరబ్రహ్మము సగుణ డెట్లాయెను? నిర్గుణుడు తన నిర్గుణత్వమును కోల్పోవు టెట్లు? దేశకాల నిమిత్తములు లేని బ్రహ్మమునందు దేశకాల నిమిత్తత (నిమిత్తము) లెట్లు కలిగెను? అను నీ ప్రశ్న లనేక వేల సంవత్సరములనుండి వినబడుచునే యున్నవి వాస్తవమునకు నీ ప్రశ్నలన్నియు నొకటే ప్రపంచ మెట్లు కలిగె ననునదియే ఈ ప్రశ్నకు ఇంతవఱకు తృప్తికరమైన సమాధాన మెవ్వరును చెప్పియుండలేదు. అద్వైతులు ఈ ప్రపంచము పుట్టనే లేదనిరి. మొదట లేని ప్రపంచము కనబడుచున్నందులకు వారు చెప్పు సమాధాన మిది.

## (3) మాయ

మాయను గుఱించి విచారింతము. ఇది పైన చెప్పిన నిర్గుణ బ్రహ్మమునం దేకదేశస్థమై యున్నదని చెప్పిరి. మాయ జడ మైనది. సత్త్వము, రజస్సు, తమస్సు అను మూడు పరస్పర విరుద్ధగుణములు కలది. అందు సత్త్వగుణము స్ఫటికము వలె స్వచ్ఛము, ప్రకాశింపజేయునది. రజోగుణము క్రియాత్మకమైనది. అనగా కర్మయందు ప్రవర్తింప జేయునది. తమోగుణము పై రెండింటి

లక్షణములు లేనిది మోహింప జేయునది, జడప్రాయమైన నిద్రను కలిగించునది త్రిగుణాత్మిక యగు మాయ ఉన్నదని లేనిదని చెప్పుటకు వీలుగానిది, అనగా సత్తును కాదు, అసత్తును కాదు సదసత్తులయొక్క కలయికయును కాదు. అనగా · పరబ్రహ్మమువలె సత్యము కాదు కుందేటికొమ్ము, వంధ్యాపుత్రులవంటి అసత్తును (అభావము) కాదు. సదసత్తులు కానిదగుటచే అనిర్వచనీయమగు నొక భావపదార్థ మనిరి జగత్తును మోహింపజేయునది కనుక మాయ యనియు, విచిత్రసామర్థ్యము కలది కనుక మాయాశక్తి యనియు పేర్లు.

జి : పరబ్రహ్మ మొకటి. మాయాశక్తి యొకటి రెండుపదార్థము లగుచున్నవి, ఇది అద్వైత మెట్లగును?

వే : ఇచట రెండు పదార్థములు లేవు పరబ్రహ్మము స్వతంత్రాస్తిత్వము గల వస్తువు. అట్టి బ్రహ్మవస్తువునకు సజాతీయమైన వస్తువు లేదు మాయ సత్యమైన దైనచో ద్వైతము సిద్ధించును మాయ స్వతంత్రాస్తిత్వము గలది కాదు పరబ్రహ్మముపై నాధారపడి ఆయనకంటె భిన్నమును అభిన్నమును కానిదగుట చేత అద్వైతమునకు హాని కలుగదు

ఎట్లనగా శక్తి, శక్తము. శక్తిగలది శక్తము "ఉదా అగ్ని, ఇది శక్తము దానిని చేతితో తాకినచో బొబ్బ లెత్తును. అనగా అగ్నికి దహనశక్తి కలదు అగ్నికిగల యీశక్తి యగ్నికంటె భిన్నము (వేఱు) అనికాని, అభిన్నము (ఆశక్తియే అగ్ని) అని గాని చెప్పుటకు వీలు లేదు అగ్ని కాల్చుచున్నది దహించుశక్తి దానికి కలదు ఒకానొకడు మంత్రము చేతనో, ఔషధముచేతనో, శిలప్రభావము చేతనో అగ్నియందు కాలక నిలుచును అగ్నియు దహనశక్తియు నొక్కటియే యైనచో నా మనుష్యుని నగ్ని యేల దహించక యుండును? అచ్చట నగ్ని యుండియు తాత్కాలికముగా నగ్నికి దహనశక్తి లేకపోయినది అందుచేత నగ్నికంటె దహనశక్తి భిన్నమైనదని చెప్పవలసి వచ్చినది. భిన్న మన్నపుడు దహనశక్తిని నగ్నినుండి వేఱుచేసి యిది యగ్ని, యిది దహనశక్తి అని భిన్నముగా మనము చూడలేము కనుక వేఱని చెప్పుటకును వీలులేదు

మాయాశక్తికూడ బ్రహ్మమునందిట్లే యున్నది అనగా బ్రహ్మమునకంటె నది అభిన్నమును గాక యున్నది మాయాశక్తి కార్యమే జగత్తు మాయ - తన కార్యమైన యీ జగత్తున కంటెను తనకాధార మైన పరబ్రహ్మమున

కంటెను విలక్షణ మైనది బ్రహ్మమునందు జగత్కల్పన జరగినపుడు జగత్తును చూచి మాయను నిట్టి దని తెలిసికొనుచున్నాము

జి : శక్తి యనునది జడద్రవ్యము నాశ్రయించుకొని యుండును పరబ్రహ్మము జడద్రవ్యము కాదు ఆయనయందు శక్తి ఎట్లుండును?

వే : జడద్రవ్యము నాశ్రయించుకొనియున్న శక్తి జడశక్తి. పరబ్రహ్మమునందున్నది మాయాశక్తి. రెండును ఒకటి కాదు. మాయ అఘటనాఘటనా సమర్థ మైనది. అనగా సంఘటితము కాని కార్యమును సంఘటింప జేయును ఎట్లనగా - నొక యావగింజయందు హిమాలయపర్వతము నంతయు నిముడునట్లు చేయగలదనియు, సంఘటిత మగు దానిని నసంఘటితము చేయగలదనియు దాని తాత్పర్యము. మాయ లేదన్నచో ప్రపంచమే లేదు మాయాకార్యమే ప్రపంచము దీనికార్యము నిత్యానుభవమునందు కూడ కనబడుచున్నది. వివేకబుద్ధితో పరిశీలించినయెడల పట్టుకు చిక్కుటలేదు మాయచేత బ్రహ్మమునం దీజగత్తు కల్పించబడినది. పరబ్రహ్మము నిర్గుణుడే ఆయన యీ ప్రపంచమును కల్పించు వాడును కాడు, ఉపసంహరించువాడును కాడు. ఇది యంతయు మాయాకార్యమే జగత్తు లేదనుటకు అద్వైతులు చెప్పిన సమాధాన మిది :

మాయ యనిర్వచనీయము కనుక మాయాకల్పితమైన ప్రపంచముకూడ అనిర్వచనీయము. అనగా ఉన్నదని లేనిదని చెప్పుటకు వీలు లేనిదే

మాయ జగత్తును కల్పించి నశించి యుండకూడదా ? అని శంకించుటకు వీలులేదు. మాయ లేనిచో నానాత్వము లేదు. మాయ మానవునకు ప్రత్యక్షముగా కనబడక పోయినను వివేకి యగువాడు ప్రాణులయందు దాని కార్యమును నిత్యమును ప్రత్యక్షముగా చూచుచున్నాడు ఎట్లనగా మానవులు మాయామోహితులై క్షణభంగురమైన శరీరము తామని నమ్మి చేయరాని అకృత్యములు చేయుచున్నారు మాయను గుఱించి భగవంతు డిట్లు చెప్పెను

శ్లో॥ త్రిభి ర్గుణమయై ర్భావై రేభి స్సర్వ మిదం జగత్ ।
మోహితం నాభిజానాతి మామేభ్యః పర మవ్యయమ్ ॥ (గీ 7-13)

తా : సత్త్వరజస్తమోగుణములు గల యామాయచేత మోహితులై లోకులు పరుడను, అవ్యయుడను నగు నన్ను చూడలేకున్నారు.

గీతయందు మాయకే "యోగమాయ" యని మఱియొక పేరు చెప్పబడెను (గీత 7-25) పరబ్రహ్మము జగత్తునకు వివర్త* కారణము

బహువిధములుగా విజృంభించియున్న యీ విశ్వమునకు వ్యాకృతమని పేరు వ్యాకృతముయొక్క పూర్వావస్థకు (మాయకు) అవ్యాకృతమని పేరు ఆ స్థితియందు ప్రపంచము బీజరూపమునం దున్నందున బీజశక్తి యనియు, అవ్యక్త మనియు ప్రకృతి యనియును మాయకు కొన్ని పేళ్లు

మాయ జగత్కల్పనము చేయుట ఒక్కసారి యని చెప్ప వీలులేదు ఇదివఱకు కల్పించిన బ్రహ్మాండములు ప్రళయకాలమున నుపసంహరించుకొని బీజరూపమున తన యందుంచుకొని తిరిగి కల్పము నారంభించును సృష్టి యనాది యైనది కల్పమునకే ఆది కలదు కాని సృష్టికి ఆది లేదు "మాయయను కామధేనువునకు జీవేశ్వరు లిరువురు దూడలని" విద్యారణ్యులవారు (వే పం 6-236) చెప్పిరి. మాయ వేఱు, ప్రకృతి వేఱు- అను వివాదమును శ్వేతాశ్వతరోపనిషత్తు పరిష్కరించినది

**"మాయాం తు ప్రకృతిం విద్యాన్మాయినం తు మహేశ్వమ్ |**
**తస్యావయవ భూతైస్తు వ్యాప్తం సర్వ మిదం జగత్"||** (శ్వే అ-4 శ్లో-10)

ప్రకృతి యనునది మాయయనియును, మాయగలవాడు మహేశ్వరుడనియును, మహేశ్వరునియొక్క యవయవ భూతములగు వస్తువులచే నీ జగత్తు వ్యాప్తమై యున్నదనియును తెలియదగినది కనుక మాయయు ప్రకృతియు ఒక్కటే.

---

* కారణములు మూడు విధములు : (1) ఉపాదానకారణము (2) నిమిత్తతాకారణము (3) వివర్తకారణము - కుండకు మట్టి ఉపాదాన కారణమై యున్నది ఉపాదానకారణమైన మట్టి కార్యమైన కుండను విడిచి యుండదు - నిమిత్తతాకారణము కుమ్మరివాడు ఈ నిమిత్త కారణము కార్యమునందు కనబడదు నిమిత్తకారణము నశించినను దాని కార్యము నశించదు వివర్తకారణము - త్రాటిని చూచి పామని భయపడి నపుడు, ఆ భ్రమచేత కనబడిన పామునకు త్రాడు వివర్త కారణమై యున్నది. ఇచ్చట కారణమైన త్రాడు స్వస్వరూపమును కోల్పోవకయే యారోపిత సర్పమువలె కనబడును సర్పధర్మములు త్రాటియందు కలుగుట లేదు అట్లు బ్రహ్మ మీ ప్రపంచమునకు వివర్త కారణమై యున్నది అధిష్ఠానమునకన్న విపరీత స్వభావము గలది వివర్త మనబడును అధిష్ఠాన మనగా ఆధారము

## (4) జగత్తు మిథ్య

జగత్తు మిథ్య* యనగా నేమి? ఒకానొక ప్రాచీన కవి యిట్లు చెప్పెను

శ్లో|| "శ్లోకార్ధేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథకోటిభిః |
బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః" ||

అనేక గ్రంథములయందు చెప్పబడిన విషయమును అర్ధశ్లోకములో చెప్పుచున్నాను. అదేమనగా- బ్రహ్మసత్యము. జగత్తుమిథ్య జీవుడు బ్రహ్మమేకాని వేఱుకాదు అని తాత్పర్యము. శంకరులవారు సహితము ఈ అర్థమునే ఒక శ్లోకములో చెప్పిరి.

బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః |
ఇదమేవ తు సచ్ఛాస్త్ర మితి వేదా న్తడిణ్డిమః || బ్రహ్మజ్ఞానావలీమాలా 21

ఈ మిథ్యాత్వమును శాస్త్రములయందు మూడువిధములుగా నిట్లు చెప్పిరి

1. "సదసద్విలక్షణత్వం మిథ్యాత్వం." అనిర్వచనీయము గనుక మిథ్య అనగా జగత్తు; సత్తును అసత్తును కాదు. జగత్తు కనబడుచున్నది కనుక కుందేటికొమ్ము వంటి అసత్ పదార్థము కాదు. కనబడినను బ్రహ్మమువంటి స్వతంత్రసత్త కలది కాదు. బ్రహ్మసత్తకంటె దీనికి పృథక్ (వేఱు) సత్త లేదు. కనుక బ్రహ్మేతరమైన జగత్తు మిథ్య

2. "జ్ఞానైక నివర్త్యత్వం మిథ్యాత్వం." జ్ఞానముచేత నివర్తింపబడుచున్నది కనుక మిథ్య. త్రాటియందు భ్రాంతిచేత కనబడిన సర్పము భ్రాంతి తొలగగనే కనబడలేదు. బ్రహ్మముయొక్క యపరోక్ష జ్ఞానము కలుగగనే నామరూపములు అసత్యమను నిశ్చయము కలుగును. కనుక నామరూపాత్మక ప్రపంచము మిథ్య.

3 "ప్రతిపన్నోపాధౌ త్రైకాలిక నిషేధ ప్రతియోగిత్వం మిథ్యాత్వమ్" ఆద్యంతములయందు లేదు కనుక మధ్యమును లేనియట్లే. త్రాటియందు భ్రాంతివశమున తోచిన సర్పము మొదట లేదు. భ్రాంతి తొలగిన పిమ్మటను లేదు. మధ్యనున్నట్లు కనపడినను లేదు. కనుక వ్యావహారిక జగత్తు మిథ్య

---

* "జగత్తు మిథ్య" అని వ్రాసిన చోట్లనెల్ల "వ్యావహారిక జగత్తు" లేక - "నామరూపాత్మక జగత్తు" అని అర్థము చేసికొనవలెను

శ్రీ విద్యారణ్యులుకూడ "ఆదావంతే చ యన్నాస్తి వర్తమానేఽపి తత్తథా" (వేదాంతపంచదశి 13-68) అన్నారు

**జగత్తనగా :** దేశ కాల నిమిత్తత్వములు. ఈ మూడింటి కంటె వేఱైన జగత్తును నెవ్వడు ఉన్నదని భావించుట లేదు ఈ మూడింటిని గుఱించి విచారించినచో నామరూపాత్మక ప్రపంచముయొక్క సత్తా (ఉనికి) యథార్థమో మిథ్యయో తెలిసిపోవును

## (5) దేశ, కాల, నిమిత్తతలు

**దేశమనగా నేమి?** దేశ మనునది కొన్ని హద్దుల (ఎల్లల)కు లోబడి యొకానొక విధమైన (నిర్ణీతమైన) ఆకృతి రంగులు కలిగియుండవలెను ఏదేని నొక కారణముతో నా యెల్లలు, రంగులు నశించిపోయినచో లేదా మార్పు చెందినచో నప్పుడది పూర్వదేశమని చెప్పుటకు వీలులేదు. కనుక దేశమనునది యితరముపై నాధారపడక స్వతంత్రసత్త (కలిమి) కలది కాదు. ఇతరముపై నాధారపడున దేదియు శాశ్వతమైనది కానేరదు దానియొక్క యునికి సత్య మని చెప్పలేము.

**కాలము :** కాలమనునది రెండు సంఘటనల మధ్య మానవుని చిత్తమందు ద్యోతమగుచున్నది. ఎల్లనగా. సూర్యుడుదయించుట అస్తమించుట అను రెండు సంఘటనల మధ్యగల వ్యవధిని 'పగలు' అనుచున్నాము ఆ సంఘటనలే లేనిచో కాలభావమే లేదు కాలమనగా మనసునందాత్మ శక్తి ప్రసారమైనపుడు మనసునకు చింతన కలుగును. అట్టి చింతనము నుండియే కాలభావ ముదయించునని పెద్దలనిరి మనస్సులోని మార్పునుబట్టి కాలము మారుచుండును కనుకనే యొక మనుష్యుడు ఎన్ని యుగములు నిద్రించినను లేచిన తర్వాతనే యింతకాలము నిద్రించితినని తెలిసికొనుచున్నాడు కాని నిద్రలో కాలమును తెలిసికొనలేడు. ఎందు కనగా? నచట రెండు సంఘటనలు లేవు చింతనము లేదు. కనుక కాలభావము నశించినది చింతనముపై ఆధారపడిన కాలమునకు నొక స్వతంత్ర మగు అస్తిత్వము లేదు, కనుక నదికూడ నసత్యమే.

**నిమిత్తము :** నిమిత్తతాభావమునే కార్యకారణ భావమని చెప్పవచ్చును దేశకాలములను విడిచి దీనికి ప్రత్యేకమైన యునికి లేదు. దేశ కాలములతో

దీనికి విడువరాని సంబంధ మున్నది ఇది చెట్టు, విత్తువంటిది విత్తనమునుండి చెట్టు మొలిచినది విత్తనము కారణము చెట్టు దానియొక్క కార్యము కార్యమైన చెట్టునుండి మఱియొక చెట్టునకు కారణమైన బీజము కలిగినది ఈ విధముగా కారణమునుండి కార్యము, ఆ కార్యమునుండి మరల కారణము - ఈ గొలుసు అనాదినుండియు సాగిపోవుచున్నది కనుక పెద్ద లిట్లు చెప్పిరి ఈ ప్రపంచమున నే సంఘటన మైనను స్వల్పకార్య మైనను, కారణము లేనిదే జరుగదు ఆ కారణ మంతకు ముందుగల కార్యమునుండి ప్రభవించినదే. కనుక దీనికిని నొక స్వతంత్రమగు అస్తిత్వ మనునది లేదు అందువలన నిదికూడ సత్యము కానేరదు దేశకాల నిమిత్తములను ఈ మూడును నున్నవని గాని లేవనిగాని చెప్పుటకు వీలులేదు లేవన్నచో కనబడుచున్నవి ఉన్నవన్నచో వాటికి స్వతంత్రమైన యునికి లేదు. దేశకాల నిమిత్తతలను మూడుపురులు గల ఒక త్రాడు వంటిదే మాయ యని శ్రీవివేకానందస్వాములవారు చెప్పిరి కనుక బ్రహ్మము నిత్యమని నామరూపాత్మకమగు జగత్తు మిథ్యయని యద్వైతులు చెప్పు కారణములలో నిదియొకటి

## (6) జగత్తు మిథ్య యనుటకు చెప్పిన దృష్టాంతములు

మాయ విక్షేపశక్తి ఆవరణశక్తి యని రెండు విధములుగా నున్నది **విక్షేపశక్తి** యనగా : లేనివస్తువును ఉన్నట్లు కల్పించుట **ఆవరణమనగా** : ఉన్నవస్తువును లేదనుకొనునట్లు చేయుట ఈ రెండింటివలన బ్రహ్మమునందు జగద్భ్రాంతి యను పరబ్రహ్మము లేదనుటయును కలిగినది

జగత్తు మిథ్య యనుటకు అద్వైతు లనేక దృష్టాంతముల నిచ్చియున్నారు. వాటిలో కొన్నింటిని ఉదాహరించుచున్నాను. (1) స్వప్నమునందు తోచిన ప్రపంచము. (2) రజ్జు సర్పము (3) స్థాణుపురుషుడు (4) మృగతృష్ణికాజలము. (5) శుక్తిరజతము. (6) ఆకాశమునందు నీలత్వము (7) ఇంద్రజాలికుని సృష్టి (8) జపాకుసుమ సాన్నిధ్యమున స్ఫటికమునందు తోచు రక్తిమ. (9) దర్పణమున తోచు ప్రతిబింబము. (10) నావలోయానము చేయువారికి తీరము నందలి వృక్షముల కదలిక. (11) నీటియందు వృక్షాదులు తలక్రిందుగ కనబడుట. (12) నూలు-వస్త్రము. (13) కనకము-భూషణములు. (14) మట్టి కుండలు. (15) తామ్రకల్పిత దేహాదులు. (16) జలము-తరంగము.

ఇందులో మొదటి దృష్టాంత మవస్థాంతరానుభవము రెండు మూడు దృష్టాంతములు జాగ్రదవస్థలో మసక చీకటి యందు భ్రాంతిచే కనబడునట్టివి మసక చీకటియందు త్రోవను పోవువాడు త్రాటిని చూచి సర్పమనుకొనును అట్లే స్థాణువు (కొమ్మలను కొట్టి మొదలును కొట్టక నిలిపియుంచిన చెట్టు)ను చూచి దొంగయని భయపడును ఈ దృష్టాంతముల వలన మనకు బోధపడుచున్న దేమి? త్రాడు, పాము-ఈ రెండును ఒకటి కావు కాని అచ్చట అవి రెండును భిన్నములు కావు అట్లే బ్రహ్మము, ప్రపంచము భిన్నములు కావు, కాని రెండును ఒకటే కావు అట్లే తక్కిన దృష్టాంతములను అర్థము చేసికొనవలెను

నాల్గునుండి ఏడువఱకు చెప్పబడిన దృష్టాంతములు జాగ్రదవస్థలో భ్రాంతివలన కలుగుచున్నవి ఎనిమిదినుండి పదకొండువఱకు గల దృష్టాంతములు జాగ్రదవస్థలో విచారలోపమువలన కలిగినట్టి యధ్యాస పంద్రెండు మొదలు పదహాఱువఱకు చెప్పబడిన దృష్టాంతములు పై దృష్టాంతముల కంటె భిన్నమైనవి వీటిని సూక్ష్మముగా విచారించినచో పైన చెప్పిన వాటివలె "భ్రాంతివాదము" అనగా వివర్తవాదమునకును పరిణామవాదమునకును సరిపోవును మట్టి కుండయైనట్లు లేదా కుండవలె కనబడుచున్నట్లు, నూలు వస్త్రమువలె కనబడుచున్నట్లు - బ్రహ్మము జగద్రూపముగా కనబడుచున్నదని దీని యర్థము

ఎండమావులను చూచి నీరని తలచుట, ముత్యపు చిప్పను చూచి వెండియను భ్రాంతి చెందుట, ఆకాశమునకు రూపము లేకపోయినను నల్లగా నున్నట్లు భ్రాంతి చెందుట, ఇంద్రజాలికుడు చేసిన మాయవలన కలిగిన పదార్థములు సత్యమనుకొనుట - ఇవి యన్నియు నొక్క జాతికి చెందిన దృష్టాంతములే. కనుక వీటిని నెక్కువ చర్చింప నవసరము లేదు జపాకుసుమ సాన్నిధ్యమున స్ఫటికమునందు తోచు రక్తిమ-స్ఫటికము స్వచ్ఛమైనది జపాకుసుమ మెఱ్ఱగా నుండును. జపాకుసుమ సాన్నిధ్యమున ఎండలో స్ఫటికము నుంచినచో నదినెఱ్ఱగా కనబడును. కనబడునేగాని స్ఫటికము రక్తిమను చెందదు. అనగా స్ఫటికము దాని స్వచ్ఛత్వమును తాత్కాలికముగ నైనను కోల్పోదు. జపాకుసుమమును గాని, స్ఫటికమునుగాని యొక దానినుండి యొకటిని దూరము చేసినచో స్ఫటిక మెప్పటివలెనే స్వచ్ఛముగనే కనపడును మొదట జపాకుసుమ సామీప్యమందు స్ఫటికము ఎఱుపు చెందినది కాని

తర్వాత ఆ రక్తిమను పోగొట్టుకున్నదిగాని లేదు. ఈ దృష్టాంతము అద్వితీయ నిర్గుణ బ్రహ్మము - సగుణు డెన్నడును కాలేదనియు, సగుణుడైనట్లు కొంతవఱకు కనబడుట మాత్రమే యనియు, అదియును పురుషుడు ముక్తస్థితిని పొందకుండు నంతవఱకే - ననియు బోధించుచున్నది.

దర్పణమునందు తోచు ప్రతిబింబ దృష్టాంతముకూడ నిట్టిదే. ఒక దాని యందు మఱియొక వస్తువు నైనను, మఱియొక వస్తుధర్మము నైనను నారోపించుట యధ్యాస యనబడును సముద్రమందు గాని, నదియందుగాని పోవునపుడు తీరమునందలి వృక్షాదులు వెనుకకు పోవు నట్లుండును. ఇది రైలు ప్రయాణము చేయు వారి కందరికీ ననుభవసిద్ధమే. వాస్తవముగా పోవునట్టిది నావయై యుండగా దాని ధర్మము (కదలిక) స్థావరమైన వృక్షాదులయం దారోపించుట వాస్తవమునకు నద్వితీయ పరబహ్మ మొక్కటియై యుండగా తద్వ్యతిరేకముగా నానాత్వము కలదనుట, నీటియందు వృక్షాదులు తలక్రిందుగ కనబడుట కూడ నిటువంటిదే.

మట్టి దాని వికారములైన కుండలు- ఒక కుండను మనము చేతితో తీసికొని చూచినయెడల దానియందు మట్టి తప్ప అణుమాత్రమైనను నన్యపదార్థము కనబడదు. అయినను లోకవ్యవహారమున దానిని మట్టి యనక, కుండ యనుచున్నాము. ఏలయన దాని యాకారము కేవలము మట్టివలె కాక పొట్టవలె గుండ్రముగా నుండుటచేతను, దానియందు నీరు, పిండి, ధాన్యము అట్టివి యుంచుకొనుటకు ననుకూల్యము ఉండుటచేతను దానికి మృత్తిక నామమునకు బదులు కుంభనామము కలిగినది అదియే పగిలి వక్కలైనచో దాని రూపనామములు మారిపోవును మృత్తిక యీ రూపమగుటకు కుమ్మరివాని హస్తకౌశలము. కుమ్మరిసారె మొదలగు సాధనములు కారణమై యుండినను నవి కుండయందు కనపడవు. ఉపాదాన కారణ మగు మృత్తిక మాత్రమే కనబడుటచేత నిది మృద్వికారమే అనగా కార్యకారణముల కభేదము.

ఇట్లే సువర్ణముచేత చేయబడిన భూషణములు. నూలుచేత నేయబడిన వస్త్రము, సముద్రతరంగము, తామ్రకల్పిత దేహాదులు (రాగిలోహముచే చేయబడిన విగ్రహాదులు) ఇవి యన్నియు నొక యర్థమునే బోధించునట్టివి ఇందులో నున్న విశేషమేమన నుపాదాన కారణమగు మట్టి, నూలు, సువర్ణము,

జలము. తామ్రము నివి నామరూపములను ముసుగువలన కుండలు, వస్త్రములు, భూషణములు, అలలు, విగ్రహములుగా కనబడుచున్నవే గాని, యా ముసుగు వెనుక నున్న యథార్థ స్వరూపము మృత్తికాదులే అట్లే పరబ్రహ్మమునం దీప్రపంచము నామరూపము లనెడి ముసుగుమాత్రమే కాని, యీ ముసుగు తొలగించినచో నుండు యథార్థ స్వరూపము పరబ్రహ్మమే ఇందువలన వ్యావహారిక జగత్తు కేవలము వంధ్యాపుత్రునివలె నభావము కాదనియు, బ్రహ్మమే యిట్లు కనబడుచున్నదనియు చెప్పవలెను ప్రపంచము బ్రహ్మేతరము కాదనియే అద్వైత సిద్ధాంతము.

పైన చెప్పిన దృష్టాంతము లన్నియును బోధకొఱకు చెప్పబడి యున్నందున దృష్టాంతమునందలి గుణము లన్నయు దార్ష్టాంతికమునం దుండి తీరవలయునను నియమము లేనందున కేవలము ప్రధానాంశము మాత్రమే తీసికొనవలయును. ఇట్లే శ్రీ శంకరాచార్యులవారు చెప్పియున్నారు ప్రపంచ మనునది నామరూపములకంటె భిన్నముగా లేనందున నా ముసుగు ప్రతిక్షణము మార్పులు చెందుచున్నందున నామరూపాత్మక ప్రపంచము మిధ్యయని సారాంశము

ఇచ్చట మిక్కిలి సూక్ష్మమగు నొక యంశమును మనము విచారించు చున్నామని జ్ఞాపక ముంచుకొనవలయును 1 నుండి 11 వఱకును చెప్పిన దృష్టాంతముల యందలి యర్థమును, 12 నుండి 16 వఱకు చెప్పిన దృష్టాంతముల యందలి యర్థమును ఒక్కటి కాదు కొంతవఱకు భిన్నములు ఎల్లనగా - 1 నుండి 11 వఱకును గలవి అవిద్యావశమున బ్రహ్మము తెలియబడక నామరూపాత్మక ప్రపంచమును సత్యమని చూచువానికిని, 12 నుండి 16 వఱకును గలవి అవిద్య నశించి బ్రహ్మమును, బ్రహ్మముయొక్క ఛాయామాత్రముగ వ్యావహారిక జగత్తును చూచు జ్ఞానికిని వర్తించును సువర్ణ కంకణమును చూచినపుడు ఇది కంకణ మనుకొను జ్ఞానమునకును, ముత్యపు చిప్పను చూచి వెండి యనుకొను జ్ఞానమునకును భేదము కలదు ఇట్లే శుక్తియందు లేని రజతత్వమును చూచునట్లు బ్రహ్మమునందు లేని జగత్తును చూచుచున్నామని చెప్పినచో ప్రపంచము లేనిదే యగును ప్రపంచము అభావమే యయినచో అభావమును మన మెట్లు చూడగలము? కనుక బ్రహ్మమే జగద్రూపముగ తోచుచున్నది., కనకము కంకణముగా చూచుట యన్నపుడు సువర్ణమును మనము చూడకపోలేదు సువర్ణమును కంకణమును

రెంటిని చూచుచున్నాము, ఇచ్చట కంకణ మనునది యేది ? యని ప్రశ్న కలుగవచ్చును సువర్ణమే వలయాకారముగా నున్న ఆకృతి. దాని నామము కంకణము ఈ నామరూపములు రెండును మిథ్య సువర్ణము మాత్రము సత్యము. కంకణమును కరగించినచో నప్పు డేమగును? కంకణమను రూపమును, కంకణ నామమును మిథ్య యగును. జగత్తున గల సర్వవస్తుజాతమును ఇట్లే యుండును

ఈ దృష్టాంతము లన్నియు వేఱువేఱుగా కనబడినను వీటి యన్నిటి యందును సామాన్యముగా గోచరించు నర్థ మొక్కటే అది యేమనగా వస్తువును దాని స్వరూపము ఉన్నది యున్నట్లుగా మనము చూడక తద్భిన్నముగా చూచుట దీనికి కారణము మన దృష్టి దోషమే కాని వస్తువునందు నట్టి దోషము లేదనుట ఈ దృష్టాంతము లన్నింటి కంటెను మొదట చెప్పిన దృష్టాంతమునకు భాగవతమందు* నెక్కువ ప్రాముఖ్యము గలదు

జగత్తు వ్యావహారిక సత్యమే గాని బ్రహ్మమువలె పారమార్థిక సత్యము కాదు. కనుక మిథ్య యని చెప్పిరి. ప్రపంచము స్వప్నతుల్యమని చెప్పు స్వప్న దృష్టాంతము జగత్తుయొక్క అసత్యమును తెలుపుటకే చెప్పబడెను గాని అన్నివిధముల స్వప్నమువలె మిథ్యయను నర్థముతో చెప్పబడలేదు అద్వైతులయందు పారమార్థిక ప్రాతిభాసికసత్తలను రెండింటిని మాత్రమే అంగీకరించువారు వ్యావహారిక జగత్తునకును స్వప్న ప్రపంచమునకును భేదమును చెప్పరు వీరిని దృష్టిసృష్టివాదు లందురు వ్యావహారిక సత్త (వ్యావహారిక సత్యము) అను మూడవ సత్తను అంగీకరించువారు స్వప్న జాగరములకు భేదము చెప్పుదురు శంకరులవారు త్రివిధ సత్తల నంగీకరించువారు. వారు జగత్తును స్వప్నముతో పోల్చిన యీ క్రింది శ్లోకము నందలి యర్థమును గమనింపవలెను.

శ్లో|| "విశ్వం దర్పణదృశ్యమాన నగరీతుల్యం నిజా న్తర్గతం
పశ్య న్నాత్మని మాయయా బహిరివోద్భూతం యథా నిద్రయా |
య స్సాక్షాత్కురుతే ప్రబోధసమయే స్వాత్మాన మే వాద్వయం
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే ||

(దక్షిణామూర్తి స్తోత్రము).

---

* "స్వప్నజాగరములు సమములు" అని భాగవతమున ప్రహ్లాదుని వచనము ఇట్టి వాక్యములు భాగవతమునందు ఇంకను గలవు.

తా ' అద్దమునందు కనబడునటువంటి నగరము వలె పరబ్రహ్మమునందు వ్యావహారిక జగత్తు కనబడుచున్నను మాయా ప్రభావమువలన బయట నున్నట్లు తోచుచున్నది ఎట్లనగా - నిద్రలో తనయందు (మనస్సుతో) కల్పింపబడిన స్వప్నప్రపంచము బయట నున్నట్లు తోచినను నిద్రనుండి మేల్కొనగనే లేనిదే యగును అట్లే సద్గురువుచే ప్రబోధింపబడినవాడు జగత్తును నిర్వికార బ్రహ్మముగనే చూచునని స్వప్నదృష్టాంతముచే చెప్పబడినది

పై శ్లోకమునందు బ్రహ్మమును అద్దముతో పోల్చిరి అద్దమునందు ప్రతిబింబించిన నగరముతో జగత్తును పోల్చిరి అద్దమునకంటె నగర ప్రతిబింబము వేరుగా లేదు కాని ఆ రెండును ఒకటి గావు - రెండవ దృష్టాంతము తనయందు తోచిన స్వప్నప్రపంచము నిద్రనుండి మేల్కొనగనే తాను దప్ప అన్య మేమియును లేదు ఈ యర్థమునే వేదాంత పంచదశి (13-101) యందును చెప్పబడెను

మనము స్వప్నము కనుచున్నపుడది యథార్థ మనియే భావింతుము అది యసత్యమని యనుకొనము మేలుకొన్నపుడది యసత్యమని యనుకొందుము అట్లే జాగ్రదవస్థనుండి మేలుకొనవలసి యున్నది ఆ మెలుకువనే తురీయ మని, తురాయాతీతమని, సిద్ధావస్థ యని చెప్పుదురు అట్టి వారికి మాత్రమే నామరూపాత్మక జగత్తు స్వప్నతుల్యముగ కనబడును

జ్ఞానముచేత నివర్తింపబడుచున్నది కనుక నామరూపాత్మక ప్రపంచము మిథ్య యను దాని యర్థము ప్రపంచము నశించునని కాదు తురీయావస్థయందు, లేక సమాధి యందు జగత్తు కనబడుట లేదుకదా? యను ప్రశ్న కలుగును, కాని జగత్తు ఆ సమయమున నశించినదని చెప్పరాదు సమాధినుండి లేచిన వెంటనే జగత్తు కనబడును. దీని కొక చక్కని దృష్టాంతమును చెప్పిరి దుందుభి (రణభేరి) ధ్వనికి సమీపమునందుండి వినువారికి ఇతర శబ్దము లేవియున్నను అవి యేవియు వినబడవు. దుందుభి ధ్వానము నిలిచిపోయినంతనే యితర శబ్దములు కూడ యథావిధిగ వినబడును ఇదిగాక సర్వమును బ్రహ్మముగా చూచు సిద్ధపురుషునకు సిద్ధావస్థయందు సహితము జగత్తు అదృశ్యము కానేరదు. మఱి యేమన అజ్ఞానదశలో అత డీజగత్తును చూచు దృక్పథమునకును, ఇప్పటి సిద్ధావస్థలోని దృక్పథమునకు భేదము కలదు అజ్ఞానదశయందు జగత్తు సత్యమనుకొని శబ్దాది విషయములయందు

ఆసక్తి కలిగియుండును. సిద్ధావస్థయందు దానికి వ్యతిరేకముగా నుండును అంతియే కాని వెలుతురు వచ్చిన వెంటనే త్రాటియందు కనబడిన పామువలె ప్రపంచము అదృశ్యము కాదు. అట్లే తక్కిన దృష్టాంతముల విషయముకూడ నూహించుకొనవలయును. ఈ విధముగా జగన్మిథ్యాత్వము చెప్పబడినది

మిథ్యాభూత మగు నీ జగత్తు బ్రహ్మమునం దే విధముగా కల్పింపబడెనో మనము విచారింప వలసియున్నది. ఇది మానవబుద్ధికి అసాధ్యమైన కార్యము అయినను బ్రహ్మమును తెలిసికొనవలెనన్నచో శ్రుతులు చెప్పిన విధము ననుసరించి యీశ్వర జీవ జగత్తులను నీ మూడింటిని గుఱించి తెలిసికొనిన బ్రహ్మమును తెలియవచ్చునని శ్రుతి చెప్పినందున (శ్వే 1-10) మొదట నీశ్వరవిచారము చేయవలసి యున్నది.

## (7) ఈశ్వర స్వరూపము

పరబ్రహ్మమందు సూక్ష్మరూపమున (అవ్యక్తముగా) నున్న మాయ, (కల్పారంభమున) సృష్టి యారంభ కాలమున కదలుటకు ప్రారంభించినది అట్లు ప్రారంభించుటయే అనగా ఆ యారంభదశనే యీశ్వరు డని చెప్పవచ్చును ఎప్పుడు బ్రహ్మమునందు మాయకు కదలిక కలిగినదో అప్పుడే విశ్వప్రవాహ మారంభమైనది. ముకుళించిన పద్మము రేకులు విప్పుకొని వికాసము నొందినట్లు కాలము, కర్మము , ప్రాణము, విశ్వము అను నివియన్నియు కలిసి ఒకటే ప్రవాహముగా విశ్వరూపమై తుదకాప్రవాహము ఎచ్చట ప్రారంభమయ్యెనో యచ్చటికే వచ్చి యింకిపోవుచున్నది. ఈ మొత్తమంతయును ఈశ్వరుడని చెప్పవచ్చును. ఈయన వ్యక్తికాడు త్రిమూర్తులలో ఒకడగు నీశ్వరుడును కాడు.

పైన చెప్పిన మాయ జగత్కల్పనము చేసిన విధమును అద్వైతు లిట్లు చెప్పియున్నారు. మాయ తన పింఛమును విప్పి బ్రహ్మమునందు జగత్కల్పనము చేయుటకు ప్రథమమున రెండు విధములైనది. (1) శుద్ధసత్త్వప్రధాన మగు మాయ. దీనినే విద్య యందురు. (2) మలినసత్త్వప్రధాన మగు మాయ. దీనినే అవిద్య యని యందురు. మాయయు, మాయ కధిష్ఠానమగు బ్రహ్మచైతన్యమును, మాయయందు ప్రతిఫలించిన చిత్తుయొక్క ఛాయయు -ఈ మూడును చేరి యీశ్వరుడు. అధిష్ఠాన మనగా : ఆధారమని యర్థము ఉదా : త్రాటిని చూచి భ్రాంతివశమున సర్ప మనుకొను నపుడు భ్రాంతిజన్యమగు

సర్వాకారమునకు నేయది యాధారమై యుండునో యట్టి బ్రహ్మము సర్వమునకు అధిష్ఠానము పైన చెప్పిన యీశ్వరుడే అద్వైతులు చెప్పు సగుణ బ్రహ్మము అనగా .- నిర్గుణబ్రహ్మము, మాయ - యీ రెండింటి యొక్క కలయిక యని చెప్పుదురు

శ్రీ శంకరులవా రిట్లు చెప్పిరి

శ్లో|| "మయాభాసో విశుద్ధాత్మా త్రయమేత న్మహేశ్వరః |
మాయాభాసోఽ ప్యవస్తుత్వాత్ ప్రత్యేకం నేశ్వరో భవేత్"|| (స్వాత్మ 39)

తా · మాయ, చిదాభాసుడు, పరిశుద్ధాత్మ - ఈ మూడును కలసి ఈశ్వరు డనబడును మాయయును, చిదాభాసుడును వాస్తవములు కాకపోవుట వలన నా రెండింటిలో నేదియును ఈశ్వర సంజ్ఞను పొందజాలదు

విద్యారణ్యులవారు ఈ క్రింది విధముగ చెప్పిరి

శ్లో|| మాయాధీన శ్చిదాభాస శ్శ్రుతో మాయీ మహేశ్వరః |
అంతర్యామీ చ సర్వజ్ఞో జగద్యోని స్స ఏవ హి. || (వే.పం 6-151)

తా · "మాయ యందు ప్రతిఫలించి మాయాధీనుడై మాయకు ఆధారుడైన చిదాభాసుడు ఈశ్వరుడు ఈ చిదాభాసుడే అంతర్యామి, సర్వజ్ఞుడు జగద్యోని" (వే పం. 6-157) ఇచ్చట కేవలము చిదాభాసుని మాత్రమే గైకొని మాయను దానికాధార మగు బ్రహ్మమును వదిలిరి "మాయీ సృజతి విశ్వల స్మ" (వే.పం 6-191) "ఆ మాయయే శరీరముగ (ఉపాధిగ) గల యీశ్వరుడు జగత్తును పుట్టించుచున్నాడు "అని చెప్పిరి

మఱియు మాయావిశిష్ట చైతన్యము ఈశ్వరుడనియు, మాయోపాధికుడు ఈశ్వరసాక్షి యనియు భేదము చెప్పబడెను ఉపాధియనగా "ఏవస్తువు స్వరూపమునందు ప్రవేశింపకయే వ్యావర్తకముగా* నుండునో దానిని ఉపాధియందురు. ఆ యుపాధిద్వారమున భిన్నతచేత నేది చూపబడునో

---

* వ్యావర్తకము = ఇతర పదార్థములకన్న భిన్నముచేసి, వస్తువు యొక్క స్వరూపము నేది చూపుచున్నదో దానిని వ్యావర్తక మందురు దానినే అవచ్ఛేదకము, పరిచ్ఛేదకము అనియు అందురు మఱియు ఇతర పదార్థములకన్న భిన్నము చేసి దేనిని చూపుచున్నదో, దానిని వ్యావర్త్యమందురు దానినే అవచ్ఛేద్యమనియు, పరిచ్ఛేద్యమనియు అందురు "

విచారసాగరము 142 విషయము

దానిని ఉపహిత మందురు." (వి.సా.), ఉదా : ఘటము (కుండ) పుట్టగనే దానియందుగల మహాకాశమును ఘటాకాశ మని వ్యవహరింతురు ఘటాకాశమునకు ఘటము ఉపాధి. ఘటము ఘటాకాశమున ప్రవేశము చేయకయే ఘటాకాశమును మహాకాశమునుండి వేరుచేసి చూపు చున్నది. అట్లే మాయ ఈశ్వరచైతన్యమున ప్రవేశింపక బ్రహ్మచైతన్యమునకంటె భిన్నతచేత చూపబడు చున్నందున మాయోపాధిగల చైతన్యమును ఈశ్వరసాక్షి యందురు. ఈశ్వరుడు మాయోపాధికు డనుటకు శ్రీ శంకరులవారి వాక్యములు

**శ్లో॥ అవిద్యోపాధికో జీవో మాయోపాధిక ఈశ్వరః ।**
**మాయాఽవిద్యా గుణాతీతః ఇతి వేదా స్త్రడిండిమః"** ॥ (వే.డిం. 30)

తా : అవిద్యోపాధికుడు జీవుడు, మాయోపాధికుడు ఈశ్వరుడు అవిద్యకును మాయకును ఈ రెండింటి గుణములకును అతీతమయినది బ్రహ్మము అని వేదాంతభేరి. మరియు "**ఈశ్వరశక్త్యుపాధిత్వాత్**" (తత్త్వోపదేశము 19) అని చెప్పిరి

ఇచ్చట మాయ యనగా విక్షేపశక్తితో కూడినది. అవరణశక్తి లేదు కనుక యీశ్వరునకు అజ్ఞానము లేదు ఈయన నిత్యనిరతిశయ జ్ఞానసంపన్నుడు

మాయావిశిష్ట చైతన్యము ఈశ్వరుడను మాటకు అర్థము = మాయ విశేషముగాగల బ్రహ్మము (చిత్తు) అని అర్థము

విశిష్టమనగా విశేషము ఉదా . నీలఘటము (నల్లకుండ) ఇచ్చట నీలత్వము ఘటమునకు విశేషము. ఘటము విశేష్యము. ఘటస్వరూపమునందే నీలత్వము కలదని యర్థము. నీలత్వము వలన ఘటము ఇతర శ్వేతపీతాది ఘటములనుండి వేరుచేయబడినది మాయావిశిష్ట చైతన్యము ఈశ్వరుడనగా= మాయ చైతన్యమునందు ప్రవేశించుటవలన బ్రహ్మచైతన్యము నుండి యీశ్వరచైతన్యము భిన్నతచే చూపబడినదని యర్థము అందువలన ఈశ్వరుడు మాయ విశేషముగా గల (విశిష్టమైన) బ్రహ్మచైతన్యమని అర్థము. శ్రీ శంకర, శ్రీ విద్యారణ్యులు మొదలగు ఆభాసవాదులు ఈశ్వరుడు మాయోపాధికుడని చెప్పినపుడు, ఆభాసునకు మాయ యుపాధిగనుక మాయోపాధికుడని చెప్పిరి

ఇచ్చట అభాస మనునపుడు ఛాయ యనియేగాని ప్రతిబింబము కాదు ఛాయ, ప్రతిబింబము - ఈ రెండును ఒకటి కావు. భిన్నములు శ్రీ శంకర,

శ్రీ విద్యారణ్యులవారి గ్రంథములకు తెనుగున టీకలు వ్రాసిన పండితులు 'ఛాయ' లేక 'అభాస' శబ్దములకు 'ప్రతిబింబము' అని కొన్ని చోట్ల అర్థమును వ్రాసియున్నారు. అయినను అది తప్పుగాదు రూపముగల పదార్థములయొక్క ఛాయకును, ప్రతిబింబమునకును భేదముండును గాని రూపము లేని వాటికి భేదముండదు.

జి : నాకు సంశయము కలుగుచున్నది రూపము గల వస్తువునకే ఛాయయు, ప్రతిబింబమును కలుగును గాని రూపములేని పరబ్రహ్మమునకు ఛాయగాని, ప్రతిబింబము గాని కలుగుననుట యెట్లు సరియగును?

వే : ఈ ప్రశ్న శ్రీరామానుజాచార్యుల నుండియు తఱచుగ వినబడుచున్నదే రూపములేని దానికి కూడ ప్రతిబింబము కలదు ఒకానొక చోట మన మేదైన పలికినచో మఱల నదేవిధముగా మారు పలుకుట విందుము దీని పలుకురాయి యందురు. అంతకంటెను సులభముగా తెలిసికొనుటకు ప్రకృతకాలమున సాధనము లేర్పడినవి. గ్రామ ఫోనుప్లేటు త్రిప్పినచో పాట వినిపించుచున్నది ఆ పాట మునుపు పాడినవారి పాటయొక్క ప్రతిబింబము. అది శబ్దముయొక్క ప్రతిబింబము. శబ్దమునకు రూపము లేదు కదా! అది నేత్రేంద్రియమునకు దృశ్యము కాదు కదా! దానికి ప్రతిబింబ మేర్పడినది కదా! అట్లే యేవస్తువునకు తగిన ప్రతిబింబము ఆ వస్తువున కుండును. దేనికి దగిన యుపాధి దానికుండును రూపరహితుడగు పరమాత్మకు రూపములేని ప్రతిబింబమే యుండును

ఈశ్వరుడు నిత్యనిరతిశయ జ్ఞానశక్త్యుపాధి కలవాడు. ఇతనినే అంతర్యామి యనియు, సూత్రాత్మ యనియు యందురు ఈయన సర్వజ్ఞుడు, సర్వశక్తుడు, సర్వవ్యాపి, సర్వమయుడు. ఈయనను శబలబ్రహ్మమనియు మాయా శబలుడనియు నందురు అధర్మము ప్రపంచమున వృద్ధిపొందినపుడు ధర్మమునకు గ్లాని కలిగినపుడు, ఆత్మమాయచే యుగయుగముల యం దవతరించి, అధర్మము నణచి ధర్మమును స్థాపించువా డీయనయే (గీత- 4-7, 8) యజ్ఞముల యందుండి హవిస్సును తీసికొనువాడును, జీవుల కర్మముల ననుసరించి వారికి ఫలము నిచ్చువాడును, సమస్తలోక నియామకుడును (గీత - 529), సర్వభూతముల హృదయముల యందును ప్రేరకుడై యుండువా డీయనయే.

మానవుడు ముక్తుడై సర్వమును బ్రహ్మమయముగా చూచునపుడు జీవేశ్వర భేదముకాని, జగత్తులోని నానాత్వముగాని నిలువజాలదు. కొందఱు పెద్ద లీశ్వరుని నుపాసనకొఱకు కల్పింపబడినవాడని చెప్పుదురు. ఎంతవరకు జగత్తు తోచునో యంతవరకు మాత్రమే యాయనకు నిత్యత్వము కలదనియు, రజ్జువునందు సర్పము తోచి భ్రాంతి నశించినంతనే సర్పము లేనియ ట్లీయనకూడ మిథ్యయే యని యందురు. ఏది యెట్లయినను ఈశ్వరోపాసనవలన జీవులు బ్రహ్మజ్ఞానమును పొంది సంసారబంధమునుండి ముక్తులై యవిద్యోపాధి రహితులై కైవల్యమును పొందుదురు.

ఈశ్వరుని యందుండి "సూత్రాత్మ" లేక హిరణ్యగర్భుడు కలిగెను. కలిగెననగా ఈశ్వరుడే హిరణ్యగర్భుడాయెనని చెప్పవచ్చును. అట్లే అయన యందుండి 'విరాట్టు' కలిగెను (విరాట్టుగా మారెను). ఈశ్వరునియందు సమస్తవిశ్వము బీజప్రాయమై యుండును. అనగా విత్తనములు చల్లిన తోటవలె నుండును. ఇది ప్రళయము సూత్రాత్మ లేక హిరణ్యగర్భునియందు విశ్వము అంకురము లెత్తిన తోటవలె నుండును. ఇది సృష్టి ప్రారంభ దశ. పండిన తోటవలె విశ్వము 'విరాట్టు' నందు స్పష్టమై యుండును. అనగా విశ్వము యొక్క పూర్ణస్థితి. తోటకూర పైరు వేయుటకు ముందు విత్తనముల యందును, ఆ తర్వాత పైరై విత్తనములతో నిండిన తోటవలెను నుండును. ఈ మూడుదశలవలెనే అవిద్యాకల్పిత జీవునియందుకూడ మూడు దశలు కనబడుచున్నవి.

## (8) జీవస్వరూపము - భిన్నమతములు

జీవుని గుఱించి వేదాంత గ్రంథములయందు అనేకు లనేక విధముల చెప్పియున్నారు. ఇతర సంప్రదాయముల మాట యట్లుండ ఒక్క యద్వైత సంప్రదాయమునందే భిన్నాభిప్రాయములు గలవు. శంకరుల వారిట్లు చెప్పిరి

శ్లో|| **అధిష్ఠానం చిదాభాసో బుద్ధి రేతత్త్రయం యదా |**
**అజ్ఞానా దేకవద్ భాతి జీవ ఇత్యుచ్యతే తదా ||** (స్వాత్మ. 36)

తా . అధిష్ఠానమగు కూటస్థుడు, చిదాభాసుడు, బుద్ధి - యీ మూడును అజ్ఞానమువలన ఒకటిగ తోచినప్పుడు జీవసంజ్ఞ కలుగుచున్నది

కూటస్థుడు నిర్వికారు డగుటవలన జీవుడు కాడు. చిదాభాసుడు మిథ్య యగుటవలన జీవుడు కాడు (స్వాత్మ 37)

పైన చెప్పిన మూడింటిలో నే యొక్కటియు వేఱు వేఱుగ జీవుడని చెప్పబడదు బుద్ధి జడము, పై మూడును కలిసియే జీవు డనబడును. (స్వాత్మ. 38)

మఱియు పై మూడింటిలో నే రెండును జీవు డనబడదు

విద్యారణ్యులవా రిట్లు చెప్పిరి.

శ్లో॥ చైతన్యం య దధిష్ఠానం లింగ దేహశ్చ యః పునః ।

చిచ్ఛాయా లింగ దేహస్థా తత్సంఘో జీవ ఉచ్యతే ॥ (వే.పం 4-11)

తా : లింగదేహము మొదలగు కల్పనల కన్నింటికిని అధిష్ఠానమగు కూటస్థ చైతన్యము, లింగదేహము (లేక అజ్ఞానాంశము), దానియం దున్న చిదాభాసుడును - ఈ మూడును చేరి జీవుడు అని చెప్పబడును మఱియు,

బ్రహ్మమే శరీరమునందు ప్రవేశించి జీవరూపుడాయె ననియును, ప్రాణాదులను ప్రేరేపించువా డగుటవలన జీవుడనుపేరు కలిగె ననియు (వే పం. 4-10), ఒక్క ఆత్మయే శరీరాదులు తాననుకొనుట వలన జీవభావము కలిగెననియు (వే. పం. 14-6) చెప్పిరి.

శ్రీశంకర శ్రీవిద్యారణ్యులు చెప్పిన విషయాలలో పరస్పర భేదమేమియును లేదు. బుద్ధియన్నను లింగ దేహ మన్నను నీ రెండును అవిద్యా పరిణామములే కనుక అభేదము. శ్రీ శంకరుల వారు అవిద్యోపాధికుడు జీవుడని అనేక గ్రంథములందు చెప్పియున్నారు. శ్రీ శంకర శ్రీ విద్యారణ్యుల మతమునకు ఆభాసవాద మని పేరు

వేదాంత పంచదశియందు, బ్రహ్మమే శరీరమునందు ప్రవేశించి జీవరూపు డాయెననియు, ప్రాణాదులను ప్రేరేపించు వాడగుటవలన జీవుడను పేరు కలిగెననియు (4-10), ఒక్క ఆత్మయే శరీరాదులు తాననుకొనుటవలన జీవభావము కలిగెననియు (14-6) చెప్పిరి

ఆభాసవాదము సరికాదని ప్రతిబింబవాదులు చెప్పుదురు "అజ్ఞాన రూపోపాధివలన బ్రహ్మచైతన్యమే బింబస్థానమందు ఈశ్వరభావముచేతను, ప్రతిబింబస్థానమందు జీవభావముచేతను వ్యవహార దశయందు తోచుచున్నది విచార దృష్టిచే చూచిన జీవేశ్వర భేదమే లేదు. మఱియొక పక్షమున బింబమగు ఈశ్వరుడు సత్యము కనుక ప్రతిబింబమగు నీశ్వరుడును సత్యమే."

"అజ్ఞానోపాధివలన ఒక్క జీవుడే ప్రపంచమును, అనంత జీవులును నున్నట్లు కల్పించుకొనుచున్నాడు. అజ్ఞాన నివృత్తి అయిన యెడల సమస్తమును

మిథ్యగా తోచును అజ్ఞానోపాధినివృత్తివలన ప్రతిబింబమునకు బింబమునందు ఐక్యము సిద్ధించును ఎట్లనగా, స్వప్నమునందు తానొక్కడేయై యుండియు స్వప్నప్రపంచమును, అందు జీవులను ఉన్నట్లు ఏ విధముగ కల్పించుకొనుచున్నాడో, మేల్కొనిన పిమ్మట స్వప్నప్రపంచము ఎట్లు మిథ్యయగునో, ఆ విధముగానని స్వప్నదృష్టాంతమును చెప్పుదురు జాగ్రదవస్థయందు అతడు కల్పించుకొన్న జీవులు జీవాభాసులు మాత్రమే; జీవులు కారు." ఇది యేకజీవవాదము.

ఆభాస ప్రతిబింబవాదముల యందు దోషము కలదని అవచ్ఛేదవాదులగు వాచస్పతి మొదలగువారు వేఱొక విధముగ చెప్పుదురు వారి మతమిట్లుండును.

"అజ్ఞానము ఒకటి కాదు. అనంతములు. అనంత జీవులు, ఆ యా యజ్ఞానములకు ఆశ్రయమైన ఒక్కొక్క జీవుడు, ఒక ప్రపంచము కలదని, యీ ప్రపంచమునకు నియామకు డగు నీశ్వరుడు కలడని అందురు - ఇట్లు అనంత జీవులచే కల్పితములైన అనంత బ్రహ్మాండములు, అనంతేశ్వరులు కలరని వీరి మతము. ఏ జీవునకు అజ్ఞానము నశించునో అట్టివానికి మాత్రమే తాను కల్పించుకొన్న ఈశ్వరుడును బ్రహ్మాండమును మిథ్యయని తోచి తనకును బ్రహ్మమునకును అభేదభావము సిద్ధించి ముక్తుడగును"

## (9) జీవేశ్వరుల మూడవస్థలు

ఈశ్వరునికివలెనే జీవునియందును మూడు దశలు కలవు. ప్రాజ్ఞ డను పేరుగల జీవుడు కారణ శరీరాభిమాని ఇది వ్యష్టి వీనియొక్క సమష్టిరూపము పైన చెప్పిన ఈశ్వరుడు (అంతర్యామి) ఈ కారణశరీరమందు స్థూల సూక్ష్మ దేహములు రెండును ఇమిడియున్నవి బీజరూపములో నున్నవి ఇతనియందుండి "తైజసుడు" కలిగెను లేక తైజసుడుగా మారెను. ఇతడు సూక్ష్మశరీరాభిమాని విత్తనము నుండి అప్పుడే పుట్టిన మొలకవంటివాడు వీనియొక్క సమష్టి హిరణ్యగర్భుడు. ఈశ్వరునియం దీయన ప్రథమమున సృష్టింపబడెను (మాండూ 1-1). తైజసునియందుండి "విశ్వుడు" కలిగెను ఇతనికి "వైశ్వానరుడ"ని కూడ పేరు స్థూలదేహాభిమాని పండిన మొక్కవంటివాడు. వీని సమష్టి విరాట్టు. ఈ మూడును క్రమముగా సుషుప్తి స్వప్నము జాగ్రత్త యను మూడవస్థల యందుండునవి ఈ విషయము సువ్యక్తమగుటకు పటమును పరిశీలించునది.

## జీవేశ్వరుల త్రివిధావస్థలు
## ఓమ్ (ఓం)
## పరబ్రహ్మము (ఆత్మ) తురీయపాదము

| మలినసత్త్వ ప్రధానమగు మాయ | శుద్ధత్వ ప్రధానమగు మాయ |
|---|---|
| ↓ | ↓ |
| జీవుడు (వ్యష్టి) | (సమష్టి) ఈశ్వరుడు |
| 1. ప్రాజ్ఞుడు<br>తృతీయపాదము<br>మకారము<br>సుషుప్తి<br>కారణశరీరాభిమాని<br>↓ | 1. అంతర్యామి<br>తృతీయపాదము<br>మకారము<br>ప్రళయము<br>సమష్టికారణ శరీరాభిమాని<br>↓ |
| 2. తైజసుడు<br>ద్వితీయపాదము<br>ఉకారము<br>స్వప్నావస్థ<br>సూక్ష్మశరీరాభిమాని<br>↓ | 2. సూత్రాత్మ (హిరణ్యగర్భుడు)<br>ద్వితీయపాదము<br>ఉకారము<br>సృష్టి ఆరంభము<br>సమష్టి సూక్ష్మశరీరాభిమాని<br>↓ |
| 3. విశ్వుడు(వైశ్వానరుడు)<br>ప్రథమపాదము<br>అకారము<br>జాగ్రదవస్థ<br>స్థూలశరీరాభిమాని | 3. విరాట్టు<br>ప్రథమపాదము<br>అకారము<br>జగత్తుయొక్క సంపూర్ణవికాసము<br>సమషి స్థూలశరీరాభిమాని |

ఇందు మొదట బ్రహ్మము ఆపైన ''ఓమ్'' (ఓం) అను ప్రణవాక్షరము గలదు మాండూక్యోపనిషత్తు ననుసరించి సర్వమును ఓమ్‌కారము యొక్క వ్యాఖ్యానమే గనుక భూత భవిష్యత్ వర్తమానములను కాలాతీతమును ఓమ్‌కారమే (మాండూ 1 నుండి 6 మం బ్రహ్మమునకు `ఓమ్' అను నామకరణము నిచ్చినందున ప్రథమ,

## (10) చిత్రపట దృష్టాంతము

చిత్రపట మనగా చిత్తరువు లిఖించబడిన వస్త్ర మని యర్థము విద్యారణ్యస్వాములువారు బ్రహ్మము జగద్రూపముగా తోచుట నీ క్రింది విధముగా వర్ణించిరి. ఒక తెల్లని (శుభ్ర) వస్త్రము కలదనుకొందము. చిత్రకారుడు దానియందు చిత్తరువును వ్రాయదలచి గుడ్డను గట్టిచేయుటకు గంజి పెట్టును అప్పుడు దానిని ఘటిత వస్త్రమందురు. దానిపైన పర్వతములు , నదులు, పల్లెలు, మనుష్యులు మొదలగునవి యెచ్చ టెచ్చట చిత్రింపవలయునో ఆయా భాగములయందు తదనుగుణమైన రంగులను రేఖామాత్రముగా గుర్తుంచుటకు పూయును (ఇచట నదులు, పర్వతములు మొదలగు నాకారములు సరిగా కనబడవు). దీనిని లాంఛిత వస్త్రమందురు తర్వాత చిత్రకారుడు తాను వేసికొన్న గుర్తుల ప్రకారమే యేయాకృతులను నేయేరంగులతో పూర్తిచేయవలయునో ఆ విధముగా పూర్తిచేసిన వస్త్రమునకు రంజిత వస్త్ర మందురు ఇట్లు వస్త్రము నాల్గువిధము లైనది ముందు చెప్పినట్లు మాయారహితమైన బ్రహ్మము (చిత్తు) శుభ్రవస్త్రము అంతర్యామి ఘటితవస్త్రము సూత్రాత్మ లాంఛితవస్త్రము, విరాట్టు రంజిత వస్త్రముగా నొప్పుచున్నవి

(వే పం 6-1, 2, 3, 4 )

---

ద్వితీయ, తృతీయ పాదములకు క్రమముగ అ - ఉ - మ అను అక్షరములను తురీయమునకు అర్థానుస్వారమును నియ్యబడినది

పటముయొక్క ఎడమ ప్రక్కన సుషుప్తి, స్వప్న, జాగ్రదవస్థాత్రయముగను, కారణ, సూక్ష్మ, స్థూలదేహములను, వాటినభిమానించు ప్రాజ్ఞ, తైజస, విశ్వులను చూపితిని ప్రాజ్ఞుని నుండి తైజసుడు, అతని నుండి విశ్వుడును; బీజమునుండి అంకురమును, అందుండి పండినమొక్కయును, కలుగునట్లు విశ్వము పరబ్రహ్మమునుండి కలిగిన దనుటచే ప్రాజ్ఞ, తైజస, విశ్వులకు క్రమమున 1-2-3 అను సంఖ్యలను గుర్తులు కలవు ఇదేవిధముగ జీవుల సమష్టి యగు ఈశ్వరకోటియందు కుడిప్రక్కన అంతర్యామి, హిరణ్యగర్భ, విరాట్టులను; వారి అవస్థలను; కారణ సూక్ష్మ స్థూలాది సమష్టి శరీరములను; ప్రళయ సర్గ స్థితులను పైన జీవులకు చెప్పిన విధముగనే యర్థము చేసికొనవలయును

ఇది ఒకవిధముగు సృష్టిక్రమమును తెలియజేయుచున్నది రాత్రియును, ఉషస్సును, పగలును కలిగినట్లు తెలియజేయు సృష్టిక్రమమును వ్యక్తము చేయుచున్నది

## (11) ఆకాశ దృష్టాంతము

విద్యారణ్యులవారు ఆకాశ దృష్టాంతముచేత బ్రహ్మమును నాలుగు విధములుగా వివరించిరి ఎట్లనగా -

**1. మహాకాశము** : ఇది సర్వగతమైనది బ్రహ్మమును దీనితో పోల్చిరి

**2. ఘటాకాశము** : మహాకాశమే కుండయందున్నప్పుడు ఘటాకాశమని వ్యవహరింపబడెను కూటస్థుని*దీనితో పోల్చిరి

**3. జలాకాశము** : ఒక కుండ నీటిచేత నింపబడెను ఆ కుండయందున్న నీటి పై భాగమున మేఘనక్షత్ర సహితాకాశము ప్రతిఫలించెను ఆ ప్రతిబింబమే జలాకాశము** పైన చెప్పిన కూటస్థ చైతన్యమునందు కల్పింపబడిన బుద్ధియందు (అంతఃకరణమునందు) ప్రతిఫలించిన కూటస్థ ప్రతిబింబమే చిదాభాసుడు, ఈ చిదాభాసుని జలాకాశముతో పోల్చిరి

**4. మేఘాకాశము** : ఆకాశమునందున్న మేఘమునందు జలము కలదు అనగా సూక్ష్మములగు జలకణముల సముదాయము మేఘము దానియందు ప్రతిఫలించిన ఆకాశము మేఘాకాశము మేఘాకాశము మనకు కనబడకపోయినను నీటికిగల స్వభావము దాని యెదుటనున్న యాకారమును ప్రతిఫలింప జేసికొనుటయే కనుక అట్టి స్వభావానుసారము మేఘజలమునందు ఆకాశ ప్రతిబింబము కలదని నమ్మవచ్చును ఈశ్వరుని మేఘాకాశముతో పోల్చిరి, ఇట్లు ఒక్క ఆకాశమే మహాకాశ, ఘటాకాశ, జలాకాశ, మేఘాకాశము లని వ్యవహరింపబడినట్లు సర్వగతమైన పరబ్రహ్మమే ఉపాధిభేదముల ననుసరించి బ్రహ్మ, కూటస్థ, చిదాభాస, ఈశ్వర నామములచే ప్రసిద్ధమైనది (వే పం 6-18, 19, 20, 21),

---

* కూటమనగా డాగలి (యినుపమొద్దు) స్వర్ణకారుడు వెండి బంగారు సొమ్ములను డాగలిమీద చేయును అట్లు చేయబడు ఆభరణముల రూపనామములు మారుచున్నను నీ యినుప దిమ్మె మారక నిర్వికారమై యుండును కనుక దానికి కూటమని పేరు కలిగెను అట్లె నిర్వికారుడగు ఆత్మకు కూటస్థు డను పేరు కలిగెను

** నిశ్చలదాసుగారి విచారసాగరమున "ఆకాశ ప్రతిబింబము మఱియు ఘటాకాశము, ఈ రెండును కూడి జలాకాశ మందురు" అని వ్రాసిరి ఆ పుటయొక్క అడుగున (Foot note నందు) "ఆకాశము యొక్క ప్రతిబింబము చెప్పుటవలన ఘటస్థితమైన జలసహిత ప్రతిబింబము యొక్క గ్రహణము కలదు" అని వ్రాసిరి

## (12) ఈశ్వరాస్తిత్వ లక్షణములు

జి : జీవుల యొక్క సమష్టి యీశ్వరుడని చెప్పితిరి గదా? ఈశ్వరుడు విత్తనములు చల్లిన తోటకూర చేను వంటివాడని చెప్పితిరి ఈ దృష్టాంతమును బట్టి జీవులరాశి (సమష్టి) యే యీశ్వరుడైనచో ఈశ్వరుడు జగత్తును సృజించు టెట్లు? ఇట్టి సంశయము లనేకములు కలుగును అందువలన నీశ్వరాస్తిత్వమును గుఱించి సంశయింపవలసి వచ్చును గదా?

వే : అద్వైతసిద్ధాంతమున నట్లే యున్నది కాని దృష్టాంతమునందు గల అర్థ మదిగాదు సమష్టి యనగా అనేకము నందుగల ఏకత్వమని యర్థము ఈశ్వరుడు తోటకూర గింజల రాశివంటివాడు కాడు బాగుగా పండిన తోటకూర వెన్నుతో ఈశ్వరుని పోల్చవచ్చును లేదా సీతాఫలముతోను, దానిమ్మపండుతోను, మఱిపండుతోను పోల్చవచ్చును అందలి బీజములను జీవులతో పోల్చవచ్చును. సీతా ఫలము, మఱిపండు మొదలగు వాటియందలి బీజములకు ఫలమే ఆధారమై బీజములను పోషించి రక్షించునదై యున్నందున బీజముల సమష్టిని ఈశ్వరునితో పోల్చియుండ వచ్చును అంతమాత్రముచేత ఈశ్వరుడు కేవల కల్పితుడని చెప్పుటకు వీలులేదు ఈశ్వరాస్తిత్వమును ప్రత్యక్షానుమాన ప్రమాణములచేత నిరూపింపజాలము శ్రుతి ప్రమాణమే ఆధారము శ్రుతిని వినిన మహర్షులు అతీంద్రియ జ్ఞానసంపన్ను లగుటవలన వారి అంతర్దృష్టిచే నీశ్వరాస్తిత్వములు తెలిసికొనగలిగిరి

మనము తర్కముచేతను, హేతువాదము చేతను ఈశ్వరాస్తిత్వమును స్థాపించలేక పోయినను నిర్గుణబ్రహ్మమునకును, జీవజగత్తులకును అవినాభావ సంబంధము కలిగి జగత్తును పాలించుకర్త యొకడున్నాడని మన అనుభవము వలన విదితమగుచున్నది జగత్తు సర్వశక్తిగల యొకానొకని యాజ్ఞచే నడుపబడుచున్నదని అనుమానముచేతను,శ్రుతివలనను నిశ్చయింపబడుచున్నది ఎట్లన భూజలాగ్ని వాయ్వాకాశములు క్రమముగ నొక దానికంటె నొకటి ఉత్తరోత్తర సూక్ష్మమును శక్తిమంతమును వ్యాప్తిమంతములై యున్నవి అధికశక్తిగల భూతము దానికంటె అల్ప శక్తిగల భూతమును నశింపజేయక అల్పభూతమును పరిశుద్ధ మొనర్చుచున్నది. ఒక మట్టిపెళ్ల నీటిలోవేసినచో కరిగిపోవును. దీపము గాలిలో నుంచిన ఆఱిపోవును. భూమి మాలిన్య మయినపుడు నీటిచేత నిర్మల మగుచున్నది. చెడ్డనీటిని సూర్యకిరణములు

ఆవిరిగా మార్చి పరిశుభ్ర మొనర్చుచున్నవి అగ్నియందలి ధూమాది మాలిన్యమును వాయువు పోగొట్టుచున్నది దుర్గంధమైన వాయువును ఆకాశము శుభ్రపఱచుచున్నది దీనిని చూడగా మనకొక విషయము జ్ఞాపకమునకు వచ్చును అద్భుత తపోధనులగు మునుల ఆశ్రమములందు పులులు - లేళ్లు, పిల్లులు - ఎలుకలు అన్యోన్య స్నేహ భావమున తిరుగుచుండినట్లు పురాణములయందు చదివియున్నాము దీనికి కారణము ఆ మునియొక్క తపశ్శక్తియే కదా! అట్లే జగద్వ్యాపారమునకును ఒకానొక నియామకుడు, లేక శాసనము కలదని మన మూహించుకొనుచున్నాము

ఇదిగాక బాహ్యజగత్తునందు కనబడు కొన్ని శుభాశుభ నిమిత్తములు (శకునములు), అంతరమునందు కలుగు కొన్ని శుభాశుభ స్వప్నములు ఈశ్వర ప్రేరితములై యున్నవనుట తప్పుకాదు ఒక రాజ్యమును పాలించు నిరంకుశుడైన రాజును ఆ రాజ్యమునందలి ప్రజలలో కొందఱు చూడకపోయినను వారి నిత్యజీవితమునందు రాజశాసనములు అమలు జరుగుచుండుట వా రెఱుగుటచే రాజు కలడని విశ్వసింతురు అట్లే యీశ్వరకర్తృత్వము లగు వ్యాపారములచే మన మాయనను తెలిసికొనుచున్నాము వ్యక్తావ్యక్త రూపమగు జగత్తునకు ఆయన కర్తయగుటచే ఆయన పూర్ణముగా కాక పోయినను, కొంతవఱకైనను మనకు బుద్ధి గమ్యుడే

ఈశ్వరుడు జగత్తును సృష్టించెనని చెప్పుట, యీశ్వరుడు జగద్రూపు డయ్యెనని యర్థము. ఆయన సృష్టిని ఉపసంహరించె నని చెప్పుట (ప్రళయము చేసెనని) ఉపసంహృత జగత్స్వరూపు డాయెనని యర్థము అనగా ఆయనకు జగత్తు యొక్క సృష్టిలయములతో ఒక విధమగు సంబంధము కలదు ఆయన నిర్గుణబ్రహ్మమువలె ప్రజ్ఞాన ఘనస్వరూపుడు కాడు ఈయనకు సూక్ష్మమును సాత్త్వికమును పరిశుద్ధమును నగు శరీరము కలదని మన మూహింపవచ్చును. ఏలయన నీయనకు వ్యక్తికిగల సంకల్పమువంటి సంకల్పము కలదు. "**ఆత్మావా ఇద మేక ఏవాగ్ర ఆసీత్ నాన్యత్కించ్పదమిషత్ స ఈక్షతలోకాన్ను సృజా ఇతి**" (ఐత. 1-1-1)

సృష్టికి పూర్వము ఒకే ఆత్మతప్ప మఱేదియు లేదు; అయాత్మ లోకమును సృష్టింపవలయునని యాలోచించెను - ఈ మొదలగు శ్రుతి వాక్యములవలన చెప్పవచ్చును. "పరమేశ్వరునకు నుపాసకుల యనుగ్రహార్థ మిచ్చవలన

మాయామయమగు రూపముండవచ్చునని చెప్పుచున్నారము " (అం సూ.భా 1-1-20) అని శంకరులవారు చెప్పిరి. **తంతువులకు ఊర్ణనాభి** (సాలెపురుగు) యెట్లో అట్లే జగత్తునకు ఈశ్వరు డుపాదాన కారణమును, నిమిత్తకారణమునై యున్నాడు * సర్వశక్తి గనుక యెట్లయినను ఉపాదానకారణము లేకనే సృష్టించగలడు

కొందఱు యోగులును, మునులు, ఆకాశమునుండి కొన్ని పదార్థములను సృష్టించుటను మన మెఱుగుదుము సూ|| **'దేవాదివదపి లోకే'** (బ్ర సూ 2-1-25) సూత్రభాష్యమున శంకరులవారు ఈ విషయమును వివరించిరి ఈశ్వరునికి సృష్టి, స్థితిలయములవలన ప్రయోజన మేమియు లేదు. అది యొక లీల మాత్రమే సూ|| **'లోకవత్తు లీలాకైవల్యం,'** (బ్ర సూ 2-1-33) సూత్రభాష్యమున నిట్లున్నది లోకమున రాజునకు క్రీడలయందు ప్రవృత్తివలెనే ఈశ్వరునికి సృష్టి కేవలము లీలామాత్రమే ఈశ్వరుడు సర్వజ్ఞుడని శ్రుతి చెప్పుటవలన ఇది యున్మత్తప్రవృత్తి కాదనియు మానవ బుద్ధికి సృష్టిరచన మహాప్రయత్న సాధ్యమైనట్లు కనబడినను, సర్వశక్తికి ఇది సంకల్పమాత్ర మనియును చెప్పిరి లీల యనుటకంటె మనము బాహ్య ప్రయోజనము నపేక్షింపకయే ఉచ్ఛ్వాస నిశ్వాసములను చేయునట్లు అది అతని సహజప్రవృత్తియని చెప్పుటయే సమంజసమగును

వాస్తవమునకు సృష్టియనునది యొకటి లేదు ఒకానొక వస్తువునకు సంకోచము (ముడుచుకొనుట), వ్యాకోచము (విస్తరించుట)- యనునవి రెండును ఆవస్తువుయొక్క ఉత్పత్తి, నాశనము లెట్లుకావో, అట్లే జగత్తుయొక్క సృష్టి సంహారములు (సర్గప్రళయములు) రెండును ఆయన స్థూలసూక్ష్మ రూపములని చెప్పవచ్చును అందువలన ఈశ్వరుడు పుట్టుక, నాశనము లేనివాడని చెప్పిరి ఈశ్వరుడు లేడన్నచో ప్రపంచము, మాయ, జీవులు వీరు సహితము లేరని చెప్పవలెను. ఇట్లు చెప్పుటవలన నీశ్వరుడు నిర్గుణ బ్రహ్మము వలె నిర్వికార, నిత్య, సత్య స్వరూపుడని చెప్పుట కాదు ఇంత మాత్రముచేత అద్వైతమునకు బాధ కలుగదు జీవులు ప్రళయమునందు వారివారి కర్మఫలములతోను

* అద్వైతులయందు భిన్నమతములు గలవు యాదవ ప్రకాశుల మతము పరిణామవాదము సన్మాత్రరూపమైన పరబ్రహ్మమే చిత్తు, జడము, ఈశ్వరుడు అను మూడువిధములుగా పరిణమించును ఈశ్వరుడనగా సర్వనియంత యైన పరమ చేతను డని చెప్పుదురు.

వాసనలతోను ప్రకృతితో కలిసి ఈశ్వరునియందు లీనమై యుందురు మరల కల్పారంభమున వారివారికి అనుగుణములైన జన్మల నెత్తుచుందురు సృష్టియు, జీవులు, వారికర్మలు, కాలము - ఇవియన్నియు అనాదులు సృష్టిస్థితిలయములు ఈశ్వరునకు అవస్థలవంటివే సృష్టికి ఆది లేదు కల్పమునకే ఆదికలదు

జి : పరబ్రహ్మముయొక్క సాన్నిధ్యమున ప్రకృతియే జగదుత్పత్తి స్థితి లయములను చేయగలదు గదా? ఈశ్వరకల్పనముతో అవసర మేమి?

వే : కేవల నిర్గుణ బ్రహ్మ సాంగత్యమాత్రమున ప్రకృతి యీ విధముగా విశ్వరచన చేయజాలదు ప్రకృతి జడము, పరబ్రహ్మము నిష్క్రియుడు, వీరివలన సృష్టి జరుగదు కనుక ఈశ్వరుని అంగీకరింపవలసి వచ్చెను అట్లుగాక శుద్ధ చైతన్యముతో ప్రకృతికి సమానస్థాన మిచ్చిన, ద్వైత మంగీకరించి నట్లగును ఇది శ్రుతులకు విరోధము కనుక, ఈశ్వరాస్తిత్వము నంగీకరింపవలయును సర్వజ్ఞుడును సర్వశక్తియుతుడును నగు ఈశ్వరునకు మాత్రమే యీ నానాత్వముతో కూడి నట్టిదియు, ఒక క్రమబద్ధ మైనట్టిదియు నగు నీసుందర విశ్వశిల్పము చేయ సాధ్యమగును చేయుట అనగా మానవుడు చేయునట్టి కర్మవంటికర్మ ఈశ్వరునకు లేదు ఆయనకు అన్యసహాయము గాని సాధనలు గాని అక్కఱలేదు ఈశ్వరుడే సమస్తమునుగా మారగలడు మానవుని శరీరమున సాక్షిచైతన్యముండినను జీవునితో (బుద్ధి వృత్తులతో కలిసిన చిదాభాసునితో) నెట్లవసరమో, బ్రహ్మాండమునందు ఈశ్వరునితో అట్లవసరము

బ్రహ్మైవ స్వశక్తి ప్రకృత్యాఽభిధేయ మాశ్రిత్య లోకాఽ
సృష్ట్వా ప్రవిశ్యాన్తర్యామిత్వేన బ్రహ్మాదీనాం
బుద్ధీన్ద్రియ నియంతృత్వా దీశ్వరః. (నిరాలంబోపనిషత్తు)

తా బ్రహ్మమే స్వశక్తియగు ప్రకృతిచేత లోకములను సృష్టించి అందు అంతర్యామియై ప్రవేశించి బ్రహ్మాదులయొక్క బుద్ధ్యాది ఇంద్రియములకు నియామకుడై యుండుటవలన ఈశ్వరుడగుచున్నాడు సగుణబ్రహ్మమే స్థూలసృష్టి చేయునపుడు చతుర్ముఖ బ్రహ్మయనియు సృష్టిని పోషించునపుడు విష్ణువనియు, ప్రళయకాలమున శివుడనియు వ్యవహరింపబడెను

. కొందఱు ఈ త్రిమూర్తులు ముమ్వురును పైన చెప్పిన యీశ్వరునివలన కలిగినవారని చెప్పుదురు

ఇదిగాక ప్రళయమునందు జీవులయొక్క వారి వారి కర్మఫలము వారికి భోగము నియ్యక నిలిపివేయుటయును తిరిగి సృష్టి యారంభమునందు పూర్వకల్పమునందలి వారి వారి కర్మానుసారము వారివారి కర్మఫల భోగయోగ్యమగు జన్మలు కలుగుటయు అను ఈ మహాయంత్రము నడుపవలసిన చేతను డొకడుండవలెను జడప్రకృతివలన గాని నిర్గుణ బ్రహ్మమువలన గాని యీ కార్యము గాదు

శ్రీ శంకరాచార్యులవారు బ్రహ్మసూత్ర భాష్యము (అ-2, పా-1, సూ-34) అవైషమ్య నైర్ఘృణ్యాధికరణము నందును, (అ-2, పా-3, సూ-42) పరాయత్తాధి కరణము నందును ఈ విషయమై చర్చించిరి అచ్చట వారు ఈశ్వరుని పర్జన్యునితో పోల్చిరి అందలి సారాంశమిది . లోకమున వడ్లు, గోధుమలు మొదలగు బీజములనుండి నానావిధములగు తీవలు మొదలగునవి పుట్టుటకు వర్షము అవసరమై యున్నది మేఘమువలన వర్షము కురియగా నానావిధములగు బీజములు వాటివాటి స్వరూప స్వభావములను బట్టి మొలకలెత్తి నానావిధ పుష్పఫలములు గలవి యగుటచే మేఘుడు వాటికి సాధారణ నిమిత్త మగుచున్న విధముగనే జీవులకు వారివారి పూర్వజన్మకర్మ నపేక్షించియే ఈశ్వరుడు శుభాశుభ ఫలముల నిచ్చుచున్నా డనునది యుక్తముగా నుండును. అట్లు కాక పోయిన ఈశ్వరునకు కొందఱియందు దయ, మఱికొందఱియందు వైషమ్యము కలదను దోష మారోపింప వలసి వచ్చును అట్లయిన జీవుల కర్తృత్వము పరాధీనమై యుండదా యనిన, సంసార మనాది యగుటవలన జీవుని కర్తృత్వము ఈశ్వరుని కార యితృత్వమును నిరవద్య మగును.

ఈశ్వరుడు ఆనందమయుడు మన యనుభవమున గల నిద్ర ఆనందమయ కోశము సర్వమునకు నీశ్వరశక్తియే ఆధారము. మన బుద్ధీంద్రియాదులు ద్వైతప్రపంచ లాంపట్యమున అలసిపోయి నిద్రను (ఈశ్వరుని) చెంది తిరిగి శక్తి మంతము లగుచున్నవి

జి : ఆనందమయ కోశమునకు సర్వజ్ఞత్వాదు లెట్లు కలుగును?

వే : మాయ అఘటనాఘటనా సామర్థ్యము కలిగినదని యిదివఱకు చెప్పితిని. కనుక ఆనందమయ కోశమునకు సర్వజ్ఞత్వాదులు ఉండుట అసంభవము గాదు. (వే.పం. 6-159). ఆనందమయ కోశమున బుద్ధివాసన లిమిడియున్నవి. అవి వ్యక్తములైనంతవఱకును తెలియబడవు. సకల

బుద్ధులయందు (సమష్టి బుద్ధులయందు) గల సామర్థ్యములనుబట్టి యీశ్వరునియందు సర్వజ్ఞత్వము నూహించి తెలిసికొనవలయును మఱియు

శ్లో॥ ఈశ్వర స్సర్వభూతానాం హృద్దేశేఽర్జున! తిష్ఠతి ।
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా ॥(గీత 18-61)

ఈశ్వరుడు సర్వభూతములయొక్క హృదయములందు నివసించుచు దేహములను యంత్రములను అధిష్ఠించినవాడై జీవులను మాయచేత త్రిప్పుచున్నాడు.

ఈ శ్లోకమును శ్రీ విద్యారణ్యులు చిత్రదీప ప్రకరణమునం దుదాహరించి, దానియర్థమును సహితము వారే వివరించిరి (172-175) దాని సంగ్రహమిది యంత్రమనగా దేహము దానియం దభిమానము గల్గుట, దాని నెక్కుట ధర్మాధర్మములయందు ప్రవర్తించుట, తిరుగుట యగును సర్వభూతములనగా విజ్ఞానమయకోశములు. ఇవి హృదయ ప్రదేశము నందుండునవి విజ్ఞానమయ కోశములకు ఉపాదాన కారణము ఆనందమయ కోశములె ఈశ్వరుడు = ఆనందమయ కోశములు ఆనందమయ కోశములు విజ్ఞానమయ కోశములుగ మారుచుండుటయే ప్రేరేపించుట యని చెప్పిరి కనుక శ్రుతి స్మృతి పురాణేతిహాస ప్రసిద్ధ మగు నీశ్వరాస్తిత్వమును అంగికరింపవలయును

## (13) ప్రపంచోత్పత్తి

ఈశ్వరుడు ఆకాశాది భూతముల నేవిధముగ సృష్టించెనని శ్రుతులు చెప్పెనో ఆవిధమును 'క్రమసృష్టి'యని చెప్పుదురు దానినే వివరింతును పరబ్రహ్మమును బోధించు వేదాంతశాస్త్రములయందు ప్రపంచోత్పత్తి ప్రసక్తి యెందులకను ప్రశ్న కలుగును పరబ్రహ్మ మట్టిదిట్టిదని చెప్పుటకు వీలులేనిది గనుక ప్రపంచముయొక్క సృష్టిలయములు (అధ్యారోపాపవాదములు) చెప్పుట ద్వారా బ్రహ్మ మిట్టిదని బోధింప వలయునే కాని వేఱొక మార్గము లేదు దీనినే శాస్త్రములయందు బ్రహ్మమునకు తటస్థలక్షణ మందురు అనగా జ్ఞేయమగు లక్ష్యము తెలిసికొని యీలక్షణము విడువబడుచున్నది ఎట్లనగా కడపపట్టణమున రామయ్య యను నతడు, వీథిలో సోమయ్య యనునతనిని కలిసికొని "ఈశ్వరయ్య యిల్లు యెక్కడ?" అని యడిగినపుడు సోమయ్య "అదిగో, ఆకాకి కూర్చున్న మేడయే యీశ్వరయ్య యల్లు" అని మొదట

కాకమును చూపి తర్వాత ఆయింటిని ఈశ్వరయ్య యిల్లని చెప్పుచున్నాడు. కాకి యా యింటికి సంబంధించినది గాదు. భవిష్యత్తులో నుండునది కాదు. అట్లుండియు ఈశ్వరయ్య యిల్లని చూపించుటకు కాకము సహాయపడినది. ఇట్లది తటస్థలక్షణమునకు దృష్టాంతముగా పెద్దలు చెప్పిరి

అట్లే దార్ష్టాంతికమైన పరబ్రహ్మమునకును మిథ్యాభూతమైన జగదుత్పత్తి లయములకును సంబంధము లేకపోయినను వీటిని బోధించుటద్వారా పరబ్రహ్మమును తెలిసికొనుట కుపయోగపడును. కనుక ప్రపంచోత్పత్తి లయములను గురించి శ్రుతి చెప్పినది. ప్రపంచము పరబ్రహ్మమునకు స్వరూపలక్షణము కాదు. స్వరూపలక్షణమనగా : పరబ్రహ్మమును విడువక పరబ్రహ్మమునకు సంబంధించియున్న లక్షణమని అర్థము. సచ్చిదానందములు పరబ్రహ్మమునకు స్వరూప లక్షణములు. ఈశ్వరయ్య మేడయే యావీథిలో మేడలన్నింటి కంటెను పెద్దదైనచో అలక్షణముచే అమేడను గుర్తించిన యెడల స్వరూపలక్షణ మగును. కనుక ప్రపంచోత్పత్తి క్రమమును గురించి వేదాంతశాస్త్రములయందు చెప్పినదానినే యిచట సంగ్రహించి చెప్పెదను.

ప్రపంచోత్పత్తిని గురించి ప్రాచీనోపనిషత్తులయందు, అతర్వాత వెలువడిన యుత్తర వేదాంతగ్రంథముల యందును, ఉపనిషత్తులయందును వేఱు వేఱు విధములుగా చెప్పిరి. ఛాందోగ్యమునం దిట్లు చెప్పబడెను.*

ఒకటవపద్ధతి : భూజలాగ్నులయొక్క అన్యోన్య సమ్మేళనమువలన ప్రపంచోత్పత్తి కలిగినది. దానికి త్రివృత్కరణ మని పేరిడిరి.

త్రివృత్కరణ మనగా : భూజలాగ్నులు మూడును కలిసి, సృష్టి యేర్పడిన విధమును తెలియజేయునదని అర్థము. శరీరము భూజలాగ్ని భూతాంశముల సముచ్చయము స్థూల దేహమునగల కఠినత, రక్తము, వేడి - యివి మూడును క్రమమున భూజలాగ్నుల యునికిని తెలియజేయును. శ్రుతియందు భూమికి అన్నమని పేరుగలదు అన్నముయొక్క సూక్ష్మాంశము (సాత్త్వికాంశము) వలన మనస్సు, జలముయొక్క సూక్ష్మాంశమువలన ప్రాణము ఏర్పడినవి మనస్సుయొక్క మిక్కిలి సూక్ష్మమగు దశయే బుద్ధి. అగ్నివలన వాగింద్రియము కలిగినది. భూతములు మూడును ఈవిధముగ కలియుటచే త్రివృత్కరణము ఏర్పడినది.

---

* ఛాం 6-2-3, 4 మఱియు 6-3-2-,4 మఱియు బ్రహ్మసూత్రములు 2-3-1 నుండి 8 వఱకును, 2-4-21, 22 నందును త్రివృత్కరణ పంచీకరణములను గురించి చర్చింపబడినది.

| పృథివి ½ | | జలము ½ | | తేజస్సు ½ | |
|---|---|---|---|---|---|
| జలము ¼ | తేజస్సు ¼ | పృథ్వి ¼ | తేజస్సు ¼ | పృథ్వి ¼ | జలము ¼ |

త్రివృత్కరణము : అగ్ని, జలము, పృథివి (సూక్ష్మ) - భూతముల మూడింటిని ఒక్కొక్క దానిని రెండు సమభాగములుగా చేసి మూడు అర్ధభాగములను వేఱుగావించి మిగిలిన ఒక్కొక్క అర్ధ భాగములను మరల రెండు సమభాగములుగ చేసి ప్రతి భూతమునందలి అర్ధభాగముతో మిగత రెండు భూతములలోని ఒక్కొక్క పాతిక భాగమును కలుపవలయును ఈవిధముగ చేసిన ప్రతిభూతమునందును దాని స్వాంశమగు అర్ధభాగమును, ఇతర భూతములయొక్క పాతికభాగములు రెండును కలిసి యుండును దీనినె త్రివృత్కరణ మని పేరు

తైత్తిరీయ[1], శ్వేతాశ్వతరోపనిషత్తు[2] లయందు పంచభూతముల వలన సృష్టి కలిగినదని చెప్పుటవలన నీ త్రివృత్కరణమునకు ప్రాముఖ్యము పోయినది.

రెండవది : తైత్తిరీయశ్రుతియందు ఆత్మవలన నాకాశమును, దానినుండి వాయువును, ఇట్లే అగ్ని ,జలము, పృథివి యను నీ భూతములు ఒక దానినుండి ఒకటి కలిగెననియు పృథివినుండి ఓషధులు, ఓషధులనుండి అన్నమును, అన్నమువలన రేతస్సు, రేతస్సువలన భూతములును కలిగిన వని చెప్పిరి. పైన చెప్పిన పంచభూతములయందు పృథివి శబ్ద స్పర్శ రూప రస గంధములు కలది. జలము శబ్దస్పర్శరూప రసములు గలది అగ్ని శబ్దస్పర్శరూపములు కలది వాయువు శబ్దస్పర్శములు కలది ఆకాశము శబ్దగుణము కలది ఆత్మ గుణరహిత మైనది ఆకాశము మొదలు ఒక్కొక్కభూతము నుండి ఒక్కొక్కగుణము హెచ్చుచు వచ్చినవి పంచభూతములయొక్క అన్యోన్య సమ్మేళనమువలన స్థూలప్రపంచ మేర్పడి భూతరాసులు కలిగినవని చెప్పబడినది. బ్రహ్మమునుండి తొలుత ఆకాశతన్మాత్ర కలిగినది. దానియందు భూతము లన్నియు సూక్ష్మరూపమున నున్నవి ఈతన్మాత్రనుండి ఆకాశము కలిగినది ఆత్మనుండి మొదట కలిగిన భూత మిది యగుటచే దీనియందు బ్రహ్మలక్షణము లున్నవి. ఇది జడమైనను

1. తై-2 అ-1 అనువాకము
2. శ్వే 2-12 నందు పంచ భూతములవలన శరీరము కలిగినట్లు చెప్పినది

ఏకము, అనంతము, సర్వగతమును, ఇతరభూతములకంటె శక్తిమంతమునునై యితర భూతముల యునికికి అవకాశ మిచ్చియున్నది.

పైన చెప్పినవిధముగా ఆకాశము, వాయువు, తేజము, జలము పృథివి అను నీ సూక్ష్మభూతములు కలిగినవి ఇవి పరమాణువులు కావు ఈఒక్కొక్కభూతమునందును ప్రకృతిగుణములగు సత్త్వ రజస్తమోగుణములు మూడును నిమిడి యున్నవి.

ఒక్కొక్క గుణముచేత ప్రతిభూతము రెండుగా విభజింపబడినది. అట్లు విభజింపబడిన సత్త్వగుణముగల వేఱు వేఱు పంచభూతముల మొదటి అర్థభాగములవలన వేఱు వేఱుగా ఆకాశాది క్రమమున శ్రోత్ర, త్వక్, నేత్ర, జిహ్వా, ఘ్రాణములను జ్ఞానేంద్రియములు కలిగినవి అయిదు భూతముల యొక్క మిగిలిన సాత్త్వికాంశములయొక్క అర్థముల సాముదాయిక (మొత్తము) మునుండి మనస్సు బుద్ధి యనునవి కలిగెను.

అట్లే రజోగుణసంబంధమైన భూతముల నైదింటిని ఒక్కొక్కదానిని రెండు సమభాగములుగ చేసి పంచభూతములయొక్క వేఱు వేఱు అర్థభాగముల నుండి ఆకాశాదిక్రమమున వాక్పాదపాణిపాయూపస్థలను పంచకర్మేంద్రియములు కలిగినవి రజోగుణసంబంధమగు అయిదు భూతములయొక్క మిగివిన అయిదర్థభాగముల మొత్తమునుండి ప్రాణము కలిగెను. ఇదియే స్థానభేదమునుబట్టి ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానమను పంచప్రాణములు కలిగినవి.

ప్రాణపంచకముగాక యీపదునేడును తత్త్వములలో చేరినవి. ఇవి లింగదేహ మనియు* సూక్షశరీర మనియు చెప్పుదురు సూక్షశరీరము పదునేడు తత్త్వములు గలదియై యున్నది అంతఃకరణమందలి మనోబుద్ధులను రెంటిని మాత్రమే చెప్పి, చిత్తమును అహంకారమును చెప్పకపోవుటచేత అవి రెండును మోహబుద్ధులయందు అంతర్భూతములని ఎఱుగవలయును (మనోబుద్ధులకు మారుగా అంతఃకరణము ఒక్కటిగా లెక్కించి దశేంద్రియములు, పంచప్రాణములు, పంచభూతములు చేరి యిరువదియొక్క తత్త్వములు సూక్ష్మసృష్టి యనియును కొందఱు చెప్పుదురు) దీనియందుగల జీవుడు తైజసుడు అట్లే యీశ్వరునికి సమష్టి దేహమైనపుడు సూత్రాత్మ లేక హిర్ణగర్భు డనిపేరు కలుగును. ఇదియే రెండవమెట్టు.

* సూక్షశరీరమును గురించి వేదాంతపంచదశిలో ప్ర-1, శ్లో-18 నుండి 24 వఱకును చెప్పబడినది

## సూక్ష్మ (శరీర) సృష్టి వివరమును తెలుపు వర్గీకరణము.

| అపంచీకృత (సూక్ష్మ) భూతములు | సత్త్వగుణముగల భూతముల యొక్క వేఱువేఱు అర్ధ భాగములనుండి కలిగిన జ్ఞానేంద్రియములు | సాత్త్వికాంశము గల భూతములయొక్క మొత్తము అర్ధభాగములనుండి | రజోగుణము గల భూతములయొక్క వేఱు వేఱు అర్ధభాగముల నుండి కలిగిన కర్మేంద్రియములు | రాజసాంశము గల భూతములయొక్క మొత్తము అర్ధ భాగములనుండి |
|---|---|---|---|---|
| ఆకాశము | శ్రోత్రము | బుద్ధి మనస్సు | వాక్కు | ప్రాణము |
| వాయువు | త్వక్కు | | పాణి | అపానము |
| అగ్ని | నేత్రము | | పాదము | వ్యానము |
| జలము | జిహ్వా | | పాయువు | ఉదానము |
| పృథ్వి | ఘ్రాణము | | ఉపస్థ | సమానము |
| | | | | ప్రాణము యొక్క ఐదు వృత్తి భేదములు |

సత్త్వ, రజోగుణ, ప్రధానములగు పంచభూత సృష్టిని గుఱించి చెప్పబడెను. తమోగుణ ప్రధానములగు భూతములయొక్క సృష్టిని చెప్పవలసియున్నది ఆ భూతము లొకదానితో ఒకటి కలియుటవలన పంచమహా స్థూలభూతములును, నానావిధ స్థూలసృష్టియును కలిగెను. ఈ పంచభూతముల యొక్క అన్యోన్యసమ్మేళనమునకే పంచీకరణ మని వేదాంతశాస్త్రములయందు పేరు కలిగెను. ఈ పంచీకరణమును గుఱించి వేఱొకచోట చెప్పెదను.

జి .- ఆత్మవలన ఆకాశాదిభూతములు కలిగినవని చెప్పుచున్నారు కలిగిన వన్నపుడు అది సత్యమే యగును కదా ?

వే - మొదట నిర్గుణమగు ఆత్మ భ్రాంతివలన శబ్దగుణకమగు ఆకాశముగా చూపబడెను అట్టి యాకాశమునే శబ్దస్పర్శ గుణములు గల వాయువుగా చూడబడెను. ఇట్లే సమస్తసృష్టియును భ్రాంతివశమున కల్పింపబడెను బోధకొఱకు "కలిగెను, కలిగెను" అని చెప్పబడుటయేగాని వాస్తవమునకు అది అంతయును కల్పనయని అద్వైతము చెప్పినది

ఏమైనను శ్రుతులు ఆత్మనుండి ఆకాశాదిక మగు సృష్టిని వివరించుటవలన జగత్తు ఈశ్వరభిన్నము కాదనియే తాత్పర్యము. సృష్టి ఒక క్రమపద్ధతిని సృజింపబడియున్నది ఆకాశము ఒక్క గుణముగల భూతము - క్రిందికి దిగి రానురాను ఒక్కొక్కగుణము హెచ్చుచు వచ్చి కడపటిదగు పృథ్వీభూతము ఐదుగుణములు కలిగినట్టిదై యున్నది. పృథ్వినుండి సోపానక్రమమున పైకి పోనుపోను ఒక్కొక్క గుణము తగ్గుచు తుదకు ఒకే గుణముగల ఆకాశమునకు పై సోపానము నిర్గుణమగు ఆత్మయని విశదమగును. ఈశ్వర నిర్మితమగు జగత్తు ముముక్షువున కొక పాఠశాలవలె క్రమోన్నతికి దారిచూపుచు తుదకు బ్రహ్మముతో చేర్చుటకు తోడ్పడుచున్నది. ఈశ్వరసృష్టి జీవునకు బంధహేతువుగా నుండక భోగమోక్షములకు తోడ్పడుచున్నది


ప్రకృతినుండి సృష్టిక్రమమును తెలుపు మూడవ పద్ధతి . ఈ పద్ధతి త్రిశిఖిబ్రాహ్మణ శ్రుతియందును, మహాభారత మందును, పురాణములందును చెప్పబడిన సృష్టివిధానము ఇంతవరకు చెప్పబడిన సృష్టిక్రమ పద్ధతికంటె ఇది భిన్నమైనది. ప్రాచీన ఉపనిషత్తులయందలి సృష్టిక్రమము ఆకాశముతో ప్రారంభ మగుచున్నది ఉత్తరవేదాంత గ్రంథములయందు సృష్టిక్రమము ప్రకృతినుండి మహత్తు, మహత్తునుండి క్రమముగా సృష్టియంతయును ప్రారంభ మగుచున్నది దీనికి కారణము సాంఖ్యులయొక్క సృష్టిక్రమము ప్రచారమునకు

వచ్చియుండుటచేత వారిప్రభావము వేదాంతులయందు సహితము కనబడినదని చెప్పవచ్చును ఆపద్ధతి యిట్లుండును

ఆత్మసాన్నిధ్యముచేత ప్రకృతియందలి మూడు గుణములు సామ్యస్థితిని చెడి హెచ్చుతగ్గులైనవి ఇదియే సృష్టిచేయవలయునని బ్రహ్మమునకు బుద్ధికలుగుట యని చెప్పవలయును సచేతనమగు నేప్రాణికైనను నేదేనియొక కర్మ చేయుటకుముం దట్టికర్మను చేయవలయు నని తొలుత బుద్ధి పుట్టవలయును అదేవిధముగనే యీశ్వరుడు సృష్టినిచేయుట యారంభించుటకు ముందు "నేనీసృష్టిని చేయవలయును" అను సంకల్పము (బుద్ధి) పుట్టవలయును కదా? ఈశ్వరునియందు సృష్టిచేయవలయునను నిచ్ఛ ఏది కలిగెనో యదియే బుద్ధి. అట్లు "కల్గుట" యనుక్రియ యేదియో యదియే కర్మ లేక వ్యాపార మనబడును. మనుష్యునియందు కల్గు ప్రతిసంకల్పము కర్మయే కదా ? అదేవిధముగా నీశ్వరునియందు సైతము ఈవిధముగా కర్మకలిగిన తర్వాత నారంభింపబడిన యీ సృష్టిక్రమ మను వ్యాపారము కొనసాగించుట యనుకర్మము నందే కాలభావముకూడ కల్గుచున్నదని ఇదివరకే చెప్పితిని

పైవిధముగా ప్రకృతియందు కలిగిన బుద్ధియే సృష్ట్యారంభమున కలిగినదని యర్థము ఈబుద్ధికే "మహత్తు, జ్ఞానము, మతి, ఆసురి, ప్రజ్ఞ, ఖ్యాతి" అను నామాంతరములు కలవు మహత్తనగా గొప్పది దేనికంటె గొప్పది? ఇక పుట్టబోవువాని కన్నింటికంటెను గొప్పదియని యర్థము ఈబుద్ధి యేకమై యున్నది ఆతర్వాత అహంకారము కలిగెను 'నే ననేకము కావలెను' అనుకొనగా ననేకము లాయెను అదియే యహంకారము ఒక్కటై యున్నదనేకము లగుటచేత "నేను, నేను" అను అహంకారము కలిగెను ఆతర్వాత పంచతన్మాత్రలు కలిగెను అహంకారము రెండువిధము లాయెను (1) సాత్త్వికాహంకారము (2) తామసాహంకారము సాత్త్వికాహంకారమునుండి సంకల్ప వికల్పాత్మకమగు మనస్సును, దశేంద్రియములును కలిగెను తామసాహంకారమునుండి పంచమహాభూతములు కలిగెను జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు, పంచతన్మాత్రలు, పంచమహాభూతములును, మనస్సు బుద్ధి అహంకారములును, నీవిధముగా ప్రకృతితో చేరి ఇరువదినాల్గు తత్త్వము లాయెను ఇందులో చిత్తమనునది చేర్చబడలేదు ఏలనన మనస్సే యింద్రియములద్వారా బయటచూచిన విషయములనే మఱలమఱల చింతనము చేయుటచేత మనస్సునకే చిత్తమని పేరుకలిగెను అంతఃకరణ చతుష్టయ మన్నపుడు మాత్రమే మనో బుద్ధి చిత్తాహంకారము లను నాల్గుపేర్లు వాడుచున్నారు

పై విధముగా నిరువదినాల్గు తత్త్వములతో, మణులయందు దారమువలె గ్రుచ్చబడినట్లు, పురుషుడు (ఆత్మ) కలిసి యున్నాడు. అందువలన నతనిని నిరువది యయిదవ తత్త్వ మని పిలుచుచున్నారు. వాస్తవమునకు నతడు ప్రకృతికంటె వేఱైన వాడు కనుక నతనిని నిస్తత్త్వుడని స్పష్టముగా వేదాంత గ్రంథములయందు చెప్పబడినది. పైన చెప్పిన సృష్టిక్రమమును స్పష్టముగా తెలియుటకుగాను ఈ క్రింది బ్రహ్మవృక్షమును చూడవలెను




త్రిశిఖిబ్రాహ్మణము నందు అవ్యక్త ప్రకృతినుండి మహత్తును, మహత్తత్త్వమునుండి అహంకారమును, రజోగుణభావమును పొందిన అహంకారమునుండి పంచతన్మాత్రలు, తమఃప్రధాన భావమును పొందిన పంచతన్మాత్రల నుండి పంచమహాభూతములు పుట్టినవని చెప్పబడినది

పై నిరువదినాలుగు తత్త్వములలో 1 నుండి 8 వఱకును అష్టవిధప్రకృతులనియు 9 నుండి 24 వఱకు గల 16 ను షోడశ కళలనియు, వికారములనియు చెప్పుదురు గీత 7 వ అధ్యాయము 4వ శ్లోకమునందు అపరాప్రకృతిని, గుఱించి చెప్పునపుడు అష్టవిధప్రకృతులలో అవ్యక్తమగు ప్రకృతిని వదలి అందులో మనస్సును చేర్చుటచేత అష్టవిధప్రకృతులైనవి ఇచట మనస్సునువదలి ప్రకృతిని తీసికొనుట చేత అష్టవిధ ప్రకృతు లైనవని ఎఱుగవలయును

దీనినే గీతయొక్క 15-వ అధ్యాయమందును, కఠోపనిషత్తు 6-1 నందును అశ్వత్థవృక్షము (రావిచెట్టు) అనియును, సంసార వృక్షమనియు చెప్పిరి. వేదములయందు నిది వటవృక్షము (మఱ్ఱి చెట్టు) అనియును, ఔదుంబర వృక్షమనియు (మేడిచెట్టు) చెప్పబడినది ఈ వృక్షమునకే వేరు (మూలము) బ్రహ్మమునందుండి వచ్చినది గనుక యూర్ధ్వమూలమనియు, అధశ్శాఖమనియు చెప్పబడినది (దీనికి సంసారవృక్ష మనికూడ పేరుగలదు ) భాగవతపురాణమున బ్రహ్మయొక్క యండమని వర్ణింపబడినది దీనికి క్షరమనియు, విశ్వమనియు పేర్లు గలవు

ఈ వృక్షమునందు 1 నుండి 19 వఱకును గల తత్త్వములు సూక్ష్మశరీరమనియును, 20 నుండి 24 వఱకును గల తత్త్వములు స్థూలశరీమునకు చెందినవనియును, ఇరువది యయిదవవాడు పురుషుడు లేక దేహి యని తెలియవలెను పైనచెప్పిన 20 నుండి 24 వఱకు గల తత్త్వములు స్థూల భూతములు.

## (14) పంచీకరణము

పంచభూతములను చేర్చి ఏకభూతముచేయుట పంచీకరణమందురు వేదాంతగ్రంథములయందు పంచీకరణము వ్రాయుట పరిపాటియైనది. పంచీకరణము నానాగ్రంథములయందు నానావిధములుగ వ్రాయబడియున్నది శ్రీ శంకరులవారు ఆత్మబోధయం దిట్లు చెప్పిరి.

**శ్లో॥ పంచీకృత మహాభూత సంభవం కర్మ సంచితమ్ ।**
**శరీరం సుఖదుఃఖానాం భోగాయతన ముచ్యతే ॥**

తా పంచీకృత మహాభూతములవలన పుట్టినట్టి కర్మసంచితమైన దేహము జీవునకు సుఖదుఃఖము లనుభవించుటకు స్థానభూతమైనదిగా చెప్పబడినది - అని మాత్రమే వ్రాసిరి. పంచీకరణ వివరమును వ్రాయలేదు సురేశ్వరాచార్యులవారును తోటకాచార్యులవారును పెక్కం్రడు పంచీకరణమును వ్రాసిరి పంచీకరణ మెట్లనగా -

(1) తమోగుణ ప్రధానములయిన అపంచీకృత పృథివ్యాది భూతముల నయిదింటిని నొక్కొక్క దానిని రెండు సమభాగములుగా చేసి యొక సమభాగము వేఱుగానుంచి, మిగతసగమును నాల్గు సగభాగములుగాచేయవలెను ఈ విభజించిన నాల్గు భాగములు తమ స్వాంశంబులను విడిచి, యిదేవిధముగా విభజించిన నితరభూతములయొక్క నాలుగు అర్థభాగములతో చేర్చుట పంచీకరణ మగుచున్నది. ఇది యీఈశ్వరసంకల్పము (వీక్షణము) న జరుగుచున్నది. ఎట్లనగా - మొదట ఆకాశభూతమును తీసికొని దానిని రెండు సమభాగములుగా చేసి యొక యర్ధబాగమును వేఱుగనుంచి, మిగిలిన అర్ధభాగమును నాల్గు సమభాగములుగా చేసి, యిదేవిధముగా చేయబడిన వాయుభాగముయొక్క యర్ధాంశములోని నాలుగవభాగమును మొత్తమునందుండు పరకను తీసికొని ఆకాశముయొక్క అర్ధభాగముతో చేర్చిన 'మనస్సు' గును. అట్లే యగ్ని యొక్క యర్ధభాగముతో చేర్చుటచే 'బుద్ధి' యాయెను. అట్లే జలముయొక్క యర్ధాంశములోని నాల్గవ భాగము చేర్చుటచేత 'చిత్త' మాయెను పృథ్వియొక్క అర్ధాంశములోని నాల్గవభాగము చేర్చుటచేత 'అహంకార' మాయెను. ఈ విధముగ ఆకాశము దాని స్వాంశమగు సగపాలునందు ఇతర నాలుగు భూతములయొక్క నాలుగు పరక (1/8) భాగములు చేరుటవలన ఆకాశము అయిదుభూతములు గలదియైనది. అయినను ఆకాశము అందులో అధికభాగ మున్నందున దానికి ఆకాశమనియే ప్రసిద్ధి.

ఆకాశముయొక్క మిగత అర్ధభాగము అంతఃకరణ మాయెను. వాయుభూతమును పైనచెప్పిన విధముగ చేసి దాని అర్ధభాగమునందు ఆకాశాగ్ని జలపృథ్వీభూతముల ఒక్కొక్క పరకభాగములను క్రమమున కలుపుటవలన సమాన, ఉదాన, ప్రాణ, అపాన, వాయువులును; వాయువుయొక్క

అర్థభాగమునందు వ్యానవాయువును నేర్పడెను ఈవిధముగానే తక్కినవి యూహించుకొవలయును

(2) ఈ పంచీకరణమును కొందఱు మఱియొక విధముగ చెప్పుదురు ఎట్లనగా పైన చెప్పిన విధముగనే ఆకాశాది భూతముల నైదింటిని రెండు సమభాగములు చేసి ఒక అర్థభాగమును వేఱుగానుంచి మిగత అర్థభాగమును నాలుగు సమభాగములుగ విభజించి, ఒక భూతముయొక్క నాలుగు పరకభాగములతో నితరభూతముల పరకభాగములనుండి ఒక్కొక్క పరకభాగమును కలుపవలయును. ఉదాహరణమునకు ఆకాశభూతమునందలి ఒకటినుండి నాలుగువఱకునుగల పరకభాగములతో తక్కిన నాలుగు భూతముల ఒక్కొక్క పరకభాగములను చేర్చిన క్రమమున మనోబుద్ధి చిత్తాహంకారములును, మిగత ఆకాశార్థభాగము వలన అంతఃకరణమును నగును ఈ విధముగనే మిగతవాటి విషయమును తెలిసికొనవలెను ఈ విధానము నాకు యుక్తమని తోచలేదు. ఏలయన? ఆకాశభూతముయొక్క నాలుగు పరకభాగములతో తదితర భూతముల నాలుగింటియొక్క నాలుగుపరకలను కలిపినయెడల ఇతరభూతమలతో చేర్చుటకు ఆకాశముయొక్క నాలుగు అష్టాంశములు మిగిలి యుండవు. కనుక మొదటివిధానమే సరియని మొదటిపద్ధతి ననుసరించి ఏయే భూతాంశములు ఏయే భూతములయందు చేరుటవలన నెట్టి స్థూల సృష్టి యేర్పడునో ఆవివరమును తెలియజేయు నీ క్రింది పటమును చూపితిని.*

* పంచీకరణమును పైంగలోపనిషత్తునందును కలదు

## స్థూలశరీర పంచీకరణము

| | | | |
|---|---|---|---|
| ఆకాశము అంతఃకరణము | వాయువు | 1/8 | మనస్సు స్థానము |
| | అగ్ని | 1/8 | బుద్ధి స్థానము |
| | జలము | 1/8 | చిత్తము స్థానము |
| | పృథ్వి | 1/8 | అహంకారము స్థానము |
| వాయువు వ్యానవాయువు | ఆకాశము | 1/8 | సమానవాయు స్థానము |
| | అగ్ని | 1/8 | ఉదానవాయు స్థానము |
| | జలము | 1/8 | ప్రాణవాయు స్థానము |
| | పృథ్వి | 1/8 | అపానవాయు స్థానము |
| అగ్ని చక్షురింద్రియము | ఆకాశము | 1/8 | చెవి |
| | వాయువు | 1/8 | చర్మము |
| | జలము | 1/8 | నాలుక |
| | పృథ్వి | 1/8 | ముక్కు |
| జలము రసము | ఆకాశము | 1/8 | స్థూల శబ్దము |
| | వాయువు | 1/8 | స్థూల స్పర్శము |
| | అగ్ని | 1/8 | స్థూల రూపము |
| | పృథ్వి | 1/8 | స్థూల గంధము |
| పృథ్వి పాయ్వింద్రియము | ఆకాశము | 1/8 | వాగింద్రియ స్థానము |
| | వాయువు | 1/8 | పాణీంద్రియ స్థానము |
| | అగ్ని | 1/8 | పాదేంద్రియ స్థానము |
| | జలము | 1/8 | ఉపస్థేంద్రియ స్థానము |

## (15) అధ్యాత్మ - అధిభూత - అధిదైవతములు

సూక్ష్మమును, స్థూలమును నగు సృష్టి వివరింపబడినది అధ్యాత్మాధి భూతాధి దైవతములను గుఱించి చెప్పవలెను ఈవిషయము వేదాంత గ్రంథములయందేగాక, మహాభారత శాంతిపర్వమున యాజ్ఞవల్క్య జనకరాజ సంవాదమునందును చెప్పబడినది పిండమునందు ఇంద్రియాధిదేవతలని చెప్పబడు వారే విరాట్టునకు నింద్రియములని తెలియవలయును

| అధ్యాత్మము | అధిభూతము | అధిదైవతము |
|---|---|---|
| మనస్సు | మంతవ్యము | చంద్రుడు |
| బుద్ధి | బోద్ధవ్యము | క్షేత్రజ్ఞుడు |
| చిత్తము | ధారణాశక్తి | బ్రహ్మదేవుడు |
| అహంకారము | అభిమానము | రుద్రుడు |
| శ్రోత్రము | శబ్దము | దిక్కులు |
| త్వక్కు | స్పర్శము | వాయువు |
| చక్షువు | రూపము | సూర్యుడు |
| జిహ్వ | రసము | వరుణుడు (ఉదకము) |
| ఘ్రాణము | గంధము | పృథ్వి |
| వాక్కు | ఉచ్చరించుట | అగ్ని |
| పాణి | గ్రహించుట, విడుచుట | ఇంద్రుడు |
| పాదములు | నడచుట | విష్ణువు |
| పాయువు | విసర్జన | మృత్యువు, మిత్రుడు |
| ఉపస్థ | ఆనందించుట | ప్రజాపతి |

ఈ పదునాలుగు త్రిపుటులు ప్రాణపంచకమును కూడి విరాట్టు విశ్వాలకు ముఖములని చెప్పిరి.

ఇట్లు పంచీకరణమువలన పిండబ్రహ్మాండములన్నియు నేర్పడినవి.

ఇంతవఱకు స్థూలసూక్ష్మ భూతసృష్టిని గురించి చెప్పబడెను. ఇంతటితో సృష్టి సంపూర్ణ మయినది. విరాట్టు విశ్వాలయొక్క పూర్ణరూపము లవతరించినవి. విరాట్టుయొక్క వర్ణనము పురుషసూక్తమునందును, ముండకోపనిషత్తునందు

(2-1-4 నుండి 9) మంత్రములయందును, భాగవత పురాణమందు అచ్చటచ్చటను వర్ణింపబడెను విరాట్టునకు, విశ్వునకు భేదము లేదని ఉత్తరగీతయందు (2-21 నుండి 34), ఛాందోగ్యము (5-12-1), మాండూక్య (3), నాదబిందూపనిషత్తులందును గల వర్ణనముల వలన తెలియుచున్నది

## (16) కాపిలసాంఖ్యము

సృష్టిక్రమమును చెప్పిన సందర్భమున సృష్టిక్రమముయొక్క మూడవపద్ధతికి సాంఖ్యమతముయొక్క పలుకుబడి కారణమై యుండవచ్చునని చెప్పియుంటిని. కనుక సాంఖ్యమతమును గురించి సంగ్రహముగా చెప్పెదను.

సాంఖ్యమతముయొక్క కర్త కపిలమహాముని. కపిలుడు బ్రహ్మకుమారుడని కొందఱందురు, కర్దమునకును స్వాయంభువుని పుత్రికయగు దేవహూతికి జన్మించినవాడని భాగవతమును చెప్పును సగరపుత్రులను భస్మమొనర్చినట్లు రామాయణమునందు చెప్పబడిన కపిలుడు, వైదిక కపిలుడనియు, సాంఖ్య మతాచార్యుడగు కపిలుడు ఆయనకంటె భిన్నుడనియు శ్రీ శంకరులవారు చెప్పిరి ఎట్లయినను నితడు నారాయణాంశ సంభూతుడని "సిద్ధానాం కపిలో మునిః" (గీత 10-26). సిద్ధులలో కపిలమునిని నేనేయని భగవంతు డర్జునునకు చెప్పుటవలన నిత డెంత గొప్పవాడైనది తెలియును. వీరిరువదినాల్గు తత్త్వములు లెక్కింతురు (సంఖ్య పెట్టుదురు). కనుక వీరిమతము సాంఖ్యమతమనియు, కపిలముని బోధించుటచేత కాపిలసాంఖ్యమనియు నందురు. ఈ మతమునకు మూలగ్రంథము ఈశ్వరకృష్ణ విరచిత మగు సాంఖ్యకారికలు (సాంఖ్య కారికాసప్తతి).

సాంఖ్యమత బీజములు ఉపనిషత్తులందున్నవి ముఖ్యముగ శ్వేతాశ్వతరోపనిషత్తునందు కలవు. మహాభారత శాంతిపర్వమునందు సహితము సాంఖ్యము చెప్పబడినది వేదాంతదర్శనము తరువాత అంతటి గౌరవము సాంఖ్యదర్శనమునకే కలిగినట్లు కనబడుచున్నది. వీరిమతమున ప్రకృతి, పురుషుడు అను రెండును స్వయంభువులును స్వతంత్రములును నగు పదార్థములు. ఇవి జగదుత్పత్తికి కారణములని చెప్పుదురు. పురుషుడు - నిర్వికారుడు, శుద్ధచేతనుడు, గుణరహితుడు. ప్రకృతి - సత్వరజస్తమో గుణాత్మకము; జడము. ఈ రెండింటి సంయోగమువలన జగత్తు కలిగినది. ఈ రెండును సత్యపదార్థములు, నశించునట్టివి కావు. ప్రకృతియొక్క మూడు

గుణములొక దానితో నొకటి కలియుటవలన నిరువదినాల్గు తత్త్వము లేర్పడినవని యందురు. ఇరువదియయిదవవాడు పురుషుడు ఈ యిరువది నాల్గుయొక్క సమష్టిరూపము ప్రపంచము. దీని వలన నుత్పన్నమైనది శరీరము. ఈ పంచవింశతి (25) తత్త్వములయొక్క కూడిక దేహదేహములు నిర్గుణుడైన పురుషుడు ప్రకృతి సంయోగమువలన గుణమయు డైనట్లు కన్పడును ఇట్లు కనబడుటయే బంధము. ప్రకృతిబంధముననుండి విడిపించుకొనుటయే ముక్తి ఇదియే యీ మతముయొక్క సంగ్రహస్వరూపము అని సాంఖ్యులందురు.

సాంఖ్యులు చెప్పు నిరువదినాల్గు తత్త్వము లివి

(1) మూలప్రకృతి - దీనినుండి కలుగబోవు సమస్తమునకును ఇది ములము. దీనికి మూలము లేదు కనుక దీనికీపేరు కలిగినది మఱియు ప్రధానము, గుణక్షోభిణి, బహుధానకము మొదలగుపేర్లు గలవు దీనినుండి (2) మహత్తు (బుద్ధి) పుట్టినది. బుద్ధివలన (3) అహంకారము కలిగినది సత్త్వగుణాధిక్యముగల అహంకారమునుండి (4) మనస్సు, (5 నుండి 9 వఱకు) జ్ఞానేంద్రియపంచకము, రజోగుణమునుండి (10 నుండి 14 వఱకు) కర్మేంద్రియ పంచకము కలిగినది అట్లే, తమోగుణాధిక్యముగల అహంకారము నుండి (15 నుండి 19 వఱకు) శబ్దాది పంచతన్మాత్రలు కలిగినవి ఈ పంచతన్మాత్రలనుండి (20 నుండి 24 వఱకు) ఆకాశాది పంచమహాభూతములు పుట్టినవి 2, 3, 15, 16, 17, 18, 19 ఇవి ప్రకృతి వికృతులు 4 నుండి 14 వరకు వికృతులు (వికారములు). 25 వ వాడగు పురుషుడు. ఇతడు ప్రకృతియు కాడు. వికృతియు కాడు

పంచతన్మాత్రలు మహత్త్వమునుండియే జన్మించెనని యొకచోటను, అహంకారమునుండి జన్మించెనని మఱియొకచోటను చెప్పిరి అంతఃకరణము ఒక్కటేయని మరొకచోట చెప్పిరి. ఇంకొకచోట బుద్ధినిమాత్రమే గ్రైకొనిరి. మఱియొకచోట మనో బుద్ధ్యహంకారములు మూడును కలసి అంతఃకరణ మనిరి. ఒకచోట జ్ఞానేంద్రియము లైదింటిని ప్రత్యేకముగ చెప్పక ఒక్క త్వగింద్రియమును మాత్రమే జ్ఞనేంద్రియముగను, సర్వశక్తులు కలదానినిగను గ్రహించి, కర్మేంద్రియ పంచకముతో కలిపి ఇంద్రియము లాఱని చెప్పిరి మఱియొకచో జ్ఞాన, కర్మేంద్రియములు, మనస్సు చేరి యేకాదశేంద్రియములుగా చెప్పిరి. ఇట్లు సాంఖ్యులు పరస్పరవిరుద్ధములగు సిద్ధాంతములను చేసిరి.

సృష్టి విచారమునుగుఱించి సాంఖ్య వేదాంతములకు భేదము స్వల్పము ఇదివఱకు చెప్పబడిన బ్రహ్మవృక్షమునే కొంచెము భేదముతో సాంఖ్యు లామోదింతురు. మొదట బ్రహ్మమునుండి ప్రపంచ ముత్పన్న మైనదని వేదాంతుల మతము. సాంఖ్యులు బ్రహ్మము లేక పరమేశ్వరుడు అను మూలతత్త్వమునుండి సృష్టి జరిగినదని చెప్పరు. వేదాంతుల 'ప్రకృతి' స్వతంత్రమైనది కాదు. స్వయంభువు కాదు. అది పరబ్రహ్మముయొక్క యిచ్ఛాధీనమైనది. సాంఖ్యుల 'పురుష' లనేకులు అద్వైత (వేదాంత) మతానుసారము ఆత్మపురుష డొక్కడే. ఇవి ముఖ్యమైన భేదములు

పరమేశ్వరు నంగీకరింపని సాంఖ్యులకు నిరీశ్వరవాదు లని పేరు కాలక్రమమున వా రీశ్వరుడు కలడని యంగీకరించిరి అట్టివారికి సేశ్వరసాంఖ్యులని పేరు.* ప్రాణమును గుఱించి వేదాంతులకును, సాంఖ్యులకును భేదము కలదు.

## (17) ముఖ్యప్రాణము

ప్రాణము పరమేశ్వరునియందుండి స్వతంత్రముగా పుట్టినదని యుపనిషత్తులయందు కలదు. అనగా ప్రకృతి, ప్రకృతివలన కలిగిన వికృతులు ఈ యిరువదినాల్గింటిలో చేరదని భావించవలెను సాంఖ్యు లాకాశమునందు వాయువు పుట్టినదని, వాయువువలననే పంచప్రాణములు కలిగినవని చెప్పిరి కొన్ని వేదాంత గ్రంథములయందును ఇట్లే యున్నది (వెనుక ప్రపంచసృష్టి యొక్క రెండవపద్ధతియందు సూక్ష్మ శరీరవివరణమున రజోగుణము గల అపంచీకృత పంచ భూతములయొక్క మొత్తము నుండి ప్రాణపంచకము కలిగెనని చెప్పియుంటిని.) ఇందులకు భిన్నముగా ముండకము మొదలగు నుపనిషత్తులయం దిట్లు చెప్పబడినది.

"ఏతస్మా జ్జాయతే ప్రాణో మనస్సర్వేంద్రియాణి చ ।
ఖం వాయు ర్జ్యోతిరాపః పృథివీ విశ్వస్య ధారిణీ ॥ (ముం. 2-1-3)

తా : ఈ మహాపురుషునియొద్దనుండి (పరమాత్మ) ప్రాణము, సక లేంద్రియములు, పృథివ్యప్తేజోవాయ్వాకాశము లనునవి యన్నియు కలిగెను

* సాంఖ్యదర్శనమును గుఱించి ఈ గ్రంథముయొక్క ద్వితీయ తృతీయ భాగములయందు చెప్పియున్నాను. కనుక నిచ్చట విస్తరించి చెప్పలేదు

పైన ప్రాణమును చెప్పి తర్వాత పంచభూతములను చెప్పినందున, పంచభూతములలో చెప్పబడిన వాయువు ప్రాణము రెండును వేఱువేఱని శ్రుతి తాత్పర్యము.

ఛాందోగ్యమునందు సనత్కుమారుడు నారదున కుపదేశించిన ఘట్టమునందు ప్రాణమునుగుఱించి యిట్లు చెప్పెను 'ఈ ప్రాణమును ముఖ్యప్రాణమని యందురు ఆత్మ (ప్రజ్ఞాత్మ) దేనియందు నద్దమునందువలె ప్రతిబింబించి యుండునో యదియే ప్రాణము, రాజువద్ద ముఖ్యమైన యధికారి ఎట్లు సమస్తకార్యములు చేసి పెట్టుచుండునో యట్లు పరమాత్మక్రింద సర్వాధికారమును జరుపునట్టిది ప్రాణము. ఇది పరమాత్మను నీడవలె ననుసరించి యుండును. (ఛాం 7-15-1 నుండి 4)

నిద్రించునపు డింద్రియములును, మనస్సు ప్రాణమందు చేరుచున్నవి కనుక వీటియన్నింటికంటె ప్రాణమున కెక్కువ ప్రాముఖ్యము నిచ్చియున్నారు. దేహమునందుగల చేతన యీ ప్రాణముయొక్క వ్యాపారమేయని చెప్పుదురు. ప్రాణముయొక్క యీ ప్రాముఖ్యమును గుర్తించినవారు మధ్వాచార్యులవారు కనుకనే ద్వైతులు ప్రాణదేవత కుమారుడు, లేక ప్రాణముయొక్క యవతారమగు ఆంజనేయస్వామిని ముఖ్యముగా పూజింతురు

## (18) కర్మసిద్ధాంతము

పరబ్రహ్మమునందుండి ప్రకృతి గుణసామ్యము వదలుకొనుటతోడనే కర్మచక్రముకూడ తిరుగుటకు ప్రారంభించినది జీవునకు జన్మపరంపరలను కలిగించు నీకర్మనుగుఱించి యిచట కొంత చెప్పవలసియున్నది

కర్మయనగా నేప్రాణిగాని చేయు సమస్తవ్యాపారము అనగా క్రియలు కర్మయనబడును. మానవుడు చేయునట్టి యేసంకల్పమైనను, నుచ్చరించు ప్రతివాక్కును, శరీరముచేయు ప్రతికదలికయు కర్మయే అనాదిగా జీవుడు కర్మసుడిలోపడి యీ కర్మప్రవాహములో జననమరణ రూపమైన యీ సంసారములో నీదుచునే యున్నాడు ఈ కర్మచక్రము ఎపుడు తిరుగుట కారంభించినదో, యెట్లారంభమైనదో, యీ కర్మచక్రమునందు జీవు డేవిధముగ పడెనో చెప్పుటకు సాధ్యము కాదు. కర్మలను శాస్త్రములయందు మూడు

విధములుగ విభజించి చెప్పియున్నారు. 1. సంచితము, 2 ప్రారబ్ధము, 3 ఆగామి ·

(1) వెనుకటి యనేక జన్మములయందు చేయబడిన కర్మములయొక్క సముదాయము సంచితమని చెప్పబడును. అనగా నీక్షణమువఱకును మానవుడు చేసిన కర్మలన్నియును సంచితమునందు చేరియున్నవని యర్థము. దీనికి అదృష్టమని, అపూర్వమని పేర్లు.

(2) అట్టి సంచిత కర్మములనుండి కొంతభాగము అనుభవమునకు వచ్చుటకు పంచీకృత పంచభూతములవలన దగిన శరీరము నిర్మితమై జన్మమెత్తుచున్నాడు. వర్తమానకాలము నందే తల్లిదండ్రుల శరీరమునుండి యీ శరీరము సంప్రాప్తమైనదో యీ శరీరము కలిగిన తరువాత నీ జన్మమునందు మరణపర్యంతము నెట్లు సుఖదుఃఖములు కలుగునో వీటికి కారణమగు కర్మకు ప్రారబ్దమనిపేరు

(3) ఈ ప్రారబ్ధానుభవ కాలములోనే మనుష్యుడు పదునైదవయేట నుండి చేయు ప్రతికర్మయు - కర్తృత్వ భోక్తృత్వాభిమానములతో చేయబడు నేని నాగామికర్మ యనబడును ఈ యాగామికర్మ సంచితకర్మలో చేరి ముందు రాబోవు జన్మములకు ప్రారబ్ధరూపమున పరిణమించును దానికే క్రియామాన మనియు వర్తమానకర్మ యనియు పేర్లు

పైవిధమగు మూడు కర్మలను, పెద్దలు రెండువిధములుగా విభజించి యున్నారు ఆ పద్ధతి ఇది. కర్మలు ఆరబ్ధములు అనారబ్ధము లని రెండువిధములు ఎట్లనగా వెనుక ననేక జన్మసముపార్జిత కర్మరాశి నంతయు సంచితమనుపేర చెప్పబడినది. ఈ సంచితమునుండి యేదోయొక కొంతభాగము మాత్రమే వర్తమాన కాలమునం దనుభవింపబడుచున్నది. సంచితమంతయు ననుభవింపబడుట లేదు. సంచితమందు పాపమిశ్రమములై యున్నవి పాపకర్మములయొక్క ఫలము దుఃఖము లేక నరకము పుణ్యకర్మలయొక్క ఫలము సుఖము లేక స్వర్గము ఇట్లు పరస్పర విరోధములగు పుణ్యాపాప కర్మలయొక్క ఫలములను నేక కాలమునందు పూర్ణముగా ననుభవించుటకు వీలులేదు. అందువలన సంచిత మంతయు నొక్కసారి యనుభవించుటకు కాదు. కనుక సంచితమునందుండి యేకర్మలు వర్తమానకాలమునం దనుభవించుటకు నారంభింపబడెనో, యట్టి కర్మలకు ప్రారబ్ధమని యిదివరలో

చెప్పితినికదా? ఆ ప్రారబ్ధమునకే ఆరబ్ధమనియు, అనుభవమునకు రాక మిగిలియుండు కర్మకు అనారబ్ధ మనియు పేర్లు

శాస్త్రములయందు ప్రారబ్ధమును మూడువిధములుగా చెప్పి యున్నారు 1 ఇచ్ఛాప్రారబ్ధము, 2 అనిచ్ఛాప్రారబ్ధము, 3 పరేచ్ఛాప్రారబ్ధము వాటిస్వరూప వివర మిది

**ఇచ్ఛాప్రారబ్ధము** : "అనర్థములగు కార్యము లాచరించెడివారును, రోగగ్రస్తులైయుండియు, రోగమును వృద్ధి చేయునట్టి అపథ్యపదార్థములను భుజించునట్టివారును, దొంగతనము చేయువారును, రాజుభార్యతో చెడుప్రవర్తన చేయువారును, తమకు కీడుకలుగునని తెలిసి యుండియును ఆకార్యములను చేయుచున్నారు. ఇట్టి కార్యములయందు ఇచ్ఛను పుట్టించునది గనుక దీనికి ఇచ్ఛాప్రారబ్ధమని పేరు (వే పం 7-153) [ఇట్టి ప్రారబ్ధకర్మయొుక్క ప్రాబల్యమున విషయభోగములయందు జ్ఞానికి కోరిక పుట్టినయెడల జ్ఞాని దుఃఖపడుచునే నట్టిభోగముల ననుభవించును (వే పం 7-143) జ్ఞాని అట్లనుభవించినను వేచినవిత్తనములు మొలకలెత్త లేనియట్లు జ్ఞానికట్టి భోగములు పునర్జన్మ హేతువులు కావని విద్యారణ్యులవారి మతము అజ్ఞాని యన్ననో అహంకార మమకారములు కలిగిన వాడగుటవలన వేచని విత్తనములు భూమిపైబడి యా యా ఋతువులందు మొలక లెత్తునట్లు], ప్రారబ్ధ మనుభవించు కాలమున వానిచేత చేయబడిన కర్మలు సంచితమున చేరి దాగియుంటి సమయానుకూలముగా తిరిగి వానికి ప్రారబ్ధరూపమున ననుభవమునకు వచ్చును ఈ విధముగ విత్తునుండి చెట్టును, చెట్టునుండి తిరిగి విత్తును - ఇట్లు జననమరణ ప్రవాహము ఏర్పడుచున్నది

**అనిచ్ఛాప్రారబ్ధము** : ఇది యజ్ఞానికి, జ్ఞానికి సమానము ఎట్లనగా కోరకపోయినను చీకటియందు నడచుచుండ కాలు జారిపడుటయు, ఎవనినో కొట్టబోయిన నాదెబ్బ వీనికి తగులుటయు, త్రోవన బోవుచుండగ అకస్మాత్తుగా వర్షము వచ్చి తడియుటయు, నిట్టివి కోరకనే ననుభవమునకు వచ్చుచుండును

**పరేచ్ఛాప్రారబ్ధము** : ఇది పరులనిచ్ఛచేత ప్రేరేపింపబడి వచ్చునట్టిది ఎట్లనగా నెవడేని యొుక డాపదలో నుండి తన్నుద్ధరించుమని ప్రార్థింపగా దయాళువై వానికి సహాయము చేయుటకు పోయి యాపదలో చిక్కుకొనునట్లును, ఒకడు బావిలోపడి తన్నుకులాడుచుండ వానిని దరిచేర్చుటకు పోయి వేఱొకడు

అందులోపడి మరణించునట్లును; కొంపలు కాలుచుండగ లోపలనున్న వారిని రక్షించుటకై ఒకడు ఇంటిలో దూరి వీడును నగ్నిచేత దగ్ధమగునట్లును గల ఈ ప్రారబ్ధము జ్ఞానికిని నజ్ఞానికిని సమానము.

శ్లో॥ యథైధాంసి సమిద్ధోఽగ్ని ర్భస్మసాత్కురుతేఽర్జున ।
జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా ॥ (గీత 4-37)

తా · అర్జునా! చక్కగా ప్రకాశించుచున్నటువంటి యగ్ని కట్టెల నేవిధముగా భస్మము చేయుచున్నదో యావిధముగ జ్ఞానమను నగ్ని సమస్త కర్మలను నశింపజేయుచున్నది.

"జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణి" (గీత 4-19), అనియును చెప్పబడిన 'సర్వకర్మాణి' యన్నవాక్యమునకు సంచిత ప్రారబ్ధ ఆగామి కర్మలను మూటిని నశింపజేయున దని యర్థము కాదు. పునర్జన్మ హేతువు లగు సంచిత ఆగామి కర్మలను మాత్రమే నశింపజేయును జ్ఞానియైనను ప్రారబ్ధము ననుభవించియే తీరవలయును అట్లుగాక జ్ఞానము కలిగిన తత్క్షణమే యాగామి సంచితమువలె ప్రారబ్ధముకూడ నశించునని చెప్పితిమేని, జ్ఞానము కలిగిన నాక్షణమునందే మనుష్యుడు మరణింపవలసివచ్చును. అట్లు మరణించెనేని జ్ఞాని యగువా డీప్రపంచములో నుండడు. కనుక ప్రారబ్ధ మనునది యనుభవించిననే కాని నశింపదని సిద్ధాంతమై యున్నది.

ప్రారబ్ధ మనునది సహితము జ్ఞానికి లేదని శంకరులవారు అపరోక్షానుభూతి యందు చెప్పిరి. ప్రారబ్ధకార్యములయందు సుఖదుఃఖములను జ్ఞాని సమముగా చూచుచున్నాడు కనుక యాతనికి ప్రారబ్ధకర్మమున్నను లేనియట్లే లోకమున కాతడు ప్రారబ్ధ మనుభవించుచున్నా డనియే గాని, జ్ఞానికి నట్లుండదు

శ్లో॥ తత్త్వజ్ఞానోదయా దూర్ధ్వం ప్రారబ్ధం నైవ విద్యతే ।
దేహాదీనా మసత్త్వాత్తు యథా స్వప్నో విబోధతః ॥ (అప 91)

తా · మేలుకొనిన తర్వాత కల లేనియట్లు, తత్త్వజ్ఞానోదయ మైనతర్వాత దేహాదులు అసత్తగుటవలన ప్రారబ్ధము లేదు.

ఆగామి, సంచిత, ప్రారబ్ధ కర్మలనుగురించి సులభముగ తెలిసికొనుటకు ఈ క్రింది దృష్టాంతము సరిపోవును. ఒక మనుష్యునకు నాతని పూర్వులార్జించి పెట్టినధనము విస్తారముగా నుండెను. అందులో చాలభాగము బంగారము,

రత్నములుగా చేసి యొక రహస్యస్థలమున పాతిపెట్టెను అందుండి కొంతధనమును తన దినవెచ్చమునకై తీసికొని కావలసిన వస్తుసామగ్రిని కొని తనయింటియం దుంచుకొనెను మిగిలిన ధనమును నచ్చటచ్చట కొందరికి వడ్డీకిగాను నప్పుల నిచ్చెను కాని విధివశమున నాతడు పాతియుంచిన ధనమును నిశ్శేషముగా దొంగ లెత్తుకొనిపోయిరి అప్పులు తీసికొన్న వారప్పుల నెగవేసిరి పోగా నాతనియొద్ద మిగిలియున్నది కొద్ది దినములు భుజించుటకు తగినంత యాహారము మాత్రమే

ఈ విధముగా పాతియుంచబడిన ధనమే సంచితకర్మము దానినుండి దినవెచ్చమునకుగాను తీసికొన్నధనము ప్రారబ్ధకర్మము వడ్డీకొఱకై లోకులకు నిచ్చిన యప్పు ఆగామికర్మము మానవుడు జ్ఞానము కలిగిన పిదప ఆగామి, సంచితకర్మలు నశించగా శేషించిన ప్రారబ్ధమును మాత్రము ననుభవించి ముక్తు డగుచున్నాడు

జి : ప్రారబ్ధమును అనుభవించియే తీరవలయును కదా? ప్రారబ్ధమును తప్పించుకొనుటకు ప్రయత్నించినను లాభము లేదు కదా? కనుక, పురుష ప్రయత్నముతో పని యేమి?

వే : ఈ ప్రశ్నకు తృప్తికరమగు సమాధానమును చెప్పవలయునన్న కష్టమే కాని, శాస్త్రముల యందున్న విషయమునే నీకు ఎఱిగింతును ఇందును గుఱించి యోగవాసిష్ఠమునందలి ముముక్షు ప్రకరణమున ఈ క్రింది విధమున చెప్పబడినది

శ్లో॥ ద్వావుడా వివయుద్ధ్యేతే పురుషార్థౌ సమాసమౌ ।
ప్రాక్తనశ్చైహిక శ్చైవ శామ్యత్యత్రాల్పవీర్యవాన్ ॥

తా పూర్వజన్మము యొక్కయు, ఈ జన్మము యొక్కయు సమాన, అసమాన పురుష ప్రయత్నములు రెండును రెండు పొట్టేళ్ల వంటివి రెండు పొట్టేళ్ళు పరస్పరము ఢీకొని యుద్ధము చేయుననుకొనుము అందు అల్పబలము కలది యోడిపోవును అట్లే ఈ జన్మమునందలి పురుష ప్రయత్నము బలీయ మైనదైనచో పూర్వజన్మము నందలి కర్మఫలమును ప్రక్కకు నెట్టివేయును అనగా ఓడించును

శ్లో॥ శుభేన పౌరుషేణాశు శుభమాసాద్యతే ఫలమ్ ।
అశుభేనాశుభం నిత్యం దైవం నామ న కించన ॥

తా॥ పురుషుడు తాను చేయు శుభప్రయత్నమువలన శుభఫలమును, అశుభ ప్రయత్నముచే అశుభఫలమును శీఘ్రముగా పొందుచున్నాడు. అంతే కాని అదృష్టము (దైవము) అనునది ఇంచుకయినను లేదు

**శ్లో॥ తజ్జయాయ యతన్తే యేన లోభలవలంపటాః ।**
**తౌ దీనాః ప్రాకృతా మూఢాః స్థితా దైవపరాయణాః ॥**

తా॥ అట్టి పూర్వజన్మమునందు చేయబడిన కర్మను (ప్రారబ్ధమును) జయించుటకొఱకు యత్నము చేయనివారును దైవపరాయణులు నగు విషయ సుఖముల యందుండు వారు దీనులును, పామరులును, మూఢులును అగుదురు అని ఉన్నది

విశిష్టాద్వైతులు చెప్పున దేమనగా - భగవంతుని ప్రపత్తిచేయువారు తమ కిష్టము లేని ప్రారబ్ధమును అనుభవించవలసిన అవసరము లేకుండ భగవంతుడు చేయునట

## (19) అపవాద - సృష్టియొక్క ఉపసంహారము

ఇంతవఱకు నిర్వికార నిర్గుణ పరబ్రహ్మమునందు మాయాప్రభావముచేత జగత్కల్పనమెట్లు జరిగెనో చెప్పబడెను ఆవిధము అద్వైతమునందు అధ్యారోపమనియు, అధ్యాసయనియు నందురు అనగా బ్రహ్మమునందు లేని జగత్తు కల్పింపబడినదని యర్థము ఈ జగత్తు తిరిగి బ్రహ్మమునం దేవిధముగ లీనమగునో యావిధానమునకు అపవాదమని పేరు

ఎట్లనగా ఇదివఱలో సృష్టియొక్క క్రమమును చెప్పినపుడు ఆత్మనుండి యాకాశము మొదలగు భూతములు ఒక దానినుండి ఒకటి కలిగిన క్రమమునకు వ్యతిరేకముగ అపవాదమందు భూమి జలమునందును, జలము అగ్నియందు, అగ్ని వాయువునందును, వాయువు ఆకాశమునందును, ఆకాశము ఆత్మ (బ్రహ్మ) యందును లయమగుచున్నది తుదకు శేషించినది అఖండ బ్రహ్మము మాత్రమే సృష్టిక్రమము ఎట్లు వేర్వేరు పద్ధతుల ననుసరించి చెప్పబడెనో, అట్లే కార్యము కారణముకంటె భిన్నము కాదని ఆయా పఞ్చీకరణముల ననుసరించి యేపదార్థము దేనినుండి ఉత్పన్నమైనదో దానిలో లయమగు చున్నది అనగా కార్యము దాని వ్యుత్పత్తిస్థానమగు కారణమందును, ఆకారణము దాని కారణమందును - ఇట్లు చేరుచుపోయినచో తుదకు బ్రహ్మము

శేషించుచున్నది. సృష్టి బ్రహ్మమునుండి కలిగిన క్రమమునకు (పైనుండిక్రిందికి) అనులోమమనియు క్రిందినుండి పైకి విలోమమనియు చెప్పుదురు సృష్టి ఏక్రమమున కలిగినట్లు అధ్యారోపము చేయబడెనో దానికి వ్యతిరేకమున (విలోమముగ) ముముక్షువు లయచింతనము చేయవలయునని తాత్పర్యము ప్రాణమును, కాలమును ఈప్రకృతియందు చేరినవి కావనియు, నివి స్వతంత్రముగా పరమేశ్వరునియందు కల్గినవి కనుక నివియును ప్రకృతి యవ్యక్తస్థితి చెందినపుడు పరబ్రహ్మమునందు లయమగునని కొందఱు చెప్పుదురు ప్రాణ మనునది మనస్సు, ఆకాశము అనువాని కలయికవలన నేర్పడినదని కొందఱందురు కాలముకూడ ఆకాశమునందే కలిగినట్లు కొందఱు చెప్పుదురు

## (20) కాలము

కాల మీశ్వరమూర్తియని పురాణములయందు చెప్పబడినది "కాలోఽస్మి లోకక్షయకృత్ప్రవృద్ధో" (గీత 11-32) లోకనాశనమగు ప్రబలమైన కాలమును నేనే యని భగవంతునిచే చెప్పబడెను పురాణాదులయందు పలుచోట్ల కాలము చక్రముగను ప్రవాహముగను వర్ణించబడినది భాగవతము తృతీయస్కంధము నందు కాలమును చక్రముతో పోల్చి అయనములు, ఋతువులు, మాసములు, మొదలగునవి చక్రముయొక్క అవయవములుగా వర్ణించిరి జ్ఞానవాసిష్ఠమునందలి భార్గవోపాఖ్యానమునందు కాలము పురుషాకృతితో (స్థూలదేహముతో) రూపకల్పన చేయబడినది కాలపురుషుడు కల్పాంతాగ్నిచేకూడ తాను దహింపబడనివాడనని, యనేక బ్రహ్మాండములు నశించినను తనకు (కాలమునకు) నాశనము లేదని భృగువునకు చెప్పెను

మహాభారత శాంతిపర్వమునందలి చతుర్థాశ్వాసమున భీష్ముడు ధర్మరాజునకు కాలచక్రప్రకారము తెలుపు సందర్భమున ఆత్మచేత నొకచక్రము ధరింపబడి కాలవశమున తిరుగుచున్నదనియు, నాచక్రమునకు నవ్యక్తమగు మాయ యనునది బొడ్డు అనియు, మహత్త్వము మొదలుకొని 7 వికృతులును అంచులనియు, 16 వికారములు చక్రముయొక్క చుట్టు నున్న ప్రదేశమనియు, నిశ్చలరూపము దానికాధార మనియు, స్థావరజంగమములను భూతములన్నియు దానియందున్నట్లు వర్ణింపబడినది శాంతిపర్వమున పంచమాశ్వాసమున శుకునకు వ్యాసభగవానుడు కాలముయొక్క అవయవముల నిట్లుపదేశించెనని చెప్పబడినది.

మనుష్యుని కనురెప్పపాటు కాలమునకు నిమిషమని పేరు * 18 నిమిషయములు ఒక కాష్ఠము. 30 కాష్ఠములు ఒక కల. 360 కలలు ఒక ముహూర్తము. 30 ముహూర్తములు రాత్రిపగలు గల ఒకదినము. 30 దినములు ఒకనెల. 2నెలలు ఒక ఋతువు. 3 ఋతువులు ఒక అయనము. 2 అయనములు ఒక సంవత్సరము 360 దినములు గల ఒక సంవత్సరము దేవతలకు ఒక దినము (అహోరాత్రము). నాలుగు యుగములు వాటికి సంధ్యలు సంధ్యాంశములు అన్నియును చేరి దేవతలకు 12 వేల సంవత్సరము లగును అనగా మానవ సంవత్సరముల ననుసరించి యీ యుగములయొక్క వివరము

| | | |
|---|---|---|
| కృతయుగసంధ్య | = | 1,44,000 |
| కృతయుగము | = | 14,40,000 |
| కృతయుగ సంధ్యాంశము | = | 1,44,000 |
| ఇదేవిధముగా త్రేతాయుగము దానియొక్క | | |
| సంధ్య, సంధ్యాంశములు కలిసి | = | 12,96,000 |
| ద్వాపరము దానియొక్క సంధ్య సంధ్యాంశలు కలిసి | = | 8,64,000 |
| కలియుగము దానియొక్క సంధ్య సంధ్యాంశలు కలిసి | = | 4,32,000 |
| మానవ సంవత్సరములు | = | 43,20,000 |

ఇది యొక మహాయుగము ఇట్టివి 1000 అయిన బ్రహ్మకు నొక పగలగును అంతియె అయిన నొకరాత్రి యగును బ్రహ్మయొక్క ఒక పగటికిగాని ఒక రాత్రికిగాని కల్ప మని పేరు ఒక కల్పమునకు 432 కోట్ల మానవ సంవత్సరములు 864 కోట్ల మానవ సంవత్సరములు బ్రహ్మదేవునికొక దినము (ఇవి సౌరములు)

* నిమిషమును గుఱించి పూర్వికులు కనురెప్పపాటు కాల మన్నారు వర్తమానకాలమునందలి నిమిషము 1/60 గంటయగును ఆంధ్రవాచస్పత్యమునందు దీనిని గుఱించి యిట్లు చెప్పబడినది "ఒక మనుష్యుని యొక్క పదునెనిమిది ఱెప్పపాట్లకాలము = కాష్ఠ (4/15) సెకనులు ముప్పది కాష్ఠలకాలము = కల (8 సెకనులు) ముప్పదికలలు గలకాలము క్షణము (4 నిమిషములు) పంద్రెండు క్షణములకాలము = ముహూర్తము (48 నిమిషములు. రెండు ఘడియలు) ముప్పది ముహూర్తముల కాలము అహోరాత్రము రేయింబగలు = ఒకదినము"

**మనువులు :** ఈ కల్పకాలమున పదునలుగురు మనువులు పాలింతురని మఱియొకచోట చెప్పబడినది ఒక్కొక్క మనువునకు 71 మహాయుగములు మొదటి మన్వంతరముయొక్క ప్రారంభమునందును, చివరను ఒక్కొక్క మనువునకు మధ్యయందును సంధికాలము కృతయుగమంత ప్రమాణము

| | | |
|---|---|---|
| 14 మనువులకు అయిన సంవత్సరములు | = | 4,29,40,80,000 |
| 15 సంధికాలములు కలిసి (కృతయుగ సంధ్య సంధ్యాంశములకాలము 17,28,000 X 15) | = | 2,50,20,000 |
| మానవ సంవత్సరములు | = | 432,00,00,000 |

ఇది బ్రహ్మకు నొక పగలు, ఇంతైనరాత్రి ఈ రెండునుచేరి ఒకదినము ఇట్టివి 360 అయిన బ్రహ్మకు ఒక సంవత్సరము ఇప్పటికి బ్రహ్మకు 50 సంవత్సరములు గడచి 51-వ సంవత్సర మారంభమయ్యెను ఇప్పటి దివసమునకు శ్వేత వరాహ కల్పనిపేరు ఈ కల్పమునందు ఆఱు మన్వంత రములు గడచిపోయినవి 7-వదియగు వైవస్వత మన్వంతరము జరుగుచున్నది ఈ మన్వంతరములో 27 మహాయుగములు గడచినవి 28-వ మహాయుగమునందు కలియుగము ప్రారంభమై 5065 సంవత్సరములు గడచినవి పైన చెప్పిన కల్పము అనగా 432 కోట్ల మానవ సంవత్సరములు బ్రహ్మదేవునకొక పగలని చెప్పితిమికదా ? అదియొక బ్రహ్మదేవునకేగాక ఆయన లోకమున నుండు సిద్ధపురుషులకు సైత మాకాలమానమే వర్తించునని పురాణములు చెప్పుచున్నవి **"సీ|| ఇలమీద మనువు లీరేడ్వురు జనువేళ దివసమై యెచ్చోట దిరుగుచుండు."** (పోతన భాగవతము)

ఈ విధముగా కల్పమును గుఱించి పెద్దలు చెప్పిరి ఇందులో నిత్యప్రళయమును, యుగప్రళయమును, మన్వంతర ప్రలయమును నిమిడియున్నవి నిత్యప్రళయమనగా జీవుల యొక్క సుషుప్త్యవస్థ (నిద్ర) నాలుగుయుగములు ముగిసినప్పుడు యుగప్రళయము ఒక మనువుకాలము గడచుట మన్వంతరప్రళయ మనబడును. దీనికే అవాంతర ప్రళయమని పేరు నైమిత్తిక ప్రళయమని కూడ దీనినందురు పైన చెప్పిన కల్పమునకు దైనందిన ప్రళయమనికూడ పేరు ఈ ప్రళయమున ప్రాణికోటి నశించునేకాని

మహాభూతములు నశింపవు. ఆత్యంతిక (బహ్మ) ప్రళయమున పంచమహా భూతములు సైతము నశించునని చెప్పుదురు గీతయం దీ విషయము ఇట్లు చెప్పబడినది

**శ్లో|| అవ్యక్తాద్వ్యక్తయ స్సర్వాః ప్రభవంత్యహరాగమే |**
**రాత్ర్యాగమే ప్రలీయంతే తత్రైవావ్యక్తసంజ్ఞకే ||** (గీత. 8-18)

బ్రహ్మదేవుని పగటికాలమునందు స్థావరజంగమము లైన సమస్త జంతువులు పుట్టుచున్నవి బ్రహ్మకు రాత్రి కాగానే యా జీవరాసులన్నియు నడగుచున్నవి.

**శ్లో|| భూతగ్రామ స్స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే |**
**రాత్ర్యాగమేఽవశః పార్థ! ప్రభవ త్యహరాగమే ||** (గీత. 8-19)

ఓ యర్జునా! యీ భూతసమూహమే అస్వతంత్రమైనదై మఱల మఱల పుట్టుచు రాత్రి కాగానే లీనమగుచున్నది పగలు రాగానే మఱల పుట్టుచున్నది

దీనివలన నొకానొక పదార్థముయొక్క సంకోచ వ్యాకోచములే జగదుత్పత్తి లయములని తెలియుచున్నది వీనికంతకును పరమేశ్వరుడే కారణమని చెప్పబడినది

**శ్లో|| సర్వభూతాని కౌంతేయ! ప్రకృతిం యాంతి మామికాం |**
**కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజా మ్యహమ్ ||** (గీత 9-7)

అర్జునా! కల్పాంతమందు సమస్తప్రాణులును త్రిగుణాత్మకమగు నా మాయను (ప్రకృతిని) చెందుచున్నవి కల్పాదియందు నేను మఱల వాటిని పుట్టించుచున్నాను అని యన్నపుడు ఈ కల్పశబ్దమున కర్థము బ్రహ్మప్రళయమని యెఱుగవలయును. ఆసమయమున మహాభూతములు మొదలగున వన్నియు అవ్యక్తమైన ప్రకృతియందు చేరునని యర్థము. ఇట్లు సర్వమును తనయందు లయింప జేసికొనిన నీ కాలవాహిని ఏమగుచున్నది? ఇక వాహిని యనునది యెక్కడ? ఇరుప్రక్కల నొడ్డులుండిన గదా వాహిని యగును; నామరూపములు లేనట్టియు, హద్దులు లేనట్టియు, రెండు సంఘటనలే కల్గినట్టియు, ఆ అవ్యక్త స్థితియందు కాల మెట్లుండును? అయినచో నీ కాల మెచ్చటికి పోయినది?

క॥ కాలంబెడలిన విద్యో
నీల్మితమగు బోధ మన్యమిశ్రత్వంబుం
దూలించి వెలుఁగుచుండు వి
శాలమతీ! బ్రహ్మ మది ప్రశ స్తము శ్రుతులన్ (తిక్కన మభా శాం)

కాలము సమస్త నామరూపములను నశింపజేయగ, పరబ్రహ్మమును ఆశ్రయించియుండు అవ్యక్త ప్రకృతియు, కాలమును నీ రెండును బ్రహ్మమునందే అణగిపోగా ఇతర పదార్థ సంబంధములేని అద్వితీయాఖండబోధ స్వరూపము మాత్రమే ప్రకాశించుచున్నది ఆ బోధకు నే ప్రళయము నందైనను నెట్టి వికారములును సంభవించవు అట్టి కేవలబోధ స్వరూప మేదిగలదో అదియే బ్రహ్మమని శ్రుతులయందు ప్రశస్తమై యున్నదని పద్యముయొక్క తాత్పర్యము

ఒకమారు సింహావలోకనము చేసినయెడల "స దేవసోమ్యేద మగ్ర ఆసీదేకమేవాద్వితీయం." (ఛా 6-2-1) ఓసోమ్యుడా! సృష్టికిపూర్వము సత్తు మాత్రమే యుండెను. "ఆత్మా వా ఇద మేక ఏవాగ్ర ఆసీత్" (ఐత 1-1-1) ఈ ప్రపంచము సృష్టికిపూర్వము ఒక ఆత్మగా నుండినది అన్న వాక్యములు జ్ఞప్తికి వచ్చుచున్నవి "సర్వం ఖల్విదం బ్రహ్మ" సమస్తమును బ్రహ్మము అన్న వాక్యమునందలి "సమస్తము" మిథ్యయై బ్రహ్మముమాత్రము సత్యమగుచున్నది

అట్టి పరబ్రహ్మమునకు నమస్కారములు

## (21) భౌతిక విజ్ఞానవాదము

ప్రపంచముయొక్క యుత్పత్తి లయముల గురించి పాశ్చాత్యఖండము నందలి ఆధునిక పాశ్చాత్య జ్యోతిశ్శాస్త్ర (ఖగోళశాస్త్ర) జ్ఞులు చెప్పునది మనము పరిశీలించితిమేని వారు చెప్పునదియు మనపూర్వులు చెప్పునదియు నించుమించు సమానముగనే యున్నది వారు చెప్పువిషయము లివి - సూర్య, చంద్రగ్రహ తారకాదులు పుట్టుటకు పూర్వము ప్రదేశము మాత్రమే యుండెను, దానియందు వాయువు మహావేగమున వీచుటచేతనో మఱేకారణముచేతనో యాప్రదేశములోనికి గొప్పతేజోరాశి (నెబ్యులా) ప్రవేశించెను అది విచ్ఛిన్నమై ప్రదేశము నందంతటను చెల్లాచెదరుగా పడి నెబ్యులాలు, గెలాక్సీలు, నక్షత్రములును కల్గెను ఇట్టి నక్షత్రములలో నొకటి మనకు కనబడుచున్న సూర్యుడు.

సూర్యుడు ప్రజ్వలించుచున్న తేజోరాశి ఒకానొక కారణమువలన ఇతనినుండి కొంతద్రవ్యము వేఱై దూఱముగా పోవుటకు ప్రయత్నించి కొంతదూరము సాగి తునకలై అవి సూర్యుని ఆకర్షణశక్తివలన పోలేక సూర్యుని చుట్టును ప్రదక్షిణము చేయసాగినవి ఇవియే గ్రహములైనవి ఇట్టి గ్రహములలో భూమి యొకటి. ఇది ప్రజ్వరిల్లుచున్న సూర్యునిలోని ద్రవ్యరాశిలోనుండి వేఱుపడిన బిందువే యయినను క్రమముగ నిది చల్లారి కొంతభాగము వాయురూపముగను, కొంతభాగము ద్రవరూపముగను, కొంతభాగము ఘనరూపముగను నయినది ఆ తర్వాతనే భూమిపైన జీవరాసులు పుట్టినవని చెప్పుదురు అట్లు భూమి ఘనీభవించి సుమారు 140 కోట్ల సంవత్సరము లయియుండును రూథరుఫర్డు మహాశయుడు భూమియొక్క వయఃపరిమితి 340 కోట్ల సంవత్సరములకు మించియుండదని లెక్కకట్టెను సౌరకుటుంబ మేర్పడి దాదాపు 100 కోట్ల సంవత్సరములనుండి 1000 కోట్ల సంవత్సరముల వఱకు నయియుండునట ఇప్పటికిని ననేక నెబ్యులాలున్నవి

యాంద్రామీడారాశిలోని M 31 నెబ్యులా బరువు సూర్యుని కంటె 3500,000,000 రెట్లు పెద్దది భూమి తనచుట్టు తాను ఒకసారి తిరుగుటకు 24 గంటలకాలము పట్టునట్లు, యాంద్రామీడా నెబ్యులా తనచుట్టు తానొకసారి తిరుగుటకు 19000,000 సంవత్సరములు పట్టును దీనియొక్క భ్రమణవేగము మందమగుటచేత నింతకాలము పట్టునని యర్థము కాదు. దీనియొక్క వైశాల్యము గొప్పదగుటవలన భ్రమణవేగ మధికముగ నున్నను, అంతకాలము పట్టుచున్నది దీనిబరువు 3500,000,000 సూర్యుల బరువునకు సమానముగా నున్నదట దీనినిబట్టి మనము తెలిసికొనునది యేమన ఆకాశాది మహాభూతములు ఒకటితర్వాత ఒకటి పుట్టుటకు మధ్య కొంతకాలము వ్యవధి యున్నట్లు తెలియుచున్నది వీటి లయముకూడ నట్లే తెలియబడుచున్నది. సూర్యుని బరువు దినమును 36,000 కోట్ల టన్నులు తగ్గుచున్నదట సూర్యునిచుట్టు ప్రదక్షిణము చేయుచున్న భూమి 100 సంవత్సరములకు 1 గజము చొప్పున సూర్యునికి దూరముగా వెళ్ళిపోవుచున్నది ఇందుచేత ముందెప్పుడో యొకప్పుడు భూమి పైన జీవరాసు లుత్పత్తికావని యూహింపవచ్చును

అన్నిటికంటె నాశ్చర్యకరవిషయ మేమన పశ్చిమఖండమునందలి ఆధునిక ఖగోళ జ్యోతిశ్శాస్త్రవేత్తలు నక్షత్రము లన్నిటికంటెను జ్యేష్ఠానక్షత్రము పెద్దదనియు గ్రహములలో గురుగ్రహము గొప్పదనియును తమ పరిశోధనలవలన తెలిసికొనిరి

అనేక వేలసంవత్సరములకు పూర్వమే భరత ఖండమందలి ఋషిపుంగవులు "జ్యేష్ఠగురు" అనుపేర్లను వాటికి పెట్టియుండుటను చూడ జగదుత్పత్తి ప్రళయముల గుఱించి మనవారు చెప్పెడి లెక్కలు పుక్కిటి పురాణములు కావనియు, త్రికాలజ్ఞులైన వారు చక్కగా తెలిసికొని చెప్పిరనియు మనము నమ్మవచ్చును

రాత్రివేళ మనకంటికి కనబడు అనంత నక్షత్రరాశియును నెబ్యులాలును ప్రకాశించుచు వానిలోని ద్రవ్యము అంతయు నశించిపోగా ప్రదేశమంతయు నంధకార బంధుర మగునని శాస్త్రజ్ఞులు ఊహించుచున్నారు తిరుగా నీ యంధకారమును భేదించి గొప్ప తేజోరాశి (నెబ్యులా) యుదయించును భాగవతమునందలి గజేంద్రమోక్షణ కధాఘట్టములోని ఈ క్రింది పద్య తాత్పర్యముతో భౌతికవాదుల యభిప్రాయము సహిత మేకమగు చున్నదని భావింపవచ్చును

కం|| లోకంబులు లోకేశులు,
లోకస్థులుఁ దెగిన దుది నలోకం బగు పెం
జీఁకటి కవ్వల నెవ్వం డే
కాకృతి వెలుఁగు నతని నే సేవింతున్.

పై విధముగా సృష్టియంతయు నుపసంహరింపబడిన పిమ్మట సృష్టికి పూర్వమందున్న బ్రహ్మమే మిగిలెను "ఆద్యంతములయందు లేనిది వర్తమానమునందుకూడ లేనట్లే యగు"నని చెప్పబడిన మాటయొక్క యర్థము విదిత మాయెను జడమును అనిత్యమును నగు జగత్తు ఆత్మయొక్క సత్తాస్ఫూర్తుల వలన తాను సత్తాస్ఫూర్తులు కలిగినదాయెను అనగా (1) అస్తి (2) భాతి (3) ప్రియము (4) రూపము (5) నామములను - నీ నైదింటి యందును జగత్సంబంధమగు నామరూపములు రెండును అదృశ్యమై ఆత్మసంబంధమగు 'అస్తి భాతి ప్రియము' అను నీ మూడుమాత్రమే మిగిలెను ఎట్లనగా స్వర్ణకారునియొద్ద అయిదుతులముల బంగారపు ముద్ద (కళిక) నిచ్చి సువర్ణకంకణము చేయించగా అది అయిదు తులముల తూకముమాత్రమే యుండెను మొదట నిచ్చిన అయిదుతులముల బంగారమే యుండెను గాని, కంకణ సంబంధమగు (ప్రత్యేకమగు) బంగార మేమియు దాని యందు లేదు తిరిగి దానిని కరిగించగా అది మొదటివలెనే ముద్దయాయెను

అద్యంతములయందు లేని కంకణనామము, రూపమునను నీ రెండును మిధ్య యాయెను **"వాచారంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యమ్."** కారణ సత్తకంటె వేఱుసత్త లేకపోయినను వ్యవహారముకొఱకు ప్రత్యక్షముగ కనబడు కార్యజాతమంతయు వాచారంభణ మనబడును. అనగా 'ఘటము (కుండ) నందు అంతటను మృత్తికతప్ప వేఱుపదార్థము లేకపోయినను మృత్తికను కుండయని వ్యవహరించినట్లే' యని శ్రుతి తాత్పర్యము ఇట్లు "బ్రహ్మ సత్యమ్ జగ న్మిథ్యా" అను వాక్యముయొక్క అర్థము పూర్తిగా చెప్పబడెను

## (22) సచ్చిదానందములు

**సచ్చిదానందమనగా :** సత్తు, చిత్తు, ఆనందము - అను నీ మూడును చేరి సచ్చిదానందమని చెప్పబడును కాని యీ మూడును వేర్వేరు కాదు సత్తుననదే చిత్తును ఆనందమును చిత్తే సత్తును, ఆనందమును ఆనందమే సత్తు చిత్తు ఒకే వస్తువుయొక్క స్వరూపము మూడుపేర్లతో చెప్పిరి ఆవస్తువే పరబ్రహ్మము ఈ మూడును పరబ్రహ్మముయొక్క గుణములు కావు పరబ్రహ్మస్వరూప మగుటచే నొక దానిని విడిచి మఱియొకటి యుండదు ఇది అఖండము, అఖండసత్తు, అఖండచిత్తు, అఖండానందము

సత్తు, చిత్తు, ఆనందము అను నీ మూడు శబ్దములు ఒక దానితో నొకటి కలిసి సచ్చిదానందమని చెప్పినపుడు ఇది పరబ్రహ్మము నుద్దేశించి చెప్పబడిన బ్రహ్మ నిర్వచనమే యని యర్థము చేసికొనవలయును. ప్రకృతిసంబంధమైన గుణములని అర్థము చేసికొనకూడదు ఇట్లే తైత్తిరీయ శ్రుతియందు (తై 2-1) **"సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ"** అని చెప్పబడినది అనగా బ్రహ్మము సత్యము బ్రహ్మము జ్ఞానము, బ్రహ్మము అనంతము అని శ్రుతియొక్క తాత్పర్యము ఇవి బ్రహ్మయొక్క లక్షణములు విశేషణములుకూడ కావచ్చునని పండితులు చెప్పుదురు

**జి :** లక్షణమనగా నేమి?

**వే :** ఒక వస్తువుయొక్క స్వరూపమును నిట్టిదని నిరూపణచేసి దాని ప్రత్యేక వ్యక్తిత్వమును వ్యక్తీకరించుట. అనగా ఆ వస్తువును ఇతర వస్తువుల నుండి వ్యావర్తింప చేయునది లక్షణము. ఇచ్చట బ్రహ్మము సత్యమనగా అసత్యము నుండి (అసత్యబ్రహ్మమునుండి) సత్యబ్రహ్మమును వేఱుచేసి

నిరూపించుట సత్యమనగా: ఏపదార్థమునకు నేస్వరూప ముండునో ఆస్వరూపము త్రికాలములయందును బాధింపబడనిదై (మార్పులేనిదై) యుండునట్టిది సత్యమనబడును.

జి : విశేషణమనగా నేమి ?

వే : సజాతీయమగు వస్తువులయందు ఒక విశిష్ట ధర్మముగల కొన్నిటినిమాత్రము వ్యావర్తింప చేయునది అనగా గోవులన్నిటియందును గోజాతిధర్మము సమానముగా నుండును కపిలగోవు అనునపుడు ప్రత్యేకముగా కపిలవర్ణము గలగోవు అని ప్రత్యేకింపబడుట అది దానికి విశేషణ మగును బ్రహ్మమునకు సజాతీయ విజాతీయ స్వగత భేదములు లేనందున పరబ్రహ్మమును నిర్విశేషుడని చెప్పిరి అనగా ఏ విశేషణములును లేనివాడని అర్థము. సత్యజ్ఞానానంతములు లక్షణములే గాని విశేషణములు కావని కొందఱును, లక్షణములును విశేషణములును రెండును కావచ్చునని కొందఱును చెప్పిరి "సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ" అని శ్రుతి భయపడుచునే పరబ్రహ్మమును నిర్వచనము చేసెనని పెద్దలందురు

శబ్దశాస్త్రము, పాండిత్యము నటుంచి మన యనుభవమును బట్టిగూడ పై నిర్వచనము సరియైనదని చెప్పవచ్చును జగత్తు, బ్రహ్మము అను వీటిని నిర్వచనము చేయవలెనన్న మొదట జగత్తును నిర్వచనముచేసి పిమ్మట బ్రహ్మమిట్టిది కాదని చెప్పినచో చాలును ఇది నిషేధపద్ధతి జగత్తును గుఱించి చెప్పునపుడు అనృత జడ దుఃఖాత్మకమని చెప్పిరి అనగా జగత్తు అనృతము, జగత్తు జడము, జగత్తు దుఃఖము అని యర్థము దీనిని వ్యతిరేకముగ చెప్పవలయునన్న అనృతము కానిది, జడము కానిది, దుఃఖము కానిది బ్రహ్మమని చెప్పవలెను అదియే అనృతమునకు వ్యతిరేకముగ సత్యము లేక సత్తు అనియును, జడమునకు వ్యతిరేకముగ చిత్తు లేక జ్ఞానము అనియును, దుఃఖమునకు వ్యతిరేకముగ ఆనందము లేక అనంతము (అనంతమే పరిపూర్ణము) అనియును పై శ్రుతి వాక్యమునందు చెప్పబడినది.

"సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ" యన్న శ్రుతివాక్యములోని సత్యశబ్దము జగత్తునందలి వ్యావహారికమగు సత్యాసత్యములను ద్వంద్వములోని సత్యశబ్దము కాదనియు. (ఎట్లనగా మట్టి సత్యము, దాని వికారములగు కుండలు మొదలగు నవి అసత్యము అనునట్లు) ప్రాకృతసంబంధమగు జడద్రవ్యము యొక్క

నిత్యత్వమును నిరూపించు నుద్దేశముతో చెప్పినది కాదని తెలియ జేయుటకే సత్యశబ్దమునకు పిమ్మట జ్ఞానశబ్దము చేర్చబడినది.

జ్ఞానశబ్దముచేత లోకవ్యవహారమునందు చెప్పబడు జ్ఞానాజ్ఞానములను ద్వంద్వములోని జ్ఞానమువంటిది కాదనియు, 'ప్రజ్ఞానం బ్రహ్మ'యను శ్రుతియందు చెప్పబడిన చిద్రూపమును స్వయంప్రకాశమును నగు జ్ఞానమును గూర్చి చెప్పబడినదేగాని, చావుపుట్టుకలు గల బుద్ధిజన్య జ్ఞానముగాని, జ్ఞానాజ్ఞానము లను ద్వంద్వములోని జ్ఞానముగాని చెప్పబడలేదనియు తెలియ జేయుటకే శ్రుతిలోని జ్ఞానశబ్దమునకు పిమ్మట అనంతశబ్దము చేర్చబడినది

ఇక మూడవదియగు అనంతశబ్దము అఖండమని బోధించుచున్నది కనుక అది పరబ్రహ్మమునకు తప్ప అన్యత్ర వర్తింపదు కాబట్టి "అనంతం బ్రహ్మ" అని చెప్పబడినది అట్లే సచ్చిదానంద మనుటలో ఆనందశబ్దమునకు పరిపూర్ణమని యర్థము అనంతమన్నను పరిపూర్ణ మన్నను ఒక్కటే

ఈ రీతిగ అఖండసత్యమని, అఖండజ్ఞానమని, అనంతశబ్దము చేత విదితమగు చున్నది "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" అను శ్రుతివాక్యము పరబ్రహ్మమును పూర్ణముగ నిర్వచనము చేయజాలదని (గౌణమని) అంద ఱెరింగినదే కాని యింతకంటె గొప్పగ నిర్వచనముచేయుట కెవ్వరికిని సాధ్యము కాదని అంగీకరించి, కుతర్కమును చేయుకుండుట ఉత్తమ పద్ధతి

## (23) సత్తు* - అసత్తు

'సత్' అను సంస్కృతపదమునకు తెనుగున కలిమి యని యర్థము అనగా భూతభవిష్యద్వర్తమాన కాలముల యందుండు నట్టిదియు; కలిమి (ఉనికి) యే స్వరూపముగా కలిగినట్టిదియు అగు వస్తువు సత్ అని పిలువబడును ఈ విషయ మిదివఱకు కొంత చర్చింపబడినది అయినను ఇచట మఱల చెప్పుట పునరుక్తి కానేరదు ఇతరశాస్త్రముల యందువలె వేదాంతశాస్త్రమందు పునరుక్తిదోషము లేదని పెద్దలు చెప్పిరి పునరుక్తి యనగా చెప్పిన యర్థమునే మఱల చెప్పుట జిజ్ఞాసువునకు బోధ దృఢతరము చేయుటకు పూర్వాచార్యులు, చెప్పినవిషయమునే మఱల మఱల చెప్పిరి.

* సచ్చిదానందములు శరీరమునకు పుట్టినవని అచలమత స్థాపకులగు శివరామ దీక్షితులవారు చెప్పుటవలన సచ్చిదానందములను వేఱు వేఱుగా కొంత విస్తరించి చెప్పవలసి వచ్చినది

"స దేవ సో మ్యేద మగ్ర ఆసీ దేక మే వాద్వితీయం తదె క ఆహురస దేవేద మగ్ర ఆసీ దేక మే వాద్వితీయం తస్మా దసతస్స జాయేత" (ఛాం 6-2-1)

"ఓ సౌమ్యుడా! సృష్టికిపూర్వము "సత్తు" మాత్రమే యుండెనని చెప్పబడెను సత్తునకు విపరీతమైనది అసత్తు బ్రహ్మ మిట్టిదని చెప్పుటకు సాధ్యముకానిది అట్లు చెప్పుటకు సాధ్యముకాని పరతత్త్వమును శిష్యునికి బోధించుటెట్లు ? శిష్యుడు సృష్టికి పూర్వ మేమి యుండెనని గురువును ప్రశ్నించెను? గురు వేమని చెప్పగలడు? అట్టిది యిట్టిదని చెప్పుటకు నలవికాని బ్రహ్మవస్తువును ఎఱుకపరచవలెనన్న శిష్యుని చిత్తపరిపాకమునుబట్టి బోధింపవలసియున్నది శిష్యునిబుద్ధి దేశకాల నిమిత్తతలకు లోనైనది అట్టి సందర్భమున శిష్యుని కాతని యనుభవమునే యాధారము చేసికొని బోధింపవలసి వచ్చినది "సృష్టికి పూర్వము సత్తుమాత్రమే యుండెను" అని చెప్పినపుడు సత్తు ఒకానొకప్పు డుండినది, యిప్పుడు లేనిదని యర్థము చేయరాదు అయిన 'సత్త'ను వ్యవహారము ఎట్లు వచ్చెను? 'కలిమి' యన్నపుడు 'లేమి' యను నది వెంటనే తోచుచున్నది అట్లైనచో నీ రెండును ప్రకృతి యొక్క యావరణమునకు లోబడిన ద్వంద్వమే యగును

ప్రకృతికి నతీతమైన బ్రహ్మమును బోధించుటకు 'సత్త'ను శబ్దమెట్లు యోగ్యమగును? అనుప్రశ్న వెంటనే కలుగును లోకవ్యవహారమున భూమి, ఇండ్లు, మొదలగు కలిమిగల వస్తువులు సత్తని పిలువబడ దగినవనియు కుందేటికొమ్ము, వంధ్యాపుత్రుడు అను అభావవస్తువులు 'అసత్త'నియు, ఈ విధముగ సదసత్తులయొక్క యర్థము లౌకికదృష్టిచేత కలిగెను ఈ కారణముచే బ్రహ్మము సత్తని యొకటోటను, సత్తు కాదని మఱియొక చోటను పరస్పరవిరుద్ధముగా చెప్పబడెను ఈ విధములగు అర్థములచేత సత్తనగా ప్రపంచము లేక మాయ యని యుపనిషత్తులయందు కొన్నిచోట్ల గలదు ఎచ్చట ప్రపంచమును సత్తని చెప్పిరో యచ్చట బ్రహ్మమును అమృతమని చెప్పిరి ఇట్లు చెప్పుచు సత్తనగా బ్రహ్మమే యని నిర్ధారణచేసిరి భాగవతమునందలి గజేంద్రమోక్షమున నిట్లు చెప్పబడినది **"కలుగడే నాపాలి కలిమి సందేహింప కలిమి లేములు లేక కలుగువాడు."** అనగా ఉండుట లేకుండుట యనునవి లేక, యుండుట (కలిమి) నే స్థిరపఱచిరి అధ్యాత్మ శాస్త్రమందు సత్తను పదము నిత్యసత్యమైన బ్రహ్మము నందే చెప్పబడెనని యర్థము చేసికొనవలెను

"నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః" (గీత 2-16) సత్తు (కలిమి) అనగా (ఎప్పుడును) నుండునట్టిది, యొకప్పుడు లేకపోవుట లేదు అసత్తు (లేనిది) ఒకప్పుడుండుటయును లేదు అని భగవంతుడు సత్తు శాశ్వతమైనదని చెప్పెను

"అనాది మత్పరం బ్రహ్మ న సత్తన్నాస దుచ్యతే" (గీత 13-13) "ఆది లేని నాశ్రేష్ఠమగు స్వరూపము నిర్గుణ బ్రహ్మము సత్తును గాదు, అసత్తును గాదు "లోకవ్యవహారమున సిద్ధింపబడిన భూమి, ఇండ్లు మొదలగు సత్పదార్థముల కంటెను, కుందేటికొమ్ము, వంధ్యాపుత్రుడు మొదలగు అసత్పదార్థములకంటెను, బ్రహ్మము వేఱైనవాడని గాని, సత్తైనప్రకృతికంటెను, అసత్తైన స్థావరాది భూతనిచయముల కంటెను తాను వేఱైన వాడైనట్లుగాని, చెప్పెనని యర్థము

నిర్గుణబ్రహ్మము ఉండునదికాదు లేనిదికాదు, ఈ రెండింటికి అతీతమై యుండునట్టిది అని చెప్పుటయందు మఱియొక యర్థమును కూడ చెప్పిరి ఒకడు ఘటమునుచూచి, ఇచట ఘట మున్నదని చెప్పును అప్పుడు 'ఘటము' ఉన్నది అను బుద్ధికి (జ్ఞానమునకు) విషయ మగుచున్నది ఘటము లేనప్పుడు లేదు అనుబుద్ధికి విషయమగుచున్నది కనుకనే నిర్విషయమగు బ్రహ్మము ఒకప్పుడుమాత్రమే యుండి మఱి యొకప్పుడు లేనిది కాదు, "ఉండుట లేకుండుట యనునది లేక ఉండునట్టిది," అని చెప్పవలసివచ్చెను 'ఉండునదికాదు లేనిదికాదు' అనిచెప్పి అంతటితో విరమించుకొన్న అది మాయయొక్క నిర్వచన మగును అట్లు చెప్పక "ఉన్నదని గాని లేదనిగాని చెప్పుటకు వీలులేక యుండునట్టిది బ్రహ్మమ"ని చెప్పి తుదకు కలిమినే దృఢపరచవలసి వచ్చెను

"లోకవ్యవహారమున సిద్ధింపబడిన సదసత్తులు నేను కాన"ని (గీత 13-13) నిరాకరించినప్పటికి, గీతయొక్క ఏడవ యధ్యాయమువందలి 4, 5 శ్లోకములలో పరా, అపరాప్రకృతులు నావిభూతు లే అని చెప్పిన ఆవాక్యమునకు విరోధము రాకుండుటకై భగవంతుడు తిరిగి యిట్లు చెప్పెను. "సద సచ్చాహ మర్జున" (గీత 9-19), "సత్తును అసత్తును నేనే" సత్తైన ప్రకృతియు, తత్కార్యమైన ప్రపంచమును (అసత్తును) రెండును నేనే యని చెప్పినట్లు అర్థముచేసికొనవలయును వేదాంతశాస్త్ర మనుసరించి సత్తనగా శాశ్వతవస్తువని, బ్రహ్మనిర్దేశిత మైనదనియు రూఢియైనది

మఱియు నాత్మసాంగత్యమున మాయ తొలుత ఆకాశమును కల్పించెను దానినుండి వాయువు, దానినుండి అగ్ని, అగ్నినుండి జలము, జలము నుండి పృధ్వి కల్పించినదని చెప్పుదురు ఆకాశము కలదు, వాయువు కలదు, అగ్ని కలదు, జలము కలదు భూమి కలదు అను నీవాక్యములయం దాకాశము మొదలగునవి యొక దానినుండి యొకటి కల్గినను, నొకదాని స్వరూపము మఱియొక దానియం దనువర్తింపక పోయినను 'కలదు 'కలదు' అనునీకలిమి (ఈసత్పదార్ధము) యొక్క లక్షణము అన్నింటియందును ననువర్తించుటచేత కలిమి యొక్కటి మాత్రమే సత్యమని, అదియే సత్ అని తక్కిన దంతయు 'అసత్' అని వేదాంతులమతము

ఈచర్చవలన ఫలిత మేమనగా ఉపనిషత్తులకాలము నుండియు సత్తనుపదమును ఉపయోగించినవారు, వారిమనస్సున నేయర్థము నిడికొని చెప్పిరో దానినిబట్టి 'సత్త'ను శబ్దమునకు వ్యాఖ్యానము చేయవలయునుగాని "న సత్తన్నాసదుచ్యతే" అని గీతయందు చెప్పబడినదని, యాకారణము చేతనే వేదాంతశాస్త్రములయం దెచ్చటెచ్చట "సత్" శబ్దము ప్రయోగింపబడెనో అచట 'సత్' శబ్దముయొక్క యర్థము బ్రహ్మముకాదని చెప్పుట సరికాదు 'సత్' అను శబ్దమును బ్రహ్మమునందే అనేకు లనేకపర్యాయములు ప్రయోగించినారని తెలియవచ్చుచున్నది

## (24) చిత్తు - జడము

**చిత్తు** : చిత్తనగా స్వయంప్రకాశమగు జ్ఞానము అదియే ప్రజ్ఞానఘనము అదియే ఆత్మ లేక బ్రహ్మము దానికంటె అన్యమైనది జడము ప్రకృతి మొదలు గడ్డిపోచవఱకును గల సమస్తము జడము చిత్తు తాను స్వయముగ ప్రకాశించుచు సర్వమును ప్రకాశింప జేయగల వస్తువు చిత్తునిత్యమును సత్యమును నై యుండవలయునే గాని, కొంతకాలము లేకుండి, కొంతకాలముండి, మఱికొంతకాలము లేకపోవుటకు వీలులేదు కారణమేమనగ, చిత్తు తానుండి తనయునికిని తెలియజేయుచు తనకంటె అన్యమైన వాటి యునికిని తెలియ చేయునట్టిది అట్టిది ఒకానొకప్పుడు లేకపోయెనేని, యట్టి లేకపోవుటయను ఆ లేమిని యిట్టిదని ఎఱుకపరుచుటకు మఱియొక చిత్తు లేదు గనుక, జననమరణ విరహితమైన శాశ్వత వస్తువే చిత్తుగా నుండి తీరవలయును కావున శాశ్వతమగు సత్తే చిత్తని యుపనిషత్తుల మతము

జడము : జడద్రవ్య మంతయు పుట్టినదే జడమనగా తాను ప్రకాశింప లేదు (తాను ఉన్నట్లు తనయునికిని తెలియజేయ లేదు) ఇతరపదార్థముల యొక్క యునికిని తెలియజేయ లేదు. ఇందుకు దృష్టాంతము చీకటియందు మనకు ఏవస్తువులును తెలియబడవు. దీపమున్నచో నింటియందున్న వస్తువులను మనము తెలిసికొనగలము. ఇప్పుడు దీపమువలన దాని సహాయమున ఇంటిలోని వస్తువులను చూడగలిగితిమి దీపమును చూచుటకు అన్యసహాయము అవసరము లేకపోయినది దీపము తాను ప్రకాశించుచు ఇతరములను ప్రకాశింపజేసెనని దీనియర్థము అట్లే చిత్తు తాను ప్రకాశించుచు సూర్య చంద్ర నక్షత్రాది జ్యోతిస్సులను ప్రకాశింప జేయుచున్నది జడము సమస్తము పుట్టినదే యగుటవలన దానికి చైతన్యముగాని స్వయంప్రకాశముగాని లేదు కొన్నిగ్రంథముల యందు బుద్ధిని జ్ఞానశబ్దముతో వ్యవహరించిరి ప్రకృతి లేక మాయను పరమేశ్వరిగా ఉపాసించిన భక్తులు, కవులు ఆమెను 'చైతన్యరూపిణి' యని 'చిద్రూపిణి' యని వర్ణించిరి ఈ వర్ణనల నాధారముగ చేసికొని కొందఱు* ప్రకృతియే చిద్రూపిణియని చిత్తనగా మాయ యని వాదించిరి

ఇనుమునకు ప్రకాశముగాని ఉష్ణ (దహన) శక్తిగాని స్వయముగా లేకపోయినను అగ్ని సంయోగమువలన దాని కారెండు గుణములును కలుగుచున్నవి అంతమాత్రముచేత ఇనుము ప్రకాశించునని దహించునని చెప్పగూడదు ఎంతవఱకు అగ్నితో దానికి సంబంధము కలదో, అంతవఱకు దాని కాగుణము లుండును కనుక ప్రకృతియు, తజ్జనితమైన జడద్రవ్యమును స్వయముగ చిద్రూపిణి కాదు, చైతన్యరూపిణి కాదు రాజు యొక్క ప్రతినిధిగా వచ్చిన రాజప్రతినిధి (గవర్నరు జనరల్) ని ప్రభునామముతో పిలుచుట లోకవ్యవహార మందున్నది అతడు ప్రభువు కాకపోయినను ప్రభువగురాజు యొక్క అధికారము (నిగ్రహానుగ్రహములు) అతనియందుండుటచే అతని ప్రీతికొఱకు క్రింది యుద్యోగులు ప్రభువని పిలుచునట్లే పరమేశ్వరి భక్తులగువారు చిద్రూపిణి యని ప్రకృతిని సంబోధించిరి వాస్తవమునకు ఆమె చిన్మయి మాత్రమే సచ్చిదానందములలో మూడవదియగు ఆనందమును గుఱించి విచారింతము

---

* శివరామదీక్షితులవారు మాయ చిద్రూపిణి యని గుర్తెఱుగునది శరీరమేయని చెప్పిరి

## (25) ఆనందము (సుఖము) - దుఃఖము

**ఆనందము :** "ఆనందో(బ్రహ్మ" అని శ్రుతి ఇంద్రియములను బహిర్ముఖము కానీయక మనస్సునందు నిలిపి, మనస్సును చంచలము కానీయక బుద్ధియందు చేర్చి యోగి జాగ్రద్దశయందు సమాధిస్థితి ననుభవించుచున్నాడు గీతయొక్క ఆఱవ అధ్యాయమందిట్లు చెప్పబడినది

చిత్తమెచట నుపరితి నొందుచున్నదో, యెక్కడ మనస్సు ఆత్మను పొందుచున్నదో, యెచట నేస్థితియందు యోగి యోగాభ్యాసముచేత తన్ను తాను చూచుకొని ఆనందించుచున్నాడో, యేయవస్థయం దింద్రియములకు నతీతమైన పరమసుఖమును బుద్ధిచేత తెలిసికొనుచున్నాడో, యే యవస్థయందు స్వస్వరూపుడై యుండు యోగినిశ్చలుడై చలింపకయుండునో, యింతకంటె సుఖమును పొందుటకు నెచటను సాధ్యముకాదో, యే లాభమును పొందుటచేత నితర లాభము నపేక్షింపడో, యే లాభమును పొందినపిమ్మట ఎంతటి దుఃఖము వచ్చినను వికారము జెందడో- యట్టి యత్యంత దుఃఖరహితమైన స్థితిని యోగమందురు ఇట్టి యోగమునందు యోగి పొందునట్టి సుఖమే యానందము. అదియే బ్రహ్మము. దానికే బ్రహ్మానంద మనిపేరు

బ్రహ్మము వేఱు, ఆనందము వేఱు కాదు దీనినే తురీయావస్థ యని చెప్పిరి సమస్త ద్వంద్వము లెచట నశించినవో, అచ్చట శాశ్వతముగా దుఃఖము నశించినదనియే చెప్పవచ్చును ప్రకృతిలోని సుఖదుఃఖము లచ్చట లేవు. కోరికలకు స్థానము సంకల్పము. కోరికలవలననే దుఃఖము కలుగుచున్నది సర్వసంకల్పవర్జిత మగు నాస్థితియందు కోరిక లెక్కడివి? దుఃఖ మెక్కడిది? అదియే అఖండానందము ఈ విషయమే గీతయందు "ప్రశాంతమనసం హ్యేనం యోగినం సుఖ ముత్తమం" అనియును "సుఖేన బ్రహ్మ సంస్పర్శ **మత్యంతం సుఖమశ్నుతే"** (గీత 6-27, 28) అనియును చెప్పబడినది ఈ బ్రహ్మానందమును గుఱించి యుపనిషత్తులయం దనేకచోట్ల వివరింపబడినది. ముఖ్యముగా బృహదారణ్యకోపనిషత్తు అధ్యా 6 బ్రా. 3 యందును, *తైత్తిరీయోపనిషత్తు బ్రహ్మానందవల్లి 8-వ అనువాకమునందును, బ్రహ్మానందముయొక్క ప్రమాణములు (వర్ణన) చేయబడినవి. అందిట్లున్నది

* స యోమనుష్యాణాగ్ రాద్ధః సమృద్ధో భవత్యన్యేషా మధిపతి స్సర్వై ర్మానుష్యై ర్భోగై స్సమ్పన్నతమః స మనుష్యాణాం పరమ ఆనన్దోఽథమే శతం మనుష్యాణా మానన్దా..

సర్వావయవములు చక్కగానుండి ఆరోగ్యవంతుడై యందఱికి నధికారియై యుండినవా డనుభవించు నానందమును ప్రమాణముగా తీసికొని పితరులు, గంధర్వులు, కర్మదేవతలు, ఆజానదేవతలు, ప్రజాపతి, బ్రహ్మ - వీరల ఆనందములో నొకరియానందము కంటె మఱియొక్కరియానందము వరుసగా నూఱింతలు నూఱింతలు యుత్తమోత్తమముగా గుణింపబడినది. ఇది యొకవేళ ద్వైతభావమైనను అఖండమై నిరవధిక మైన బ్రహ్మానంద మింతకంటెను గొప్పదని తెలియజేయుటకే యిట్లు చెప్పిరని భావింపవలెను "విజ్ఞాన మానందం బ్రహ్మ" (బృహదా 5-9-28) ఈ బ్రహ్మానందము కాక వాసనానంద విషయానందములుకూడ చెప్పబడినవి.

**వాసనానందము :** ఇది జాగ్రద్దశయందు సుఖదుఃఖములను భావింపక పురుషుడు ఉదాసీనుడై యున్నపు డానందము ననుభవించును. ఉదాసీనభావమునం దహంకార ముండును కనుక దానిని బ్రహ్మానంద మనకూడదు. అయినప్పటికిని దీనివలన బ్రహ్మానందానుభవము కలదని తెలిసికొనుచున్నాడు. ఎట్లనగా చల్లని నీటిచేత నింపబడిన కుండపైభాగము చేతితో తాకిన చల్లదనమువలన లోపల నీరున్నదని యూహించుకొన్నట్లు.

**విషయానందము :** దీనికి ప్రతిబింబానంద మను మఱియొక పేరు గలదు ఒక పురుషు డొక విషయమునందు వాంఛగలవాడై దానికొఱకు ప్రయత్నించి యావిషయమును పొందినట్లైన (దాని ననుభవించినట్లైన) దానియందు కోర్కె యుపశమించును. కోర్కె తీరినపుడు అంతర్ముఖమైన చిత్తవృత్తి యందు ప్రతిఫలించు బ్రహ్మానందమే విషయానంద మనబడును. ఇది ఆనందమయ కోశధర్మము. మనస్సు విషయసుఖము ననుభవించునపుడు ఆనందమయకోశము విజృంభించుచున్నది సామాన్యముగ నిష్టవస్తు దర్శనమునందును, ఇష్టవస్తువు లభించుటయందును, దాని ననుభవించుట యందును గలుగుచుండు సుఖ మిది. (ఈ విషయము పంచకోశములను గుఱించి చెప్పుసందర్భమున మఱల చెప్పబడును.)

లోకవ్యవహారమునందున్న సుఖదుఃఖము లను ద్వంద్వములో చెప్పబడిన సుఖమే యీ సుఖము. ఇది వస్త్వధీన మగుటవలన నట్టిసుఖసాధన మగుపదార్థము లేనపుడు ఈ సుఖముండదు. అట్టి పదార్థ వియోగమువలన దుఃఖము కలుగును. కనుకనే యీ సుఖదుఃఖములు రాకపోకలు కలవి. ఇవి

ప్రకృతి సంబంధము లైనవి మనస్సుయొక్క ధర్మములు కొందఱు సుఖమనునది లేదనియు దుఃఖోపశమనమే సుఖమనియు చెప్పుదురు కాని ప్రాపంచిక సుఖదుఃఖములు రెండును కలవని పెద్దల మతమై యున్నది ఈ సుఖదుః ఖముల కతీతమైనదే నిరుపాధిక మగు ఆనందము వెనుక అఖండసత్తనియును అఖండచిత్తనియును చెప్పబడినదే యిచట అఖండానందమని తెలియవలెను

ప్రకృతిసంబంధమైన శరీరము దుఃఖస్వరూపము భాహ్యాప్రపంచమునందలి శబ్దాదివిషయములు ఆనందదాయకమని వాటికొఱకు జాగ్రదవస్థలయందు ప్రాకులాడి ఇంద్రియములద్వారా శబ్దాదివిషయములను మనస్సు గ్రహించి బుద్ధికి నివేదించి భోక్తయగు ఆనందమయ పురుషుని అనుభవము కొఱకు పెట్టుచున్నది. వాటియందు లేశమైనను ఆనందము కలుగక పోవుటచే ఇంద్రియాదులు సుఖసంపాదనార్థమై పడిన శ్రమనివారణకొఱకు జీవుడు బలహీనము లైన కరణములను సుషుప్తియందు వదలి ఆనందమయు డయ్యును, కర్మవశమున మఱల జాగ్రదవస్థయందు శబ్దాదివిషయములకొఱకు ప్రాకులాడుచున్నాడు ఇందుకు అజ్ఞానమే కారణము ఈ అజ్ఞానమే ఆనందమయకోశము.

కనుక స్థలసూక్ష్మ శరీరోపాధులు దుఃఖస్వరూపములై యున్నవి అవి యే సుస్వరూపము లైన సుఖముకొఱకు ప్రాకులాడవలసిన పని యుండదు కనుక శరీరోపాధులు దుఃఖస్వరూపములు. ఆత్మ అఖండ నిత్య నిరతిశయ సుఖస్వరూపము ప్రకృతిగాని, దానిపరిణామము గాని, ఆనందస్వరూపము కాదు ప్రకృతిని పరదేవతగా అరాధించిన భక్తులు ఆమెను ఆనందస్వరూపిణియని వర్ణించుట, పూర్వము నేను చెప్పినట్లు రాజువలన అధికారమును పొందిన ప్రతినిధిని ప్రభునామముతో పిలిచి నట్లే యని యెఱుగవలయును. కనుక ప్రకృతిని ఆనందమయి యని చెప్పిన సరిపోవును సచ్చిదానందములు పరబ్రహ్మలక్షణము లనిచెప్పుట తక్కువయే ఐనను నాలక్షణములు ప్రకృతివి మాత్రము కావు సగుణబ్రహ్మము సచ్చిదానంద మయుడు. ప్రకృతిని ' సచ్చిదానందమయి'యని చెప్పవచ్చును *

* ఆనందము కలదని శ్రుతిస్మృతులిట్లు చెప్పుచుండగా శివరామదీక్షితులవారు "ఆయాసములేని ఆనందము లేదు ఆనందములేని ఆయాసములేదు విషయానందమునే ఆనంద మనవలెగాని బ్రహ్మానందము లేనే లేదు" (బృహద్వాసిష్ఠసిద్ధాంతము పూ పు 131 132) అని చెప్పిరి వీరి సిద్ధాంతమును నీ గ్రంథముయొక్క చతుర్థ భాగమున పరిశీలించితిని

ఆత్మదర్శను లైనమహాత్ములు బ్రహ్మానందానుభూతిని పొంది

శ్లో|| "ధన్యోఽహం, ధన్యోఽహం నిత్యం స్వాత్మాన మంజసా వేద్మి,
ధన్యోఽహం ధన్యోఽహం బ్రహ్మానందోవిభాతి మే స్పష్టం." (వే.పం 7-292)

తా "ఎల్లప్పుడు స్వస్వరూపమును యథార్థముగా గుర్తెఱుంగుచున్నాను ఈకారణమువలన నేను చాల ధన్యుడనైతిని, నాకు బ్రహ్మానందము స్పష్టముగా ప్రకాశించుచున్నది కనుక నేను అత్యంత ధన్యుడను" అని ముక్తకంఠముతో చెప్పుకొనిరి

## (26) ఆత్మానాత్మ వివేకము

ఆత్మనుగుఱించి యిదివఱకు చెప్పనవిషయములనే యిచ్చట అన్నింటిని చేర్చి సంగ్రహముగా చెప్పుచున్నాను. "అజో నిత్యశ్శాశ్వతోఽయం పురాణో" (గీత 2-20) అని ఆత్మనుగుఱించి గీతారంభమునందే చెప్పబడెను ఆత్మ పుట్టుక లేనిది. పుట్టుక లేదనుటవలన నాశము లేదని వేఱుగా చెప్ప నవసరము లేదు అందువలన శాశ్వతమైనదని యర్థము అనగా సత్తు. ఏది శాశ్వతమైనదో యది స్వయంప్రకాశమానమై యుండవలెను. ఇతరముచే ప్రకాశింపజేయబడునది శాశ్వతము కాదు. స్వయంప్రకాశమనగా స్వయంజ్యోతియని చెప్పవలెను స్వయంజ్యోతియగు వస్తువు తాను ప్రకాశించుయే గాక యితరములను ప్రకాశింప జేయగలదు. ఏది స్వయంజ్యోతియో యది సాక్షి కావలెను. అనగా దానికి వేఱొక సాక్షి యుండరాదు. సాక్షియనునది చిద్రూపమే కావలెను చిత్తు కానిది సాక్షి కాజాలదు చిత్తును సాక్షియు నగున దేదియో యదియే దృక్కు, దృక్కనగా ప్రజ్ఞానము అది కూటస్థమై యుండవలెను. కూటస్థమనగా నిర్వికారమే నిర్వికారమును చిద్రూపమునగు వస్తువు శుద్ధచైతన్యమే కావలెను అది జడపదార్థము కాదు. జననమరణ వికారరహిత మైన వస్తువు, అఖండముగా నుండజాలదు. ఏలయనగా పరిమితమును ఖండము నగు వస్తువు పుట్టినదిగనే యుండవలెను అఖండ వస్తువే పరిపూర్ణము. ఆనందము అపరిపూర్ణ మెప్పుడును ఆనందము కాజాలదు ఆనందమే యనుభవము. పైన చెప్పినదే మఱల నొకసారి స్మరింతము. ఆత్మయనగా సత్తు. స్వయంప్రకాశము, స్వయంజ్యోతి, సాక్షి, చిత్తు, దృక్కు, ప్రజ్ఞానము, కూటస్థుడు, శుద్ధచైతన్యము, అనంతము పరిపూర్ణము, ఆనందము, నిష్క్రియము, క్షేత్రజ్ఞుడు అనుభవము, ఇవన్నియు నొక్క ఆత్మయే. ఆత్మస్వరూపమే

ఆత్మకానిది అనాత్మ దీని లక్షణములు ఆత్మవ్యతిరేక లక్షణములు బుద్ధిమొదలు శరీరము వఱకును. బాహ్యమున తృణము మొదలు ప్రకృతివఱకును అనాత్మ స్వయంప్రకాశము లేనిది, జడము, దృశ్యము, అజ్ఞానము, వికారి, ఖండము, అపరిపూర్ణము, దుఃఖము, జననమరణములు కలది, అనుభవింపబడునది జ్ఞాతృ, జ్ఞాన, జ్ఞేయ రూపమైనద్ది నామరూపములు కలది, మార్పు చెందునది, క్రియావంతమైనది, కర్తృత్వ భోక్తృత్వ రూపములు గల సంసారి - అను నీలక్షణములు గల అనాత్మనుండి యాత్మను వేఱుచేసి తెలిసికొనవలెను ఎట్లు తెలిసికొనవలయును? కార్యకారణ సంఘాతరూప దేహేంద్రియాదుల (క్షేత్రము) యందు ఆత్మలక్షణములను వెదకుచు పోయిన ఏది యాత్మ కాదో దానిని 'నేతి నేతి' యని త్రోసివేయుచు ఆత్మ నన్వేషింపవలయును

## (27) పంచకోశ వివేకము

తైత్తిరీయోపనిషత్తు చెప్పినట్లు "సత్యము, జ్ఞానము, అనంతము బ్రహ్మ" అని బ్రహ్మయొక్క స్వరూపలక్షణములను వాటియొక్క అర్థమును వివరింతును తైత్తిరీయము నందలి భృగువల్లియందు ఆత్మ నెఱుంగుటకు మఱియొక మార్గము చూపబడెను అందు వరుణపుత్రుడగు భృగుమహర్షి తండ్రిని చూచి యిట్లడిగెను. "బ్రహ్మమునుగూర్చి నాకు తెల్పుము" వరుణు డిట్లు చెప్పెను "శరీరము, ప్రాణము, నేత్రము, శ్రోత్రము, మనస్సు, వాక్కు మొదలగునవి బ్రహ్మము నెఱుగుటకు మార్గములు" అని చెప్పి తుదకు బ్రహ్మలక్షణముల నిట్లు బోధించెను **"యతో వా ఇమాని భూతాని జాయంతే, యేన జాతాని జీవంతి యత్ప్రయన్త్యభిసంవిశంతి, తద్విజిజ్ఞాసస్వ, తద్బ్రహ్మేతి"** (3-1) ఈ సమస్త భూతములును దేనియందు పుట్టినవో దేనిచే జీవించుచున్నవో, నశించునపుడు దేనియందు లయమగుచున్నవో, అదియే బ్రహ్మము అట్టి బ్రహ్మ జిజ్ఞాస కలుగుట తగినది" అని చెప్పగ భృగువు తపస్సుచే (ఏకాగ్రచిత్తముతో ఆలోచించి) పంచకోశముల లోపల ఆత్మ యున్నదని తెలిసికొనెను ఇది ఆత్మ నెఱుంగుట కొకపద్ధతి ఆ పద్ధతిని శ్రుతి చెప్పిన విధమును వివరింతును

**పంచకోశములనగా :** ఐదుకోశములని అర్థము కోశమనగా ఒఱ. కత్తి యొఱయందున్నట్లు ఆత్మ గుహయందున్నది. గుహ యనగా. పంచకోశములు;లేక

ముసుగు; లేదా అచ్ఛాదనము అని అర్థము చెప్పవచ్చును అకోశము లివి (1) అన్నమయ (2) ప్రాణమయ (3) మనోమయ (4) విజ్ఞానమయ (5) ఆనందమయ కోశములు. అన్నము మొదలు ఒక్కొక్క కోశమును బ్రహ్మముగా ఉపాసన చేసిన కలుగుఫలమును సహితము శ్రుతి బోధించినది ఫలాపేక్షగల మందాధికారులు ఉపాసనావిధానము ననుసరించినను తుదకు ఆత్మను తెలిసికొందురని తలంపు ఆత్మ అయిదు కోశముల లోపల నున్నది ఒక్కొక్క కోశమును దాని ధర్మకర్మములను విచారించి ఆత్మ లక్షణము లందులో లేవని 'నేతి' 'నేతి' ఇదికాదు, ఇది కాదు అని త్రోసివేయుచు తుదకు నిషేధించుటకు వీలు కానిదానిని ఆత్మయని నిశ్చయించుకొనవలయును ఎట్లనగా నింటిలోని వస్తువు లన్నియు నింటినుండి తొలగించగలము, కాని యింటిలోని ఆకాశమును తొలగించ లేనియట్లని యర్థము వీటిని గురించి విచారింతము

1 **అన్నమయకోశము** : పృథివియందుండి యోషధులు, యోషధులవలన అన్నము, అన్నరసమునుండి శుక్లశోణితములు, వీటివలన పురుషశరీరము కలుగుచున్నది. పంచీకరణమునం దీవిషయము గమనించి యున్నాము. పృథివియందు తక్కిన నాల్గుభూతముల గుణము లున్నందున పురుషశరీరము పంచభూతాత్మక మనియును చెప్పిరి ఇది (1) చర్మము (2) మాంసము (3) రక్తము (4) శల్యములు (5) మెదడు (6) మజ్జ (7) శుక్లము అను సప్తధాతుమయము దీనినే స్థూలశరీర మందురు." సకలభూతములు అన్నమువలననే పుట్టినను, బ్రహ్మానుభవము పొందుటకు నధికారముగల మానవశరీర ముత్తమోత్తమము గనుక దీనిని నాధారము చేసికొని పంచకోశవిచారము చేయబడినది.

ప్రాణము లేనిది యీ అన్నమయము; కదలుట , మెదలుట లేదు నశించిపోవు చున్నది. కనుక అన్నమయకోశ మాత్మకాదు. దీనియందున్న ప్రాణము దీనికి ఆత్మ కత్తికి నొఱ యున్నట్లు ప్రాణమునకు అన్నమయకోశము ఒఱవంటిదని తెలిసికొనిరి. అయినను అన్నమువలననే భూతములు పుట్టుచున్నవి, అన్నమువలననే జీవించుచున్నవి. తుదకు అన్నము (భూమి) నందే లయము నొందుచున్నవి. 'అన్నం బ్రహ్మ' మని చెప్పుటకు కారణమదియే ఇది తమఃప్రధాన మైనది. ఇచట క్రియాశక్తి కనబడలేదు. జననమరణాది వికారములు దీని ధర్మము. ప్రాణశక్తిచేత ప్రేరేపింపబడి కార్యములు చేయుట దీనికర్మము. దీనిని బ్రహ్మమని యుపాసించినవారికి పుష్కలముగా అన్నము లభించును.

జి : అన్నముయొక్క సూక్ష్మాంశము మనస్సు నీటియొక్క సూక్ష్మాంశము ప్రాణము అన్నోదకములవలన ఏర్పడినది ఈ శరీరము అందువలననే క్రియాశక్తియు, జ్ఞానశక్తియు నీశరీరమునకు లక్షణములే కనుక ఇదియే యాత్మ ఇంతకంటెను వేఱొకయాత్మ దేహమునందు లేదు అని అనెడివారికి సమాధానమేమి?

వే : శరీరము ఎఱుగబడుచున్నది ఏదియైనను దానినదే తెలిసికొన లేదు కంటిని కన్ను చూడలేదు. దేహమును దేహము తెలిసికొన జాలదు

జి : కన్ను అద్దములో కంటిని చూచుచున్నది కదా?

వే : అద్దములో కనబడినది కంటియొక్క ప్రతిబింబమే కాని కన్నుగాదు అట్లే 'ఇది దేహమ'ని తెలిసికొనునది దేహమునకంటె వేఱైనదిగా నుండవలెను, దేహసంబంధమైనదిగా నుండరాదు ఒకానొకవస్తు వేదైనను అదియే దృక్కును, దానిలో కొంతభాగము (దృక్కునకు) దృశ్యమును కాజాలదు నాభుజములపై నన్ను ఎత్తుకొని పోజాలను దృక్ దృశ్యము లెన్నడును పరస్పరభిన్నము లైనవే. ఇదియే యీవిశ్వమునందలి నియమము దేహము పుట్టినది కనుక దీనిని తెలిసికొనునది పుట్టుక లేనిదే యై యుండవలెను

2 **ప్రాణమయకోశము** : ఇది అన్నమయకోశము నందు సర్వత్ర వ్యాపించియున్నది ఇది వాయుమయము ప్రాణాత్మకము ఇది అన్నమయ కోశమునకు ఆత్మ ఈకోశము ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములను అయిదు రూపములుగ నున్నది ప్రాణమయకోశము అన్నమయకోశమున కంటె సూక్ష్మమైనది ఇది లేనిదే అన్నమయకోశము నిలువలేదు ఇంద్రియము లన్నియు దీనివలననే శక్తిమంత మగుచున్నవి (ఇదివఱకు ఆత్మయనుకొనిన అన్నమయకోసము ఆత్మగాదని నిషేధించవలయును) ఇది రజోగుణరూప మగుటచే క్రియాత్మక మగుచున్నది పంచకర్మేంద్రియములతో చేరి ప్రాణము ప్రాణమయకోశమని పిలువబడును దీనికి తెలివిలేదు గనుక ఇది యాత్మకాదు శరీరముచేత సకల కర్మలు చేయించుట దీనికర్మము ఆకలిదప్పులు దీనిధర్మములు దీనిని బ్రహ్మమని యుపాసించినవారికి దీర్ఘాయువు కలుగును

3 **మనోమయకోశము** : ఇది సంకల్ప వికల్పాత్మక మగు అంతః కరణములోని భాగము ఇదిప్రాణమయ కోశమున కంటె సూక్ష్మమగుటవలన

దానికిది యాత్మయై ఉన్నది మనోమయకోశము ప్రాణమయకోశము నందంతటను వ్యాపించినదై యున్నది మనోబలము చేతనే ప్రాణమయకోశము క్రియావంత మగుచున్నది అందువలన దానికిది యాత్మయని చెప్పబడినది జ్ఞానేంద్రియ పంచకమును మనస్సును చేరి యీకోశమైనది. తమోమిశ్రిత సత్త్వగుణము దీనికి కారణమగుటవలన నిది రాగద్వేషములకు స్థానమగుచున్నది పై రెండుకోశములకంటె నీకోశమునందు ఆత్మచైతన్యము అధికముగ వ్యక్తమగుచున్నది జిజ్ఞాసువు దీనియందు ఆత్మబుద్ధిని దృఢముగ గలవాడై ప్రాణమయకోశము ఆత్మ గాదని నిషేధింపవలెను. జ్ఞానేంద్రియ పంచకముచేత బాహ్యవిషయములను లోనికి తీసికొని బుద్ధికడనుంచి బుద్ధియొక్క నిశ్చయమును కర్మేంద్రియ పంచకముద్వారా ఆచరణలో పెట్టుచున్నది. అనగా కర్మేంద్రియములతో చేరిన శరీరమును క్రియావంతము చేయుచున్నది. ఇది దీనికర్మము. బుద్ధి దీనికి ఆత్మయై యున్నది శోకమోహములు మఱియు, లజ్జాభయములు మొదలగునవి దీనిధర్మములు. దీనిని బ్రహ్మమని యుపాసించినవారికి మనోబలము సిద్ధించును.

4 విజ్ఞానమయకోశము : ఇది మనోమయకోశము యొక్క అభ్యంతర (లోపల) మందుండును. దానికంటెను ఇది సూక్ష్మము మనోమయకోశము విజ్ఞానమయకోశముచేత పూర్ణమగుచున్నది సత్త్వగుణ కార్యమగు జ్ఞానశక్తియందలి రజోమిశ్రభాగము కర్తృత్వ ధర్మము గలదియై విజ్ఞానమైనది. నిశ్చయించుట దీనికర్మము. సమస్తక్రియలును విజ్ఞాన పూర్వకము లగుటచేత మనోమయకోశమునకు విజ్ఞానమయకోశము ఆత్మయని చెప్పబడుచున్నది. లౌకికములు వైదికములగు సమస్త కర్మములును సారాసార విచారముచేసి విశేషబుద్ధిచేత నిశ్చయింపబడిన పిమ్మటనే చేయబడుచున్నందున ఇది కర్త యనిపించుకొనుచున్నది అంతఃకరణవృత్తిలో నొకటియగు బుద్ధియే యిది దానిని బ్రహ్మమని యుపాసించు వారు సర్వకామములను పొందుచున్నారు. దానిని ఆత్మయని నిశ్చయించినపుడు మనోమయకోశము ఆత్మగాదని నిషేధించుచున్నారు.

ఒక అంతఃకరణములోనివి యగు మనోబుద్ధులను రెండింటిని ఒక్కకోశముగ చెప్పక రెండుకోశములుగా చెప్పవచ్చునా యని ప్రశ్న కలుగవచ్చును. అట్లు చెప్పుటకు కారణము అంతఃకరణమునందలి వెలుపలి కరణశక్తి. అనగా సాధనము మనోమయకోశము. లోపలిదగు కరణశక్తి

విజ్ఞానమయకోశము కర్తృత్వశక్తి కలది అనగా నేను కర్తను అని అభిమానించునది విజ్ఞానమయకోశము. ఇదమ్ 'ఇది' యని చెప్పబడు మనోమయకోశము కార్యము దానికి కారణము విజ్ఞానమయకోశము కనుక ఒక అంతఃకరణమునే రెండు కోశములుగా చెప్పవలసివచ్చెను

5 **ఆనందమయకోశము** : ఇది విజ్ఞానమయకోశమునకు లోపలనుండును అంతర్ముఖమైన యొకానొక బుద్ధివృత్తి ఆనందస్వరూపమగు బ్రహ్మముయొక్క ప్రతిబింబమును గ్రహించును ఇదియే ఆనందమయకోశము ఇది పుణ్యము ననుభవించు కాలమున అభివ్యక్తమగును పుణ్యఫలము క్షయింపగనే నిద్రారూపమున లయించుచున్నది. ఇది ఒకప్పుడుండి మఱియొకప్పుడు లేకపోవుచున్నందున ఆత్మ కానేరదు బుద్ధి మొదలగు సంఘాతమును తనయందు బీజరూపమున నుంచుకొనుటయు, తిరిగి వాటిని ప్రేరేపించుటయు దీని కర్మము. అజ్ఞాన ప్రియ ప్రమోదములు దీనిధర్మములు ఆనందమయమనగా ఆనందము ఎక్కువగలదని యర్థము ఆనందము విస్తారముగా నున్నదని చెప్పిన యెడల ఆనందము కానిది కొంత కలదని యర్థమగుచున్నది కనుక నిదియును ఆత్మకాదు. ఆనందమయకోశమునకంటె అంతరము నందున్నదియు, ఆనందమయకోశము నంతటయును వ్యాపించి యున్నదియు, ఆనందమయ కోశముయొక్క ఆత్మయు, అగు ఆనందమే బ్రహ్మము అతడే ఆత్మ ఈనిశ్చయముచే ఆనంమయ కోశమును ఆత్మగాదని, దానియందు బ్రహ్మభావము చేయుట అజ్ఞానమని ఆనందమయకోశమును నిషేధింపవలెను

ఇట్లు అన్నమయాది కోశములయందు ఒకదానియందైనను ఆత్మ లక్షణములు కనబడనందున నిషేధించి, నిషేధావధియగు నిరతిశయ, నిరుపాధిక, ఆనందస్వరూపమే ఆత్మ అదియే బ్రహ్మము, భూమ అని నిశ్చయము చేయవలెను మొదట వరుణునిచే "యతో వా ఇమాని భూతాని" అని చెప్పబడిన బ్రహ్మలక్షణములు ఆత్మయందే కలవు. ఆత్మయందుండియే ఆనందమయాది కోశపంచకము కలిగినందునను, ఆత్మ మఱియొక దానియందు ప్రతిష్ఠింపబడక పోవుటయు సర్వము నెఱింగెడి బోధస్వరూప మగునది ఆత్మయే యని నిశ్చయింపవలెను. ఈ విధముగ భృగువు తపస్సుచేసి తెలిసికొనెను. ఎవ్వరీవిధముగ పంచకోశ విచారము చేసి ఆత్మ నెఱుంగు చున్నారో వారే బ్రహ్మవిదులు.

## (28) తురీయము

తైత్తిరీయోపనిషత్తు పంచకోశ విచారముచే ఆత్మస్వరూప నిరూపణము చేయగా, మాండూక్యోపనిషత్తు మానవుని నిత్యానుభవమునందున్న అవస్థాత్రయ విచారము చేసి స్థూలసూక్ష్మ కారణశరీరములు ఆత్మగావని త్రోసివేసి ఆత్మ నిరూపణము చేసినది. పర్యవసానమున రెండును నొక్కటియే. ఎట్లనగా స్థూలశరీరము అన్నమయకోశము; సూక్ష్మశరీరమునందు ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశములున్నవి; కారణశరీరమే ఆనందమయకోశము మఱియు బ్రహ్మమును ఓంకారమును నొక్కటియే యని ఓంకారమునకు వలెనే బ్రహ్మమునకు నాలుగు పాదములను బోధించి క్రిందనుండి మూడుపాదములను 'నేతి' 'నేతి' యని నిషేధించి చతుర్థపాదమును ఆత్మగా నిర్ధారణచేసినది

మం **"నాంతః ప్రజ్ఞం న బహిః ప్రజ్ఞం నోభయతః ప్రజ్ఞం న ప్రజ్ఞానఘనం న ప్రజ్ఞం నాప్రజ్ఞం అదృష్ట మవ్యవహార్య మగ్రాహ్య మలక్షణ మచింత్య మవ్యపదేశ్య మేకాత్మ ప్రత్యయసారం ప్రపంచోపశమం శాంతం శివ మద్వైతం చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః"** (మాం 7) ఈ మంత్ర తాత్పర్యమును పెద్ద లీవిధముగా చెప్పిరి (1) 'నాంతః ప్రజ్ఞం' అనుటవలన ద్వితీయపాదమగు స్వప్న సంబంధ జ్ఞానమును, సూక్ష్మశరీరమును, తైజస హిరణ్యగర్భులును, ఓంకారమునందలి ద్వితీయమాత్ర యగు 'ఉ' కారము ఆత్మకాదని నిషేధింప బడినది (2) 'న బహిఃప్రజ్ఞః' అనుటచే ప్రథమపాద మగు బాహ్యప్రపంచ సంబంధమైన జాగ్రదవస్థా జ్ఞానమును, స్థూలశరీరమును విశ్వవిరాట్టులును, ఓంకారమునందలి ప్రథమమాత్ర యగు 'అ' కారము, ఆత్మ కాదని నిషేధింపబడినది (3) 'నోభయతః ప్రజ్ఞం' అనుటవలన బహిఃప్రజ్ఞ, అంతః ప్రజ్ఞ - యీ రెండును కాదనియును ఆ రెండింటి వలన కలుగు అవస్థ కాదనియును, లేదా, ఒకవిధమగు నారెండింటియొక్క సంధిసహితము కాదనియును, అట్లే స్మృతిసహితము కాదనియు, నిషేధింపబడినది (4) 'న ప్రజ్ఞానఘనం' అనుటవలన, కారణశరీరము, సుషుప్త్యవస్థ, ప్రాజ్ఞుడు, ఈశ్వరుడు, ఓంకారమునందలి తృతీయమాత్రయగు 'మ' కారమును నిషేధింపబడినవి (5) 'న ప్రజ్ఞం' అనుటచేత నొకమారుగ సర్వవిషయప్రజ్ఞాత కాదని నిషేధింపబడినది (6) 'నాప్రజ్ఞం' అనుటచే అది అచేతనమగు జడము కాదని నిషేధింపబడినది. (ఇట్లు సమస్తమును 'నేతి' 'నేతి' యని నిషేధింపగా

నిషేధావధి యగు చతుర్థపాదము మిగిలినది దానినిగుఱించి ఇట్లు చెప్పబడెను) (7) 'అదృష్టం' అనగా పంచేంద్రియములచేత తెలియబడునది కానిది, (8) 'అవ్యవహార్యం' అనుటచే వ్యావహారిక సంబంధము లేనిది, (9) 'అగ్రాహ్యం' అనుటచే మనస్సుచేత బుద్ధిచేత గ్రహించుటకు సాధ్యము కానిది, (10) 'అలక్షణం' అనగా ప్రత్యక్షాది ప్రమాణములచేత తెలియదగినది కానిది, (11) 'అచింత్యం' చింతింప శక్యముకానిది, (12) 'అవ్యపదేశ్యం' ఉపదేశించుటకు సాధ్యము కానిది (13) 'ఏక ఆత్మ-ప్రత్యయ-సారం' అనగా ఒక్కటి యగు శుద్ధచైతన్య స్వరూప మగు ఆత్మ తప్ప అన్యమిశ్రితము కానట్టిది (14) 'ప్రపంచోపశమం' అనుటచే ప్రపంచము దానిసంబంధమైనది ఏదియును లేనిది, (15) 'శాంతం' అనుటచే ఇచ్ఛారాగ ద్వేషరహితమైనది (16) 'శివమ్' అనుటవలన పరమానందబోధ స్వరూపమును, 'మంగళ' స్వరూపమును నైనది. (17) 'అద్వైతం' అద్వితీయమైనది 'చతుర్థం' అనగా నాలుగవపాద మగు తురీయమే ఆత్మయని తెలిసికొనవలెను

ఆత్మమాత్ర కాదు గనుక అమాత్ర యందురు మంత్రమునందు 1 నుండి 12 వఱకుగల ఆత్మవిశేషణములు నిషేధపద్ధతిలో చెప్పబడినవి కేవలనిషేధ పద్ధతిచూపి విరమించిన ఆత్మ శూన్య మనుభావము కలుగకుండుటకై శ్రుతి 13 నుండి 17 వఱకును గల విశేషణములు చెప్పినట్లు భావించవలెను ఆత్మ తురీయమనగా నాలుగవదని అర్థము ఆత్మ నాలుగవదని సహితము చెప్పకూడదు జాగ్రదాది మూడవస్థలకు అతీతమను అర్థముతో తురీయమని చెప్పబడెను మఱియు తురీయుడు "భోక్తృభోగ్యప్రేరకు లగు విశ్వతైజసప్రాజ్ఞులు ముగ్గురు నెవనియందు ప్రతిష్ఠింపబడి యున్నారో అట్టివా"డని శ్రుతి వాక్యము (శ్వే 1-7)

విశ్వతైజసులు కార్యకారణబద్ధులై యున్నారు ప్రాజ్ఞుడన్నచో కారణమాత్ర బద్ధుడై యున్నాడు తురీయుని యందు ఈ కార్యకారణములు రెండును సిద్ధింపవు (గౌడపాద కారిక - 11)

*ఇదివఱకు బ్రహ్మమునుండి అంతర్యామి, ఆయననుండి హిరణ్యగర్భుడు, ఆయననుండి విరాట్టు కలిగిన సృష్టిక్రమమును గమనించి యున్నాము

---

* ఈ ప్రకరణమందు (పుట 140లో) "జీవేశ్వరుల త్రివిధావస్థలు" అను పటమును చూచిన విషయము సులభముగా బోధపడును

అక్రమము ననుసరించి నాలుగవ పాదమునుండి మూడవపాదమును, మూడునుండి రెండును, రెండునుండి ఒకటవ పాదమును కలిగినట్లు తెలిసికొంటిమి. కారణముకంటె కార్యము భిన్నము కానందున ప్రథమపాదము ద్వితీయపాదముకంటె వేఱుకాదని, ప్రథమమును ద్వితీయమునందు లయింప జేసి, ద్వితీయపాదము తృతీయమున కంటె భిన్నము కాదని ద్వితీయమును తృతీయమునందు లయింపజేసి, తృతీయపాదము చతుర్థపాదమునకంటె భిన్నము కాదని, తృతీయమును చతుర్థమునందు లయింపజేసి, చతుర్థ మగు ఆత్మయే తుదకు మిగిలినదని ఆత్మయందే యీ సమస్తమును శుక్తియందు రజతమువలె, రజ్జువునందు సర్పమువలె భ్రాంతి కల్పితమని నిష్ప్రపంచ మగు ఆత్మయే తానని "**అయం ఆత్మా బ్రహ్మ**" అని మాండూక్యశ్రుతి బోధించినది. ఆత్మయగు చతుర్థపాదము తక్కిన మూడుపాదములయందు కలిసియే యున్న సంగతి మఱువరాదు.

బ్రహ్మముయొక్క పాద చతుష్టయ స్వరూపమును మహానారాయణో పనిషత్తునం దిట్లున్నది *అవిద్యప్రథమపాదము, విద్య ద్వితీయపాదము, ఆనందము తృతీయపాదము, తురీయము చతుర్థపాదము మాండూక్యము 12 మంత్రములు గల చిన్నయుపనిషత్తే యైనను ఉపనిషత్తులకు శిరోమణివంటిదని ప్రసిద్ధి కెక్కినది "**మాండూక్య మేక మేవాలం ముముక్షూణాం విముక్తయే**" (ముక్తి 1-26) మోక్షము కోరువారికి ముక్తికొఱకు మాండూక్యశ్రుతి యొక్కటియే చాలునని ముక్తికోపనిషత్తు చెప్పినది. **ఇందలిమంత్రములు నృసింహతాపిన్యుపనిషత్తు మొదలగు శ్రుతులచే గైకొనబడి యుండుటవలన ఈ శ్రుతియొక్క ప్రాముఖ్య మెఱుగబడుచున్నది

ఇందు ఉపాసనగాని కర్మగాని చెప్పబడక కేవలము ఓంకార మాత్రలు ఆత్మపాదములు సమానమని తెలిపి జాగ్రదాది మూడవస్థలను దాటి

---

* పాద చతుష్టయాత్మకం బ్రహ్మ, కిం తత్పాదచతుష్టయం (బ్రహ్మభవతి) అవిద్యాపాద స్సు విద్యాపాద శ్చానందపాద స్తురీయపాదశ్చేతి, తురీయపాద స్తురీయతురీయం తురీయాతీతంచ, కథం పాదచతుష్టయస్య భేదః అవిద్యాపాదః ప్రథమః పాదో విద్యాపాదో ద్వితీయ అనన్దపాదస్తృతీయ స్తురీయపాద స్తురీయ ఇతి, (మహా నా 1 అ)

** శివరామదీక్షితులవా రిట్లు చెప్పిరి "శంకరాచార్యులు దేహాదిపదార్థాలను గుఱైతింగే క్షేత్రజ్ఞస్వరూపమనే పరాప్రకృతిని ఆత్మ అని అబద్ధమాడి, ఈ ఆత్మ బ్రహ్మస్వరూపమని అన్నారు. శ్రుతి 'అయ మాత్మా బ్రహ్మ' అనే అబద్ధాలశ్రుతి ముందరపెట్టినాడు". (బృహద్వా ఉ. పు. 79). వీరికి తగిన సమాధానమును చతుర్థభాగమున చెప్పియున్నాను.

మాత్రారహిత మగు ఓంకారము తురీయమునందు చేరునట్టి అస్పర్శయోగము నుపదేశించియుండుటయు, శంకరులవారికిని, వారిగురువగు గోవిందపాదులవారికిని గురువగు గౌడపాదాచార్యులవారు కారికలరూపమున ఈ యుపనిషత్తునకు వ్యాఖ్య వ్రాసియుండుటవలనను, మాండూక్యశ్రుతియొక్క ఘనతను మన మూహింపవచ్చును

## (29) కూటస్థ చిదాభాసులు

జి : ఇదివరలో కూటస్థ చిదాభాసులను గుఱించి చెప్పితిరి దానివిషయ మింకను వివరముగ తెలుపవేడుచున్నాను

వే : ఆ విషయమై యిప్పుడు చెప్పదలచుకొంటిని బియ్యమునందు కలిసియుండు మట్టిపెళ్లలను, సన్నటిరాళ్ళను, ఇసుకను బియ్యమునుండి వేఱుచేసి మంచిబియ్యమును ప్రక్కకు తీయునట్లు దేహమునందు ఇంద్రియ మనోబుద్ధ్యహంకారములను వాటికార్యములను వేఱు వేఱుగ విచారించి అహంకారాది దేహాంతపర్యంతము ఆత్మ గాదని త్రోసివేసి ఆత్మ నెఱుంగు మార్గమును కేనోపనిషత్తు చెప్పినది దానిననుసరించి శ్రీ శంకరాచార్యాదులగు మహాత్ములు ప్రకరణగ్రంథములయందు రచించిన విధమును తెలుపు మఱియుయొక పద్ధతి చెప్పెదను. అంతఃకరణమునందు ప్రతిఫలించిన కూటస్థాభాసమే చిదాభాసుడని చెప్పియుంటిని గదా !

జి : కూటస్థుడు అంతఃకరణమునందే యేల ప్రతిఫలించవలెను ?

వే : అంతఃకరణము పంచభూతములయొక్క సాత్త్వికాంశముల అర్ధభాగముల మొత్తమునుండి కలిగినదని యిదివఱకే (సూక్ష్మశరీర వివరమును తెలుపు వర్గీకరణమునందు) చెప్పియుంటిని ప్రకృతియొక్క సాత్త్వికాంశము ప్రకాశవంతమును, సూక్ష్మమును, నిర్మలమును, తేజస్వంతమును కనుక దానియందు మాత్రమే కూటస్థుడు ప్రతిఫలించును

కూటస్థుడు సూర్యునివంటివాడు తనను తాను ప్రకాశింపజేసికొనుచు, సర్వమును ప్రకాశింపజేయువాడు. చిదాభాసుడన్నచో కాలిన ఇనుప గుండువంటివాడు. కాలిన ఇనుపగుండు చీకటిలో తననుతాను ప్రకాశింపజేసికొన గలదు. దానిచుట్టును అంధకారములో మునిగియున్న యితర పదార్థములను ప్రకాశింప జేయలేదు.

శ్రీశంకరులవారు ఇట్లు చెప్పిరి. ఒక అద్దమునందు ముఖప్రతిబింబము కలిగినది. ఆ ప్రతిబింబము అద్దముయొక్క ధర్మముకాదు. ముఖధర్మముకాదు. ఈ రెండును కానిదైనను అది అద్దము, ముఖము నుండువఱకే యుండును. అవి లేని, సమయమున ప్రతిబింబము ఉండదు. ప్రతిబింబ ముండినను ముఖమునందుగల కంఠస్వరముగాని యుచ్ఛ్వాస నిశ్వాసములుగాని ప్రతిబింబమునందు లేనందున ప్రతిబింబమే ముఖమని చెప్పుటకు వీలులేదు. అద్దమునకు ప్రక్కగా నిలబడి చూచినయెడల ప్రతిబింబము కనబడదు ప్రతిబింబమునకు ఆదర్శసత్తకంటె వేఱైన సత్త లేదు - అనబడుచున్నందున అసత్యమును కాదు. అనగా ముఖదర్పణములయొక్క సంబంధముకంటె పూర్వమును వెనుకను ముఖాభాసమునకు ముఖదర్పణ వ్యతిరిక్తసత్త లేనందున అది యున్నదని లేనిదని చెప్పుటకు వీలులేనిది ఈ కారణమువలన ప్రతిబింబమును ఆభాసయని చెప్పిరి కనుక అది యనిర్వచనీయము. ఈ దృష్టాంతమున ముఖము కూటస్థుడనియు, అద్దము బుద్ధియనియు, ప్రతిబింబము చిదాభాసుడనియు, వేఱుగా చెప్పనక్కరలేదు. బింబప్రతిబింబములకు ఆకారమునం దేమాత్రము భేదము లేనందున బింబమే యీ ప్రతిబింబమని చెప్పుచున్నారు. ఆకారణముననే శ్రుతులు జీవబ్రహ్మలకు అభేదమని చెప్పినవి. సుషుప్త్యవస్థయందు బుద్ధి ఆత్మయందు లీనమై పోవుచున్నది. కనుక అప్పుడు చిదాభాసుడును లేడు బుద్ధి కలిగిన వెంటనే చిదాభాసుడు కలుగుచున్నాడు. దీనికే రాకడపోకడ (ఆగమాపాయములు) అని అందురు.

(ఉ సా 18-31, 37, 38, 39, 40)

మనము బాహ్యప్రపంచమునందలి ఘటము (కుండ) ను చూచినయెడల దానియాకారము నేత్రేంద్రియముద్వారా మనస్సు గ్రహించుచున్నది అప్పుడు బుద్ధి ఘటాకారమును పొందుచున్నది అట్టి బుద్ధి వృత్తియందు చిదాభాసుని ప్రకాశము (చిత్తుయొక్క ప్రతిబింబము) పడినప్పుడు ఘటము జ్ఞాతమగుచున్నది ఇది ఘటమని తెలియబడుచున్నది నాచేత ఘటము జ్ఞాతమైనదను జ్ఞానము చిదాభాసుని చేత నెఱుగబడదు. కూటస్థునిచేతనే యెఱుగబడును అదియును గాక ఘటము జ్ఞాతము కాకమునుపు ఘటాభావము నెఱుగు వాడును కూటస్థుడే. అనగా : ఘటముయొక్క జ్ఞానాజ్ఞానములకు (భావాభావము) రెండింటికిని అయనసాక్షి. 'ఇది ఘటము' అనుజ్ఞానము సాక్షిచైతన్యముచేత తెలియబడదు. జ్ఞాతత్వము చిదాభాసుని వ్యాప్తికి ఫలము కూటస్థచైతన్యముయొక్క వ్యాప్తికి

ఫలముకాదు జ్ఞాతత్వము పుట్టించుట (ఘటమును తెలిసికొనుట) మాత్రమే చిదాభాసుని పని. జ్ఞాతత్వమును నెఱుగుట కూటస్థుని పని
(వే పం 8-13, 4-31)

(1) కూటస్థసంబంధమైన జ్ఞానము (2) చిదాభాస సంబంధమైన జ్ఞానము ఇట్లు జ్ఞానమును రెండుగా విభజించి మొదటిది బ్రహ్మమువలన తెలియబడు నట్టిదనియు, రెండవది బుద్ధివృత్తియనియు చెప్పిరి మొదటిది జననమరణములు లేని జ్ఞానము ఇది బ్రహ్మశబ్దవాచ్య మైనది "ప్రజ్ఞానం బ్రహ్మ" "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" అన్నశ్రుతులు దేనినిగుఱించి చెప్పెనో యట్టిజ్ఞానము ఇది సాక్షిచైతన్య మనబడును దీనినే ఆత్మస్వరూపమగు ఉపలబ్ధి (జ్ఞానము) యని యందురు. రెండవది జననమరణములు కలదని యిదివఱకే చెప్పితిని రెండవదానిని ప్రత్యయ (జ్ఞాన) మనియును, వృత్తిజ్ఞాన మనియు అందురు

బుద్ధి వృత్తిజ్ఞానము ఒకవిషయమును తెలిసికొని దానిని విడిచి యింకొకవిషయమును ప్రకాశింపజేయుచు, ఇట్లు ఒక దానిని విడిచి మఱియొక విషయమును ప్రకాశింపజేయు చుండునప్పుడు విషయమునకును, మఱియొక విషయమునకును, మధ్యనుండు సంధిని ప్రకాశింప జేయునట్టిది కూటస్థ బ్రహ్మచైతన్యము.

విద్యారణ్యులవా రొకదృష్టాంతము నిచ్చిరి గోడయం దొకయద్దము కలదు ఆకసమున వెలుగు సూర్యునియొక్క ప్రకాశమువలన గోడయును, అద్దమును ప్రకాశించుచున్నవి సూర్యుని ప్రతిబింబము అద్దమునందు ప్రతిఫలించి యాప్రతిబింబముయొక్క కాంతిచేత నిదివఱకే సూర్యునికాంతిచేత ప్రకాశింపబడు గోడయును, అద్దమును అధికముగా ప్రకాశించునట్లు బ్రహ్మముచేత ప్రకాశింపజేయబడిన శరీరము, అంతఃకరణమునందు ప్రతిఫలించిన చిదాభాసునిచేత నెక్కువగా ప్రకాశింపబడుచున్నది ఇచట శరీరము గోడయనియు, అంతఃకరణము అద్దమనియు, గోడయు అద్దమును ఎవనిచేత ప్రకాశింపజేయబడెనో యట్టి సూర్యునివంటివాడు (చిత్తు) కూటస్థుడనియు అద్దమునందు ప్రతిఫలించిన సూర్యప్రతిబింబము వంటివాడు చిదాభాసుడనియు తెలియవలెను

పైన చెప్పినట్లు గోడయందు నొక యద్దముగాక, నాలుగద్దములు వేఱు వేఱుగా నమర్చియున్నపుడు, ఒకయద్దమునకు మఱియొక అద్దమునకును

మధ్యనున్న గోడను సూర్యుని కాంతి ప్రకాశింపజేసినట్లు బుద్ధివృత్తుల సంధిని కూటస్థుడు ప్రకాశింపజేయునని యెఱుగవలయును బుద్ధివృత్తిజ్ఞానము జాగ్రత్స్వప్నములయందు మాత్రమే కలిగి సమాధి, సుషుప్తి, మూర్ఛ యను వీటియందు లేక యున్నది. ఈ మూడింటి యందు ఏజ్ఞానము ప్రకాశించెనో యాజ్ఞానమే సాక్షి అదియే చావుపుట్టుకలు లేని కూటస్థుడు (వే పం 8-21). ఈకూటస్థుడే చిదాభాసుని, బుద్ధివృత్తిని, ఘటాదివిషయములను - ఈమూడింటిని నొక్కసారిగా ప్రకాశింపజేయువాడు

జి : కూటస్థుడు ఘటమును ఏల తెలిసికొనలేడు?

వే : కూటస్థుడు సర్వవ్యాపి నిర్వికారుడు క్రియా శూన్యుడు కనుక బుద్ధివలె ఘటాకారమును పొందదు నిర్వికారునకు వికార మెట్లు సంభవించును? ఘటాకారమును పొందుట క్రియ క్రియాశూన్యునకు కర్తృత్వ మెట్లు కలుగును? అదిగాక సాక్షియగు ఆత్మ సర్వవ్యాపి ఆయన స్వయముగ ఘటమును తెలిసికొనిన ఘటాది జడద్రవ్యములకును నితరములను తెలిసికొను జ్ఞాన ముండవలసివచ్చును అట్టిది లోకమున లేదు కూటస్థుడు సర్వమును ఒక్కసారిగా ప్రకాశింపజేయును. బుద్ధివృత్తి అట్లు ప్రకాశింప జేయలేదు. ఇది గాక జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము అను నీమూడింటిని ప్రకాశింపజేయు ఆత్మకు అధ్యక్షుడని పేరు. ఈ అధ్యక్షకృతమగు దృష్టియే దృశ్యమును చూచినదని చెప్పినచో ఆత్మ సావయవి కావలసివచ్చును. ఆత్మ నిరవయవి. కనుక దృశ్యమునకును దృక్కునకునుగల సంబంధము మాయికము ఆత్మ జ్ఞానమును కాదు. జ్ఞాతయును కాదు ఆత్మను "జ్ఞ" డని చెప్పుదురు "జ్ఞ"డనగా తెలిసికొనువాడు అజ్ఞుడనగా తెలియనివాడు. ఆత్మ జ్ఞానాజ్ఞానములు రెండును కాదు

జి : ఒక్క మట్టిపెళ్ల యెట్లు జడమైనదో బుద్ధియు నట్టిదే ఉన్నభేద మేమనగా మట్టిపెళ్ల స్థూలము బుద్ధి స్వచ్ఛమగు సూక్ష్మద్రవ్యము రెండును జడములే. జడము స్వయముగా తన్నుతాను ప్రకాశింపజేసికొనుటకుగాని యితర పదార్థములను ప్రకాశింపజేయుటకుగాని శక్తి లేదని యిదివఱకే చెప్పియుంటిని కనుకనే చిదాభాసుడు కావలసివచ్చెను. చిదాభాసుని కల్పనతో పనిఏమి? అనుప్రశ్నకు శంకరులవారు ఇచ్చిన సమాధానమును ఉపదేశసాహస్రి 18-75, 84, 152, 153. 154వ శ్లోకములను చూడుడు. మఱియు బుద్ధికి బోధలేదు

ఆత్మకు వికారము లేదు (ఉ సా 17-25), చిత్తము స్వయముగా చేతనము కాదు చిదాభాస సంబంధము లేనిదే చేతనము కాదు అని (ఉ సా 18-88) చెప్పిరి

జి : కూటస్థుని సంయోగమువలన అంతఃకరణము చైతన్యవంత మగును కదా ఈ చిదాభాసునితో అవసరమేమి?

వే : సంయోగ మనునది రెండు సమాన ద్రవ్యములకే కలుగునుగాని, నిర్వికార చిత్స్వరూప శుద్ధచైతన్యమగు కూటస్థునికిని, జడమగు అంతః కరణమునకును సంయోగము ఘటింపదు ఎట్లన ఇనుమును మాంగనీస్‌ను కలిపి ముద్దచేసినట్లు ఇనుము వాయువును అట్లు చేయలేము కనుక చిత్తుయొక్క ప్రతిబింబమగు చిదాభాసుని అంగీకరింప వలసివచ్చెను చిదాభాసుడనగా జీవుడొక్కడే కాదు ఈశ్వరుడు (సగుణబ్రహ్మము) గూడ చిదాభాసుడే

జి : జ్ఞానేంద్రియ పంచకమునందు కూటస్థుడు ప్రతిఫలించి విషయములు నెఱుగవచ్చును కదా? ఇంద్రియములకును, కూటస్థునకును మధ్య అంతః కరణ మనునది కల్పింపవలసిన పనియేల?

వే : అంతఃకరణమే లేకపోయినచో కూటస్థుడు ఇంద్రియములద్వారా విషయములను నిరంతరము చూచుచుండవలసివచ్చును లేదా యెప్పటికిని చూడకనే యుండవలసివచ్చును అట్లేయగుచో మన యనుభవమునందు గల నిద్ర, మూర్ఛ, సమాధి అను ననుభవములే లేకపోవలసివచ్చును ఇదియునుగాక, కాలిలో ముల్లు గ్రుచ్చుకొనినపుడు త్వగింద్రియముద్వారా కూటస్థు డెఱిగినను, ముల్లును చేతితో తీసివేయుటకు కర్మేంద్రియమగు పాణీంద్రియమును ప్రేరేపింపవలసివచ్చును కూటస్థుడు నిష్క్రియుడు గనుక అది సాధ్యము కాదు కనుక మన అనుభవమును బట్టియు, శ్రుతిప్రమాణమును బట్టియు, అంతఃకరణమును చిదాభాసుని అంగీకరించియే తీరవలయును

జి : కూటస్థ చిదాభాసులయందు సంసారి ఎవడు ?

వే : కూటస్థుడు సంసారికాడు అతని ప్రతిబింబమగు చిదాభాసుడును సంసారికాడు చిదాభాసునితోకూడిన అంతఃకరణము (అహంకారము) సంసారియని చెప్పవచ్చును ఆత్మ స్వరూపబోధతో కూడినదైన బుద్ధి అవివేకమువలన తానే కర్తయని భావించును బుద్ధి తనకు సాక్షియగు ఆత్మను తెలియకపోవుటయే సంసార మనబడును (ఉ సా 16-60, 61)

జి : చిదాభాసుడును జీవుడును నొక్కడేయైన సుషుప్తియందు చిదాభాసుడు లేడు సుషుప్తియందు ప్రాజ్ఞుడను జీవుడున్నాడుగదా?

వే : సుషుప్తియందు అంతఃకరణమునందొక భాగమగు మనస్సు బీజావస్థయందుండుటచే బాహ్యవిషయములను లోనికి తీసికొనిపోవు వ్యాపారి లేడు కనుక (బుద్ధి) వృత్తులు లేవు. వృత్తులున్నప్పుడు కదా నామరూపాత్మక మగు నానాత్వము గోచరించును' వృత్తులుగా మారకుండునట్టి బుద్ధి మిక్కిలి శ్రేష్ఠమైనది అప్పుడది 'ప్రజ్ఞ' యనబడును. అప్పుడును దానియందు చిదాభాసుడున్నాడు కాని, వృత్తులు లేని కారణమున అతడేమియు నెఱుగడు కనుక చిదాభాసుడు లేడని తోచును ఆ సమయమున చిదాభాసుడు మిథ్యాభూతమగు నామరూపములను చూడని కారణమున (నామరూపములను చూచు విశ్వతైజసులకంటె) శ్రేష్ఠుడగుటచే "ప్రాజ్ఞుడు" అను గౌరవ నామమును ధరించుచున్నాడు. మఱియు విశ్వతైజస ప్రాజ్ఞులకు సాక్షియగు కూటస్థునకు ప్రాజ్ఞుడు సమీపమున (సామీప్యమున) నున్నాడు

ఈ సందర్భమున వేదాంత పంచదశియందలి వాక్యములను చెప్పెదను వినుము

చిదాభాసుడే జీవుడు ప్రాణధారణమువలన అతని కాపేరు కలిగినది ఇతడే లోకవ్యవహారము ననుసరించి సంసారియని పిలువబడుచున్నాడు (వే.పం 6-23) వేదాంతశాస్త్రములయందు ఆయాసందర్భములనుబట్టి 'చిదాభాస' 'జీవ' శబ్దములను వాడుచున్నారు "జీవునకే సంసారముగాని ఆత్మ కెంతమాత్రమును లేదను నిట్టి విజ్ఞానమే బోధ యనబడును."(వే.పం.6-11)

ఒక్క ఆత్మయే రెండువిధములుగ పరమాత్మ యనియు జీవాత్మ యనియు చెప్పబడెను దేహత్రయమునందు తాననెడి భ్రాంతి కలుగుటచేత జీవుడనియు, దేహత్రయముకంటె తాను విలక్షణుడని నిశ్చయించుటవలన పరమాత్మ యనియు చెప్పబడెను (వే పం 14-6)

జి : కర్త చిదాభాసుడా, బుద్ధియా?

వే : అంతఃకరణమునందు ఒక భాగమగు మనస్సు జ్ఞానేంద్రియములతో చేరి ఘటము మొదల్గు విషయముల యందు ప్రసరించుచున్నది అనగా ఒక విధమగు కరదీపిక (Torch light) వలె విషయమునే గాక దాని పరిసరమును

గూడ కొంత ప్రకాశింప జేయును ఇట్లు ప్రకాశింప జేయబడిన వస్తువుయొక్క ఆకృతిని, మనస్సులోనికి కొనిపోయి బుద్ధియెదుట నిలుపును బుద్ధి విషయాకారముగా పరిణమించును బుద్ధియొక్క యీ క్రియలకే వృత్తులని యందురు బుద్ధివృత్తియనియు చెప్పుదురు ఇదియే వృత్తిజ్ఞానము కనుక బుద్ధియే కర్త, బుద్ధియే వికారి అట్లనుటవలన కేవల బుద్ధిమాత్రమే కర్తకాదు (తెలిసికొనజాలదు)

ఇచ్చట 'బుద్ధి' అనగా 'చిదాభాస సంబంధమైన బుద్ధి' అని యెఱుంగవలెను నిర్వికారుడగు కూటస్థునియొక్క ప్రతిబింబముకూడ కదలదు బింబము కదిలినప్పుడే ప్రతిబింబము కదలును కాదా? నీటియందు చంద్రుడు ప్రతిఫలించగా నీరు కదలినపుడు చంద్రుని ప్రతబింబముకూడ కదలి నట్లుండును అట్లే బుద్ధియొక్క వ్యాపారము, కర్తృత్వము చిదాభాసునియందు ఆరోపింపబడు చున్నవి జడమైన బుద్ధికి చైతన్యము లేదు చిదాభాసుని సంపర్కమున దానికి చైతన్యము కలిగినది బుద్ధి సంపర్కమువలన చిదాభాసునియందు కర్తృత్వము ఆరోపింపబడినది ఎట్లనగా అగ్ని యొక్క సంయోగముచేత ఇనుమునకు ప్రకాశమును, ఇనుముయొక్క సంయోగమున అగ్నికి సమ్మెటదెబ్బలు కలిగినట్లుగా నని తెలియవలెను కూటస్థునినుండి ప్రకాశమును, బుద్ధినుండి కర్తృత్వమును చిదాభాసునికి సంక్రమించినవి

జి : అట్లయినచో నీ సంసారమంతయు చిదాభాసునిదని యేల చెప్పరాదు?

వే : జిజ్ఞాసువు జాగరూకతతో చిదాభాసుని రెండు విధములుగ భావింపవలెను (1) అంతఃకరణముతో తాదాత్మ్య మొందిన చిదాభాసుడు కర్తయనియు (2) అంతఃకరణముతో తాదాత్మ్య మొందని చిదాభాసుడు అకర్తయనియు భావింపవలయును చిదాభాసుడు అకర్తయయినపుడు బుద్ధియే కర్త యగుచున్నది "మనస్సు, ఇంద్రియములు మొదలగునవి కరణములు (సాధనములు) అంతఃకరణమునందలి విషయాకారమే బాహ్యావిషయ మనబడును బాహ్యావిషయము జీవునిచే కోరబడుటవలన కర్మ యనబడును కర్తకు నిష్టమైనది కర్మ కర్త అంతర్యామిచే కార్యమునందు ప్రేరేపింపబడు చున్నాడు" (ఉ సా 18-118, 119)

"ఆవిర్భావ తిరోభావములు గల చిత్తవృత్తులయందు తాదాత్మ్యమును పొందిన ఆత్మను ప్రమాత (జ్ఞాత) యనియు, కర్మేంద్రియములతో తాదాత్మ్యమును పొందినపుడు కర్తయనియు, పూర్వకర్మ విశేషమువలన ప్రాప్తించిన అంతఃకరణ సుఖదుఃఖములను తనవిగా భావించుటవలన భోక్తయనియు, సంస్కారవశమున కాలాంతరమున పూర్వానుభూతవృత్తులుదయింపగా స్మర్త యనియు, నీ సమస్తచిత్త విలాసములను (ఈ రాకడపోకడలను) నెఱుంగుచు సందేహము, భ్రాంతి లేనివాడగుచు నుండగా సాక్షియనియు, ఉపలబ్ధి యనియు వ్యవహారదశయందు చెప్పబడును" (ఉ.సా గద్య 2-81)

జి : ఆత్మకు భ్రాంతి కలదా?

వే : ఆత్మకు భ్రాంతిలేదు, సంఘాతనమునకే భ్రాంతి సంఘాత మనగా అహంకారము మొదలు దేహమువఱకును గల ఉపాధులు

జి : సంఘాతము జడము కదా? అది భ్రాంతి చెందుట ఎట్లు?

వే : చిదాభాస సంబంధమువలన నీ సంఘాతము చైతన్యవంతమగు చున్నది కదా? సత్త్వగుణ విశిష్టముగాని బుద్ధి అవిద్యావశమున తానే ఆత్మయనియు కర్తృత్వ భోక్తృత్వాదులు తనవే యనియు తలంచుటచే నివియన్నియు మనము ఆత్మయం దారోపించుకొనుచున్నాము ఎట్లనగా వేగముగా పోవుచున్న రైలులో ప్రయాణము చేయువానికి ఇరుప్రక్కలనున్న చెట్లు కదలుచున్నట్లు కనబడినట్లని తెలియవలయును. ఇదియునుగాక ఇనుముతో అగ్నికి సంయోగము కలిగినపుడు ఇనుమునకు అగ్నిధర్మములగు ప్రకాశత్వ ఉష్ణత్వములు కలుగుచున్నవి. కాని ఇనుమున కవి సహజములు కావు ఆగంతుకములు ఇనుపగుండుగాని, ఒక ఇనుపకమ్మిగాని కాలినపుడు అగ్నివలెనుండును దానిని చూచి మూఢులు 'అగ్ని బంతివలె గుండ్రముగా నున్నది' అనియును, అగ్ని కమ్మివలె పొడవుగా నున్నదనియును చెప్పుకొందురు అట్లే కూటస్థునియందు కర్తృత్వభోక్తృత్వాదుల నారోపించుచున్నారు (ఉ సా గద్య. 2-77)

అదిగాక ఒక రాజు యుద్ధభూమికి వెడలక అంతఃపురమునందే యుండినను అతనిసైన్యము శత్రువులను జయించినపుడు సైన్యము సాధించిన

జయమును రాజునం దారోపించినట్లు కర్తృత్వాదులు కూటస్థునియం దారోపించుచున్నారు కర్తృత్వాదులు అంతఃకరణ ధర్మములే వీనిని మన అనుభవమే దృఢపఱచుచున్నది ఎట్లనగా సుషుప్తియందు "అంతఃకరణము లీనమై యున్నది కనుక "అంతఃకరణ ధర్మములగు కర్తృత్వ రాగేచ్ఛా సుఖదుఃఖములు నిద్రయందు స్ఫురింపకుండుటయు, అంతఃకరణము కల్గిన జాగ్రత్స్వప్నములయందు కర్తృత్వాదులు స్ఫురించుటయు విదితమే"(ఆత్మబోధ శ్లో 23)

జి : అహంకారము చేయుపని యేమి?

వే : శబ్దాది దృశ్య ప్రపంచమును, బ్రహ్మమును తనయందు ప్రతిఫలింప జేసికొని ఆత్మయందు భ్రాంతిని కలిగించుచున్నది (నై సి 2-40 90)

ఆత్మగాని దేహమును ఆత్మ యనుకొనుటచే అహంకారమును అహం ప్రత్యయమని యందురు చిదాభాస యుక్తమగు అంతఃకరణమునందు ఆత్మ నేనని స్ఫురించుటచే అంతఃకరణము అహంప్రత్యయవత్ అనబడును ఆత్మ త్రిపుటికి సాక్షి

త్రిపుటియనగా చిదాభాసునితో కూడిన బుద్ధి జ్ఞాత యనియు, బుద్ధియొక్క పరిణామము జ్ఞానమనియు, విషయములను జ్ఞేయమనియు చెప్పుదురు ఈ త్రిపుటినే వేఱొక విధముగా చెప్పుదురు ఎట్లనగా వృత్తులు కలిగిన అంతఃకరణమునందు ప్రతిఫలించిన చైతన్యమును ప్రమాత యనియు, జ్ఞానమునకు ప్రమయనియు, ఇంద్రియగోచరమగు సకలవస్తువులు ప్రమేయ మనియు చెప్పుదురు శబ్దస్పర్శాదులనే విషయములని చెప్పుదురు విషయములతో కలసి విషయాకారమును పొందెడి బుద్ధివృత్తులకు ప్రత్యయములని పేరు విషయి అనగా తెలిసికొనువాడు అని యర్థము (వే పం 4-30) పైన చెప్పిన ప్రమాతృ, ప్రమాణ, ప్రమేయములనే క్రమముగా ద్రష్టృ, దర్శన, దృశ్యములని చెప్పుదురు

నిశ్చలదాసుగారు వారి 'విచారసాగరము' నందు చైతన్యమును నాలుగు విధములుగ వివరించిరి ఎట్లన (1) **ప్రమాతృ చైతన్యము.** ఇది అంతః కరణ విశిష్టచైతన్యము లేక సాభాసాంతఃకరణ విశిష్టచైతన్యము (2) **ప్రమేయ చైతన్యము.** ఇది ఘటాది ప్రమేయావచ్ఛిన్న చైతన్యము (3) **ప్రమాణచైతన్యము.**

ఇది వృత్తివిశిష్ట చైతన్యము లేక సాభాసవృత్తి విశిష్టచైతన్యము. (4) ప్రమాచైతన్యము. ఇది ఘటాది విషయాకార వృత్తియందు దారూఢమైన చైతన్యము.

ఈ విషయ మొకసారి సింహావలోకనము చేయుదము శరీరమునందున్న ఆత్మను సంఘాతమును క్రింది యుపమానముతో పోల్చి చెప్పవచ్చును ప్రభువు-ఆత్మ శరీరము-ఆయనకు కోట బుద్ధి-ప్రధాని అహంకారము-ప్రతీహారి (ద్వారపాలకుడు) మనస్సు-గుమాస్తా (కార్యదర్శి). ఇంద్రియములు-సేవకులు, బాహ్యవిషయములు-(పదార్థములు) భోగ్యపదార్థములు బాహ్యపదార్థములను సేవకులద్వారా కార్యదర్శి అంతఃపురములోనికి పంపుచుండును కొందఱు సేవకులచేత పనులు చేయించుచుందురు కార్యదర్శి ప్రధానియెదుట పెట్టిన పదార్థములను ప్రధాని ప్రభువునెదుట నుంచును ప్రతీహారి ద్వారమునందుండి తానే ప్రభుడనని విషయముల ననుభవించుచు సుఖదుఃఖముల నొందుచుండును నిస్సంగుడును, నిష్క్రియుడును నగు ప్రభువు వీటికన్నింటకి సాక్షిమాత్రుడై యుండును కార్యదర్శి ప్రభువుయొక్క ప్రయోజనముకొఱకే (లాభముకొఱకే) ఈ వ్యాపారము నంతయును జరిపించుచుండును

ప్రధాని బయటికిపోయి విషయములను తీసికొని వచ్చెడివాడు కాడు కార్యదర్శి యీ వ్యాపారమునందు ప్రవేశింపక ఉదాసీనుడై యూరకున్నచో వ్యాపారము (సంసారము) కట్టుబడిపోవును ఏలయన బయటి విషయములు లోపలికి పోజాలవు అందువలన ప్రధానికి పనియుండదు ఆ కారణమువలన 'నేను ప్రభుడ' ననుకొను దురభిమానియగు ప్రతీహారి నశించిపోవును సేవకులకు పనియుండదు ప్రభువునెదుట నీ వ్యాపారమంతయు నిలచిపోవుటచే ఆయనకు సాక్షిత్వము పోవును సాక్ష్యముండిన కదా సాక్షిత్వ ముండును ఇతర సంపర్కములేని ఆత్మ స్వయంజ్యోతియై ప్రకాశించును

ఇచ్చట ఇంకొక విషయమును గుర్తుంచుకొనవలయును అహంకార మాదిగ దేహ పర్యంతమును, నన్నియు ప్రభువగు ఆత్మసాన్నిధ్యముచేతనే ఆయా కార్యములయందు సమర్థములై యున్నవని యెఱుగవలయును ఈ విధముగ ఆత్మనెఱుంగుటకు సంఘాతముయొక్క వ్యాపారములను నెఱుంగుట యనునది యొకపద్ధతి ముఖ్యముగా మనస్సు నరికట్టి ఆత్మనెఱుంగుట యొకపద్ధతి కనుకనే

శ్లో॥ 'మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః ।
బంధాయ విషయాసక్తం ముక్త్యై నిర్విషయం స్మృతమ్' ॥

మానవుని బంధమోక్షములకు మనస్సే కారణము. విషయముల యందాసక్తమగు మనస్సు బంధమునకును, విషయాసక్తముగాని మనస్సు మోక్షమునకు కారణమని తాత్పర్యము అని శాట్యాయనీయోపనిషత్తు చెప్పినది

ఈ విధముగ రజ్జువునందు తోచిన సర్పమువలె ఆత్మయందు తోచిన యీసంఘాత మంతయు మరల ఆత్మయందే అణగిపోవుచున్నది "సముద్రజలమునుండి ఉత్పత్తియైన నదులు గంగాదినామములను పొంది మరల ఎట్లు సముద్రమునందు చేరి నామరూప రహితములై సముద్రనామమున వ్యవహరింపబడు చున్నవియో అట్లే యీ యీసంఘాత మంతయు ఆత్మయందే చేరుచున్నది" (ప్రశ్న 6-5)

జి : కూటస్థునిగుఱించి చెప్పితిరి ఆత్మను దృక్కు, ప్రజ్ఞానము, సాక్షి అని చెప్పితిరి వీటియందు భేదమేమైన గలదా?

వే : భేదము లేదు బోధ దృఢమగుటకు బ్రహ్మమే అనేకవిధములుగా చెప్పబడెను సమస్త జగత్కల్పన కధిష్ఠానమగు చైతన్యమును బ్రహ్మమనియు, అహంకారాదుల కల్పన కధిష్ఠానమగు చైతన్యమును కూటస్థుడనియు, జ్ఞాతృజ్ఞాన జ్ఞేయములను దృశ్యమును చూచువాడగుటచే దృక్కనియు, సర్వము నెఱుగువాడగుటచే ప్రజ్ఞానమనియు, అంతఃకరణోపాధికు డగుటవలన సాక్షియనియు, పరిపూర్ణుడు (గొప్పది) అగుటవలన భూమయనియు చెప్పబడెను

## (30) దృగ్దృశ్యవివేకము

శంకరులవా రిట్లు చెప్పిరి

దృగ్దృశ్యౌ ద్వౌ పదార్థౌ స్తః పరస్పర విలక్షణౌ ।
దృగ్ బ్రహ్మ దృశ్యం మాయా స్యాత్ ఇతి వేదాన్తడిణ్డిమః ॥

తా దృక్కు దృశ్యములని పదార్థములు రెండు ఈ రెండును పరస్పరవిరుద్ధములు ఇందు దృక్కు బ్రహ్మము, దృశ్యము (జ్ఞాతృజ్ఞాన జ్ఞేయములు) మాయ అని వేదాంత డిండిమము

జి : అహంకారము మొదలు దేహాంతమును గల సంఘాతమునందు ఇంద్రియాదులు వాటినవి యెఱుగగలవా?

వే : అవి తమ్ము తా మెఱుగజాలవు

శ్లో|| న విదం త్ర్యాత్మనః సత్తా తం ద్రష్టు దర్శన గోచరాః ।
న చాన్యోన్యమతోఽమీషాం జ్ఞేయత్వం భిన్నసాధనమ్ ||(నై సి 2-106)

తా ద్రష్టు, దర్శన, దృశ్యములు (ప్రమాతృ, ప్రమాణ, ప్రమేయములు) తమ తమ స్వరూపములును తామే స్వతంత్రముగా చూడజాలవు మఱియు ఈమూటిలో ఒక దానియొక్క స్వరూపమును మఱియొకటి తెలియజాలదు ఎట్లనగా ద్రష్టయొక్క స్వరూపమును దర్శనము, దర్శనముయొక్క స్వరూపమును ద్రష్ట, ద్రష్టృదర్శనములయొక్క స్వరూపము దృశ్యమును, దృశ్యముయొక్క స్వరూపము ద్రష్టు దర్శనములున్ను స్వతంత్రముగ చూడ జాలవు వీని కంటె విలక్షణమైన దృక్కు వీటిని తెలియుచుండును దృక్కు (చిదాత్మ) ప్రకాశమువలన జ్ఞేయత్వము (తెలియదగియుండుట) కలుగుచున్నది ఈ చిదాత్మనే ప్రజ్ఞానమని చెప్పిరి

శ్లో|| యేనేక్షతే శృణోతీదం జిఘ్రతి వ్యాకరోతి చ ।
స్వాద్వస్వాదూ విజానాతి తత్ప్రజ్ఞాన ముదీరితం || (వే పం 5-1)

తా "ఏచైతన్యముచేత చూడదగిన రూపాదికమును చూచుచున్నాడో, శబ్దములను వినుచున్నాడో, గంధముల నాఘ్రాణించుచున్నాడో, అనేకశబ్దములను వ్యవహరించుచున్నాడో, మధురరసములను తిక్తరసములను తెలిసికొనుచున్నాడో ఆచైతన్యము ప్రజ్ఞానమని చెప్పబడుచున్నది " సురేశ్వరాచార్యుల వారిట్లు చెప్పిరి

శ్లో|| అపశ్యన్ పశ్యతీం బుద్ధి మశృణ్వన్ శృణ్వతీం తథా ।
*నిర్మలోఽవిక్రియోఽ నిచ్ఛన్ని చ్ఛంతీం చాప్యలుప్తదృక్ ||

శ్లో|| ద్విషంతీ మద్విష న్నాత్మా కుప్యంతీం చాప్యకోపనః ।
నిర్దుఃఖో దుఃఖినీం చైవ నిస్సుఖః సుఖినీ మపి ||

శ్లో|| అముహ్యమానో ముహ్యంతీం కల్పయంతీ మకల్పయన్ ।
స్మరంతీ యస్మరం శ్చైవ శయానా మస్వపన్ ముహుః ||
(నై.సి 2-71, 72, 73)

తా ఆత్మ చూడనివాడును, విననివాడును, ప్రయత్నము, ఇచ్ఛ, ద్వేషము, కోపము, సుఖము, దుఃఖము, మోహము, కల్పన, స్మరణము మొదలగునవి లేనివాడై యుండియును, వేఱు వేఱు శరీరములయందు వేఱు వేఱుగా ప్రవర్తించుచున్న అనగా చూచుచు, వినుచు, ప్రయత్నము చేయుచు,

* 'నిర్మలో' అనుటకు 'నిర్వృత్తో' అని పాఠాంతరము

ఇచ్ఛయించుచు, ద్వేషించుచు, కోపగించుచు, సుఖించుచు, దుఃఖించుచు, మోహించుచు, కల్పించుచు, స్మరించుచు నున్న బుద్ధిని చూచుచు, దానికి సాక్షిమాత్రుడగుచు నిర్మలుడును నిష్క్రియుడునై యున్నాడు

ఈ విషయమునే శ్రుతులిట్లు చెప్పుచున్నవి "ప్రాణస్య ప్రాణముత చక్షుష శ్చక్షు రుత శ్రోత్రస్య శ్రోత్రమ్" (బృహదా 6-4-18)

తా ఎవరు ఆ పరబ్రహ్మమును ప్రాణమునకు ప్రాణముగను, నేత్రమునకు నేత్రముగను, శ్రోత్రమునకు శ్రోత్రముగను, మనస్సునకు మనస్సుగను, నున్నదని తెలియుచున్నారో వారు దానిని శ్రేష్ఠవస్తువనియు, పూర్వమే యున్నదనియు నిశ్చయముగ నెఱుగుచున్నారు

మం॥ **శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనో యద్వాచోహ వాచగ్ం స ఉ ప్రాణస్య ప్రాణ శ్చక్షుష శ్చక్షు రతిముచ్య ధీరాః ప్రేత్యాస్మాల్లోకా దమృతా భవంతి.** (కేన 1-2)

తా . శ్రోత్రమునకు శ్రోత్రము, మనస్సునకు మనస్సు, వాక్కునకు వాక్కు, ప్రాణమునకు ప్రాణము, నేత్రమునకు నేత్రము- అని తెలిసకొని శ్రోత్రాదులయందు ఆత్మ భావమును విడిచి, ఈషణత్రయమును వదలి ధీమంతులు అమృతమును పొందిరి

మం॥ **యచ్చక్షుషా న పశ్యతి యేన చక్షూగ్ంషి పశ్యతి,**
**తదేవ బ్రహ్మత్వం విద్ధి నేదం య దిద ముపాసతే.** (కేన 1-6)

తా : లోకులు (జనులు) నేత్రముచేత ఏపరబ్రహ్మస్వరూపమును చూడలేరో అంతఃకరణముతో కూడకున్న ఏ బ్రహ్మస్వరూపముచేత నేత్రము చూచుచున్నదో దానినే నీవు బ్రహ్మస్వరూపముగ తెలిసికొనుము దానికి వ్యతిరేకముగ నుపాసింపబడునదంతయు బ్రహ్మస్వరూపము కాదు

**మం॥ యచ్ఛ్రోత్రేణ న శృణోతి యేన శ్రోత్ర మిదం శ్రుతం ।**
**త దేవ బ్రహ్మత్వం విద్ధి నేదం య దిద ముపాసతే ॥** (కేన 1-7)

**తా :** శ్రోత్రేంద్రియముచేత ఏ బ్రహ్మస్వరూపమును వినుటకు సాధ్యము కాదో, అంతఃకరణముతో కూడుకొన్న ఏ బ్రహ్మస్వరూపముచేత శబ్దము శ్రోత్రేంద్రియముచేత తెలియబడుచున్నదో - దానినే నీవు బ్రహ్మస్వరూపముగా తెలిసికొనుము.

మం॥ య త్ప్రాణేన న ప్రాణితి యేన ప్రాణః ప్రణీయతే ।
త దేవ బ్రహ్మత్వం విద్ధి నేదం య దిద ముపాసతే ॥ (కేన 1-8)

తా : ప్రాణవాయువుచేత ఏ బ్రహ్మము ప్రాణవ్యాపారము కలదికాదో, ఏబ్రహ్మముచేత ప్రాణవాయువు ప్రాణవ్యాపారము కలదిగా చేయబడుచున్నదో- ఇత్యాది శ్రుతులచేతను చెప్పబడిన బ్రహ్మమే దృక్కు, తదితర మంతయు దృశ్యము

## (31) సాక్షి విచారము

జి : మీ రింతవఱకు చిదాభాస సంబంధమైన జ్ఞానమును గుఱించి చెప్పితిరి మందాంధకారమున త్రాటిని చూచినపుడు సర్పమను భ్రమ కలుగుచున్నది కదా? ఈ భ్రాంతి ఎట్లు కలిగినది? స్వప్న మెట్లు కలుగును? సుఖదుఃఖములు, స్మృతి - ఇవి ఎవని విషయములై యున్నవి?

వే : ఈ విషయములు పూర్తిగా అవగాహన చేసికొనవలెనన్న కొన్ని సంగతులు ముందుగా తెలిసికొనవలయును ప్రమాజ్ఞానము ప్రమాత నాశ్రయించినది స్మృతిజ్ఞానము సాక్షి నాశ్రయించినది స్మృతికంటె వేతై, అబాధితమైన అర్థమును, విషయమును చేయునట్టి జ్ఞాన మేది కలదో దానినిమాత్రమే ప్రమ యందురు భ్రాంతి మొదలగునవి అవిద్య నాశ్రయించునవి అవి బాధింపబడుచున్నవి

సాక్షికి అంతఃకరణము ఉపాధి సాక్షిని గుఱించి వేదాంత గ్రంథములయందు భిన్నాభిప్రాయములు కలవు శ్వేతాశ్వతరోపనిషత్తునందు సాక్షిని గుఱించి చెప్పిన మంత్రములో సాక్షి నిర్గుణుడని, బ్రహ్మలక్షణములను చెప్పుచు కర్మఫలమును ఇచ్చువాడు అనియును చెప్పబడెను (శ్వేతా. 6-11) కర్మఫలమును ఇచ్చువాడు ఈశ్వరుడు సాక్షియో నిర్గుణుడు కర్మఫలము నిచ్చువాడు కాడు కర్మఫలభోక్తయు కాడు సుఖదుఃఖములను ప్రకాశింపజేయును కనుక కర్మ పలము నిచ్చువాడని శ్రుతి చెప్పియుండవచ్చును అందుచేత సాక్షి ఈశ్వరునికంటె భిన్నుడు బ్రహ్మమే సాభాసాంతః కరణోపాధిచే సాక్షియని వ్యవహరింపబడుచున్నాడు

సాక్షికి మాయతో సంబంధమున్నట్లు దోచుటే గాని వాస్తవముగ నెట్టి సంబంధమును లేదు. వేదాంత పంచదశి నాటకదీప ప్రకరణమునందు సాక్షిని గుఱించి చెప్పబడినది అచ్చట సాక్షిని నృత్యశాలయందలి దీపముతో పోల్చిరి. నర్తన శాలను దాని వెలుపలనుగూడ ఆ దీపము ప్రకాశింపజేయును

నృత్యశాలను (రంగస్థలమును), అందలి ప్రభువును, నర్తకిని, నాట్యాంగములగు మృదంగాది వాద్యములను, వాయించు వారిని, సభ్యులను, రంగస్థలమందలి, దీపమెట్లు సమానముగ ప్రకాశింపజేయునో, అట్లే సాక్షి సుఖదుఃఖాదికములగు అంతఃకరణ వృత్తుల నేకవిధముగా ప్రకాశింపజేయును ఇచ్చట ప్రభువు జీవుడు బుద్ధి ఆటక త్తె నాటకాంగములు ఇంద్రియములు, సభ్యులు విషయములుగ పోల్చబడెను

శ్లో|| కర్తారం చ క్రియాం తద్వ ద్వ్యావృత్త విషయా నపి ।
స్ఫోరయే దేకయత్నేన యోఽసౌ సాక్ష్యత్ర చిద్వపుః ॥ (వేం పం 10-9)

తా చేయువానిని, చేసెడిపనిని, విషయములను నొక్కసారిగా ప్రకాశింపజేయు చిత్స్వరూపమగు చైతన్యమే సాక్షి

మం|| జ్ఞాతృజ్ఞాన జ్ఞేయాదావా విర్భావ తిరోభావజ్ఞాతా ।
స్వయం తదావిర్భావ తిరోభావ రహితః స్వయంజ్యోతి శ్చేతన స్సాక్షీ॥
(సర్వసార)

తా తెలిసికొనువాడు, తెలివి, తెలియబడునది-ఈ మొదలగువానియందు ఆవిర్భావము (తోచుట), తిరోభావము (మఱుగగుట) లను తెలిసికొనువాడుగను, తనకు ఆవిర్భావతిరోభావములు లేనివాడుగను, స్వప్రకాశము కలవాడుగను నుండు చేతనుడే సాక్షి యనబడుచున్నాడు * ఈ సాక్షినే అంతరాత్మయందును ఈయన నిష్క్రియుడు భిన్నభిన్న అంతఃకరణోపాధులయందు కలవాడగుటచే సాక్షులు అనేకులని భిన్నులని చెప్పగూడదు అనేకములగు భిన్నభిన్నా కారములుగల ఘటములయందున్న మహాకాశము భిన్నభిన్న ఘటాకారములు పొందినట్లు కనిపించినను ఘటాకాశములని - బహువచనముచేత వ్యవహరింప బడినను ఒక మహాకాశమే యగుటవలన అన్నింటియందును ఒక మహాకాశమే యున్నట్లు సమస్త అంతఃకరణోపాధులయందున్న (సాక్షి) చైతన్యము ఏకమును అద్వితీయమునగు బ్రహ్మమునకంటె భిన్నము కాదు

---

* ఈ అర్థము సీతారామాంజనేయ సంవాదమునం దిట్లు చెప్పబడినది

ధీచేతో విషయాత్మకంబు లగు జ్ఞాతృజ్ఞాన విజ్ఞేయముల్
మాచింపం దగఁ దల్లయోదయములన్ సుప్తిప్రబోధంబులే
నాచిత్రంబుల వానిఁ జేయు నిజమాయన్ సాక్షియై చూచుచున్
రోచిష్ణుత్వముచే వసింతు సదసద్రూపాతిరి క్తంబుగాన్.

## (32) సాక్షి - భ్రాంతి విచారము

ఇప్పుడు భ్రాంతిజ్ఞానము ఎట్లుకలుగునో వివరించెదను ఒకపురుషుడు మసకచీకటియందు నడచుచుండగా అతనికి మార్గమున ఒకత్రాడు కనబడినది దానినిచూచి సర్పమని భ్రమపడెను ఇచట జరిగిన విషయ మిది అంతఃకరణవృత్తి నేత్రేంద్రియముద్వారా బయలు వెడలి రజ్జువును సమీపించెను రజ్జువు నాశ్రయించియున్న అవిద్యావరణము కొంత తొలగి కొంత తొలగక అట్లే యున్నది కారణ మేమనగా వెలుతురు సహాయము లేనిదే నేత్రేంద్రియము చక్కగా పనిచేయదు వెలుతురు పూర్తిగా లేకపోవుటచేత నేత్రేంద్రియముద్వారా బయలు వెడలిన అంతఃకరణవృత్తి రజ్జువు నాశ్రయించియున్న అవిద్యావరణమును పూర్తిగా తొలగించలేక పోయెను అప్పుడు అవిద్యయందు క్షోభ కలిగెను నేత్రేంద్రియముద్వారా రజ్జువుయొక్క సామాన్యరూపము మాత్రమే కనబడెను దాని నాధారముగ చేసికొని రజ్జూపహిత చైతన్యము నాశ్రయించి యున్న యవిద్యయందలి తమోగుణాంశము మిథ్యాసర్పమును కల్పించెను అదేసమయము నందే సాబాసాంతఃకరణోపహిత చైతన్యము నాశ్రయించియున్న అవిద్యయందలి సత్త్వగుణాంశమువలన సర్పజ్ఞానము కలిగెను ఇట్లు మిథ్యాసర్పమునకును తత్ సర్పజ్ఞానమునకును విద్య యుపాదాన కారణమై యున్నది ఇట్లు మిథ్యా వస్తువు, మిథ్యాజ్ఞానమును రెండును చేరి భ్రమ, లేక భ్రాంతి యనబడును మిథ్యాసర్పమును అర్థాధ్యాసమనియు భ్రాంతి జ్ఞానమును జ్ఞానాధ్యాసమనియు చెప్పిరి

మిథ్య యనగా ఏదేని నొకవస్తువు పుట్టవలయునన్న దానికి కొంత దేశము, కాలము, సామగ్రి కావలసియుండును అట్లు దేశ కాల సామగ్రితో అవసరములేకయే యుత్పన్నమైన వస్తువును మిథ్యయని చెప్పిరి. *మిథ్యాసర్పము

* ఇచట నొక విషయము గమనించవలసియున్నది మిథ్యాపదార్థముల యొక్క నిర్వచనము పైన చెప్పినరీతిగా శాస్త్రములయందు చెప్పబడినది పురాణములయందు వసిష్ఠ జమదగ్న్యాదుల కామధేనువు, కోరిన భోజనాది సామగ్రులను దేశకాల సామగ్రితో అవసరములేకయే క్షణమాత్రమున సృష్టించినట్లు కలదు శ్రీమద్రామాయణమున భరతుని పరివారమునకు భరద్వాజుడు తన తపశ్శక్తిచే విందుచేసినట్లు చెప్పబడినది. ఇచటను దేశకాలసామగ్రి లేదు 'పై సందర్భములయందు ఉత్పన్నమైన పదార్థములు మిథ్యలని చెప్పుటకు వీలులేదు వర్తమానకాలమునందు కొందఱు యోగులు వారిభక్తులకు క్షణమాత్రమున కొన్ని వస్తువులను సృష్టించి యిచ్చుచున్నారు. అవియును మిథ్యయని చెప్పుటకు వీలులేదు

నకు రజ్జూపహిత చైతన్యమే అధిష్ఠానము తత్ సర్పజ్ఞానమునకు ఆభాస సహిత అంతఃకరణోపహిత చైతన్యము (సాక్షి) అధిష్ఠానము

వెలుతురు వచ్చినంతనే నేత్రేంద్రియముద్వారా సాభాసాంతఃకరణవృత్తి రజ్జువునందు ప్రవేశించి దానియందున్న అవిద్యావరణమును పూర్తిగా తొలగించుటచే రజ్జుసాక్షాత్కారమైనది ఎప్పుడు రజ్జుసాక్షాత్కారమైనదో, అప్పుడు వృత్తిచైతన్యము రజ్జూపహితచైతన్యము నీ రెండును నొక్కటి యగుచున్నవి అప్పుడు బాహ్యరజ్జువు ఒకటి రజ్జ్వాకారమును పొందిన మనోమయరజ్జు వొకటి, రెండురజ్జువు లైనవి మొదటిది ప్రమాతచేత ఎఱుగబడినది రెండవది సాక్షిచేత తెలియబడినది ఆ సమయమునందే మిధ్యాసర్పమును తత్ సర్పజ్ఞానమును రెండును నశించినవి ఈ విధముగనే మసకచీకటియందు నేలపగులు, పూలదండ, నీటిచాలు, మొదలగునవి సర్పాకారముగ కనబడవచ్చును వాటివిషయమున నిదేవిధముగ నర్థము చేసికొనవలయును

జి : మిధ్యాసర్పమునకు అధిష్ఠానము రజ్జువుకదా? రజ్జూపహిత చైతన్యమని చెప్పితిరే ఏల?

వే : అవిద్య ఎప్పుడును చైతన్యము నాశ్రయించి యుండును, జడద్రవ్యమును నాశ్రయించి యుండదు అందు వలన రజ్జూపహిత చైతన్యమే మిథత్యాసర్పమున కధిష్ఠానము.

జి : అవిద్యకు చైతన్యము విరోధి కాదా ? చైతన్యము నెట్లాశ్రయించి యుండును?

వే : చైతన్యము రెండువిధములు (1) వ్యాపక చైతన్యము (2) వృత్తిచైతన్యము మొదటిది అవిద్యకు విరోధికాదు రెండవది యగు వృత్తిచైతన్యమే అవిద్యకు విరోధి.

మిథ్యాసర్పము అనిర్వచనీయ మైనది ఏలయన కనబడుచున్నది కనుక కుందేటికొమ్మువలె అసత్తు కాదు. వెలుతురు వచ్చినంతనే అదృశ్యమగును, కనుక సత్తుకాదు అందు వలన 'అనిర్వచనీయమనియు, అనిర్వచనీయ ఖ్యాతియనియు, చెప్పుదురు. మిథ్యాసర్పము ప్రమాతకు విషయము కాదు సాక్షికి విషయమై యున్నది

## (33) స్వప్న విచారము

స్వప్న మనునది జాగ్రద్దశయొక్క స్మరణ కాదు. అనగా జాగ్రదనుభవము యొక్క స్మృతికాదు మఱి యేమనగా : జాగ్రద్దశయందలి మన అనుభవమువలన కలిగిన సంస్కారముచేత కలుగు నొకయవస్థ. ఇచట సంస్కార మనగా - జాగ్రద్దశయందు శబ్దాదివిషయ రూపాకారముగ పరిణమించిన అంతఃకరణము తిరిగి కాలాంతరమున అయా రూపాద్యాకారముగా మారుటకు శక్తికలది యగుటయే. ఇది స్మృతికంటె భిన్నము. స్మృతియనగా - పూర్వానుభూత విషయాకారరూపముగా అంతఃకరణము పరిణమించుట. సంస్కార మనునపుడు ఈజన్మయందలి జాగ్రద్దశానుభవములనే కాక వెనుకటి యనేక జన్మముల యందలి సంస్కారములను కూడ కలుపుకొనవలసి యుండును

శ్లో॥ "ప్రబోధరూపం మనసోఽర్థయోగజం ।
స్మృతౌ చ సుప్తస్య చ దృశ్యతేఽర్థవత్" ॥ (ఉ.సా 14-49)

తా "జాగ్రద్దశయందలి వస్తుదర్శనమువలన మనస్సు వస్త్వాకారముగ వ్యాపించి స్మరణయందును స్వప్నావస్థయందును ఆవస్తురూపముగా అనబడుచున్నది."

స్వప్నవిషయములు రజ్జువునందు తోచిన మిథ్యాసర్పమువలెనే మిథ్యయైనవి కనుక స్వప్నము అనిర్వచనీయ మైనదే. సాక్షి నాశయించియున్న అంతఃకరణ రూపావిద్య యందలి తమోగుణాంశము వలన స్వప్నమునందలి వస్తువులు కల్పింపబడినవి. అచటి అవిద్యయందలి సత్త్వగుణాంశమువలన స్వప్నగత జ్ఞానము గలిగినది. అవి అన్నియును సాక్షిచేతనే ప్రకాశింప జేయబడినవి జాగ్రదవస్థయందున్నట్లే స్వప్నము నందును త్రిపుటి కలదు అచ్చట శరీరమును ఇంద్రియములును కలిగియుండును అవి జాగ్రదవస్థయందు పనిచేయు ఇంద్రియములేనా? జాగ్రత్తయందు పనిచేయు నింద్రియములు స్థూల శరీరమునందలి అయా గోళములయందుమాత్రమే క్రియావంతములై యుండును కాని, స్వప్నము సూక్ష్మశరీరమని చెప్పిరి గదా? సూక్ష్మశరీరమందు ఇంద్రియములు గలవు కనుక అవి జాగ్రదవస్థయందలి యింద్రియములు కావని చెప్పుటకును వీలులేదు.

స్వప్నమును జాగ్రత్తయును రెండును ఒక్కటియేయని కొందఱందురు మఱికొందఱు వేఱు వేఱని చెప్పుదురు. ఈ భేదమునకు కారణమిది.

వేదాంతశాస్త్రమునయందు మూడు విధములైన 'సత్త'లు చెప్పబడెను. అందు మొదటిది పారమార్థికసత్త ఇది పరబ్రహ్మము రెండవది వ్యావహారిక సత్త ఇది జగత్తు మూడవది ప్రాతిభాసికసత్త. ఇది స్వప్నము ఎవరి మతమునందు త్రివిధసత్తలు అంగీకరింపబడునో వారి మతమునందు జాగరణ స్వప్నములు రెండును ఒకటికావని చెప్పుదురు, వారు చెప్పెడి కారణములయందు ముఖ్యములివి.

స్వప్నమున కార్యకారణములు రెండును ఒక్క సారియే కలుగును. అనగా తల్లులు వాటిపిల్లలు రెండును ఒకసారియే కనబడును. చెట్టును దానిపలములును ఒకసారియే కనపడును. మిథ్యావస్తువుయొక్క యుత్పత్తివలెనే దీనికి తగినంత దేశకాలసామగ్రి లేదు ఈ మొదలగు కారణముల వలన స్వప్నజాగరణములు రెండును ఒకటి కావని చెప్పుదురు.

మఱియొక పక్షమువారి మతమునందు త్రివిధసత్తలు లేవు. వారు ద్వివిధసత్తలను మాత్రమే యంగీకరింతురు బ్రహ్మము పారమార్థికసత్త స్వప్నజాగరణములు రెండును ప్రాతిభాసికసత్త. వ్యావహారికసత్తను వారు త్రోసి వేయుదురు వారివాదములో ముఖ్యవిషయ మేమనగా, ఏ (అవిద్య) బ్రహ్మమునందు మిథ్యాజగత్తును కల్పించెనో, ఆయవిద్యయే స్వప్నమునుకూడ కల్పించెను అందువలన స్వప్నజాగరణములు సమములు.

నాయభిప్రాయమున త్రివిధసత్తల నంగీకరించుటయే యుక్తము. రెండింటికిని అవిద్యయే కారణమైనను స్వప్న ప్రపంచమును సృష్టించు అవిద్యకు నిద్రాదోషము తోడ్పడుచున్నది. నిద్రాదోషసహిత అవిద్య స్వప్నమునకు ఉపాదానకారణము వ్యావహారిక ప్రపంచమునకు అధిష్ఠానము బ్రహ్మము స్వప్నప్రపంచమునకు అధిష్ఠానము సాక్షి. మఱియు స్వప్నము జాగరణ సుషుప్తులకు మధ్యనున్నది జాగరణమునందు నేత్రముననున్న విశ్వుడు కంఠమునందున్న హితానాడియందు ప్రవేశించినపుడు తైజసుడని పేరుకలిగి స్వప్నమును గాంచుచున్నాడు. అతడే హృదయమునందు చేరి నిద్రానుభవమునుపొంది ప్రాజ్ఞు డనబడుచున్నాడు. కనుక ఒక్కొక్కసారి ప్రాజ్ఞునియందున్న గొప్పతనము తైజసునియందు చేరును అందువలన ఒకానొక సమయమున కొందఱికి కలుగు స్వప్నములు భావిశుభాశుభ సూచకములని చెప్పుదురు

**తే. అనిలముఖదోషములను సత్త్వాదిగుణ వి**
**కారముల జాగరంబునఁ గలుగునట్టి**
**తోపు బెరయంగఁ గలయయై తోఁచునది శు**
**భాశుభములకు సూచకమనియుఁ గలదు.** (తిక్కన శాంతి ఆ 4)

అని భీష్ముడు ధర్మరాజునకు చెప్పినట్లు కలదు

బ్రహ్మజిజ్ఞాసువు స్వప్నజాగరణములను వేఱు వేఱని తలచినను కొన్ని విషయముల రెండింటికిని సాదృశ్య ముండుట వలన, ముఖ్యమైన విషయమున రెండును అసత్యములే యగుట వలన రెండును నొక్కటియేయని భావించి నప్పుడే వైరాగ్యము దృఢమగును ఎట్లనగా ఇరువురు మనుష్యులు నిద్రించినపుడు ఇరువురికిని స్వప్నముకలిగి అందొకడు రాజైనట్లును, రెండవవాడు బిచ్చమెత్తికొన్నట్లును అనుభూతిని పొంది, మేల్కొనినంతనే ఇరువురును సమానులైనట్లు వ్యావహారిక జగత్తునందును, సర్వభూమండలాధిపతియైన సార్వభౌముడును, బిచ్చగాడును ఈ జాగ్రత్తనుండి మేల్కొని నంతనే (లేక మరణించగనే) ఇద్దరును ఒక్కటియే యనియు, ఆ మెలకువ ఏక్షణమునందైనను కలుగవచ్చుననియు, అందు వలన వ్యావహారిక జగత్సంబంధమైన వైభవములకొఱకు ప్రాకులాడరాదని, వైరాగ్యమునందు స్థిరుడై, జ్ఞానియై, ముక్తుడగుచున్నాడు. కనుక స్వప్నజాగరణములు అన్నింటను సమములు గాకపోయినను సమమని తలచుటయే యుక్తము

## (34) సుఖదుఃఖాదులు సాక్షికి విషయములు

జి : సుఖదుఃఖములు సాక్షికి విషయములా లేక ప్రమాతకు విషయములా?

వే : సుఖదుఃఖములు మొదలగు మనోధర్మములు (అంతఃకరణముయొక్క ధర్మములు) ప్రమాతకు విషయములు కావు. దేనియొక్క ధర్మమును నది యెఱుగలేదు సరి కదా అంతఃకరణముగాని, ఇంద్రియముకాని, దాని కత్యంత సమీపమునందున్న దానిని అది తెలిసికొనలేదు అంతఃకరణ ధర్మములు సాక్షికిమాత్రమే విషయము లగుచున్నవి. సుఖమో దుఃఖమో కలిగినపుడు అంతఃకరణము వాటి ఆకారమును పొందుచున్నది అప్పుడు అవృత్తియందు ఆరూఢుడైన సాక్షి ఆసుఖదుఃఖాకారము పొందుటకు వెలుపలికి పోవలసిన పనిలేదు. అది లోపలనే ఆవిధమైన ఆకారమును పొందుచున్నది వృత్త్యపేక్ష లేనిదే సాక్షి దేనిని గూడ ప్రకాశింపజేయలేదు

## (35) స్మృతి, సంశయ, జ్ఞానముల విచారము

**స్మృతియనగా** : పూర్వానుభూత విషయాకారమును పొందిన అంతః కరణవృత్తియని చెప్పియుంటిని స్మృతి సంశయజ్ఞానములు రెండును సాక్షికి విషయము లగుచున్నవి. ఏలయన ఇవి భ్రాంతిజ్ఞానమువలెనే యవిద్యావృత్తిరూపముగ నున్నవి. ప్రమాజ్ఞానమే ప్రమాతకు విషయమని చెప్పియుంటివి 'ప్రమ'యనగా స్మృతికంటె భిన్నమై అబాధితార్థమును తెలియజేయు జ్ఞానము సుఖదుఃఖముల ననుభవించిన పిమ్మట కొంతకాలమునకు పురుషుడు పూర్వానుభవములను స్మరించినప్పుడు అంతః కరణవృత్తి ఆయా సుఖదుఃఖాకారమును పొందుచున్నది పూర్వము వాడనుభవించిన సుఖదుఃఖదాయక విషయసంబంధజ్ఞానము ఇప్పుడు ఉండవలసిన యవసరము లేదని మన మెఱింగినదే అయినను అజ్ఞానము స్మృతిరూపమున నున్నది. పూర్వము చూచిన పదార్థమిపుడు స్మరింప బడుచున్నది అ విషయ మెచ్చట నుండినది?

శంకరులవా రిట్లు చెప్పిరి

శ్లో॥ స్మరతో దృశ్యతే దృష్టం పటే చిత్రమివార్పితమ్ ।
యత్ర యేన చ తౌ జ్ఞేయౌ సత్త్వక్షేత్రజ్ఞ సంజ్ఞకౌ ॥ (ఉ.సా. 15-2)

తా · పటము (చిత్రము వ్రాయుట కుపయోగించుకొను వస్త్రము) నందు చిత్రము (బొమ్మ) వ్రాయబడినది ఆ వస్త్రమును ముడిచినప్పుడు చిత్రము కనపడదు. వస్త్రమును విప్పినపుడు చిత్రము కనబడును అదే విధముగ ఇది వఱకు చూడబడిన వస్తువును స్మరించునపుడు ఏచిత్తమందు, పటమునందు చిత్రమువలె నావస్తువు కలదో, యది సత్త్వ మనియును చిత్తమును వస్తువును చేరి, పటమును, చిత్రమునువలె నీ రెండును ఎవనిచేత తెలియబడునో అతడు క్షేత్రజ్ఞుడు అని చెప్పబడును

జి : విషయాకారమును పొందినవాటి విషయ మట్లుండ సుఖదుఃఖాది అంతఃకరణవృత్తులు స్మరింపబడు నపుడు వాటి యొక్క స్థానమెచ్చట?

వే : వాటికిని అంతఃకరణమే స్థానము. సంశయజ్ఞానము అవిద్యాకార్య మగుటవలన అదియును సాక్షిభాసితమే.

## (౩౬) గౌడపాదుల అజాతవాదము

గౌడపాదాచార్యులవారు ఇదివఱలో చెప్పినట్లు ద్వివిధసత్తల నంగీకరించు వారు వ్యావహారికజగత్తు పుట్టనే లేదని చెప్పిరి సృష్టికల్పనా భేదములను, సృష్టికి కారణము కలదని చెప్పునట్టి ముప్పది ఐదు మతములను, సంగ్రహముగ చెప్పి వాటియందు దోషమును చూపియున్నారు (గౌ కా. 1-22 నుండి 28 వఱకు)

**శ్లో॥ ఆదావన్తే చ యన్నాస్తి వర్తమానేఽపి తత్తథా ।**
**వితథైః సదృశా స్సన్తోఽవితథా ఇవ లక్షితాః ॥** (గౌ కా 4-31)

**తా** ఆదియందును అంతమునందును నేది లేదో అది మధ్యయందును లేదు. మనము చూచు పదార్థములన్నియు మిథ్యయే యైనను మనకు సత్యమువలె కనబడుచున్నవి

పై శ్లోకముయొక్క ప్రథమార్ధభాగము వేదాంతపంచదశియందు గైకొనబడినది (వే పం 13-68) ఆశ్లోకము యొక్క భావమిది ఒకానొక నిరుపేద నిద్రలో రాజయినట్లు స్వప్నము గాంచును. మేల్కొనిన పిమ్మట కలలో వాడనుభవించిన రాజ్యసంపదలు లేవు. నిద్రించుటకు పూర్వము లేవు పోనీ మధ్యయందైన నుండెనా యన్న అప్పుడును లేవు. ఉన్నట్లు తోచుటయేగాని సర్వమును మిథ్యయే.

**జి :** ఏచిత్తమునకు ఈ స్వప్నదృశ్యము కనబడెనో అదియైనను వాస్తవమేనా?

**వే :** చిత్తముగాని, చిత్తదృశ్యముగాని, జాగ్రత్తగాని జాగ్రత్తయందు తోచెడి యీ ప్రపంచముగాని, యెప్పుడును పుట్టనే లేదని చెప్పిరి (గౌ.కా 4-28, 29, 30, 33)

**జి :** ఈ మిథ్యాకార్యమునకు కారణ మొకటి యుండవలెను కదా?

**వే :** అసత్యమైన మిథ్యాకారణమే మిథ్యాకార్యమును సృష్టించుచున్నది. "(1) అసత్యమునకు అసత్యము కారణము కాజాలదు. (2) సత్యమునకు అసత్యము కారణము కాజాలదు. (3) సత్యమునకు సత్యము కారణము కాజాలదు. (ఇట్లుండగా) (4) అసత్యమునకు సత్యము కారణమెట్లగును?

ప్రపంచముగాని మఱేదిగాని పుట్టలేదు నశించనులేదు" అని (గౌ. కా 4-40) చెప్పిరి. మఱియు ద్రష్ట (చూచువాడు), దృశ్యము (చూడబడునది) నీరిద్దరికి మధ్య సంధానముచేయుటకు మఱియొకటి యుండవలెను; కనుక దర్శనము అవసరమైనది ఈమూడును త్రిపుటి యని చెప్పిరి ఇందులో ఏఒకటి లేకున్నను మిగిలిన రెండును లేవు కనుక ఇవి పరస్పరము తమ అస్తిత్వమున ఒకదానిపై ఒకటి ఆధారపడియున్నవి దేనికిని స్వతంత్రాస్తిత్వము లేదు. కనుక నీత్రిపుటి అసత్యము త్రిపుటికంటె వేఱైన జగత్తు లేదు

జి : ప్రపంచము పుట్టనే లేదని యంటిరి శ్రుతులయందు ఆత్మయందుండి ఆకాశము, ఆకాశమునుండి వాయువు ఈవిధముగా సృష్టి జరిగినదని మీరే చెప్పితిరికదా?

వే : శ్రుతులయందు సృష్టిని గుఱించి చెప్పిన వాక్యములు సృష్టిని ప్రతిపాదించు వాక్యములుగ కనబడినను వాటి యర్థము ననుసరించి చూచిన అవి సృష్టిని ప్రతిపాదించునవి కావనియు, అవి బుద్ధ్యవతారార్థము అనగా జీవ బ్రహ్మల కభేదమును బోధించుట కుపాయభూతములుగ మాత్రమే చెప్పబడినవిగాని, పారమార్థికములు గావనియు సమాధానము చెప్పిరి (గౌ.కా. 3-15, 23). శంకరులవారు ఈ వాదమును త్రోసివేయలేదు

జి : జగత్తు కలదను మన అనుభవమును నెట్లు త్రోసివేయుదుము?

వే : త్రాటియందు భ్రాంతివశమున సర్పము కల్పింపబడినట్లు ఆత్మయందు మొదట జీవభ్రాంతి కలిగినది ఆజీవుడే వాని విజ్ఞానము ననుసరించి వాని కనుగుణమగు స్మృతి కలవాడై బాహ్యములును, ఆంతరంగికములును నగు భావములను కల్పించుకొనియున్నాడు (గౌ.కా. 1-16)

(1) బాహ్యాభావము లనగా మనస్సు వెలుపల కనబడు పదార్థములు. ఇవి భేదకాలమనియు, ద్వయకాలమనియు చెప్పబడును. అనగా లోపలను, వెలుపలను నుండునట్టివి ఇవి స్ఫుటములు.

(2) అంతరంగిక భావములనగా కేవలము మనస్సు లోపలి మనోరథమాత్రములైన భావములు. ఇవి చిత్త కాలములు. అనగా - కల్పనాకాలమున మనస్సునందే తోచును కాని బయట కనబడవు. ఇవి

అవ్యక్తములు. ఇవి రెండును కాల్పనికములే. ఇట్టికల్పన యెట్లు జరిగెననగా హేతువిజ్ఞానము చేత ఫలవిజ్ఞానమును, అందువలన హేతుఫలములయొక్క స్మృతియు, దానివలన తత్స్మృతియు, అస్మృతివలన క్రియాకారక ఫలవిజ్ఞాన భేదములును, వీని వలన వీనిస్మృతియు, దానివలన దానివిజ్ఞానమును - ఇట్లు అన్యోన్యము కార్యకారణ సంబద్ధములగు బాహ్యాధ్యాత్మిక భావముల (పదార్థముల) ను కల్పించుకొనుచున్నాడు.

ఇందుల కొక యుదాహరణము చెప్పిరి. భోజనాదికము తృప్తికి హేతువనెడి కల్పనావిజ్ఞానము మొదట కలుగుచున్నది. ఆ తరువాత హేతుఫలములయొక్క స్మృతి కలుగుచున్నది. అనగా : తృప్తికి హేతువగు భోజనము, భోజనమునకు ఫలము తృప్తియు నను వీటిస్మృతి కలుగుచున్నది అస్మృతి ననుసరించి అన్నపానముల సమకూర్చుకొని భుజించుటయు, దానివలన తృప్తియు, అన్నముకొఱకు బియ్యము మొదలగు పదార్థములు సమకూర్చుకొను యత్నమును, అప్రయత్నమునం దనేక కల్పనలును - ఇట్లు అనేక విధములగు పరస్పరము కార్యకారణరూపమగు ప్రపంచమే కల్పింపబడినది. ఇట్లు జీవుడు కర్మచేయుట, దానివలన భోగానుభవము, దాని కొఱకు తిరిగి కర్మాచరణము, దానినుండి తత్ఫలభోగమును సంభవించుచున్నవి. ఇదియంతయు అఘటనా ఘటనా సమర్థమగు మాయయొక్క కార్యము. కనుక ప్రపంచము పుట్టనే లేదని తాత్పర్యము.

## (37) జ్ఞానసాధనములు లేక, ప్రమాణములు

మనకు సత్యజ్ఞానమును కలిగించు సాధనములను ప్రమాణము లందురు అనగా ప్రమాణజ్ఞానమునకు (ప్రమకు) నేది కరణమగునో దానిని ప్రమాణమందురు. ఈ ప్రమ ఆఱువిధములు. దానివలన ప్రత్యక్షాది ప్రమాణములు ఆఱువిధములైనవి. అందులో ముఖ్యములగు మూడింటిని చెప్పుచున్నాను.

(1) ప్రత్యక్షము (2) అనుమానము (3) శ్రుతి.

(1) ప్రత్యక్ష ప్రమాణము : శబ్దాది విషయములకు ఇంద్రియములతో ప్రత్యక్షసంబంధము కలిగి, బుద్ధివృత్తి విషయాకారమును పొందినపుడు ప్రత్యక్షజ్ఞానము కలుగును. అప్పుడు అధార అధేయములు ప్రత్యక్షమగును

ఇందుకు దృష్టాంతము: ఒక గంపయందు బియ్యముండుటను మనము నేత్రేంద్రియముద్వారా చూచుచున్నాము. గంప ఆధారము; బియ్యము ఆధేయము. ప్రత్యక్షజ్ఞాన మనగా ప్రమాతృ చైతన్యము ప్రమేయచైతన్యముతో ఏకమగుట. (రజ్జువునందు సర్పభ్రాంతి కలుగుచున్న సమయమున మిథ్యాసర్పము నేత్రేంద్రియముచే తెలియబడుచున్నను దానిని ప్రత్యక్షమని చెప్పకూడదు. కారణ మేమనగా అచ్చట ప్రమాతృచైతన్యము ప్రమేయ చైతన్యముతో ఏకమగుట లేదు. మిథ్యా సర్పము, తత్సర్పజ్ఞానము రెండును బాధింపబడుచున్నవి. అట్లే శుక్తిరజతాదులయందును నని నెఱుగవలెను. భ్రాంతి జన్యములగు సర్పరజతములు కేవలము వ్యక్తిగతములైనవి.) ఇట్టి జ్ఞానమునకు సాధనము ప్రత్యక్షప్రమాణము.

2. **అనుమాన ప్రమాణము** : రెండు పదార్థములలో ఒకదానితో మఱియొకదానికి నియత సంబంధమున్నపుడు, ఒకదానిని విడిచి మఱియొకటి యుండుట అసంభవమయినయెడల, అందులో ఒకటి మనకు ప్రత్యక్షమై, రెండవది మనకు ప్రత్యక్షము కానపుడు, నారెంటికిని గల నియత సంబంధమును స్మరించి రెండవది మనకు కనబడకపోయినప్పటికిని అదియును కలదని మనము తెలిసికొనుచున్నాము.

ఇందుకు దృష్టాంతము పాకశాలయందు పలుమాఱు వహ్నిధూమములను చూచియున్నాము. ఎచట పొగగలదో యచట యగ్ని గలదని గ్రహించితిమి. ఆస్మృతి ననుసరించి ఆధేయమగు పొగ మనకు ప్రత్యక్ష మగునపుడు ఆధారమగు అగ్ని కలదను జ్ఞానము కలుగుటచే బుద్ధివృత్తి అగ్నియొక్క ఆకృతిని పొందుచున్నది. ప్రత్యక్షప్రమాణమునందు విషయాకారము (అగ్ని యొక్క ఆకారము) బాహ్యమునందును, అంతరమునందును ఉండును. ఇచట బాహ్యము నందుండదు. అంతరమునందు మాత్రమే యుండును. అగ్ని ప్రత్యక్షము కాకపోయినను పాకశాలయందు అగ్నిధూమములను చూచిన యనుభవమును బట్టి అగ్ని కలదని తెలిసికొంటిమి.

అగ్నికిని ధూమమునకును గల సంబంధము సామాన్యముగ నియత మైనదే కాని నిత్యమైనదని చెప్పలేము. తడిసిన కట్టెలు మండు చున్నపుడు పొగవచ్చును. కొన్ని ఇంధనములకు పొగరాదు. అదిగాక ఇంకొకవిషయముగూడ చెప్పబడెను. అదేమన : పర్వతప్రదేశమందు గోవులను మేపువారు దోమలబాధ

నివారించుకొనుటకు గ్రామమునందు తోలుతిత్తులలో పొగనింపుకొని రాత్రికాలమున వారు నిద్రించునప్పుడు ఆపొగను వదలుదురు. అచ్చటనే అగ్ని రగుల్కొల్పిన నిద్రాసమయమున అది కార్చిచ్చై వారిని, గోవులను దహించునని వారి భయమగుటచే అట్లు చేయుదురు. అచ్చట పొగయున్నను అగ్ని యుండదు. అయినను పొగ యెచ్చట పుట్టెనో అచ్చట అగ్ని యుండినదేగదా? ఇట్టి జ్ఞానము పైన చెప్పిన ప్రత్యక్షప్రమాణమువలన సాధ్యపడదు కనుక, దీనినొక ప్రమాణముగా అంగీకరింపవలసి వచ్చినది

3. శ్రుతి ప్రమాణము : పైరెండు ప్రమాణములచేతను తెలియబడని విషయము యథార్థవాక్య శ్రవణము వలన కలుగును. ఇందుకు దృష్టాంతము దేశాంతరమున నున్న ఒక మిత్రుడు మరణించగా, ఆవిషయము యథార్థవాది యగు ఆప్తునివలన విని, ఆమిత్రుడు మరణించెనని మనకు నిశ్చయజ్ఞానము కలుగుచున్నది. మానవుడు అపరిపూర్ణ జ్ఞానము కలవాడు కనుక శ్రుతిపైననే ఆధారపడవలసి యున్నది. ఎవడైనను వాని తలిదండ్రు లెవరైనది యితరుల వలన విన్ననే కాని స్వయముగా తెలిసికొనలేడు. కర్ణుడు కుంతీపుత్రుడైనను, రాధాపుత్రుడ ననుకొనెను. ఆప్తవాక్యమువలన యథార్థజ్ఞానము కలిగెను.

ఇవిగాక ఉపమానము, అర్థాపత్తి, అనుపలబ్ధి అను ప్రమాణములను పూర్వమీమాంసాదర్శనము చెప్పినది. మఱికొందఱు మఱికొన్ని ప్రమాణములను చెప్పిరి. ముఖ్యమైనవి పై మూడు ప్రమాణములే యగుటవలన పైమూడింటినే చెప్పితిని వీటియందు తక్కిన ప్రమాణములు అంతర్భూతము లని చెప్పవచ్చును

ఈ ప్రమాణములలో ఒక్క శ్రుతితప్ప దేనివలన గాని బ్రహ్మము తెలియబడదు. శ్రుతిని ప్రమాణముగ అంగీకరింపవలయును శ్రుతి (ఉపనిషత్తు) వలన కలిగిన జ్ఞానమే ప్రమాణ జ్ఞానమందురు. మనుష్యునకు గల పరిచ్ఛిన్నజ్ఞానము కొన్ని హద్దులలో నుండియే పనిచేయుచున్నది. ఇతరులపై ఆధారపడక ఎవడును ప్రజ్ఞావంతుడు కాలేడు. కనుక ఉపనిషత్ ప్రతిపాద్యమైన జ్ఞానము ఆప్తవాక్యముగ అంగీకరింపబడెను. శ్రుతి సైతము బ్రహ్మమును ప్రత్యక్షముగా తెలుపజాలదు. శాఖాచంద్రన్యాయముగా బ్రహ్మమును చూపుచున్నదని పెద్దలందురు. శాఖాచంద్ర న్యాయమనగా విదియనాడు చంద్రుని చూచిన ఒకడు మఱియొకనికి చంద్రవంకను చూపుచు "అదిగో

అచెట్టుకొమ్మపైన చంద్రుడున్నాడు చూడు" మని చెప్పగా చెట్టుకొమ్మపైనుండి చంద్రుని చూచినట్లని యర్థము చెట్టకొమ్మపై చంద్రుడు లేకపోయినను, చెట్టుకొమ్మ చంద్రుని చూపకపోయినను, దాని సహాయమున తెలిసికొన్నట్లు అని భావము

## (38) జ్ఞానాజ్ఞానములు

జ్ఞానశబ్దమునకు వ్యుత్పత్తి "జ్ఞాయతేఽనేనేతి జ్ఞానం" అనగా తెలియుటకు సాధనము అని యర్థము ఇదివరలో చిదాభాస సంబంధమైన జ్ఞానమును కూటస్థాత్మజ్ఞానమును గుఱించి విచారించితిమి జ్ఞానశబ్దమునకు మఱియొక యర్థము కూడ కలదు ఒక పర్యాయము నిత్యసత్యమైన బ్రహ్మము జ్ఞానశబ్దముచేతను, మఱియొకప్పుడు అగమాపాయములు గల బుద్ధివృత్తిని జ్ఞానమనియును చెప్పుటచే బ్రహ్మము చావు పుట్టుకలు కలదని అజ్ఞులు పొరబడుచున్నారు

బుద్ధివృత్తి ఉదయింపగా జ్ఞానము పుట్టినదని బుద్ధివృత్తి నశించినపుడు జ్ఞానము నశించినదని మూఢులు చెప్పుచున్నారు ఈ భ్రమ కూటస్థ చిదాభాసుల విచారముచే నివర్తింపబడెను అందువలన జ్ఞానమనునది ఆత్మప్రభావము బుద్ధియందు ప్రసరించుటవలన బుద్ధియం దుత్పన్నమగు బుద్ధిధర్మమని స్పష్టమైనది. కనుకనే వేదాంతగ్రంథములయందు బుద్ధికి జ్ఞానమనుపేరుకూడ నుపయోగింపబడినది. విశిష్టాద్వైతులు అజ్ఞానము అభావమని (కుందేటికొమ్మువలె లేనిదేయని) చెప్పుదురు జ్ఞానముయొక్క అభావమే అజ్ఞానమని వారిమతము జ్ఞానాజ్ఞానములు రెండును భావములే యని అద్వైతసిద్ధాంతము. జ్ఞానము ప్రకాశింపజేయునది, అజ్ఞానము ప్రకాశింపజేయబడునది అని యర్థము బ్రహ్మజ్ఞాన మనగా బ్రహ్మమును తెలియజేయునది. బ్రహ్మమును తెలిసికొను వివేకము.

వేదాంతగ్రంథములయందు ముఖ్యముగా భగవద్గీతయందు జ్ఞానశబ్ద మనేకపర్యాయములు ఉపయోగింపబడినది గీతయందిట్లు చెప్పబడినది.

శ్లో॥ "సత్త్వాత్సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ ।
ప్రమాదమోహౌ తమసో భవతోఽజ్ఞాన మేవ చ"॥ (గీత. 14-17)

తా అనగా ప్రతిప్రాణియు సత్త్వరజస్తమోగుణముల సముచ్చయమై యున్నది. రజస్తమో గుణములను అణగద్రొక్కి సత్త్వగుణము వృద్ధిలోనికి వచ్చినవానికి జ్ఞానము కలుగుచున్నది అట్లే రజోగుణమువలన లోభమును, తమోగుణమువలన అజాగ్రత్తయు, అజ్ఞానమును, ప్రమాదమును, మోహమును కలుగుచున్నవి పైన చెప్పిన సత్త్వగుణమువలన కలిగిన సాత్త్వికజ్ఞానము గీతయం దిట్లు వర్ణింపబడెను

శ్లో॥ "సర్వభూతేషు యేనైకం భావ మవ్యయ మీక్షతే ।
అవిభక్తం విభక్తేషు తద్జ్ఞానం విద్ధి సాత్త్వికమ్" ॥ (గీత 18-20)

తా - వేఱువేఱగు సర్వభూతములయందు అవిభక్తమై నాశరహితమై, ఒక్కటియై యున్న పరమాత్మ తత్త్వమును ఏజ్ఞానముచేత చూచుచున్నాడో, ఆజ్ఞానము సాత్త్వికజ్ఞానమని తెలియుము - ఈ యర్థమునే

శ్లో॥ అవిభక్తం చ భూతేషు విభక్తమివ చ స్థితం । (గీత. 13-17)

అనగా - అపరిచ్ఛిన్నమైన దయ్యును సమస్త ప్రాణులయందును పరిచ్ఛిన్నమైన దానివలె బ్రహ్మము ఉన్నదని చెప్పబడిన దానియర్థము నదియే.

శ్లో॥ అధ్యాత్మజ్ఞాననిత్యత్వం తత్త్వజ్ఞానార్థదర్శనం ।
ఏతద్జ్ఞాన మితి ప్రోక్త మజ్ఞానం యదతోఽన్యథా ॥ (గీత. 13-12)

తా · ఆత్మస్వరూపమునందు మనస్సును ఎల్లపుడు నిలుపుట; మోక్షజ్ఞానమునందు ప్రయోజనదృష్టి కలిగియుండుట - ఇదియే జ్ఞానమని చెప్పబడినది. దీనికి వ్యతిరేక మంతయును అజ్ఞానము. అనగా - సత్త్వగుణము వృద్ధి లోనికి వచ్చినపుడు మనుష్యునిబుద్ధి సత్త్వగుణోపేతమై సత్యమును తెలిసికొనుటకు సమర్థమై యుండును. అప్పుడు నామరూపాత్మకమగు నీ నానాత్వమందు నామరూపరహితమగు ఏకత్వమును దర్శింపగలుగును. ఇదియే జ్ఞానము యొక్క పరమావధి. రాజస, తామస గుణములు వృద్ధిలోనికి వచ్చిన వానియందు ఈజ్ఞానము కలుగదు. అట్టివానికి లౌకికజ్ఞాన మెంతయున్నను బ్రహ్మజ్ఞాని కానేరడు "సత్త్వాత్ సంజాయతే జ్ఞానం" సత్త్వగుణమువలన జ్ఞానము పుట్టుచున్నదని పైన చెప్పినందున ఈజ్ఞానమే బ్రహ్మజ్ఞానమని చెప్పబడినది.

మం॥ "జ్ఞానమితి చ, దేహేన్ద్రియ నిగ్రహ సద్గురూపాసన
శ్రవణ మనన నిదిధ్యాసనై ర్యద్య దృగ్దృశ్యస్వర రూపం సర్వాన్తరస్థం
సర్వసమం ఘటపటాది పదార్థ మివాఽవికారం వికారేషు
చైతన్యం వినా కించిన్నాఽ స్తీతి సాక్షాత్కారానుభవజ్ఞానమ్" ॥

"అజ్ఞాన మితి చ రజ్జౌ సర్పభ్రాన్తి రివాఽద్వితీయే
సర్వానుస్యూతే సర్వమయే బ్రహ్మణి దేవ తిర్యఙ్మనుష్యస్థా
వరస్త్రీ పురుష వర్ణాశ్రమ బంధమోక్షోపాధి నానాత్మ భేద
కల్పితం జ్ఞాన మజ్ఞానమ్" ॥ (నిరాలంబోపనిషత్తు)

తా : "దేహేంద్రియాదులను నిగ్రహించుట చేతను, సద్గురూపదేశమునను, వేదాంతశ్రవణమనన నిదిధ్యాసాదులచేతను; దృగ్దృశ్యరూప మగునట్టియు ఘటపటాది నానావికారపదార్థములయందు, వికారరహితమును సర్వసమమునగు చైతన్యము తప్ప అన్యమేమియు లేదని తెలిసికొను వివేకమే జ్ఞానము. సర్వవ్యాపకమగు అద్వితీయ బ్రహ్మమునందు దేవతిర్యఙ్మనుష్యస్థావర స్త్రీ పురుష వర్ణాశ్రమాది అనేక భేద కల్పితమగు జ్ఞానమే అజ్ఞానము."

గీతయందు "జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం" (గీత 4-19) జ్ఞానమను అగ్ని చేత ఆగామి సంచితకర్మలు దగ్ధము చేయబడును "సరం జ్ఞానప్లవే నైవ వృజినం సంతరిష్యసి." (గీత. 4-36) జ్ఞానమను తెప్పచేత సర్వపాపములను లెస్సగా తరింపగలవు. "తస్మా దజ్ఞానసంభూతం హృత్ స్థం జ్ఞానాసి నాఽఽత్మన" (గీత. 4-42). జ్ఞానమను కత్తిచేత అజ్ఞానమువలన కలిగిన సంసారమును నఱికివేయుము. "న హి జ్ఞానేన సదృశం" (గీత. 4-38). జ్ఞానముతో సమానమగునది మఱియొకటి లేదు "జ్ఞానదీపేన భాస్వతా" (గీత. 10-11). జ్ఞానదీపమును వెలిగించుచున్నాను. ఈవిధముగా చెప్పబడినది సాత్త్వికజ్ఞానమే. ఇది లౌకికజ్ఞానము కాదు.

## (39) విద్య

'విద్య పరా, అపరా అని రెండువిధములు. 'పరా' యనగా శ్రేష్ఠము శాశ్వతసుఖమును కలిగించునది. 'అపరా' యనగా కనిష్ఠము. అశాశ్వతఫలము నిచ్చునది.

"తస్మై స హోవాచ, ద్వేవిద్యే వేదితవ్యే ఇతి హ స్మ యద్బ్రహ్మవిదో వదన్తి పరాచైవాపరా చ. తత్రాపరా ఋగ్వేదో యజుర్వేద స్సామవేదోఽథర్వవేదః శిక్షా కల్పోవ్యాకరణం నిరుక్తం ఛందో జ్యోతిష మితి, అథ పరాయయా తదక్షర మధిగమ్యతే." (ముండక. 1-1-4, 5)

విద్య పరాఅపరా అని రెండువిధములు. అందు అపరావిద్యయనగా నాలుగు వేదములు, శిక్ష, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, ఛందస్సు, జ్యోతిషము; పరావిద్య పరబ్రహ్మమును తెలియజేయునట్టిది. (ఉపనిషత్తులు భగవద్గీత మొదలగు వేదాంత గ్రంథములవలన తెలియబడునది).

అపరావిద్య అవిద్య కాదు. కనుక పరావిద్యతో దానికి విరోధము లేదు. ఒకప్పుడు అపరావిద్య (అపరవిద్య), పరావిద్యకు (పరవిద్యకు) సాధనము, లేక, సహాయముకూడ కావచ్చును. ఎట్లనగా ఖగోళశాస్త్రజ్ఞానముచే సూర్యచంద్ర నక్షత్రములయొక్క భ్రమణమును, వాటిదూరములను, కాంతి, దాని వేగము మొదలగు విషయములు తెలిసికొనుటవలన ఈశ్వరుని యొక్క శిల్పనైపుణ్యము, అచింత్యమహిమయు తెలిసికొని క్షణికమును, అల్పమును అగు మానవజీవితము నందలి ఐహికభోగములయందు విరక్తికలిగి పరవిద్యయందు ఆసక్తుడు కావచ్చును.

సామాన్యముగా విద్య యనునది తెలిసికొనునట్టిదని, అవిద్య యనగా తెలియబడునట్టిదని అర్థముతో విద్యావిద్యశబ్దములను ప్రయోగించిరి. మహాభారత శాంతిపర్వమున వసిష్ఠుడు జనకున కిట్లు చెప్పినట్లున్నది "కర్మేంద్రియంబులకు బుద్ధీంద్రియంబులు విద్య, బుద్ధీంద్రియంబులకు మనస్సు, మనస్సునకు భూతపంచకంబును, భూతపంచకంబునకు అహంకారంబును, అహంకారంబునకు బుద్ధియు, బుద్ధికి నవ్యక్తంబును, నవ్యక్తమునకుం బంచవింశతి తత్త్వంబులును విద్యలు." (తిక్కన భారతము)

## (40) అవిద్య

అవిద్య యనగా మాయయే; పరబ్రహ్మము నాశ్రయించి యున్నపుడు మాయయనియు, కూటస్థుని ఆశ్రయించి 'యున్నపుడు అవిద్యయనియు చెప్పుదురు. ఇది దేహేంద్రియాది సంఘాతమును నేననుకొను భ్రాంతియే. దానికి విరోధి యగునది విద్య. "యా తదభిమానం కారయతి సా హ్యవిద్యా"

దేహము తానానెడి అభిమానమును ఏది కలిగించుచున్నదో అదే అవిద్య (అజ్ఞానము) అనబడుచున్నది "సో౽భిమానో యయా నివర్తతే సావిద్యా" దేహాభిమానము దేనివలన నివర్తి యగుచున్నదో అదే విద్య (జ్ఞానము) అనబడుచున్నది. అని సర్వసారోపనిషత్తు. మఱియు అవిద్య యనునది బ్రహ్మము సర్వవ్యాపకమై అపరోక్షమై యున్నను బ్రహ్మము నేనెఱుగనని యేకారణముచేత చెప్పుచున్నాడో అదియో అవిద్య. దానిని నివర్తింపజేయునదే సమ్యక్ జ్ఞానము లేక విద్య

"విద్యా దివాప్రకాశత్వా దవిద్యా రాత్రి రుచ్యతే" (సన్న్యాసోపనిషత్తు.) విద్యను పగటితోను, రాత్రిని అవిద్యతోను పోల్చినది. విద్య అవిద్యకు విరోధి. విద్య స్వయముగా బ్రహ్మమును చూపజాలదు. కాని అవిద్యనుమాత్రము తొలగించగలదు ఎట్లనగా వాయువు సూర్యుని చూపలేదు. మన దృష్టికి సూర్యబింబమును కప్పినట్లున్న మేఘమును చెల్లాచెదరు చేయగలదు. మేఘము తొలగినంతనే సూర్యుడు ప్రత్యక్షమైనట్లు అవిద్య తొలగగనే బ్రహ్మము తానేయని, అపరోక్షజ్ఞానము కలుగుచున్నది.

అవిద్య విక్షేపమనియు, ఆవరణమనియు రెండువిధములుగ నున్నదని యిదివఱకే చెప్పియుంటిని. ఆవరణమనగా కప్పుకొనియుండుట, కనపడకుండజేయుట. ఇందుకు వేదాంత శాస్త్రమునందు ప్రసిద్ధమైన ఈ కథ కలదు.

పదిమంది కలసి మార్గమున పోవుచు ఒక ఏటిని దాటిరి. వారిలో నొకడు "మనము పదుగురమున్నామో లేమో, ఏటిలో ఎవడైన కొట్టుకొని పోయెనేమో" యని లెక్కింతమని, తన్ను వదలి, తక్కిన తొమ్మండుగురను లెక్కపెట్టి తొమ్మండుగురే యున్నారని ఒక్కడు ప్రవాహములో కొట్టుకొని పోయెనని తలచగా అందరును బిగ్గఱగా విలపింపసాగిరి. ఆమార్గమున వచ్చుచున్న ఒక మనుష్యుడు ఈ కథనంతయు విని "మీరు దుఃఖపడవలసిన పనిలేదు మీరు పదిమంది యున్నారు" అని చెప్పెను. అమాటలు విని వారు దుఃఖమును విడిచి ఎటులనో చెప్పుమని యడిగిరి. తిరుగా వారిని లెక్కింపుమని చెప్పగా పూర్వమువలెనే లెక్కపెట్టి తొమ్మండుగురని చెప్పెను. "లెక్కపెట్టిన నీవు దశముడ"వని బోధింపగా పరమానందభరితులై వెడలిపోయిరట.

"దశముడు కలడు" అని చెప్పినపుడు వానికి కలిగిన జ్ఞానము పరోక్షజ్ఞానము "ఆ దశముడవు నీవే" అని చూపినపుడు కలిగినజ్ఞానము అపరోక్షజ్ఞానము అవిద్య తొలగినంతనే బ్రహ్మము నేనేయన్న అపరోక్షజ్ఞానము కలుగుచున్నది.

జి : రజ్జువునందు సర్పభ్రాంతియు, మరుమరీచికలయందు జలభ్రాంతియు ఒకసారి కలిగి అది నివర్తింపబడిన పిమ్మట అచట అవిద్య నివర్తింపబడినది కదా? మఱియొక్క సారి మఱియొక ప్రదేశమున త్రాటియందు సర్పభ్రాంతియు, ఎండమావులయందు జలభ్రాంతియు కలుగుటకు కారణమేమి?

వే : మూలావిద్య (మూలాజ్ఞానము) యనియు, తూలావిద్య (తూలా జ్ఞానము) యనియు అవిద్య రెండువిధములు. మూలావిద్య బ్రహ్మము నాశ్రయించుకొనియుండును. బ్రహ్మజ్ఞానముచే మూలావిద్య ధ్వంసమగును. తిరిగి అది ఎన్నటికిని పుట్టదు. తూలావిద్య ఇట్లుకాదు. ఎప్పటికప్పుడు జ్ఞానముచే నశించి తిరిగి పుట్టుచుండును. అయినను ఒకప్పుడు ఎండమావులందు నీరున్నదని భ్రమపడి అచటికి పోయి నీరు లేదని ఎండమావులని గ్రహించిన పిమ్మట మఱియొకసారి ఎండమావులను చూచినపుడు అది జలమువలె కనబడినను, ఎండమావులే జలమువలె కనపడుచున్నవని నిశ్చయించుకొని మునుపటివలె జలభ్రాంతితో పరుగెత్తడు నిద్ర తూలావిద్య. ఇది ప్రబోధమువలన నివర్తింపబడుచున్నను, మరల, మరల కలుగుచున్నది.

జి : సర్వవ్యాపకమై అద్వితీయమై బ్రహ్మ ముండగా అవిద్య ఎట్లు కలిగినది?

వే : ఈ ప్రశ్న ఆరంభమునుండి యున్నదే. దీనికి శాస్త్రముల యందుగల సమాధానమిది. అవిద్య ఎట్లు కలిగినది? ఎట్లు వర్ధిల్లినది? అను ప్రశ్నలు అటుంచి ఈ అవిద్య ఎట్లు నశించును? అను విషయమునుమాత్రమే జిజ్ఞాసువులు, మొదట తెలిసికొనవలసియుండును. అవిద్య నశించినచో అది యెట్లు పుట్టెను? అది ఎట్లు విస్తరించెను? ఎట్లు నశించును? అను నీవిషయములు తమంతకు తామే తెలియగలవు. అవిద్యా నాశనమునకై పాటుపడుమని పెద్దలు చెప్పిరి. అవిద్యా నాశనముతో సర్వము మిథ్యయని అద్వితీయబ్రహ్మ మొక్కడే సత్యమని నిశ్చయము కలుగును.

## (41) జ్ఞానమును పరిత్యజించుట ఎట్లు?

జ్ఞేయమును తెలిసికొనినపిమ్మట జ్ఞానమును సహితము పరిత్యజింపుమని చెప్పుదురు ఉత్తరగీతయందును బ్రహ్మవిద్యోపనిషత్తునందును.

"ఉల్కాహస్తో యథా కశ్చిత్ ద్రవ్యమాలోక్యతాం త్యజేత్ |
జ్ఞానేన జ్ఞేయ మాలోక్య పశ్చాద్ జ్ఞానం పరిత్యజేత్" ||

కొఱవికట్టె చేతపట్టుకొని చీకటిలో వెదుక వలసిన ద్రవ్యమును వెదకి ద్రవ్యమును చూచినపిమ్మట చేతియందలి కొఱవికట్టెను వదలి వేయునట్లే జ్ఞానముచేత జ్ఞేయము (బ్రహ్మము)ను చూచినపిమ్మట జ్ఞానమున వదలివేయ వలయును.

జ్ఞానమును వదలుట యనగా-జ్ఞానము మూర్తిమంతమగు ఒక పదార్థముకాదు. పుణ్యమును ధారపోసినట్లు ధారపోయుటకు వీలులేదు. దానిని వదలివేయుటెట్లు? పరిత్యజించుట యనగా శాస్త్రములచేతను గురూపదేశము చేతను ఏజ్ఞానమువలన బ్రహ్మమును తెలిసికొనగలిగెనో, అట్టి జ్ఞానమును ఇతరులకు బోధింపుమని యర్థము. బోధించుటయే పరిత్యజించుట. అట్లు చేయనిచో బ్రహ్మవిద్య యీలోకమున నశించిపోవును. అట్లు ఒకరినుండి ఒకరు గ్రహించుట అను నీగొలుసు సాగిపోవలయును.

మఱికొన్ని సందర్భములయందు జ్ఞానము నశించునని చెప్పెడి వాక్యముల యర్థము నిచట గమనింతము. శంకరులవారు వారి ఆత్మబోధయను గ్రంథమున నిట్లు చెప్పిరి.

శ్లో|| "అజ్ఞానకలుషం జీవం జ్ఞానాభ్యాసాత్ వినిర్మలం |
కృత్వా జ్ఞానం స్వయం నశ్యేజ్జలం కతకరేణువత్" ||

తా :- ఒండునీటియందు చిల్లగింజను వేసిన అది నీటియందున్న నొంద్రుమట్టిని, పరిశుభ్రమైననీటిని వేఱు చేసి తుదకు చిల్లగింజకూడ మట్టితో నశించునట్లు జ్ఞానము ఆత్మానాత్మల రెంటిని వేఱు వేఱు చేసిచూపి, తుద కదియును అనాత్మతో కలసి నశించుచున్నదని చెప్పెను.

దీనిభావ మేమనగా - బ్రహ్మమును చూచినపుడు, అనగా సమాధివశమును జ్ఞానము తీసికొనిపోయి సమాధిస్థితి చెందగనే ఒక బ్రహ్మముమాత్రమే మిగిలి,

తక్కిన సమస్తమును అదృశ్య మగుచున్నందున జ్ఞానము నశించినదని చెప్పబడినది

మఱియొక అర్థ మేమనగా

"ఏశాస్త్రజ్ఞానమువలన బ్రహ్మస్వరూప మిట్టిదని సాధకుడు తెలిసికొనెనో దానిని పలుమారు మననముచేసి బ్రహ్మసాక్షాత్కారమును పొందిన పిమ్మట శాస్త్రములను గ్రంథములను వదలవలెను. ఎట్లనగా వంటపని పూర్తియైన తర్వాత కొఱవులను పారవేసినట్లును, ధాన్యార్థియగువాడు ధాన్యమును తీసికొని తన కవసరములేని గడ్డిని పారవేసినట్లనియును విద్యారణ్యులవారు దృష్టాంతమును చెప్పిరి (వే.పం. 4-44, 45, 46)

ఏలయన ఆత్మసాక్షాత్కారానంతరము సమ్యక్ జ్ఞానము నశించుటతో సమాధియందే యుండుట ఉత్తమము గనుక అవిధముగ చెప్పబడినది. అందువలననే విద్యావిద్యలు రెండును మాయికములే యని చెప్పితిని. రెండును నశించునట్టివే యని వేదాంతసిద్ధాంతము.

"ప్రపంచముతో పాటు వేదములు గురువులు సమస్తము కల్పితమే నశించునవి" యని శంకరులవారి వాక్యము. (ఉ.సా. 17-13)

జి : పరబ్రహ్మమును బోధించునట్టి శాస్త్రములు గురువులు కల్పితములే అయినచో బంధమోక్షములు మిథ్యయే యగును. బంధమోక్షములు మిథ్యయైనచో ముక్తికొఱకు గురువులను ఆశ్రయించి శాస్త్రపఠన మేల చేయవలెను?

వే : అన్నియు నసత్యమే. నీవొక్కడవే పరమ సత్యము. శాస్త్రములు, గురువులు మిథ్యయైనను అవి బంధవిముక్తికి సాధనములయ్యే యున్నవి ఇందుకు పెద్దలు ఈ కథ చెప్పిరి.

ఒక రాజు, రక్షకభట పరివేష్టితమైన అంతఃపురము నందు ఒకగదిలో నిద్రించెను. అత డిట్లు కలగనెను. ఒక నక్క అతనికాలు కఱచెను. ఆ కాటువలన బాధ అధికమై అతడు దుఃఖింపసాగెను. వైద్యుడొక్కడు మందువేయగా బాధోపశమన మాయెను. ఆరాజు స్వస్థుడై సుఖించెను. స్వప్నము, మిథ్య, స్వప్నమునందు కనబడిన రాజు నట్టివాడే. జంబుకము నట్టిదే. అది

కఱచుటవలన కలిగిన గాయమును మిథ్యయే, కాని బాధ అతితీవ్రమై యుండెను అది యుపశమించుటకు జాగ్రదవస్థయందలి వైద్యులు ఎంత మంచిమందులు కాలికి పూసినను, ఆరాజునకు కలిగిన స్వప్నగతబాధా జనితదుఃఖము నివారణ కాదు. స్వప్నమునందలి కల్పిత వైద్యునిచేతనే, అతని మందువలననే, స్వప్నగత బాధాజనిత కల్పితదుఃఖము నివారణ కావలసియున్నది

అట్లే మిథ్యయగు సంసారము (బంధము) మిథ్యాభూతమగు గురువులచేతను, శాస్త్రములచేతను నివారింపబడవలెను. కనుక సర్వమును నసత్యమే నీవొక్కడవే సత్యమని చెప్పితిని. ఆ నీ వెవడవనగా నీవే ఆపరమాత్మవు. ఈ జ్ఞానము కలిగినపుడే నీకు బంధువిముక్తి కాగలదు. 'తత్త్వమసి' అదే నీవైతివి.

## (42) 'తత్త్వమసి' మహావాక్య విచారము

"తత్త్వమసి" = తత్+త్వం+అసి. అనగా తత్=అది, త్వం=నీవు, అసి = అయియున్నావు. అది నీవై యున్నావు. అనగా నీవు పరమాత్ముడవే గాని అన్యముకాదు అని అర్థము.

శ్లో॥ "తత్రత్యానాం పదానాం యద్ద్వితీయం త్వంపదం స్థితమ్ ।
తస్యార్థః ప్రత్యగాత్మైష యోఽహమిత్యనుభూయతే" ॥
(మహావాక్యదర్పణము 15)

తా · ఆవాక్యమునందున్న రెండవదియగు (త్వం) నీవు అను పదము ఏదికలదో, దాని యర్థమిది : ప్రతివాడును 'నేను' అని యేపదార్థమును వ్యవహరించుచున్నాడో దానినే ఎదుటివానియందు 'నీవు' అని వ్యవహరించు చున్నాడు. అట్టిది సర్వానుభవసిద్ధ శరీరావచ్ఛిన్న కూటస్థ చైతన్య మని యర్థము. ఎవడైనను ఒకడు దేనిని 'నేను' 'నేను' అను ఏ పదార్థముచేత వ్యవహరించుచున్నాడో దానినే యితరులు "నీవు' 'నీవు' అని వ్యవహరించు చున్నారు ఇది మనకు అనుభవసిద్ధమే. పై 'తత్త్వమసి'అను మహావాక్యములోని రెండవది యగు 'త్వం' పదమునకు కూటస్థుడని ప్రత్యగాత్మయనీ యర్థము.

శ్లో॥ "సహజం తు పరం బ్రహ్మం కేవలానందలక్షణమ్ ।
తత్పదస్య భవేదర్థో యః పరా త్మేతి గీయతే ॥ (మ.ద 16)

తా : "ఆనందమే స్వభావముగా గలిగి స్వభావసిద్ధ మైనట్టియు, సర్వాధిక మైనట్టియు బ్రహ్మమే తత్పదమునకు అర్థమగును "

శ్లో॥ "అసీత్యేకత్వ మనయో రఖండత్వం ముహుర్ముహుః ।
తాత్పర్యేణ శ్రుతిర్వక్తి సర్వజ్ఞా సత్యవాదినీ" ॥ (మ.ద. 17)

తా : సర్వమును ఎరిగినట్టియు, యథార్థమును చెప్పునట్టియు ఉపనిషత్తు (ఛాందోగ్యము) ఈకూటస్థ బ్రహ్మలకు అసి+ఇతి=అయియున్నావు అను శబ్దముచేత అభేదమును, అఖండత్వమును, పరిపూర్ణాభిప్రాయముతో మాటిమాటికి చెప్పుచున్నది.

ఛాందోగ్యముయొక్క షష్ఠ ప్రపాఠకమునందు ఉద్దాలకుడు అతని పుత్రుడగు శ్వేతకేతువునకు "సదేవసౌమ్యే ద మగ్ర ఆసీత్" ఓ సౌమ్యుడా! సృష్టికి పూర్వము సత్తు మాత్రమే యుండెను. అదియే బ్రహ్మము అని, అసత్తునుండి ప్రపంచసృష్టిని చెప్పి, అబ్రహ్మతత్త్వము నీవే యని మాటిమాటికి తొమ్మిదిసారులు బోధించెను.

'తత్త్వమసి' మహావాక్యము మూడు సంబంధముల చేత అఖండార్థమును* బోధించుచున్నది ఎట్లనగా -

(1) పదములకు సామానాధికరణ్య సంబంధము : ఉదా . 'సోఽయం దేవదత్తః' ఇందులో సః, అయం, దేవదత్తః, అని యున్నది. సః అనగా భూతకాలమునందు వేఱొక దేశమునందు అని యర్థము. 'అయం' అనగా వర్తమానకాలమునందు ఈ దేశమునందే (అపరోక్షమున) యని యర్థము అనగా ఆకాలమునందు ఆదేశమునందు ఆరూపమున నున్న దేవదత్తుడే యీ కాలమునందు నిచ్చట నీరూపమున నున్న దేవదత్తుడు. ఇచట 'సః' 'అయం' అను నీరెండు విశేషములు ఒక దేవదత్తునియందే యున్నవి.

(2) పదార్థములకు విశేషణ విశేష్య భావసంబంధము : ఉదా : 'నీలో ఘటః' (నల్లకుండ) నీలముతో అభిన్నమైన ఘటము. విశేషణమైన నీలత్వము

* అఖండార్థక వాక్యమనగా పదములచే చెప్పబడెడి విశేషణాంశములను వదలి ప్రధానమైన విశేష్యమును మాత్రమే చెప్పునట్టిది.

విశేష్యమైన ఘటమును రెండును ఒక ఘటమునందే యుండుట అనగా భిన్నార్థములు ఒకేయర్థమునందు చేరియుండుట

(3) **లక్ష్యలక్షణసంబంధము** : ఇచట మఱియొక విషయము చెప్పవలసియున్నది పదమునకు శక్యార్థసంబంధము లక్షణ యందురు పదముయొక్క శక్తివృత్తి* వలన నే అర్థము తెలియబడునో దానిని పదముయొక్క శక్యమందురు అగ్నిపదమందు అంగారరూపార్థము ఏది తెలియబడునో అది శక్యార్థ మనబడును దీనినే వాచ్యార్థమనియు, ముఖ్యార్థమనియు చెప్పుదురు లోకులచేత సామాన్యముగా అవిచారదృష్టితో చెప్పబడు అర్థమును వాచ్యార్థ మందురు వాచ్యార్థ బోధకపదమును వాచక మందురు

ఏయర్థముయొక్క జ్ఞానము శక్తిచేత కానేరదో అనగా ముఖ్యార్థముచేత కాదో, లక్షణావృత్తిచేత నగునో దానిని పదముయొక్క లక్ష్యార్థమందురు (వేదశాస్త్రములు చక్కగా విచారించి నిర్ణయించిన అర్థము లక్ష్యార్థ మనబడును) శక్యార్థముయొక్క సంబంధమైనదై అన్యార్థమందు శబ్దముయొక్క పరంపరా సంబంధము గల శబ్దము లక్షణావృత్తి యందురు ఈ లక్షణావృత్తి మూడువిధములు (1) జహల్లక్షణ (2) అజహల్లక్షణ (3) జహదజహల్లక్షణ

(1) **జహల్లక్షణ** : ఎచట వాచ్యార్థమును సంపూర్ణముగా విడిచి, వాచ్యార్థసంబంధియొక్క గ్రహణము కలుగునో యచట జహల్లక్షణ చెప్పబడును ఉదా "గంగాయాం ఘోషః" "గంగలో గొల్లపల్లె యున్నది" అను నీ వాక్యమునందు గంగాప్రవాహములో గొల్లపల్లె యుండుట అసంభవము కనుక గంగాశబ్దముయొక్క ముఖ్యార్థ (వాచ్యార్థ) మగు ప్రవాహమును వదలి గంగాప్రవాహ సంబంధమైన గంగాతీరమను అర్థాంతరమును బోధించుచున్నది

(2) **అజహల్లక్షణ** : ఏపదముచేత వాచ్యార్థసహితమైన వాచ్యసంబంధి యొక్క గ్రహణమగునో ఆపదమునందు అజహల్లక్షణ యుండును "శ్వేతో ధావతి", "శ్వేతము పరుగెత్తుచున్నది" అని దీని యర్థము ఈవాక్యమున శ్వేతగుణము (తెల్లరంగు) పరుగెత్తజాలదు కనుక శ్వేతశబ్ద ముఖ్యార్థ (వాచ్యార్థ) మగు శ్వేతగుణమును వదలక దానికి ఆశ్రయమగు శ్వేతాశ్వము అను మఱియొక

* వృత్తి యనునది ఇదివఱలో అంతఃకరణవృత్తియని చెప్పితిని ఇచట ఆయర్థము కాదు శబ్దశక్తి నివృత్తి యందురు శబ్దశక్తియనగా ఏ శబ్దము ఏయర్థమును బోధించుటకు సామర్థ్యము కలదో అట్టి అర్థబోధక సామర్థ్యము ఇచట శక్తి యనబడును

అర్థము గ్రహించు చున్నది. కనుక శ్వేతాశ్వము (తెల్లగుఱ్ఱము) పరుగెత్తుచున్నది అను అర్థము గ్రహింపవలసియున్నది

(3) **జహదజహల్లక్షణ** అనగా వాచ్యార్థమునందు ఏకభాగమునందుండు విరుద్ధాంశము వదలి విరుద్ధము గాని అంశమును గ్రహింపవలయును ఎట్లనగా- ఇదివఱకు చెప్పినట్లు "సోయం దేవదత్తః" వాడే యీ దేవదత్తుడు అను వాక్యమున వాచ్యార్థము బాధిత మగుచున్నది. అందువలన ఆదేశమును, ఆకాలమును , ఈ దేశమును, ఈ కాలమును వదలి దేవదత్తుని గ్రహింపవలయును పదిసంవత్సరములకు పూర్వము కాశియందు చూడబడిన దేవదత్తుడును ఇప్పుడు ఇచ్చట కడపపట్టణములో అపరోక్షమున నున్న దేవదత్తుడును నొక్కడే దీనినే భాగత్యాగ లక్షణమనికూడ నందురు ఇది శక్యమును విడిచియు, విడువకుండుటయు అనునదియే దీని స్వరూపము.

పైవిధముగ దేశకాలవస్తువులచేత అపరిచ్ఛిన్నమై సర్వవ్యాపకమగు పరబ్రహ్మ చైతన్యమునకును, కూటస్థ చైతన్యమునకును, ఏకత్వము చెప్పుటయే 'తత్త్వమసి' అను మహావాక్యమునకు లక్ష్యార్థమని గ్రహింపవలయును. పైన చెప్పిన జహల్లక్షణచేతగాని అజహల్లక్షణచేతగాని కూటస్థబ్రహ్మలకు ఏకత్వము చెప్పుటకు వీలుపడదు కనుక జహదజల్లక్షణను మాత్రము గ్రహింపవలయును

## (43) మహావాక్య విచారము

ఉపనిషత్తులయందు ప్రత్యేకముగా జీవుని గుఱించి బోధించు వాక్యములు కొన్నియు, ప్రత్యేకముగ బ్రహ్మమును బోధించువాక్యములు కొన్నియు కలవు వీటికి అవాంతర వాక్యము లనిపేరు జీవబ్రహ్మైక్యమును బోధించువాక్యములు కొన్ని గలవు. వాటిని మహావాక్యములందురు. ఇవి నాలుగు వేదముల యందుండియు నాల్గు మహావాక్యములు గైకొనబడినవి వాటి వివరమిది

(1) ఋగ్వేదమునందలి ఐతరేయ శ్రుతియందు "ప్రజ్ఞానం బ్రహ్మ" (2) యజుర్వేదమునందలి బృహదారణ్యక శ్రుతియందు "అహం బ్రహ్మాస్మి" (3) సామవేదము నందలి ఛాందోగ్యశ్రుతియందు "తత్త్వమసి" (4) అధర్వణ వేదమునందలి మాండూక్యశ్రుతియందు "అయమాత్మా బ్రహ్మ"

'ప్రజ్ఞానం బ్రహ్మ' యనునది లక్షణవాక్యమనియు, 'అహం బ్రహ్మాస్మి' యనునది అనుభవవాక్యమనియు, 'తత్త్వమసి' యనునది యుపదేశవాక్యమనియు, 'అయ మాత్మా బ్రహ్మ' యనునది సాక్షాత్కారవాక్యమనియు పెద్దలందురు

'ప్రజ్ఞానం బ్రహ్మ'. ఈ మహావాక్యమున కర్థము ప్రజ్ఞానమే బ్రహ్మము. ప్రజ్ఞానపదవాచ్యుడు జీవుడు బ్రహ్మపదమునకు వాచ్యుడు ఈశ్వరుడు ఈ రెండుపదములయొక్క చైతన్యభాగమందు లక్షణ గలదు లక్షణావృత్తి ననుసరించి ప్రజ్ఞానపదమునకు లక్ష్యార్థము కూటస్థుడు. బ్రహ్మపదమునకు లక్ష్యార్థము పరబ్రహ్మము

'అహం బ్రహ్మాస్మి' నేను బ్రహ్మమునే అయితిని యని యర్థము. అహంపదమునకు వాచ్యుడు జీవుడు. బ్రహ్మపదమునకు వాచ్యుడు ఈశ్వరుడు. ఈరెండుపదములకు చైతన్యభాగమందు లక్షణ కలదు అహంపదమునకు లక్ష్యార్థము కూటస్థ చైతన్యము బ్రహ్మపదమునకు లక్ష్యార్థము పరబ్రహ్మము.

'తత్త్వమసి' అది నీవై యున్నావని యర్థము. ఇచట 'త్వం' శబ్దమునకు వాచ్యార్థము జీవుడు 'తత్' పదమునకు వాచ్యార్థము ఈశ్వరుడు ఈ రెండింటి చైతన్యభాగము నందును లక్షణ గలదు 'త్వం' పదమునకు లక్ష్యార్థము కూటస్థచైతన్యమని 'తత్' పదమునకు లక్ష్యార్థము 'పరబ్రహ్మ'మని యిదివరకే చెప్పితిని *

'అయ మాత్మా బ్రహ్మ' ఈ ఆత్మయే బ్రహ్మమని యర్థము ఇచట ఆత్మశబ్దమునకు వాచ్యుడు జీవుడు బ్రహ్మశబ్దమునకు వాచ్యుడు ఈశ్వరుడు. ఈ రెండింటి చైతన్యభాగమునందు లక్షణ గలదు. ఆత్మశబ్దమునకు లక్ష్యార్థము ప్రత్యగాత్మస్వరూపుడైన కూటస్థుడు, బ్రహ్మశబ్దమునకు లక్ష్యార్థము పరబ్రహ్మము ఇచట 'అయం' శబ్దమువలన ఆత్మయొక్క అపరోక్షత్వము తెలియబడుచున్నది

ఈవిధముగా శ్రుతులు భాగత్యాగ లక్షణముచేత పరస్పర విరుద్ధాంశము వదలి లక్ష్యార్థమునుమాత్రము గ్రహించి ఆత్మబ్రహ్మైక్యమును బోధించినది. 'తత్త్వమసి' మహావాక్య విచారమునందు చెప్పబడిన అంశములను ఇచట గ్రహింపవలయును.

జి : సర్వజ్ఞత్వాది గుణములుగల ఈశ్వరునితో కించిద్జ్ఞత్వాది గుణములు గల జీవునకు ఐక్యము ఎట్లు సంభవించును?

వే : దీనికి శంకరులవా రిట్లు సమాధానమిచ్చిరి ఒక రాజు ఒక సేవకుడు ఇద్దఱును మనుష్యులే రాజునకు రాజ్యమును, సేవకునకు వాని

---

* తత్త్వమసి - మహావాక్యము మహావాక్యము లన్నింటిలోను ప్రసిద్ధికెక్కినది వేదాంతగ్రంథములయందు 'తత్త్వమసి' మహావాక్యమునకు ప్రత్యేకవివరణమును, మహావాక్యములకు ప్రత్యేకవివరణమును వ్రాసియున్నందున నేనును అట్లే వ్రాసితిని

యుద్యోగమును రెండును పోయినపిమ్మట నిరువురును మనుష్యులే యైనట్లు, మాయావిద్యలు రెండును నశించినపిమ్మట ఈశ్వరజీవ చైతన్యములు రెండును ఒక్కటియే కదా? (మ ద. 23) *

జి : కూటస్థబ్రహ్మలకు ఐక్యము చెప్పవచ్చును కాని జీవబ్రహ్మలకు ఎట్లు సంభవించును?

వే : జీవేశ్వరులు కల్పితులని యిదివఱకే చెప్పితిని ఎండమావులయందు జలమును, ముత్యపుచిప్పయందు వెండియు, త్రాటియందు పామును, భ్రాంతివశమున ఎట్లు కనబడుచున్నవో, ఆ విధముగనే నిర్వికార నిర్గుణ నిత్యపరిపూర్ణ పరబ్రహ్మమందు జీవేశ్వరజగత్తులు భ్రాంతివశమున కల్పింపబడినవి ఎట్లు శుక్తియందు తోచిన రజతము శుక్తికంటె వేఱుకాదో, రజ్జువునందు తోచిన సర్పము రజ్జువుకంటె ఎట్లభిన్నమో, ఆవిధముగనే బ్రహ్మమునందు కల్పితమైన జీవుడు బ్రహ్మమునకంటె భిన్నుడు కాడు ఈ విధముగా జీవేశ్వర ఐక్యమును శ్రుతులు బోధించినవి. మహావాక్యముల యొక్క అర్థము నీవిధముగా నెఱుగుటయే బోధ యనబడును

శ్రుతులు అనేకవిధముల జీవబ్రహ్మైక్యమును ఇట్లు బోధించినవి

శ్లో॥ "బ్రహ్మైవాహం న దేహోఽహం బ్రహ్మైవాహం న గోచరః ।
బ్రహ్మైవాహం న జీవోఽహం బ్రహ్మైవాహం న వేదభూః" ॥

అని తేజోబిందూపనిషత్తు చెప్పినది మఱియును మహా వాక్యములకు ముందు ప్రణవములను చేర్చి యివి మంత్రములుగా జపించుటకు ఋషి, ఛందము మొదలగు వాటిని శుకరహస్యోపనిషత్తు పేర్కొన్నది

శ్లో॥ "అహం బహ్మాస్మి మంత్రోఽయం దృశ్యపాపం వినాశయేత్ ।
అహం బ్రహ్మాస్మిమంత్రోఽయ మన్య మంత్రం వినాశయేత్" ॥

---

* శివరామదీక్షితులవారు ఈ విషయమై ఈ క్రింది విధముగ చెప్పిరి
"యేమిాలేదు, నేను జీవుడ్ని, నేను ఈశ్వరుడ్ని, నేనే ఆత్మను అని ఆగాహిత్యముచేత అన్ని మాయకూతలు కూసి, యేమిా లేనిది నేను జీవుడ్ని, నేను యీశ్వరుడ్ని అన్న 'జ్ఞానమే' భ్రాంతి భక్తి భ్రాంతి వైరాగ్యమనే భ్రాంతి యీమూలంలేని గుర్తెరిగే శరీరానకు తగులు బెడితే వదిలించుకొనే నేర్పులేక బహుక్లేశపడి కుక్కలవలె కూసి, కూసి, అందరినీ అడవిలో కల్పినారు" (బృహద్వా ఉ పు 141, 142)

(3-60) అని యీవిధముగ, దేజోబిందూపనిషత్తు 14 మంత్రములతో కీర్తించినది

ఏవిధముగా చూచినను బ్రహ్మమే తాననుకొనుట, దేహము తాను కాదనుకొనుటయే పరమార్థమై యున్నది అజము, నిత్యమునగు బ్రహ్మము తానైయుండి దాని కన్యముగా భావించుట అజ్ఞానము. ఈ యజ్ఞానమునే శ్రుతియందు ఏడుభూమికలుగా వర్ణించిరి వీటిని అజ్ఞానభూమికలని చెప్పుదురు

## (44) అజ్ఞాన భూమికలు

అజ్ఞానభూమికలనుగుఱించి మహోపనిషత్తు ఇట్లు చెప్పినది

మం|| బీజ జాగ్రత్తథా జాగ్ర న్మహాజాగ్రత్తథైవ చ ।
జాగ్రత్స్వప్నస్తథా స్వప్నః స్వప్నజాగ్రత్సుషుప్తికమ్ ॥ (5-8)

(1) బీజజాగ్రత్త (2) జాగ్రత్త (3) మహాజాగ్రత్త (4) జాగ్రత్స్వప్నము (5) స్వప్నము (6) స్వప్నజాగ్రత్త (7) సుషుప్తి వీటిని సంగ్రహముగా వివరించెదను.

1. **బీజజాగ్రత్త** : నిర్వికారుడైన పరబ్రహ్మమందు జగత్సృష్టికి కారణమగు మనస్సు మొదలగు సంకల్పము లుదయించుటకు పూర్వము బీజరూపమున నుండుట దీనికి బీజజాగ్రత్తయని పేరుకలిగెను అవిభక్తమగు సుషుప్త్యవస్థను వదలి జాగ్రదవస్థకు వచ్చుటకు పూర్వముండుస్థితి (5-11)

2 **జాగ్రత్త** : అవిభక్తమగు ఆ తెలివికి ముందు లేని భేదమును సూక్ష్మమును కలిగి విశ్వాభిముఖమగుట అనగా "నా పేరు, "నేను" మొదలగు అజ్ఞానకృత అహంకారము కలిగినది కనుక దీనికీపేరు వచ్చెను (5-12)

3 **మహాజాగ్రత్త** : పూర్వజన్మ కర్మమువలన కలిగిన మెలకువతో కార్యములయందు ప్రవేశించుట లేక యాసక్తి కలిగియుండుట మహాజాగ్రత్త. (5-13)

4 **జాగ్రత్స్వప్నము** : జాగ్రత్తయం దిదివఱకు చూచిన, వినిన విషయములను గాఢముగా చింతనము చేయుచు తన్మయుడై యుండుట జాగ్రత్స్వప్నము. మఱియు ముత్యపుచిప్పను వెండిగాను, స్థాణువును పురుషునిగాను, ఎండమావులను జలముగాను చూచుటకూడ నిందులో చేరినదే. (5-14)

5 స్వప్నము : జాగ్రత్తయందు కల్పితస్వరూపమును చూచుట స్వప్నమని కొందఱును, మన యనుభవమున నున్న సుషుప్తియందలి స్వప్నమని కొందఱును చెప్పుదురు (5-14)

6 స్వప్నజాగ్రత్త : మఱచినదానిని తలంచుటయని కొందఱును, కలలో పెద్దపులి పట్టుకొన్నట్టు కలగని లేచినపిమ్మట కూడ తత్సంబంధమైన శరీరకంపనాదులు కలిగి భయభ్రాంతులై యుండుటయని కొందఱు చెప్పుదురు (5-16, 17)

7 సుషుప్తి : ఆత్మప్రతిబింబమగు జగత్తునందలి విషయసుఖముల యందు మునుగుట యనియును, గాఢనిద్ర యనియును అందురు. ఇచట అజ్ఞానముతప్ప మఱేమియు కనబడదు పై ఆఱవస్థల పరిత్యాగరూపమైన స్థితి (5-19)

పైన చెప్పబడిన ఏడు భూమికలు ఒకదానితో వేఱొకటి కలసి నూర్లకొలది అవస్థా విశేషము లగుచున్నవి (5-20)

## (45) జ్ఞాన భూమికలు

అజ్ఞానభూమికలవలెనే జ్ఞానభూమికలు కూడ ఏడు కలవు జ్ఞానభూమికలను గుఱించి వరాహోపనిషత్తు చతుర్థాధ్యాయమునందును, అన్నపూర్ణోపనిషత్తు పంచమాధ్యాయము నందును, మహోపనిషత్తు పంచమాధ్యాయమునందును చెప్పబడెను జ్ఞానవాసిష్ఠమునందు ఉత్పత్తి ప్రకరణమునందు జ్ఞానభూమికలనియు, నిర్వాణ ప్రకరణమునందు సప్తభూమికోపాఖ్యానమనియు, చెప్పబడినది అక్ష్యుపనిషత్తు జ్ఞానభూమికలను యోగభూమికలని పేర్కొన్నది

సర్వవేదాంత శాస్త్రములయందును భిన్నాభిప్రాయములు లేక ఏకాభిప్రాయముగా చెప్పు ముఖ్యవిషయ మేమనగా శరీరమే నేననుకొనుట యజ్ఞానము తత్ వ్యతిరిక్తమయినది జ్ఞానము "నేనెవడను? ఈప్రపంచ మెట్లు కలిగినది? దీనికి కర్త ఎవడు?" అను జిజ్ఞాస కలుగుట ఆరంభము చేసికొని మానవుడు సిద్ధావస్థను (ముక్తిని) పొందువఱకుగల అతని అనుభవములను ఒక్కొక్కటి ఒక్కొక్క సోపానముగా వర్ణించి వాటిని భూమికలని శాస్త్రములయందు చెప్పియున్నారు. జ్ఞానభూమికలను గుఱించి వరాహోపనిషత్తు ఇట్లు చెప్పినది

"…. శుభేచ్ఛా ప్రథమా భూమికా భవతి విచారణా ద్వితీయా తనుమానసీ తృతీయా సత్త్వాపత్తి స్తురీయాఽసంసక్తిః పఞ్చమీ పదార్థాభావనా షష్ఠీ తురీయగా సప్తమీతి"

ఋభుమహాముని వరాహరూపుడైన భగవంతుని జీవన్ముక్తుని లక్షణము లను చెప్పుమని ప్రశ్నించగా సప్తమ భూమికయందుండువాడు జీవన్ముక్తుడని చెప్పదలచి మొదట (1) శుభేచ్ఛ (2) విచారణ (3) తనుమానసి (4) సత్త్వాపత్తి (5) అసంసక్తి (6) పదార్థాభావన (7) తురీయగా - అని ఏడు జ్ఞానభూమికలను చెప్పి, తర్వాత వాటి లక్షణములను వివరించెను వాటి నిచట చెప్పుచున్నాను

1 **శుభేచ్ఛ** : అనగా మోక్షము నొందవలెనను నిచ్ఛ "నేనెవడను? ఈ ప్రపంచ మెట్లు కలిగిన"దను జిజ్ఞాస మానవున కత్యంత శుభమును కలిగించు నట్టిది కనుక శుభేచ్ఛ యని పేరు దానికి వైరాగ్యము ప్రధానమగుచున్నది

2 **విచారణ** : పైన కలిగిన సంశయములను తెలిసికొనుటకు ప్రయత్నించి, ఇదివఱకు ముక్తులయిన మహాపురుషు లేమార్గము ననుసరించి కృతార్థులైరో యామార్గమును తెలుపునట్టి శాస్త్రములను పఠించుటయు, సత్పురుషులతోడి చర్చయు విచారణ యందురు

3 ***తనుమానస** : పైన చెప్పినవిధముగ విచారించుచు నశ్వరములైన భోగములయం దిచ్ఛగొనక, వాటియందు దోషములు లెక్కించుచు, పలుమారు దోషములను స్మరించుటవలన దుష్టవాసనలు నశించిపోవును అందువలన వాసనామయమైన మనస్సు క్రమముగా సన్నగిల్లును కనుక దీనికి తనుమానస యని పేరు

ఈ మూడవస్థలును జాగ్రదవస్థలోనివే ఈయవస్థలో ప్రపంచమును చూచుచునే యున్నాడు ఈ మూడుభూమికలు సాధించి, నాలుగవభూమిక చేరకయే మరణించినవానికి పునర్జన్మ కలదు కాని అట్టివారికి పుణ్యలోకములు కలిగి ఉత్తమమగు పునర్జన్మ కలుగును

---

* తనుమానసకు అసంగమని మఱియొక పేరు కలదు అక్ష్యుపనిషత్తునందు అసంగము సామాన్యమని, శ్రేష్ఠమని రెండువిధములుగ చెప్పిరి మఱికొన్ని గ్రంథములు ఆరెండింటినే నాలుగుగా విభజించినవి (1) సామాన్యాసంగము (2) సామాన్యసంగము (3) విశేషాసంగము (4) విశేష విశేషాసంగము అని చెప్పిరి గ్రంథవిస్తరభీతిచే నేను వాటి నిచట వ్రాయలేదు వాటి సారాంశ మంతయును తనుమానసలోనే చేరియున్నది వివరములు జ్ఞా॥ వా॥ నిర్వాణప్రకరణమున సప్తభూమికోపాఖ్యానమున చూడవలెను

4 **సత్త్వాపత్తి** : సత్త్వమనగా బ్రహ్మము దానియందుండుట సత్త్వాపత్తి యనబడును పైమూడు భూమికలను చక్కగ నభ్యసించిన పిమ్మట ముముక్షువునకు ఐహికపదార్థములయం దపేక్ష నశించును కనుక సమస్త (బాహ్య) పదార్థములు దోషభూయిష్ఠము లగుటవలన వాటియందు మనస్సును పోనియ్యక పరిశుద్ధమై నిలుచును అట్లు నిలుచుటవలన నేకాగ్రత, నిశ్చలత్వము కలిగి సమాధి సిద్ధించును ఆత్మ స్వస్వరూపము నందుండును

ఈ భూమిక యందు జగత్తు తోచుచున్నను, జగత్తును స్వప్నగత ప్రపంచమువలె చూచుచుండును ఈ పురుషుడు దేహపతనానంతరము ముక్తుడగును ఇతనిని బ్రహ్మవేత్త యందురు

5 **అసంసక్తి** : పై నాలుగవ భూమికను చిరకాలము శ్రద్ధతో నభ్యసించుటవలన సమాధి దృఢమగును పదార్థములు, వాటియందు వాంఛలును నీభూమిక యందు పూర్తిగ వదలిపోవును దేనియందును సంసక్తత లేకపోవును కనుక దీనికి అసంసక్తి యనుపేరు కలిగినది.

ముముక్షు విచ్చట ముక్తుడైనాడనియే చెప్పవచ్చును ఇతరు లెవరైనను ప్రేరేపించిననేగాని సమాధియందుండి ఈమహాపురుషుడు మేల్కొనలేడు. ఇతనిని బ్రహ్మవిద్వరుడందురు. ఇది సుషుప్త్యవస్థవలె నుండును

6 **పదార్థాభావన** : బ్రహ్మమును తప్ప నితర పదార్థమును బొత్తిగ భావింపకుండుట పై భూమికయందు విశేష కాల మనుభవము కలిగిన పిమ్మటనే యీ భూమికకు చేరుదురు ఈ భూమికయం దితరులప్రేరణచే బాహ్యస్మృతి కలుగుచున్నది

ఇచట నితరుల ప్రేరేపణవలన నెంతయో ప్రయత్నించినగాని సమాధినుండి మెలకువ కలుగదు ఇతనిని బ్రహ్మ విద్వర్యుడందురు దీనినే జీవన్ముక్తియని కొందఱందురు దీనినే తురీయమనికూడ చెప్పుదురు

7 **తురీయగ (తుర్యాతీతము)** : ఇదియొక భూమికయని చెప్పుదురు కాని, నిజముగ నొకయవస్థ కాదు జ్ఞానవాసిష్ఠమున కొన్నిచోట్ల నిది విదేహకైవల్యము అని చెప్పబడినది *అనగా జీవించియుండగా ప్రాప్తించునట్టిది కాదు ఇదియే సత్తాసామాన్యస్థితి ఇతడు బ్రహ్మవిద్వరిష్ఠుడు.

---

* జ్ఞా వా నిర్వాణప్ర "విదేహముక్తతా ప్రోక్తా సప్తమీయోగ భూమికా"

ఆఱు, ఏడు, భూమికల గుఱించి కొన్ని సంశయములు కలుగుటకు అవకాశమున్నది ఎట్లనగా ఆఱవభూమిక తురీయావస్థయనియు అది జీవన్ముక్తులకు స్థానమనియు, ఏడవ భూమిక విదేహముక్తి విషయమనియు తుర్యాతీత మనియు

శ్లో॥ "ఏషా హి జీవన్ముక్తేషు తురీయావస్థేతి విద్యతే ।
విదేహముక్తి విషయం తురీయాతీత మతః పరమ్" ॥

అని మహోపనిషత్తు చెప్పినది దీనివలన తురీయాతీత మనబడు సప్తమ భూమికయం దుండువారు జీవించియుండుట సాధ్యము కాదనియు జీవన్ముక్తులు దేహము వదలిన తర్వాత కలుగు బ్రహ్మైక్య (విదేహకైవల్య) మే ఈతుర్యాతీతమని చెప్పవచ్చును లేదా ఏడవభూమిక నధిరోహించిన పిమ్మట అట్టిపురుషుడు కొలది దినములలోనే దేహము వదలుచున్నాడని యర్థము మఱియు

"అభ్యన్తరాణాం బాహ్యానాం పదార్థానా మభావనాత్ ।
పరప్రయుక్తేన చిరం ప్రయత్నే నావబోధనం ॥
పదార్థాభావనా నామ షష్ఠీభవతి భూమికా ।
భూమి షట్కచిరాభ్యాసా ద్భేదస్యానుపలంబనాత్ ॥
యత్స్వభా వైకనిష్ఠత్వం సా జ్ఞేయా తుర్యగా గతి।
ఏషా హి జీవన్ముక్తేషు తుర్యావస్థేతి విద్యతే ।
విదేహముక్తి విషయం తుర్యాతీత మతః పరమ్" ॥*

(మహోపనిషత్తు పంచమాధ్యాయము)

అని చెప్పినట్లు ఆఱవభూమికయందున్న మహాత్ముడు ఇతరులు ఎక్కువ ప్రయత్నము చేయనిదే బాహ్యస్మృతి కలుగదనినచో ఏడవభూమిక యందుండువా డెట్లుండునో మన మూహించుకొనవలయును. "విదేహముక్తతా ప్రోక్తా సప్తమీ యోగభూమికా" అని అక్ష్యుపనిషత్తు ఏడవభూమికను విదేహకైవల్యమని చెప్పినది

* ఈశ్లోకములు జ్ఞానవాసిష్ఠము ఉత్పత్తి ప్రకరణమునందు గలవు

ఈ భూమికలు సోపానములని యిదివఱకే చెప్పియుంటిని తురీయము లేనిదే తురీయాతీత మెట్లు లభ్యమగును? సాధకుడగు యోగి ఒక్కొక్క సోపానమునే యధిరోహించి తుదకు జ్ఞేయమగు సప్తమభూమిక చేరవలసియున్నది అట్లుగాక ఈ క్రమవిధానమును విడిచి తురీయమును పొందుటకు సాధ్యము కాదు. ఎవరైన నొకానొకరు వారి పూర్వజన్మమున మొదటి అయిదు భూమికల నధిరోహించినవారై ఆఱవభూమికను చేరుటకుముందు మరణించియుండిరేని, అట్టివారు ఏకారణముచేతనో తిరిగి జన్మించియుండిన వారికి మాత్రమే పై క్రమ మవసర ముండదు ఆజన్మశుద్ధులును, ఆజన్మ సిద్ధులునగు మహాత్ము లీభూమిపైన ఎప్పుడో యొకప్పుడు అరుదుగా పుట్టుదురు. వారే కారణజన్ములు

## (46) తురీయాతీతము - సత్తాసామాన్యము

జాగ్రత్ స్వప్న సుషుప్తి తురీయములు నాలుగును జ్ఞానభూమికల ననుసరించి పదార్థాభావన (తురీయ) యను ఆఱవ భూమికతో పూర్తియగు చున్నవి ఆతర్వాత భూమిక తురీయాతీతము. ఈ వివరమును తెలిసికొనుటకు సులభముగా నుండునని, జ్ఞానభూమికలతో చేర్చి *బ్రహ్మప్రణవమును తెలియజేయు పథకమును ఇచట చూపియున్నాను

విరాట్టు, హిరణ్యగర్భ, అంతర్యాములను అవిద్యా విద్యాదిపాదములును పై విధముగనే పదునాఱు విభాగములు చేసి చూచుకొనవలయును ఈపథకముయొక్క వివరమును ఈ క్రింది తెలియజేయుచున్నాను.

పరమహంస పరివ్రాజకోపనిషత్తు స్థూలసూక్ష్మకారణ తురీయములను నాల్గింటిని ఒక్కొక్క దానిని నాలుభాగములుగ విభజించి బ్రహ్మమును ప్రణవముతో చేర్చి బ్రహ్మప్రణవము షోడశమాత్రాత్మకమని వర్ణించినది ఆ పదునాఱింటికిని క్రిందినుండి అనగా జాగ్రత్తనుండి ఒక్కొక్క దానికి ఒక్కొక్క పేరు ఈ క్రిందివిధముగా చెప్పినది. (1) విశ్వునియందు విశ్వుడు (అకారము) (2) విశ్వునియందు తైజసుడు (ఉకారము) (3) విశ్వునియందు ప్రాజ్ఞుడు (మకారము) (4) విశ్వనియందు తురీయుడు (అర్ధమాత్ర) (5) తైజసునియందు విశ్వుడు (నాద) (6)తైజసునియంందు తైజసుడు (బిందు) (7) తైజసునియందు ప్రాజ్ఞుడు (కళ) (8) తైజసునియందు తురీయుడు (కళాతీత) (9) ప్రాజ్ఞునియందు విశ్వడు (శాంతి) (10) ప్రాజ్ఞునియందు తైజసుడు (శాంత్యతీత) (11)

| *బ్రాహ్మప్రణవ పథకము-తురీయాతీతము-సప్తమభూమిక | | | |
|---|---|---|---|
| జాగ్రదవస్థ, విరాట్టు, విశ్వుడు అకారమాత్ర, స్థూలశరీరము, అవిద్యాపాదము | అకారము | అకారమునందు అకారము - జాగ్రతయందు జాగ్రత విశ్వునియందు విశ్వుడు | 1,2,3 భూమికలు |
| | ఉకారము | అకారమునందు ఉకారము-జాగ్రతయందు స్వప్నము విశ్వునియందు తైజసుడు | |
| | మకారము | అకారమునందు మకారము-జాగ్రతయందు సుషుప్తి విశ్వునియందు ప్రాజ్ఞుడు | |
| | అర్ధమాత్ర | అకారమునయందు అర్ధమాత్ర-జాగ్రతతో తురీయము విశ్వునియందు తురీయుడు | |
| స్వప్నావస్థ, హిరణ్యగర్భుడు, తైజసుడు, ఉకారమాత్ర, సూక్ష్మశరీరము, విద్యాపాదము | నాద | ఉకారమునందు అకారము-స్వప్నమునందు జాగ్రత తైజసునియందు విశ్వుడు | నాల్గవ భూమిక → |
| | బిందు | ఉకారమునందు ఉకారము-స్వప్నమునందు స్వప్నము తైజసునియందు తైజసుడు | |
| | కళ | ఉకారమునందు మకారము-స్వప్నమునందు సుషుప్తి తైజసునియందు ప్రాజ్ఞుడు | |
| | కళాతీత | ఉకారమునందు అర్ధమాత్ర-స్వప్నమునందు తురీయము తైజసునియందు తురీయుడు | |

| | | | |
|---|---|---|---|
| ← అయిదవ భూమిక | శాంతి | మకారమునందు అకారము-సుషుప్తియందు జాగ్రత ప్రాజ్ఞనియందు విశ్వుడు | సుషుప్త్యవస్థ, అంతర్యామి, ప్రాజ్ఞుడు, మకారమాత్ర, కారణశరీరము, ఆనందపాదము |
| | శాంత్యతీత | మకారమునందు ఉకారము-సుషుప్తియందు స్వప్నము ప్రాజ్ఞనియందు తైజసుడు | |
| | ఉన్మని | మకారమునందు మకారము-సుషుప్తియందు సుషుప్తి ప్రాజ్ఞనియందు ప్రాజ్ఞుడు. | |
| | మనోన్మని | మకారమునందు అర్ధమాత్ర-సుషుప్తియందు తురీయము ప్రాజ్ఞనియందు కూటస్థుడు | |
| ఆఱవ భూమిక | వైఖరి | అర్ధమాత్రయందు అకారము-తురీయునియందు విశ్వుడు | తురీయము, ఆత్మ, అర్ధమాత్ర, తురీయపాదము |
| | మధ్యమ | అర్ధమాత్రయందు ఉకారము-తురీయునియందు తైజసుడు | |
| | పశ్యంతి | అర్ధమాత్రయందు మకారము-తురీయునియందు ప్రాజ్ఞుడు | |
| | పర | అర్ధమాత్రయందు అర్ధమాత్ర-తురీయునియందు తురీయుడు | |

ప్రాజ్ఞనియందు ప్రాజ్ఞుడు (ఉన్మని) (12) ప్రాజ్ఞనియందు తురీయుడు

(మనోన్మని) (13) తురీయునియందు విశ్వుడు (పురీ) (14) తురీయునియందు తైజసుడు (మధ్యమ) (15) తురీయునందు ప్రాజ్ఞుడు (పశ్యంతి) (16) తురీయునియందు తురీయుడు (పర)

వరాహోపనిషత్తు అకార, ఉకార, మకార, అర్ధమాత్రలను స్థూల, సూక్ష్మ, బీజ, సాక్షి అను చతుర్విధ భేదములచేత (1) జాగ్రత్తయందు జాగ్రత్త (2) జాగ్రత్తయందు స్వప్నము (3) జాగ్రత్తయందు సుషుప్తి (4) జాగ్రత్తయందు తురీయము (5) స్వప్నమందు జాగ్రత్త (6) స్వప్నమునందు స్వప్నము (7) స్వప్నమునందు సుషుప్తి (8) స్వప్నమునందు తురీయము (9) సుషుప్తియందు జాగ్రత్త (10) సుషుప్తియందు స్వప్నము (11) సుషుప్తియందు సుషుప్తి (12) సుషుప్తియందు తురీయము (13) తురీయమునందు జాగ్రత్త (14) తురీయమునందు స్వప్నము (15) తురీయమునందు సుషుప్తి (16) తురీయమునందు తురీయము అని చెప్పినది

నారద పరివ్రాజకోపనిషత్తు (అష్టమోపదేశము) పై విధముగనే చెప్పినది

తురీయముతో జ్ఞానభూమికలు ఆఱు పూర్తియగుచున్నవి ఆపైన తురీయాతీతమని శ్రుతిచెప్పినది కొందఱు తురీయముకంటె తురీయాతీతము వేఱని తురీయము మాయికమేయని కనుక నశించునట్టిదేయని నాశరహితమును అజమును, అద్వితీయమును, నగువస్తువు తురీయాతీతము మాత్రమేయని చెప్పుదురు. తురీయమే తురీయాతీతము ఈ రెండింటికిని భేదము లేదు ఎట్లనగా - ఆత్మకును బ్రహ్మమునకు ఎట్లు మహావాక్యములచేత అభేదము చెప్పబడినదో అట్లే యని గ్రహింపవలయును అట్లు కాదేని తురీయమునుగుఱించి మాండూక్యశ్రుతి ఏడవమంత్రమున ఆత్మను స్థూలసూక్ష్మ కారణశరీరములు కానిదని చెప్పుచు "ప్రపంచోపశమం" "ప్రపంచము ఉపశమించినచోటు" అను నీ మొదలగు వాక్యములు అర్థశూన్యములు కావలసివచ్చును.

**"స దేవ సోమ్యేద మగ్ర ఆసీ దేకమే వాద్వితీయం, తద్దేక ఆహు రస దేవమగ్ర ఆసీ దేకమే వాద్వితీయం తస్మాదసత స్సజ్జాయత** (ఛాం 6-2-1)

తా నామరూప విశేషములతో గనబడు ఈ జగత్తు ఉత్పత్తికి మునుపు కేవలము 'సత్తు'గా (ఉన్నది అని చెప్పబడు వస్తుమాత్రముగ) ఏకము అద్వితీయమునై యుండినది అసత్తునుండి (లేనిదానినుండి) ఈజగత్తు

ఎట్లు కలుగును? అని ప్రారంభించి "**ఐతదాత్మ్య మిదగ్ సర్వం తత్సత్యగ్ స ఆత్మాతత్త్వ మసి శ్వేతకేతో ఇతి భూయ ఏవమా భగవాన్ విజ్ఞాపయ త్వితి తథా సోమ్యేతి హోవాచ**" (ఛాం. 6-8-7)

తా : ఈ సకలజగత్తునందును ఆత్మ కలదు. అది సత్యవస్తువు. అది ఆత్మయని చెప్పబడినది. ఓ శ్వేతకేతూ, అదియే నీవైయున్నావు. ఈ విధమైన శ్రుతివాక్యమునకు కూడ విరోధము సంభవించును.

తురీయమగు ఆత్మకంటె తురీయాతీతము వేఱని చెప్పినచో బ్రహ్మత్తైక్యమును బోధించునట్టి 'అయ మాత్మాబ్రహ్మ' మొదలగు మహావాక్యములు అవాక్యములను బోధించు శ్రుతులను త్రోసివేయవలసివచ్చును. అదియును గాక మాండూక్యమునందు ఆత్మలక్షణములు చెప్పినపుడు

"**అదృష్ట మవ్యవహార్య మగ్రాహ్య మలక్షణ మచింత్య మవ్యపదేశ్య మేకాత్మప్రత్యయసారం ప్రపంచోపశమం శాంతం శివమద్వైతం చతుర్థం మన్యంతే స ఆత్మా స విజ్ఞేయః**" అనియును "**అమాత్ర శ్చతుర్థోఽవ్యవహారః ప్రపంచోపశమం శివోఽద్వైత ఏవ మోంకార ఆత్మైవ సంవిశత్యాత్మనాఽఽత్మానం య ఏవం వేద.**" (మాం. 12)

తా - మాత్రారహితమై వ్యవహరించుటకు సాధ్యము కానిదై ప్రపంచోపశమమై మంగళమై అద్వైత మైన ఓంకారమే చతుర్థము అదియే ఆత్మ. ఈ ఆత్మను తెలిసికొనినవాడు పరమాత్మలో లీనమగుచున్నాడు (అనగా జీవాత్మ పరమాత్మతో ఐక్యము చెందుచున్నది).

అని చెప్పబడిన ఆత్మలక్షణములు తురీయాతీతమునకును ఆత్మకును సమానముగా వర్తించును. అట్లయినచో తురీయమని, తురీయాతీతమని రెండుగా ఏల చెప్పవలెనని యడుగవచ్చును. ఇది కేవలము వ్యావహారికమే ఘటాకాశమని మహాకాశమని వేఱు వేఱు నామములతో వేఱు వేఱుగా, ఒక మహాకాశమే పిలువబడినట్లు ఒక బ్రహ్మమే తురీయమని తురీయాతీతమని ఎఱుగవలయును తేజోబిందు శ్రుతి .

"సత్యవిజ్ఞాన మాత్రోఽహం సన్మాత్రానందవా నహం |
**తురీయాతీతరూ పోఽహం నిర్వికల్పస్వరూపవాన్**" || (3-41)
"**సత్తామాత్రస్వరూపోఽహం శుద్ధమోక్షస్వరూపవాన్**" |

**"కేవలం తురీయరూ పోఽస్మి, తుర్యాతీ తోఽస్మి కేవలః" |**
**"సదా చైతన్యరూపోఽస్మి చిదానందమయోఽస్మ్యహం" ||** (3-4)

నేను కేవలము తురీయరూపుడ నగుచున్నాను. తురీయాతీతరూపుడ నగుచున్నాను. సదా చైతన్యరూపుడను చిదానంద మయరూపుడ నగుచున్నాను అని చెప్పినది

మహానారాయణోపనిషత్తునందు ఇట్లు చెప్పబడినది **"నిరతిశయసౌందర్య పారావారం తురీయస్వరూపం తురీయాతీతం చ అద్వైత పరమానందం....." ".....త్వ మే వాఖండానందః. త్వ మేవ పరిపూర్ణానందః. త్వమేవ నిరతిశయానందః. త్వ మేవ తురీయతురీయః త్వ మేవ తురీయాతీతః".** ఒక్క బ్రహ్మమునే తురీయ తురీయాతీతములని బోధించినది.

వరాహోపనిషత్తు ఏడవభూమికయం దున్నవాడు జీవన్ముక్తుడని చెప్పినది (జీవన్ముక్తునిగుఱించి యీ గ్రంథమున మఱియొక చోట చెప్పెదను). మహోపనిషత్తు, అన్నపూర్ణోపనిషత్తును ఆఱవభూమికయే జీవన్ముక్తియని చెప్పినవి.

జీవన్ముక్తికంటె అధికమైన దేమికలదు? ఏడవభూమిక నిర్వాణరూపిణి యని అన్నపూర్ణోపనిషత్తు ఇట్లు చెప్పినది

శ్లో|| **"ఆనందైక ఘనాకారా, సుషుప్తి సదృశీ స్థితిః**
**తురీయావస్థోపశాంతా సాముక్తి రేవ హి కేవలా |**
**సమతా స్వచ్ఛతా సౌమ్యా సప్తమీ భూమికా భవేత్**
**తురీయాతీతా తు యావస్థా పరా నిర్వాణరూపిణీ" ||**

ఆనంద మొక్కటి తప్ప అన్యమేదియు లేనిదియు, సుషుప్తి సదృశమైనదియు కేవలము ముక్తియేయని తురీయమును, నిర్వాణరూపిణియని తురీయాతీతమును చెప్పినది. (అన్నపూర్ణ)

"తురీయే కేవల పరమాత్మసంబంధినీ భవతి నిత్యబోధస్వరూపా భవతి. . తథా తురీయాతీతావస్థ తథా సర్వేషా మానందస్వరూపో భవతి ద్వంద్వాతీతో భవతి" (ధ్యాన బిందూపనిషత్తు).

విశ్వతైజసప్రాజ్ఞులకు క్రమమున నేత్రకంఠ హృదయములు స్థానములనియు తురీయమునకు స్థానము మూర్ధమనియు,

శ్లో॥ "నేత్రస్థం జాగరితం విద్యా కంఠే స్వప్న సమావిశేత్ ।
సుషుప్తం హృదయస్థం తు తరీయం మూర్ధ్నిసంస్థితం" ॥

అని నారద పరివ్రాజకోపనిషత్తు చెప్పినది ఈ విషయమై కొన్ని శ్రుతులయందు భేదాభిప్రాయములు కలవు. నాభినుండి హృదయము వఱకు జాగ్రదవస్థకును, కంఠము స్వప్నమునకును, తాలుమధ్యము సుషుప్తికిని, భ్రూమధ్యము తురీయమునకును, బ్రహ్మరంధ్రము తురీయాతీతమునకును స్థానములని త్రిశిఖి బ్రాహ్మణోపనిషత్తు చెప్పినది. ఎట్లయినను భ్రూమధ్యమును బ్రహ్మరంధ్రమును మూర్ధమునందే కలవు కనుక ఈ విషయమై తురీయ తురీయాతీతములకు భేదము లేదు

తురీయాతీతమే సత్తాసామాన్యమని శ్రుతులును జ్ఞానవాసిష్ఠమును చెప్పినవి సత్తాసామాన్యమనగా "దృశ్య సంబంధ రహితమగు చైతన్యమునకే సత్తాసామాన్యమని పేరు" అనగా "శుద్ధచైతన్యముయొక్క స్వస్వరూపస్థితియే సత్తాసామాన్యము" "తాబేలు తన అవయవములను తానే ముడుచుకొనునట్లు ఈ చిత్తముకూడ తన రూపభేదములే యైనను, ఈసర్వప్రపంచమును తనంతన ఉపసంహరించుకొని మఱల కల్పింపక ఎప్పుడు స్వస్వరూపముతో నిలుచునో, అప్పుడే సత్తాసామాన్యము కలుగును ఇదియే సర్వోత్తమ మగుదృష్టి. దీనికే తుర్యాతీతమనిపేరు " (జ్ఞానవాసిష్ఠము వచనము) "సత్తాసామాన్య రూపత్వా త్తత్కైవల్యపదం విదుః" (అన్నపూర్ణ)

ఈ ప్రకరణమును ముగించుచు ఒకసారి ఈ ప్రకరణారంభమునుండి చెప్పినవిషయములను సింహావలోకనము చేయుదము. సజాతీయ విజాతీయ స్వగతభేత రహిత మైనట్టియు, దేశకాలనిమిత్తతలను హద్దులు లేనట్టియు, అట్టిది ఇట్టిది అని చెప్పుటకు వీలుగాని పరబ్రహ్మమునుగుఱించి చెప్పుటతో ఈ ప్రకరణము ప్రారంభింపబడెను అట్టి బ్రహ్మమునందు మాయాప్రభావము చేత కల్పింపబడిన ఈశ్వర జీవ జగత్తులను గుఱించి విచారించి తుద కవన్నియును కొఱవిని గిరగిరత్రిప్పుట (అలాతభ్రమణము) వలన వర్తులాకారముగ కనబడు కొఱవిని దూరమున నుండి చూచినవారు భ్రాంతివశమున సూర్యుడనుకొందురు. కొఱవియం దుండి వెడలు సన్నటి విస్ఫులింగములను జ్వాలలనుకొందురు ఈ అలాత భ్రమణము ముగిసినంతనే భ్రాంతి తొలగి అది కొఱవియని తెలిసికొనుచున్నారు.

అదేవిధమున మన ఇంద్రియగోచరమగు ప్రపంచము నిర్గుణబ్రహ్మము కంటె వేఱుగాదు. మన బుద్ధీంద్రియముల లోపమువలన బ్రహ్మమే ప్రపంచ

రూపమున కనబడుచున్నది లేదా, 'విద్య' అను సులోచనములనుండి చూచిన బ్రహ్మము బ్రహ్మముగాను, 'అవిద్య' అను సులోచనములనుండి చూచిన బ్రహ్మము జగద్రూపముగాను కనబడుచున్నది. అంతియేకాని, 'బ్రహ్మము' 'జగత్తు' అను రెండు లేవు రెండును నొక్కటె, ఇదియే అద్వైతము అని తెలిసికొని "స దేవ సోమ్యేదమగ్ర ఆసీత్" "ఓ సౌమ్యుడా! మొదట బ్రహ్మము మాత్రమే యుండెను" "ఏక మే వాద్వితీయం బ్రహ్మ" ఆ బ్రహ్మము అద్వితీయమైనది "సర్వం ఖల్విదం బ్రహ్మ" సర్వమును బ్రహ్మమే "నేహ నానాస్తి కించన" ఇతరమైన దేమియును లేదు అను సిద్ధాంతమునకు వచ్చిరి యథార్థస్వరూపమును తెలిసికొనుటయే మోక్షము

జి : అయ్యా! సత్యాన్వేషణకొఱకు పాటుబడు నాకు నా అదృష్టవశమున మీరు లభించితిరి మీ వలన బ్రహ్మస్వరూప మిట్టిదని విదితమాయెను దధిభాండమును మథించి నవనీతమును తీసి చేతికందించినట్లు అనేక వేదాంత గ్రంథ ప్రతిపాదిత బ్రహ్మతత్త్వమును వివిధ రీతుల బోధించితిరి జీవులు సంసారమునందు పడి జనన మరణముల లొందుచు స్వర్గాది లోకములకొఱకు తిరుగుచుందురని వింటిని వారి గతులను గురించిన వివరమంతయు నాయం దనుగ్రహ ముంచి తెలుపుడు

వే : నీవు నన్ను ప్రశంసించితివి నేను నీకు ఏమి వినిపించితినో దానిని మహాత్ము లిదివఱకు చెప్పినదే దానినే నామాటలతో నీకు చెప్పితిని మహాత్ముల యుచ్ఛిష్టమును మన మప్పుడప్పుడు చవిచూచి ధన్యుల మగుచుందుము మన మందరము అట్టివారికే కృతజ్ఞులము నీ వడిగన విషయమును తెలిపెదను వినుము

**"యో దేవోఽ గ్నౌ యోఽప్సు యోవిశ్వం భువన మావివేశ |**
**య ఓషధీషు యో వనస్పతిషు తస్మై దేవాయ నమో నమః" ||**
**"శ్రుతి స్మృతి పురాణానా మాలయం కరుణాలయం |**
**నమామి భగవత్పాద శంకరం లోక శంకరం" ||**

ఇది పరమేశ్వరానుగ్రహమువలన మట్టిబోయిన రామసుబ్బయ్యచే రచియింపబడిన "బ్రహ్మజిజ్ఞాస" యందలి పరబ్రహ్మము-విశ్వము అను రెండవ ప్రకరణము సంపూర్ణము

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓమ్

# బ్రహ్మజిజ్ఞాస

## మూడవ ప్రకరణము

### సంసారము-ముక్తి

శ్లో॥ అసారే సంసారే నిజభజనదూరే జడధియా
భ్రమంతం మా మంధం పరమకృపయా పాతు ముచితమ్ ।
మదన్యః కో దీన స్తవ కృపణ రక్షాతినిపుణః
త్వ దన్యః కో వా మే త్రిజగతి శరణ్యః పశుపతే! ॥
(శివానందలహరి - శ్రీ శంకరాచార్యులు)

అసారమైన సంసారమందు సుఖము లేశమైనను లేదని తెలిసికొని విరక్తుడైన పురుషునకు సంసారబంధమునుండి విముక్తి చెందుటయే ముక్తి సంసారమనగా భార్యాపుత్రాదులతో గృహస్థాశ్రమమం దుండుటయే సంసారమని లోకమునందు వాడుకకలదు. వేదాంతశాస్త్రము ననుసరించి సంసారమనగా జననమరణ ప్రవాహరూపమైన సుడిగుండమునందు చిక్కుకొని భ్రమించు చుండుట. ఇది బంధము దీని యందుండి విడివడుట ముక్తి లేక మోక్షము ముక్తి రెండు విధములు 1. క్రమముక్తి 2 సద్యోముక్తి. ఈ విచారము (ఈ ప్రకరణమున) చేయబడును.

### (1) మరణానంతరము జీవునియొక్క అస్తిత్వము

స్థూలశరీరము నశించినంతనే సర్వము నశించలేదనియు స్థూలశరీరములో సూక్ష్మశరీరము అను మఱియొక శరీరము మిగిలియున్నదనియు, స్థూల శరీరాభిమాని యగుజీవుడు స్థూల శరీర నాశనముతో సూక్ష్మశరీరముతో

---

తా : ఆత్మజ్ఞానమును పరిపాలించు ఓ పరమశివా: అసారమైనది యును నీ భజనకు దూరముచేయు నట్టిదియును నగు ఈ సంసారమునందు (గానుగయెద్దువలె) భ్రమించుచున్నాను నేను మందుడను నన్ను విశేషకరుణచేత కాపాడవలయును నీవు రక్షించుటకు నాకంటె దీనుడు ఈ ముల్లోకముల యందును లేడు. నీకంటె రక్షించుటకు నాకు తగిన రక్షకుడు లేడు

స్థూలశరీరమునుండి వెడలిపోవుననియు హిందువులందరు విశ్వసింతురు ఇందులో అభిప్రాయభేదము లేమియును లేవు చాల పూర్వకాలమున మనదేశమునందేకాక నాగరికతకు ప్రసిద్ధికెక్కిన ఈజిప్టు, బాబిలోనియా, చైనా, మున్నగు దేశప్రజలు మరణానంతర జీవితమును విశ్వసించెడివారు ఈజిప్టుప్రజలు చనిపోయిన వారి మృతకళేబరములు భద్రపఱచెడివారు. మృతులయొక్క ఆత్మలు స్థూలశరీరము నశించనంతవఱకు నుండుననియు స్థూలశరీరమునందలి యేదైన ఒక యవయవము నాశనమైన యెడల మృతజీవులయొక్క యాత్మయందలి యా యవయవము నశించుననియు వారినమ్మకము. ఇట్లొక్కొక్క దేశమునందును నిట్టి నమ్మకములే యా విధముగనే, కొంచెము మార్పులతోనే యుండినవి ఎట్టిమార్పులున్నను తుదకు ప్రధానాంశమైన మరణానంతర జీవితమును గూర్చి అందరును ఏకాభిప్రాయులే.

## (2) సోక్రటీస్

క్రీస్తునకుపూర్వము *గ్రీసుదేశమునందు సోక్రటీస్ అను ఒక తత్త్వవేత్త జన్మించెను అతడు పరలోకము ఒకటి యున్నదని, మానవులు ఇహలోకజీవనము పూర్తి యయినంతనే మరణించి వారియాత్మలు పరలోకమునకు పోయి అక్కడనే ఆలోకమునకు ననుగుణ మగు దేహధారులై సుఖింతురని శిష్యులకు బోధించెను ఆదేశపు శిక్షాస్మృతికి (పీనల్ కోడ్‌కు) ఈ బోధ విరుద్ధ మగుటవలన నా దేశపు న్యాయస్థానము అతనికి విషము నిచ్చి చంపవలసినదని మరణశిక్ష విధించెను సోక్రటీస్ బంధువులును, శిష్యులును, మిత్రులును ఆసిద్ధాంతమును వదలి న్యాయస్థానమును క్షమాపణ వేడుమనియు, వారు క్షమింతురనియు చెప్పిరి అతడు వారి మాటలు వినక చిరకాలము క్రిందట తన దేశమును వదలి వచ్చిన బాటసారి, లేక యాత్రికుడు మాతృదేశమును చేరుటకు నెట్లు సంతోషముతో పయనించునో అట్లే సంతోషముతో విషము త్రాగి మరణించెను అతని శిష్యుడు ప్లేటో సుప్రసిద్ధ తత్త్వవేత్త ప్లేటో శిష్యుడు 'అరిస్టాటిల్'. ఈతడు గ్రీసురాజు అలెగ్జాండరుతో

* సోక్రటీస్ గ్రీసునందలి ఎథన్స్ నగరమున క్రీ పూ 469-399 మధ్య ఉండినవాడు . పునర్జన్మ సిద్ధాంతమును పైతాగరస్ అను నతడు భారతదేశము నుండియే గ్రహించెనని కొందఱును, అశోకచక్రవర్తి పంపిన మతప్రచారకులవలన సోక్రటీస్ గ్రహించెనని కొందఱును చెప్పుదురు ఎథన్స్ న్యాయసభలో గల న్యాయాధిపతులు 501 లో 280 మంది సోక్రటీస్‌ను దోషియని తీర్మానించిరట

కూడ దిగ్విజయమునకు వెడలి భారతదేశమునకు వచ్చి తక్షశిలయందలి విశ్వవిద్యాలయమునందు మరణానంతర విషయమును గూర్చి తెలుపు భగవద్గీతను విని భారతీయులకు నీవిషయము తమకంటెముందే తెలియుటనుగుఱించి ఆశ్చర్యపడెనట ఇది చరిత్రకారులు చెప్పిన సంగతి

## (3) మృతులకు జరుగు శ్రాద్ధాదులు

వేదములాదిగ సామాన్యమైన కథలును స్థూల దేహనాశనానంతరము కూడ జీవునియొక్క అస్తిత్వమును గూర్చి చెప్పుచున్నవి. హిందూమతమందేగాక హిందూదేశమునందేగాక, ఇతరదేశములయందు, ఇతర మతముల యందు సహితము ఇట్టి కథలు కొద్దిమార్పుతో సనాతన కాలమునుండి చెప్పబడుచున్నవి.

మృతులైనవారికి శ్రాద్ధములు పెట్టుట, తిలోదకము లిచ్చుట, ఇవియన్నియు నేదోయొకరూపమున సామాన్యముగ అన్ని మతములయందును కలవు ముసల్మానులు ఆత్మయను శాశ్వతపదార్థ మేమియును లెదని చెప్పినను, మరణానంతరమేదో కొంత జీవితము శేషించి యున్నట్లే వారును పరోక్షమున నమ్ముచున్నట్లు న్నది కాదేని మృతకళేబరములను భూమిలో జాగ్రత్తగ పూడ్చి, భద్రపఱచుటేల? ఒక వేళ మృతులకు పునరుత్థాన మున్నదని నమ్మినను గోరీలవద్ద అప్పుడప్పుడు "ఫాత్యాలు" (నైవేద్యమువంటిది) ఇచ్చుటయు, సువాసన ద్రవ్యములను పొగవేసి, గోరీలపై గంధపుష్పములు చల్లుటయు-నివియన్నియు మృతులైనవారి జీవులను తృప్తిపఱచుటకే కదా? చాలవందల సంవత్సరములనుండి వచ్చుచున్నసంప్రదాయమే యిది ఇది కేవలము మూఢాచారమని యెవరైన చెప్పినను, అట్టిది కొంత మూఢవిశ్వాసమే యయినను, మరణానంతర జీవితమును గూర్చిన ప్రధాన సూత్రమునందు సత్యమున్నదను గాఢవిశ్వాసమే దీనికంతటికి మూలము.

ముసల్మానులలో నొక తెగవారగు సూఫీలు మానవుని మరణానంతరము ఆజీవుడు మఱియొకజన్మ యెత్తునని, అనగా పునర్జన్మసిద్ధాంతమును నంగీకరింతురట.

క్రైస్తవమతమునందు మానవునియందుండు ఆత్మ (జీవుడు) శాశ్వతుడనియు, దేహము నశించినను జీవులు నశించువారు కారనియు, వారి పుణ్యాపాపముల ననుసరించి స్వర్గమునకో నరకమునకో పోయి శాశ్వతముగా అచటనే ఉందురనియు చెప్పుదురు.

## (4) పునర్జన్మ సిద్ధాంతము

పరలోకము కలదని అంగీకరించినను పునర్జన్మ సిద్ధాంతమును అంగీకరింపని వారి సిద్ధాంతము మానవుడు భూమిపై పుట్టుట యిదియే మొదటిసారియు, కడసారియు మానవుడు మృతిచెందిన పిమ్మట వానియాత్మ వాడు చేసిన పుణ్యాపాపకర్మల ననుసరించి స్వర్గమునకో, నరకమునకో పోవును ఏలోకమునకు ఎవడు పోవునో వాడాలోకమున సుఖములో దుఃఖములో శాశ్వతముగ ననుభవించును ఈ విధముగ చెప్పువారు ఈ క్రిందిప్రశ్నల నెదుర్కొనవలసివచ్చును.

మొదటిప్రశ్న : ఒకానొక ఆటవికుడుగాని, అనాగరికుడుగాని పాపకర్మ యిది, పుణ్యకర్మయిది అని తెలియక పాపము నాచరించి మృతిచెందెనేని వాడు నరకమునకు పోయి అందు శాశ్వతముగ నుండవలసివచ్చును ఎన్నికోట్ల యుగములు గడచినను వాడు నరకమునుండి విముక్తుడు కాలేడు వానికి ఈశ్వర దర్శనావకాశము ఎప్పటికిని లేదు స్వల్పపాపమునకు అనంతమైన శిక్ష వానికి కలుగుచున్నది ఈ భూమిపైన నింతవఱకును పుట్టిన మానవ కోటియందు ఎంత కఠినహృదయుడైనను స్వల్పమగు పాపాచరణమునకు ఇంత కఠినశిక్ష యివ్వజాలడు కనుక నిది కరుణామూర్తియగు భగవంతునికి ఇష్టమైనది గాదు. పైగా పుణ్యాపాపములను రెండింటిని జీవితకాలము ఆర్జించిన వారిగతి యేమో వారు స్పష్టపరుప లేదు

రెండవ ప్రశ్న : ఈలోకమున జన్మించిన మానవులయందు కొందఱు గ్రుడ్డివారు, కొందఱు అవయవహీనులు, రోగులు, దరిద్రులుగా నున్నారు మఱికొందఱు దీనకి వ్యతిరేకముగా నున్నారు. కొందఱు మహామేధావులును మఱికొందఱు బుద్ధిహీనులుగను కలరు భగవంతుని సృష్టియందు గల ఈ వ్యత్యాసమునకు గల కారణమేమి?

ప్రపంచమున గల మతములలో నెక్కువ జనసంఖ్య గలమతము బౌద్ధము. బౌద్ధులు పునర్జన్మ సిద్ధాంతము నంగీకరింతురు పునర్జన్మ సిద్ధాంతము నంగీకరించువారిని, దానికి వ్యతిరేకులగువా రడుగుప్రశ్న లివి పూర్వజన్మ యుండినయెడల మనపూర్వజన్మముల స్మృతి మనకేల యుండదు? ఈ ప్రశ్నకు సమాధాన మిదివఱకే పెద్దలు చెప్పిరి * ·

* వివేకానందస్వామివారి 'జ్ఞానయోగము'ను ఉపన్యాస సంపుటియందు విశ్వతత్త్వదర్పణము, పిండాండము అను ఉపన్యాసములను చూడవలయును

దానికి సమాధానమిది . మనము మన తల్లిగర్భమునుండి పుట్టినది మొదలు మనబాల్యమునం దేమి జరిగినదో అదంతయును మనకు జ్ఞప్తియందున్నదా? లేదు. అట్లు లేక పోవుటకు కారణమేమి? అప్పటి మెదడు ఇప్పుడు లేదు పూర్వజన్మముల స్మృతి లేనంతమాత్రమున వెనుకటి జన్మములే లేవని చెప్పుట యుక్తము కాదు పూర్వజన్మమునం దార్జించి కూడబెట్టుకొన్న భావరాశి, సంస్కారములయొక్క పలితమే కదా ప్రస్తుతజన్మమందు మన మనుగడలకు కారణము? ఒకడు బాల్యమునందే అనేకవిద్యలయందు పండితుడై యుండుటకు కారణము వాని పూర్వజన్మానుభవములు సంస్కారరూపమున నిప్పటి మెదడునందు దాగియుండుటయే గదా? అవి జన్మతో వచ్చినవి వాటిని సహజములని యందురు

మానవుని విషయ మట్లుంచి తిర్యగ్జాతులును పూర్వ వాసనానుసారముగ వర్తించుట మనము చూచుచున్నాము ఒక అడవియందు దుప్పియో, జింకయో ఏకాంతమున ప్రసవించినపుడు దానిబిడ్డ భూమిపైన బడిన కొంతసేపటికే తల్లి చన్ను కుడుచుచున్నది స్తన్యపానము చేయుమని దాని కెవరు నేర్పరి? పిల్లిని ఎన్నడును చూడని ఎలుక పిల్లి అరచినంతనే భయపడి పరుగెత్తుచున్నది దానికి మృత్యుభయ మెట్లు కలిగినది? ఏదైనను జ్ఞానము కలుగుటకు అనుభవము కావలయునుగదా! అనుభవము లేని జ్ఞానమెట్లు కలుగును? పిల్లిని చూచి భయపడిన ఎలుక ఎప్పుడో మృత్యువును అనుభవించి యుండవలయును అది యీజన్మమున కాదుకదా? అదెప్పుడు? గడచిన అనేక జన్మములయందు అది మరణించినది. ఆసంస్కారమే యిప్పటి అనుభవమునకు కారణము ఆహారము, భయము, మైథునము- ఇవి పూర్వజన్మానుభవములై యుండి యిప్పటి జన్మతో వచ్చినవని చెప్పుటకు ప్రతిప్రాణియందును నిదర్శనములై యున్నవి

అట్లయినచో జ్ఞానులగు వారైనను పూర్వజన్మములను చూచినారా? అట్లు చూచినవారు కలరా? అను ప్రశ్నలుదయించును. అట్లు చూచినవారు కలరని శ్రీ వివేకానందులవారు ఘంటాపథముగ చెప్పిరి జ్ఞానులకు పూర్వజన్మ జ్ఞానము సహజముగా కలుగదు జ్ఞానమునకును, పూర్వజన్మ స్మృతికిని సంబంధము లేదు. పూర్వజన్మములను తెలిసికొనుట యనునది ఒకశక్తి. దానిని సాధింపవలయునన్నచో యోగవిద్యచే సాధింపవచ్చును.

*జ్ఞానులకు అవసరమని తోచినచో దానిని సులభముగ బడయ గలుగుదురు. రాజయోగమును, జ్ఞానమును ఇవి రెండును క ,గినవారి కది సులభసాధ్యము

పునర్జన్మ కలదనుటకు ముఖ్యప్రమాణము శ్రుతియే శ్రుతికంటె బలవత్తరప్రమాణము అవసరము లేదు సర్వసంగ వివర్జితులును, అతీంద్రియజ్ఞాన సంపన్నులును భగవత్సమానులు నగు మహాత్ములచే చెప్పబడిన వాక్యములే శ్రుతులు వారు వారియొక్కయు, వారి యెదుటనున్న వారి యొక్కయు వెనుకటి జన్మపరంపర లన్నిటిని చూడగలిగినవారు కనుక వారివాక్యములు సత్యములు అధికార పురుషులైనవారు జ్ఞానులయ్యును మరల మరల జన్మింతురు

వానివాని జన్మకాలమును (రాశిని) బట్టి వారివారి జీవితమునందలి సుఖదుఃఖములు జరుగునని పూర్వజన్మము లేదని కొందఱందురు అట్లయినను కేవల దుఃఖవంతులుగా జీవించగల రాశియందు కొందఱును, సుఖజీవులుగ నుండు రాశియందు కొందఱును, ఏల జన్మించవలెనను ప్రశ్న కలుగుచున్నది అనగా-సృష్టియందలి వైషమ్యమునకు కారణమేమను ప్రశ్నయే తిరుగ నీరూపమును ధరించును హైందవ జ్యోతిశ్శాస్త్రమున మానవులయొక్క పూర్వజన్మ కర్మఫలము ననుసరించియే హోరాశాస్త్రము వారి జాతకములను వ్యక్తముచేయునని చెప్పబడినది

పునర్జన్మ సిద్ధాంతము సంఘమునకు వ్యక్తులకు అభయప్రదమైనది మానవుడు వానిజీవితకాలమున కష్టపడి ఆర్జించిన విజ్ఞాన రాశియంతయు మరణముతో మట్టిపాలగు నను భయము పునర్జన్మ సిద్ధాంతము తొలగించుచున్నది

---

* పతంజలిమహర్షి పూర్వజన్మజ్ఞానము కలుగుటకు వారి యోగసూత్రములయం దిట్లు చెప్పిరి

**"సంస్కార సాక్షాత్కరణా త్పూర్వజాతిజ్ఞానమ్" (పా సూ. 3-18). సంస్కారములను కనుగొనుటచే పూర్వజన్మజ్ఞానము (కలుగును). మనము పొందునట్టి ప్రత్యనుభవమును చిత్తమునందొక వృత్తిరూపముగా కలుగుచున్నది. ఈ వృత్తి చిత్తమునందణగి క్రమక్రమముగా అతి సూక్ష్మమై పోవుచుండునేకాని నశింపదు. ఇట్టి సూక్ష్మవృత్తిని మేల్కొలిపి జ్ఞానావస్థకు దీసికొని రాగలినయెడల మఱల నది స్మృతి యగుచున్నది. కావున నిట్లు చిత్తమునం దణగియుండు పూర్వసంస్కారములపై యోగి సంయమము చేయగల్గినయెడల తన పూర్వజన్మములను జ్ఞప్తికి దెచ్చుకొన గలడు " (రాజయోగము. వివేకానందస్వామి, శ్రీరామకృష్ణమఠం)**

భూమిపై గల మతగ్రంథము లన్నిటికంటెను అతి ప్రాచీనములైన గ్రంథములు ఉపనిషత్తులు అట్టి ఉపనిషత్తులయందును, తర్వాత భగవద్గీతయందును, బ్రహ్మసూత్రములయందును, పురాణాదులయందును మరణానంతరము జీవులపరలోక గమనమును గురించియు పునర్జన్మను గుఱించియును ఏమి చెప్పబడినదో పరిశీలింతము

## (5) పంచాగ్ని విద్య*

విద్వాంసుడగు శ్వేతకేతుడను మునికుమారుడు పాంచాలదేశమునకు పోయి అక్కడ సభలో పండితుల నోడించి, ప్రవాహనుడను జైబలి రాజసభ యందలి విద్వాంసులను కూడ నోడించగోరి ప్రవాహనుని సభకు పోయెను ప్రవాహనుడు శ్వేత కేతువును అయిదు ప్రశ్న లడిగెను అవి యివి

(1) ఈ లోకమున చనిపోయిన వారలు ఏలోకమునకు పోవుచున్నారు?

(2) ఆ విధముగ పోయిన జీవులెట్లు ఈలోకముకు తిరిగి వచ్చెదరు?

(3) ఈలోకమున మరణించినవారు ఎంతకాలము నుండియో ఊర్ధ్వలోకమునకు పోవుచున్నారే, అట్టివారిచేత ఆలోకము పూర్తికాబడలేదా?

(4) ఎన్ని ఆహుతులు చేసిన జలము పురుషరూపము నొందును?

(5) మనుష్యులు గతించిన పిమ్మట దేవయాన మనియు, పితృయాన మనియు రెండుమార్గములద్వారా పోవుదురు కదా? అవి ఈ భూమికిని స్వర్గమునకు మధ్యనున్నవి కదా! ఎట్టికర్మము లొనర్చినవారు ఆరెంటియందు ఏమార్గము ద్వారా పోవుదురు?

శ్వేతకేతువు ఆ ప్రశ్నలయందు దేనికిని సమాధానమును చెప్పలేక తనతండ్రియగు 'అరుణి' వద్దకు పోయి ప్రవాహనుని ప్రశ్నలకు నుత్తరము లిమ్మని అడిగెను. అరుణి వాటికి ప్రత్యుత్తరము తెలియనందున ప్రవాహనుని కడకుపోయి యాతని నర్థించెను ప్రవాహనుడు గౌతముడగు అరుణిని

---

* పంచాగ్ని విద్యను గుఱించి చెప్పిన శ్రుతులు .

1 ఛాందోగ్యము 5-వప్రపాఠకము 3 నుండి 10 వఱకు ఖండములు

2 బృహదారణ్యకము 6-వ అధ్యాయము 2-వ బ్రాహ్మణము

3 కౌషీతకి బ్రాహ్మణశ్రుతి - ప్రథమాధ్యాయము.

సత్కరించి యిట్లనెను "ఈ ప్రశ్నలకు సమాధానము పంచాగ్ని విద్య తెలిసిననే కాని తెలియదు ఆ విద్య క్షత్రియులయందు మాత్రమే వంశపారంపర్యముగా నున్నది. బ్రాహ్మణులకు తెలియదు." అని చెప్పి అతని కావిద్య నుపదేశించెను

అందు, ద్యులోకము మొదటి అగ్ని, పర్జన్యుడు రెండవ అగ్ని, భూమి మూడవ అగ్ని, పురుషుడు (మనుష్యుడు) నాలుగవ అగ్ని, స్త్రీ అయిదవ అగ్ని ఇచట చెప్పిన ద్యులోకాదులైదును అగ్నులు కావు అగ్నులని భావింపవలయును (అవి యెట్లు భావింపబడవలయునో ఆవివరము శ్రుతియందు చెప్పబడినది) ఈ విధముగ పురుషుడుపాసన చేయవలయును ఇట్టి యుపాసకుడు మరణించిన పిమ్మట దేవయాన మార్గమున బ్రహ్మలోకమునకు పోవును ఇది యొకవిద్య

ఈ పంచాగ్ని విద్యతో నీ ప్రకరణమునకు సంబంధ మేమియును లేదు కాని, పంచాగ్నివిద్య కారణముగ నీలోకమున మృతులైనవారు పోయెడి లోకమునుగూర్చి చెప్పబడినందున ఈ ప్రస్తావన యిచట తేబడినది పంచాగ్ని విద్యయందు దేవయాన, పితృయానములని రెండుమార్గములు చెప్పబడినవి వీటినే క్రమమున అర్చిరాది మార్గము, ధూమాదిమార్గము లందురు భగవద్గీత దేవయానమును శుక్ల మనియు, పితృయానమును కృష్ణమనియు పేర్కొన్నది సగుణబ్రహ్మోపాసకు లగువారు దేవయానమార్గమున బ్రహ్మలోకమునకు పోవుదురు పుణ్యకర్మ లాచరించినవారు పితృయానమార్గమున చంద్రలోకమునకు పోవుదురు అందు దేవయాన మార్గమును గుఱించి యిపుడు విచారింతము

## (6) దేవయానము

సగుణ బ్రహ్మోపాసకులు మృతిచెందిన పిదప అర్చిరాది మార్గమున బ్రహ్మలోకమునకు చనుదురు వారు భూలోకమునుండి బ్రహ్మలోకమునకు పోవుటకు (లేదా వారిని తీసికొని పోవుటకు) మొదట అగ్ని దేవత (తేజోఽభిమానదేవత) ను చేరుదురు ఆ దేవత వారిని పగటి నభిమానించు దేవతను చేర్చును ఆదేవత శుక్లపక్షాభిమానదేవతను చేర్చును అట్లే శుక్లపక్షాభిమానదేవత ఉత్తరాయణాభిమాన దేవతను, ఉత్తరాయణాభిమానదేవత సంవత్సరాభిమాన దేవతను, ఆదేవత దేవలోకమును, దేవలోకాభిమానదేవత వాయులోకమును, వాయులోకాభిమానదేవత సూర్యలోకమును, ఆలోకాభిమాన దేవత చంద్ర లోకమును, ఆలోకాభిమానదేవత విద్యుల్లోకమును చేర్చును.

అచట చేరగనే, బ్రహ్మలోకమునుండి బ్రహ్మదేవుని పంపున అమానవుండగు నొక పురుషుడు (దేవపురుషుడు) వచ్చి విద్యుల్లోకమునుండి వారిని వరుణలోకము చేర్చును వారివెంట విద్యుదభిమాన దేవతకూడ చనును అంతట నాదేవపురుషుడు వరుణలోకమునుండి ఇంద్రలోకమునకు గొనిపోవును. అప్పుడు వారలను వరుణలోకాభిమానదేవత వెంబడించును ఇంద్రలోకాభిమానదేవత వారి వెంట రాగా ఇంద్రలోకమునుండి ప్రజాపతి లోకమును చేర్చుదురు ప్రజాపతిలోకమునుండి బ్రహ్మలోకమునకు చేర్చుదురు విద్యుల్లోకమునుండి బ్రహ్మలోకపర్యంతము అమానవ పురుషుడు ప్రధానాతి వాహికుడై యుండును విద్యుల్లోకాభిమానదేవతలు అప్రధానాతివాహికులు (గౌణాతివాహికులు)గ నుందురు

ఈవిధముగా భూలోకమునకును బ్రహ్మలోకమునకును మధ్య పదుముగ్గురు అతివాహికులు చెప్పబడిరి ఈలోకములు (వీరు) బ్రహ్మలోకమునకు పోవు మార్గమునందలి గురుతులు కావు ఇవి జడములైన లోకములును కావు అయా లోకాభిమాన దేవతలేయని సిద్ధాంతము చేయబడెను (బ్ర సూ 4-3-6) కాని దేవయానమార్గము చెప్పు ఉపనిషత్తు లన్నింటియందును ఇచట చెప్పిన అతివాహికుల నందరిని చెప్పియుండలేదు బృహదారణ్యక శ్రుతియందు సంవత్సర వాయుదేవతాలోకములును, ఛాందోగ్యమునందు దేవ, వాయు, వరుణ, ఇంద్ర, ప్రజాపతి లోకములును చెప్పబడియుండలేదు కౌషీతకీ బ్రాహ్మణశ్రుతి అగ్ని, వాయు, వరుణ, ఇంద్ర ప్రజాపతి లోకములను మాత్రమే చెప్పినది శ్రుతులన్నియు ప్రమాణములే గావున అన్నింటియందు చెప్పినవాటిని గ్రహింపవలయునని బ్రహ్మసూత్రములయందు చెప్పిరి

బ్రహ్మలోకమునకు అర్హులగువారు సగుణబ్రహ్మ విద్యోపాసకులై యుండ వలయును. ఈఉపాసనావిద్యలు ఉపనిషత్తులయందు చెప్పబడినవి వెనుక చెప్పిన పంచాగ్ని విద్యవలెనే మఱికొన్ని విద్యలును కలవు. అవి పర్యంకవిద్య, ఉపకోసలవిద్య, దహరవిద్య, మధువిద్య, శాండిల్యవిద్య, షోడశకలవిద్య, వైశ్వానరవిద్య-మొదలగు ముప్పది రెండు విద్యలు చెప్పబడినవి ఈ విషయము బ్రహ్మసూత్రముల అ. 3, పా. 3. అనియమాధికరణమునందు చర్చింపబడినది ఇది గాక అహంగ్రహోపాసకులును, ప్రణవోపాసకులును, అంతకాలము నందు ఓమ్ అను అక్షరమును స్మరించుచు శరీరము వదలిన వారును,

యోగమార్గమున బ్రహ్మనాడినుండి నిర్గమించిన వారును, ఈ అర్చిరాది మార్గమున బ్రహ్మలోకము చేరుదురు **"తేషామసౌ విరజో బ్రహ్మలోకో న, యేషు జిహ్మ మనృతం న మాయా చేతి"** (ప్రశ్న 1-6) ఎవరియొద్ద కుటిల భావము, వంచన (మాయ) లేదో, ఎవరు అసత్యమును పలుకరో, అట్టి వారు బ్రహ్మలోకమును పొందుదురు అని చెప్పబడినది ఈ విషయము గమనార్హమైనది

## (7) బ్రహ్మలోకము

బ్రహ్మలోకమునకు దివ్యపురుషునిచేత చేర్చబడుటకు ముందు, అచ్చట నున్న 'విరజ' నదిని ఉపాసకులు దాటుదురు 'విరజ' అనగా విడిచిన రజోగుణము కలది అనగా ఉపాసకులకు అంతవఱకును స్వల్పముగా నైనను రజోగుణ ముండును రజోగుణము లేనిచో బ్రహ్మలోకమునకు పోవలెనను కోర్కె యుండదుగదా? అట్టి రజోగుణము ఇచట నశించునని భావము. వారి తమోగుణము మరణకాలమునకు ముందే నశించియుండును. బ్రహ్మలోకమున నుండు వారందఱు సత్త్వగుణాధిక్యము గలవారు విరజను దాటునపుడు ఉపాసకులు వారికిగల పాపపుణ్యము లచ్చట వదలుదురు వీరు వదలిన పాపపుణ్యములయందు, వీరిని ద్వేషించువారికి వీరు చేసిన పాపములును, వీరిని పూజించువారికి లేక గౌరవించువారికి వీరు చేసిన పుణ్యములును చెందునని కౌషీతకీ బ్రాహ్మణోపనిషత్తు చెప్పుచున్నది

ఉపాసకులు బ్రహ్మలోకమును చేరునపుడు సూక్ష్మశరీరములతో చేరుదురు బ్రహ్మలోకమునం దుండువారికి దేహములుండునా, ఉండవా అను విషయమై బ్రహ్మసూత్రములయందు చర్చింపబడినది బాదరిమతము ననుసరించి వీరికి శరీరము లుండవనియును (బ్ర సూ 4-4-10), జైమిని మతము ననుసరించి వీరికి శరీరములు కలవనియును (బ్ర సూ 4-4-11), బాదరాయణాచార్యుల మతము ననుసరించి ఉపాసకులు స్వతంత్రులు కావున శరీరము కావలెనని వారు సంకల్పించుకొన్నప్పుడు శరీర సహితులుగా నుండుటయు, అక్కఱ లేదన్నప్పుడు శరీరరహితులుగా నుండుటయు కావచ్చును (బ్ర సూ 4-4-12).

బ్రహ్మలోక ప్రాప్తులకు శరీరము లుండినను లేకపోయినను, బ్రహ్మలోక భోగముల ననుభవించుటకు ఆటంకము లేదు. చతుర్ముఖునికి గల

సమస్తైశ్వర్యములును వారు కలిగి యుందురు *కాని ప్రపంచసృష్ట్యాదులు చేయలేరు

బ్రహ్మలోకమునందు 'అరము' 'నియము' అను పేర్లు గల సముద్ర సమానములగు రెండమృత సరస్సులు కలవనియు, అన్నమయమైన మనస్సునకు ఆనందము కలిగించునట్టి నైరమ్మదీయమను మఱియొక సరస్సు కలదనియు, సోమసవన మనుపేరుగల నమృతవర్షి యగు నొక యశ్వత్థవృక్షము కలదనియు, అపరాజితయను నొక పట్టణమును, అందు హిరణ్యగర్భునకు నివాసస్థానమగు మనోహరమైన సువర్ణమందిరము కలదనియు-మొదలగువిషయములను శాస్త్రములు చెప్పుచున్నవి

ఉపాసకులు చతుర్ముఖుడు జీవించి యున్నంతకాలము బ్రహ్మలోకమునం దుందురు అప్పుడు వారికి అవిద్య స్వల్పముగ నుండును వారు బ్రహ్మ ప్రళయమున (బ్రహ్మ ఆయుస్సు పూర్తియయిన తర్వాత) చతుర్ముఖునితో కూడ పరమేశ్వరునియందు ఐక్యమగుదురు అప్పుడు వారికి అవిద్య పూర్తిగ నశించును

**శ్లో॥ "అగ్ని ర్జ్యోతి రహ శ్శుక్ల షణ్మాసా ఉత్తరాయణమ్ ।**
**తత్ర ప్రయాతా గచ్ఛంతి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః"॥** (గీత 8-24)

అగ్ని, జ్యోతి, అహస్సు, శుక్లము, ఉత్తరాయణము (అర్చిరాది మార్గము) ఆమార్గమున పోయిన బ్రహ్మవిదులు క్రమముగ బ్రహ్మమును పొందుచున్నారు మఱియు (గీత 8-26)

* సాలోక్యము, సామీప్యము, సారూప్యము, సాయుజ్యము అని ముక్తిని నాల్గువిధములుగ చెప్పుదురు (1) బ్రహ్మదేవుడుండు లోకము నందుండుట సాలోక్యమనబడును (2) ఆ లోకమునం దుండుటయేకాక ఆ లోకమునందున్న హిరణ్యగర్భుని సన్నిధానమునందు ఆయనకు కింకరులై యుండుట సామీప్య మనబడును ఇది సాలోక్యము క్రికంటె అధికమైనది (3) భగవత్సామీప్యమునం దుండుటయేగాక ఆయనతో సమానరూపులై యుండుట సారూప్యము ఇది పై రెండింటికంటెను అధికమైనది (4) ఆ లోకమునందును ఆయన సమీపమునందును, బ్రహ్మరూపులై యుండుటయే గాక బ్రహ్మదేవునికి గల అపరిమిత శక్తిసంపదలు (లోకపాలకత్వము, లోకమును సృజించుట-యనునవి తప్ప) కలిగి యుందురు, ఇది సాయుజ్యముక్తి దీనినే పార్ష్ణిముక్తి యందురు ఇవన్నియు ఐశ్వర్యములు, పదవులు మహానారాయణోపనిషత్తునందు వైకుంఠలోక వర్ణనమును విష్ణుభక్తులకు సాలోక్యాదిముక్తి చతుష్టయమును చెప్పబడినది 'బ్రహ్మజిజ్ఞాస' ద్వితీయభాగమున 5-7-8 లో వైకుంఠలోక వర్ణనము చూడవచ్చును

శ్లో|| "....బ్రహ్మలోకానగమయతి తేషు బ్రహ్మలోకేషు పరాః |
పరావతో వసంతి తేషాం న పునరావృత్తిః" || (బృ 8-2-15)

బ్రహ్మలోకమునకు పోవుదురు అచటినుండి బ్రహ్మమును చేరుదురు వారికి పునరావృత్తిలేదు

"తేబ్రహ్మలోకేషు పరాంతకాలే పరామృతా త్పరిముచ్యంతి సర్వే" - ఆ యుపాసకులు ప్రళయకాలమునందు బ్రహ్మతో కూడ ముక్తులగుదురు

"బ్రహ్మణా సహ తే సర్వే సంప్రాప్తే ప్రతిసంచరే |
పరస్యాంతే కృతాత్మనః ప్రవిశంతి పరంపదం" || (స్మృతి)

"అయుపాసకు లందఱును చతుర్ముఖునకు నాశకాల మగు ప్రళయకాలము వచ్చునంతవఱకు బ్రహ్మలోకమున నివసించుచుండి జ్ఞానవంతులై యంతమున నాయనతో కూడ పరమేశ్వరునియం దైక్యము నొందుదురు

అందువలన వీరికి పునరావృత్తిలేదు దీనిని క్రమముక్తి యని యందురు బ్రహ్మలోకమునందుండు స్థితి సంపూర్ణముక్తి కాదు ఇది దుఃఖము లేనిదగుటచే బంధము లేదు ఉపాసకుడు ఉపాస్యమను ద్వైతము (భేదదృష్టి) తొలగకుండుటచే మోక్షమును కాదు ఇదియొక విధమగు మూడవ వ్యవస్థ

జి : శాస్త్రోపదిష్ట మార్గమున శ్రవణాదులు చేయకయే బ్రహ్మలోక వాసులగు ఉపాసకులకు ముక్తి కలుగునా?

వే : ఈ విషయమున మత భేదములు గలవు బ్రహ్మాది లోకములకు పోయినవారు మరలి రావలసినదే యని బృహ. 6-1-9లో చెప్పినది వీరికి పునరావృత్త లేదని చెప్పిన శ్రుతికి అర్థమేమనగా బ్రహ్మలోకమునకు పోయిన "ఉపాసకులకు నీకల్పమందు మాత్రమే పునర్జన్మ లేదు రాబోవు కల్పమునందు పునర్జన్మ కలుగును కారణ మేమనగ ఉపాసకులకు బ్రహ్మత్మైక్య జ్ఞానము లేదు ఒక వేళ వారు బ్రహ్మలోకము నందున్న కాలములో బ్రహ్మవిచారముచేసి బ్రహ్మత్మైక్య జ్ఞానము సంపాదించికొని యుండిరేని అట్టివారికి నెప్పటికిని జన్మ కలుగదు ఇదియే అద్వైతసిద్ధాంతము. బ్రహ్మలోకము సత్త్వగుణ ప్రధానమైనది. ఉపాసకులు రజస్తమోగుణములను చాలవఱకు వదలినవా రగుటచేత వాటికార్యములగు లయ, విక్షేప, కషాయములు వారికి ప్రతిబంధమును కలిగింపకుండుటచే, చిత్తము సహజముగనే సమప్రాప్తి నొందియుండును బ్రహ్మలోకముననుండి క్రిందనున్న లోకముల నన్నింటికంటెను బ్రహ్మలోకమున

సత్యము వెలుగునీడలవలె కల్పించును. జ్ఞానియందు నిర్మలమైన దర్పణమునందు ప్రతిబింబమువలె అతివిస్పష్టముగ సత్యము కాన్పించును. అనగా బ్రహ్మానుభూతి కలుగును ఇదియే ఉపాసకులకును, బ్రహ్మవేత్తలకును గల భేదము.

బ్రహ్మలోకము శ్రీమదాంధ్ర భాగవతమున ఈ విధముగ వర్ణింపబడినది

సీ|| ఇలమీద మనువు లీ రేడ్వురుఁ జనువేళ
దివసమై యెచ్చోట దిరుగుచుండు,
మహనీయ సిద్ధవిమానసంఘము లెందు
దినకర ప్రభములై తేజరిల్లు,
శోకజరామృత్యు శోషణ భయదుఃఖ
నివహంబు లెందు జనింపకుండు,
విష్ణుపదధ్యాన విజ్ఞానరహితుల
శోకంబు లెందుండి చూడవచ్చు,

ఆ|| పరమసిద్ధయోగిబాషణామృత మెంపు
శ్రవణపర్వ మగుచు జరుగుచుండు,
నట్టి బ్రహ్మలోకమందు వసించును
రాజవర్య! మఱల రాఁడు వాఁడు. (భాగవతము-ద్వితీయస్కంధము)

## (8) పితృయానము

**"అథయే యజ్ఞేన దానేన తపసా లోకాఞ్జయన్తి తే ధూమ మభిసంభవంతి"** అని (బృహదా. 8-2-15). అనగా యజ్ఞము, దానము, తపము చేసినవారు ధూమమార్గము ననుసరింతురు. వారు మరణింపగనే సూక్ష్మశరీరముతో పితృయాన మార్గము ననుసరించి చంద్రలోకమునకు పోవుదురు ఎట్లనగ వారు మరణింపగనే వారిని ధూమాభిమానదేవత రాత్ర్యభిమానదేవతను చేర్చును ఆదేవత కృష్ణపక్షాభిమానదేవతను చేర్చును. ఆదేవత దక్షిణాయనాభిమానదేవతను చేర్చును ఆదేవత పితరులయొక్క లోకమును చేర్చును. ఆదేవత చంద్రలోకమును. చేర్చును

ఇది ఆరోహణక్రమము. వీరచ్చట జలమయమైన దేహములు ధరించి అలోకభోగముల ననుభవింతురు. వారి వారి పుణ్యకర్మలయందు విశేషభాగము

నశింపగనే అనగా కొంతకర్మ మిగిలియుండగనే వారు తిరిగి చంద్రలోకమునుండి భూలోకమునకు వత్తురు. అట్లు మిగిలియున్న ఆకర్మకు (పుణ్యఫలమునకు) అనుశయమని పేరు. అనుశయముతోకూడ జీవులు చంద్రలోకమునుండి కొంతవఱకు ధూమాది మార్గము నాశ్రయించియు కొంతవఱకు ఇతరమార్గము నాశ్రయించియు భూలోకమునకు వత్తురు

"ఆకాశా ద్వాయుం వాయో ర్వృష్టిం వృష్టేః పృథివీం తే పృథివీం ప్రాప్యాన్నం భవంతి తే పునః పురుషాగ్నౌ హూయంతే తతో యోషాగ్నౌ జాయంతే తే లోకాన్ప్రత్యుత్థాయినః" (బృహదా 8-2-16) "ఆకాశమునుండి వాయువునకు, వాయువునుండి మేఘమునకు మేఘమునుండి భూమికి, భూమియందు అన్నరూపమగు ఓషధులకు చెంది అందుండి పురుషునియందు, అందుండి స్త్రీయందునుచేరి పురుషరూపమును పొందుచున్నారు" "**అథైతమేవాధ్వానం పునర్నివర్తంతే యథేత మాకాశ మాకాశా ద్వాయుం వాయు ర్భూత్వా ధూమో భవతి ధూమో భూత్వాఽభ్రం భవనీభ్రం భూత్వా మేఘో భవతి మేఘో భూత్వా ప్రవర్షతి**". (ఛాం 5-10-5, 6) "మొదట చంద్రలోకము నుండి ఆకాశమునకును అచటినుండి వాయు సమీపమునకు వత్తురు వాయురూపము చెంది పొగ యగుదురు పిదప మేఘమండలమునకు దిగివత్తురు అచట మేఘసమాన రూపులగుదురు" అంతట వర్షమూలమున భూమికి దిగివత్తురు భూమియందు ఓషధుల నాశ్రయించుకొని కొంత కాలముందురు ఓషధులను అన్నరూపమున పురుషుడు భుజించినపుడు పురుషుని వీర్యమునందు చేరుదురు. ఆవిధముగ స్త్రీగర్భమున ప్రవేశించి దేహధారు లయ్యేదరు. ఇది అవరోహణ క్రమము.*

పంచాగ్ని విద్యయందు చెప్పబడిన అయిదు అగ్నులు నివియే (1) ద్యులోకము (2) మేఘము (3) భూమి (4) పురుషుడు (5) స్త్రీ జీవుడు

---

* పుణ్యాత్ములు స్వర్గమునకు పోవుటనుగుఱించి శ్రుతులీవిధముగ చెప్పియుండగా శివరామదీక్షితులవారు ఈ క్రిందివిధముగా చెప్పిరి "తల్లికి అలవాటయిన పిల్లకు తల్లి కొనకుచస్తే, ఆపిల్ల అమ్మా అమ్మా అని యాదిచేస్తే నీల్కుకుపోయింది, వస్తుందని పొరుగింటివారు అన్నట్టు మూలంలేని యీ గుర్తెరిగే శరీరం స్వర్గానికి పోయింది అని కల్పించినారు" (బృహద్వా. ఉ పు 21, 22), దీక్షితులవారి సంప్రదాయమునకు చెందినవారిలో కొందఱు లోకాంతర జన్మాంతరములను అంగీకరించువారు కలరు ఈ విషయమును ఈగ్రంధముయొక్క చతుర్థభాగమున విపులముగ పరిశీలించితిని

చంద్రలోకమునుండి భూమికి దిగువచ్చు విధము ఉపనిషత్తులయందును, బ్రహ్మసూత్రములయందును (6-3-1) చర్చింపబడినది.

పైన చెప్పినట్లు ఆకాశరూపులగుదు రనుమాటకు, ఆకాశమున ఐక్యము మగుట కాదనియు ఆకాశసమాన రూపులుమాత్రమే అగుదురనియు అదియును అల్పకాలము మాత్రమే ఆకాశాదులయం దుందురనియు చెప్పబడినది (బ్ర సూ 3-1-22, 23). ఇచట ఓషధులనగా గోధుమలు, యవలు, వడ్లు మొదలగు ధాన్యము లగుదురని చెప్పబడినది కాని ఆయా రూపములుగ పరిణమింప బడవు మఱిమనగా, గోధుమలు మొదలగువాటియందు సహజముగనున్న ఆయా ధాన్యాభిమానులగు జీవులును, స్వర్గమునుండి వచ్చిన వీరును,వాటియందే చేరియుందురు కాని అవ్రీహ్యాదిధాన్యములు కోయునపుడు, దంచునపుడు ఆయా ధాన్యాభిమానులగు జీవులు వాటియందుండి నిర్గమింతురు కర్మశేషమువలన చంద్రలోకమునుండి దిగివచ్చు జీవులు అవ్రీహ్యాది ధాన్యములు దంచునపుడు, వండునపుడు కాని, అన్నమైన పిమ్మట పురుషుడు భుజించినపుడుగాని, ఆయాపదార్థములను వదలక అందేయుండి పురుషుని వీర్యమును చెంది స్త్రీగర్భము చేరి దేహధారు లగుచున్నారు వ్రీహ్యాది ధాన్యములను వీరు అభిమానింపక తటస్థముగ నుందురు గనుక వాటి వినాశాదులవలన వీరికి నాశనము కలుగనేరదు (బ్ర సూ 3-1-24 నుండి 27)

ఈ మార్గమున యజ్ఞాదుల నాచరించిన వారేగాక మఱికొందఱును పోవుదురు. వారిని గుఱించి గీతయం దిట్లు చెప్పబడెను

"ఒకానొకడు మోక్షమును కోరినవాడగుచు యోగమార్గమునం దాసక్తుడై యజ్ఞాదికర్మలు చేయకపోవుటచేత స్వర్గలోకమును పొందలేడు యోగమునుండి జారుటచేత ముక్తుడును కాలేడు సగుణబ్రహ్మవిద్యోపాసన లేకపోవుటచేత అర్చిరాది మార్గమునుండి బ్రహ్మలోకమును పొందలేడు ఇట్టి సాధకుడగు ముముక్షువు మరణించిన ఇత దేమార్గము ననుసరించును"అని అర్జునుడు ప్రశ్నించెను (గీ. 6-35, 37)

ఇది సహజముగ కలుగు సంశయమే. దానికి భగవంతు డీవిధముగ సమాధాన మిచ్చెను. "అర్జునా! అట్టి యోగభ్రష్టునకు నీలోకమునందుగాని పరలోకమునందుగాని దుర్గతి కలుగదు మంచిపని చేసినవాడు ఒకడును దుర్గతిని పొందడు"(గీ. 6-40) ఈ లోకమునందుగాని పరలోకమునందుగాని

అనుటవలన ఈ లోకమునందు హీనయోనులందు పుట్టడనియు పరలోకమనగా నరకలోకమునకు పోడనియు భావము "నహికళ్యాణకృ త్కశ్చి ద్దుర్గతిం తాత! గచ్ఛతి". "ఓనాయనా! మంచిపని చేసినవాడు దుర్గతిని పొందడ"ని భగవంతు డభయమిచ్చెను అట్లయినచో వారికి మార్గ మేది? భగవంతు డిట్లు చెప్పెను "అట్లు యోగమునుండి జారినవాడు పుణ్యములు చేసినవారియొక్క లోకములను పొంది అనేక సంవత్సరములు అచట భోగముల ననుభవించి తిరిగి భూలోకమునందు శ్రీమంతుల యింటియందు పుట్టుచున్నాడు" (గీత. 6-41). (ఇచట చెప్పిన లోకము పితృయానమార్గమున పోవు చంద్రలోకమని గ్రహింపవలయును) "ఒకవేళ అట్లు శ్రీమంతుల యింటియందు పుట్టకపోయినను నిశ్చయాత్మిక బుద్ధి కలిగిన యోగుల వంశమునందు పుట్టుచున్నాడు. ఇట్టి వంశమునందు జన్మించుట యనునది లోకమున చాల దుర్లభమని ఎఱుగుము" (గీత. 6-42). "అట్లు పుట్టి పూర్వజన్మకృత సంస్కారమువలన ఆత్మానాత్మ వివేకమును పొంది జ్ఞానసిద్ధి నిమిత్తమై మరల ప్రయత్నము చేయుచున్నారు". (గీత. 6-43)

ఉపనిషత్తులయందు పితృయాన మార్గమును చెప్పుట స్వర్గఫలాపేక్షతో యజ్ఞయాగాదులను ప్రోత్సహించుటకు కాదు. మఱియేమనగ స్వర్గాపేక్షను నిరసించుటకే. స్వర్గఫలాపేక్షతో యజ్ఞముచేసి దేవతలను సంతృప్తిపఱచువారు అజ్ఞానులని శాస్త్రములు స్పష్టముగా పేర్కొన్నవి. దేవతల నారాధించి వారికి బానిసలవలె కర్మలాచరంచి స్వర్గమర్త్యముల నడుమ రాకపోకలు కలిగి మరల మరల పుట్టుచు, చచ్చుచు మాతృగర్భ నరకము ననుభవించుట వివేకులకు తగిన పనికాదు. గీతయం దిట్లు చెప్పబడినది.

"వేదత్రయవేత్తలై, అనిత్యములైన స్వర్గాది సుఖములయం దాసక్తిగలవారు సోమపానముచేసి పాపములను నశింపజేసికొని అగ్నిష్టోమాది యజ్ఞములచేత నన్నుపూజించి స్వర్గమును కోరినచో పావనమైన యింద్రలోకము చేరి దేవతాసుఖములను అనుభవించుచున్నారు." (గీత. 9-20)

"అట్టివారు విస్తారమైన స్వర్గలోక సుఖములను అనుభవించి వారివారి పుణ్యకర్మఫలము నశింపగనే మరల భూమియందు పుట్టుచున్నారు ఈ విధముగ వేదకర్మలను కామ్యార్థము చేయువారు స్వర్గమర్త్య లోకములకు నడుమ పోవుచు మరల వచ్చుచున్నారు." (గీత. 9-21)

ఇది పితృయానమార్గమును చెప్పుచున్నది.

పైన చెప్పినవారేగాక చెరువులు త్రవ్వించినవారు; బావులు త్రవ్వించిన వారు; గోదాన, భూదాన హిరణ్యాదానములు చేసినవారు సహితము పితృయానమున పోవుదురు. సామాన్యముగ పుణ్యకర్మలన్నియును యజ్ఞదాన తపస్సులలోనే చేరును. అట్లు కాకపోయినను ఎట్టి పుణ్యకర్మ లాచరించిన వారైనను పితృయానమార్గమున స్వర్గమునకు పోవుదురు. వారివారి పుణ్యావిశేషములనుబట్టి స్వర్గమున వారికి వివిధములైన భోగములు లభించును.

జి : సగుణబ్రహ్మోపాసకులు బ్రహ్మలోకములకు పోవుదురుకదా. శివకేశవులను ఆరాధించిన భక్తులు మరణించిన వారికి మార్గమేది?

వే : అట్టివారి విషయమై పెద్ద లిట్లు చెప్పిరి. వారును దేవయానము ననుసరించి బ్రహ్మలోకమునకే చనుదురు. విష్ణుభక్తులకు బ్రహ్మలోకము వైకుంఠముగను, బ్రహ్మ విష్ణుదేవుడుగను, బ్రహ్మలోకవాసులు నీలమేఘశ్యాములు, చతుర్భుజులు, పీతాంబరధారులు, శంఖచక్రగదాది సాధనములు ధరించినవారును, హారకేయూర కుండలాభిరాములుగను, (శ్రీమన్నారాయణ రూపులుగను) నుందురు. ఇట్లే శివభక్తులు బ్రహ్మలోకమునకు చనిన అచట బ్రహ్మ గంగాధరుడు, శూలహస్తుడు, జటాధారి, గజచర్మవసనుడు, త్రినేత్రుడుగను ప్రతీతమగును. ఆలోకవాసులు ప్రమథులుగ నుందురు. అట్లే దేవిని ఉపాసించినవారు, ఆలోకమునకే చనుదురు చతుర్ముఖుడు దేవీరూపముగ ప్రతీతమగును. ఉపాసకులు శివకేశవులను దేవిని సగుణబ్రహ్మముగ నుపాసించిరి. కనుక వారి జీవితకాలమునందు ఆయా యిష్ట దేవతారూపములను భావించి ధ్యానించి పూజించి నిరంతరము భక్తిచే సేవించుట వలన ఒక్క బ్రహ్మలోకమే వారి యనుభవమునందు వైకుంఠాది లోకములుగ ప్రతీతమైనది. వారికిని క్రమముక్తి కలుగును

## (9) మూడవమార్గము

ఉపనిషత్తులయందు మూడవమార్గముకూడ చెప్పబడినది. మూడవది నీచమార్గమగుటచేత దానికి పేరుపెట్టబడలేదు.

"అథైతయోః పథోర్నకతరేణ చ తానీమాని క్షుద్రాణ్యసకృదావర్తీని భూతాని భవంతి జాయస్వ మ్రియస్వేత్యేత త్తృతీయగ్ స్థానం తేనాసౌ లోకో న సంపూర్యతే తస్మాజ్జుగుప్సేత తదేష శ్లోకః". (ఛాం. 5-10-8)

"తరువాత ఈ దేవయాన పితృయాన మార్గములలో దేనియందును వెళ్ళనటువంటి ఈ క్షుద్రజంతువులగు భూతములు మాటిమాటికి రాకడపోకడ గలవియై పుట్టుచు చచ్చుచున్నవి". ఇది మూడవస్థానము అట్టివానిచేత ఈస్వర్గలోకము పొందబడదు. కనుక స్వర్గము పూర్ణముగాక యున్నది. అట్టి ఈ మూడవమార్గమును నిందింపవలయునని శ్లోకము (మంత్రము) ఈవిషయమును చెప్పుచున్నది."

'జాయస్వ మ్రియస్వ' పుట్టుట చచ్చుట అను దీనినే నరకమని చెప్పుదురు. నరకమనగా యమలోకము ఒకటి కలదని, అలోకమునకు ప్రభువు యముడను దేవత కలడని. పాపకర్మలు చేసినజీవుడు యమలోకమునకు పోయి అచ్చట యాతనాదేహములు ధరించి వారివారి కర్మానుసారముగ వారు అచ్చట పలువిధములగు దుఃఖముల ననుభవింతురని, అజీవు లావిధముగ కొంతకాలము కష్టము ననుభవించి తిరిగి భూలోకమున క్షుద్రయోనులయందు పుట్టుదురని, మనుస్మృతియందును, పురాణములయందును చెప్పబడినది. ఇది ప్రాచీన ఉపనిషత్తులయందు కనబడదు కాని కఠోపనిషత్తునం దిట్లున్నది.

**"న సాంపరాయః ప్రతిభాతి బాలం**
**ప్రమాద్యంతం విత్తమోహేన మూఢమ్ ।**
**అయం లోకో నాస్తి పర ఇతి మానీ**
**పునః పునర్వశ మాపద్యతే మే"॥** (కఠ 1-2-6)

"మూఢుడును ధనమదముచే మూఢుడై ప్రమాదమును చెందుచుండు పురుషునకు సాంపరాయము (పరలోకగమన సాధనవిశేషము) తెలియదు (ప్రకాశింపదు) ధర్మమార్గము తోపదు ఈలోకమేగాని పరలోకము లేదని వానికి దురభిమానము కలుగును. దీనివలన వాడు ధర్మము నాచరింపడు అందుచే మాటిమాటికి నాకు వశుడగుచుండును" అని యముని* వాక్యము కలదు ఈవిషయమై బ్రహ్మసూత్రములయందు చర్చింపబడెను

* యముడనగా, భూమియందు మరణించిన మానవులలో మొదటివారని పెద్దలు చెప్పుదురు యముడు పరమధర్మశీలుడు చాల నిర్మలుడు సౌమ్యమూర్తి మరణించి ఆయన స్వర్గమునకు పోగనే దేవత లాయనను గౌరవించి తమ అతిథిగా గైకొనిరట కఠోపనిషత్తునం దొక కథ కలదు వాజశ్రవసుడను ఒక మహర్షి విశ్వజిద్యాగ మొనర్చెను అతనికి నచికేతసుడను పుత్రుడొకడుండెను తండ్రి బక్కచిక్కిన గోవులను ఋత్విక్కులకు దానమిచ్చుచుండగ చూచి నచికేతసుడు దుఃఖించి తండ్రికడకేగి 'తండ్రీ! నన్నెవరికి యాగదక్షిణగా నిచ్చెద'వని

**సూ. సంయమనే త్వనుభూయేత రేషా మారోహావరోహౌ తద్గతి దర్శనాత్** (బ్ర. సూ. 3-1-13).

**తా** యముని స్థానమునకు పోయి అచ్చట వారి వారి పాపములకు తగినట్లు యమునిచే యాతనల ననుభవించి భూలోకమున తిరిగి జన్మింతురు పుణ్యకర్మలు చేయనివారి కిట్టి గమనాగమనములే గతియని శ్రుతియందు గాన్పించుచున్నదని తాత్పర్యము.

శ్రీశంకరులవారు ఈ సూత్రమునకు వ్రాసిన భాష్యము నందు "న సాంపరాయః" అన్న కఠశ్రుతి (1-2-6)ని మాత్రమే ఉదాహరించిరి. యమలోకమున పాపాత్ములు యాతన లనుభవింతు రనుట కింతకంటె వేఱొక యాధారము శ్రుతియందు లేదు.

**సూ : స్మరంతి చ** (బ్ర. సూ. 3-1-14) మనువు, వ్యాసుడు మొదలగు శిష్టులవాక్యములు స్మరింపబడినవి.

**సూ : అపి చ సప్త** (బ్ర. సూ. 3-1-15)

**తా** : మఱియును రౌరవము మొదలగు నేడు నరకములు అనికలదు. పాపాత్ములు వానిని పొందుచున్నారు. వారెట్లును చంద్రలోకమును పొందరని యభిప్రాయము. పాపాత్ములు చంద్రలోకమునకు పోవుదురా పోరాయను విషయమై చర్చ నాధారముగ నీవిషయము తేబడెను. పాపాత్ములు చంద్రలోకమున కెట్లును పోరు అని సిద్ధాంతము చేసిరి. పాపకర్మమును చేసినచో పాపియై దుఃఖముల ననుభవించుచున్నాడు" అని ఉపనిషత్తుల యందున్న వాక్యము, పాపాత్ములు నాకు వశులగుదురను యమునివాక్యమును

ప్రశ్నించెను దానికి తండ్రి బదులాడనందున మరల ప్రశ్నించెను మునికోపముతో 'నిన్ను యమునికి దానముగ నిచ్చితి' ననెను. ఋషి వాక్యానుసారము నచికేతసుడు యముని యొద్దకు పోయెను యముడింట లేకుండుటచే నచికేతసుడు మూడుదినము లుపవాసముచే నట్లే యుండెను. యము డరుదెంచి యాబాలుని సత్కరించి మూడుదినములు నాయింట నిరాహారుడవై యుంటివిగనుక మూడువరములు కోరుకొమ్మ'నియెను నచికేతసు డిట్లు కోరెను (1) తనతండ్రికి తనయందు కోపము లేకుండునట్లు (2) స్వర్గసాధనమగు అగ్ని విజ్ఞానమును ప్రసాదించునట్లును (3) మానవులు మరణించిన పిమ్మట ఆత్మ యున్నదని కొందఱును లేదని కొందఱును అనుచుందురు. దీనిని గుఱించి నాకు తెలుపు మనియును అడిగెను మూడవ వరమునకు నచికేతసు డర్హుడో కాడో యని యముడు పరీక్షించి బ్రహ్మవిద్య కాతడు అర్హుడని తెలిసి బ్రహ్మవిద్య నాతని కుపదేశించెను

నాధారము చేసికొని పైన చెప్పినట్లు పురాణాదులయందు రౌరవాది నరకములు గల యమలోకవర్ణనము కల్పించి యుండవచ్చునని తోచుచున్నది. *మానవునియందు నైతికవర్తనమును శీలమును పెంపొందించుటకు నుద్దేశించి ఇట్టికల్పన చేసియుండవచ్చును

సూత్రకారులును శ్రీ శంకరాచార్యాదులును పురాణకారులయొక్కయు, మనువుయొక్కయు, భావము నెఱిగి దానిని త్రోసివేయక వారిని గౌరవించియుందురు ఉపనిషత్తులయందు బ్రహ్మోపాసకులకు దేవయానమును, పుణ్యకర్మలు చెసినవారికి పితృయానమును, ఈ రెండును కాక పాపకర్మలు చేసినవారికి పశుపక్ష్యాదులయందు పుట్టుట యను మూడవమార్గము మాత్రమే చెప్పబడెను

తృణజలూక (గడ్డిపురుగు) ఒకచోటినుండి మఱియొక చోటునకు పోవునపుడు అది చేరవలసిన చోటును ఊదిపట్టుకొని విడువవలసిన గడ్డిపోచను విడుచునట్లు జీవుడు వర్తమానకాలము నందలి శరీరమును వదలుటకు పూర్వము రాబోవు శరీరము నూదిపట్టుకొని పూర్వదేహమును వదలునని శ్రుతి (బృహ 4-4-8) చెప్పినది. ఈమాట కర్మమేమన జీవుడు పూర్వశరీరమును విడుచునపుడు ఉత్తరశరీరమును గూర్చిన భావన కలుగుననియు, ఉత్తరశరీరమునకు కావలసిన సాధనసామగ్రి ముందే స్థిరమై యుండుననియు తాత్పర్యము మూడవ మార్గమునందు పడినజీవులు మరణించిన పిమ్మట తిరుగ హీనయోనులయందు జన్మించుటయేగాని లోకాంతర గమనము లేదని తోచుచున్నది ఈవిషయమై శ్రుతు లిట్లు చెప్పుచున్నవి

శ్లో॥ "తద్య ఇహ రమణీయ చరణా అభ్యాశో ।
హయత్తే రమణీయాం యోని మాపద్యేరన్......." ॥ (ఛాం. 5-10-7)

"వారిలో నెవరు ఈలోకమునకు వచ్చుచుందురో అట్టి వారు పుణ్యకర్మములు చేసిన వారైనయెడల మంచి యోనులను బొందుదురు".

---

* శ్రీమదాంధ్ర భాగవతమునందలి పంచమ స్కంధమునందు శుకయోగి పరీక్షిత్తునకు నరకలోకమును గుఱించి చెప్పినట్లు కలదు అందు ఇరువదిఒక్క మహానరకములును, ఏడు, నరకములును (మొత్తము 28) కలవనియు, ఎట్టెట్టి పాపకర్మములు చేసినవారు ఏవిధమగు నరకబాధ ననుభవింతురో ఆ వివరము అచ్చట చెప్పబడినది

మహాభారతము నందలి అనుశాసనిక పర్వమున శివుడు పార్వతీ దేవికి నరకమును గుఱించి చెప్పినట్లు కలదు.

శ్లో|| "......ఇహ కపూయచరణా అభ్యాశో హయతే |
కపూయం యోని మాపద్యేరన్ శ్వయోనిం |
వా సూకరయోనిం వా చండాలయోనిం వా" || (ఛాం. 5-10-7)

"ఈలోకమునకు వచ్చునట్టి పాపకర్మములు చేసినవారైనయెడల నీచయోనులను పొందుదురు శునక సూకర చండాలాది యోనుల జన్మింతురు

చండాలురనగా పాపాత్ములని యర్థము పాపకర్ములకు పరుగుదూరమున నుండుమనియెడి నార్యోక్తి ననుసరించి చండాలుడనగా పాపాత్ముడనియే యర్థముచేసికొన వలయును. కాని చండాలశబ్దమునకు హరిజనుడని అర్థము చేసికొనుటకు వీలు లేదు. ఏలయన సంఘమున శూద్రాదులని హరిజనులని వ్యవహరింపబడు కులములయం దనేకులు ధర్మాత్ములును, భక్తులును, యోగులును అప్పుడప్పుడు జన్మించుచుందురు. అట్టివారి గర్భమున జన్మించుట సుకృతఫలమేకాని పాపఫలముకాదు. కనుక పాపకర్ములగువారు పాపకర్ముల యింట బుట్టి దుఃఖముల ననుభవించుటయు, పాపకర్మలు చేయుటయు, సిద్ధించును. బృహదారణ్యక శ్రుతి మానవులను వదలి **"కీటాః పతంగా య దిదం దందశూకం"** (బృహదా. 8-2-16) అని పురుగులు, పక్షులు, పాములుగా జన్మింతురని మాత్రమే చెప్పెను.

**"ఇహ కీటో వా పతంగో వా శకునిర్వా శార్దూలో వా సింహో వా మత్స్యో వా పరశ్వావా పురుషోవాన్యోవై తేషు స్థానేషు ప్రత్యాజాయతే యథాకర్మ యథావిద్యం తమాగతం పృచ్ఛతి కోఽసీతి తంప్రతిబ్రూయాత్".** (కౌషీ.1-2).

"కీటక పతంగ శకుని శార్దూల సింహ మత్స్యాదులుగ నెట్టికర్మములు చేసినచో నెట్టిజన్మలు కలుగవలయునో అట్లు కలుగు"నని. (కౌషీ. 1-2)

శ్లో|| "యోని మన్యే ప్రపద్యం తే శరీరత్వాయ దేహినః |
స్థాణు మన్యేఽను సంయన్తి యథాకర్మ యథాశ్రుతం" || (కఠ. 2-2-7)

తా . "వారు వారు జన్మాంతరములయందు చెసిన పుణ్యాపాప కర్మల ననుసరించి వారు వారు పొందిన విజ్ఞానము ననుసరించి కొందఱు జీవులు శరీరగ్రహణార్థము గర్భవాసమును పొందుచున్నారు. కొందఱు జీవులు వృక్షాది స్థావర భావమును పొందుచున్నారు". ఈ మంత్రమున మనుష్యాది స్థావరపర్యంతము చెప్పబడినది.

శ్రీ శంకరులవారును బ్రహ్మసూత్రకారులును రౌరవాది నరకములయొక్క అస్తిత్వమును అంగీకరించుట, పురాణాదులను గౌరవించుటకేయై యుండవచ్చునని చెప్పితిని పురాణాదులయందిట్టి కల్పనచేయుటకు కారణ మిట్లుండవచ్చును. లోకమున వివేకు లగువారు జననమరణ రూపమగు సంసారమే మహానరకమని దానిని తప్పించుకొనుటయే మోక్షమని ముక్తికొఱకు ప్రయత్నింతురు. మందబుద్ధులకు జన్మభయము లేదు వారు శిశ్నోదర పరాయణు లగుటచేత వారు జన్మమే కావలయునని కోరుదురు. ముక్తి యన్న వారికి భయము. అట్టివారిని పాపకర్మములనుండి దూరముచేయుటకు పురాణాదులు రౌరవాది నరకకల్పనము చేసియుండవచ్చును ఇదియును లోకక్షేమమునకే గనుక సూత్రకారులును భాష్యకారులును నరకము కలదని యంగీకరించియుండవచ్చును.

మూఢవమార్గమున పడిన పాపాత్ములు తిరిగి యెన్నటికిని మానవులుగా పుట్టరా? వీరికి ముక్తి లేదా? అని ప్రశ్న కలుగవచ్చును. ఏదో కొంత విశేష మున్నగాని వీరికి మనుష్యజన్మ సిద్ధింపదు. అనగా మహాత్ములైన యోగుల యింటియందు గోవులు, వృషభములు, గుఱ్ఱములు మొదలగు జంతువులుగా పుట్టి వారిదర్శన స్పర్శనాదులవలనను వారి యుచ్ఛిష్టము భుజించుటవలనను, పాపక్షయమును పొంది తిరుగ మనుష్యులుగ జన్మింపవచ్చును, ముక్తులును గావచ్చును. పరమేశ్వరప్రాప్తి (పరమేశ్వర దర్శనావకాశము) కలుగుటకు ప్రతిజీవునకును అవకాశమున్నది.

## (10) ఉత్క్రాంతి

జి : దేవయానమార్గమున పోవువారికిని పితృయానమున పోవువారికిని దేహమునుండి జీవుడు నిష్క్రమించుట (ఉత్క్రాంతి) ఒక తీరుననే యుండునా లేక వేఱు వేఱు గతులుండునా?

వే .: మానవునియొక్క జీవితకాలమునందు వానిచేత ఆచరింపబడు కర్మలయొక్క ఫలితమే వాని శరీరము నుండి జీవుడు నిర్గమించుట. ప్రారబ్ధాది సమస్తకర్మలయొక్క సమష్టిఫలితము ననుసరించి మృత్యువు కలుగుచున్నది జీవుడు దేహమునుండి నిర్గమించు కాలమున.

"సోమ్య పురుషస్య ప్రయతో వాఙ్మనసి సమ్పద్యతే మనః ప్రాణే ప్రాణ స్తేజసి తేజః పరస్యాం దేవతాయాం స య ఏషోఽణిమా"
(ఛాం. 6-8-6)

ఓ సోమ్యుడా (శ్వేతకేతూ) మరణ కాలమునందు వాగింద్రియము మనస్సునందును, మనస్సు ప్రాణమున, ప్రాణము తేజస్సున, దేజస్సు (అగ్ని మొదలగు భూతములు) పరదేవతయందును లీనమగును

"వాఙ్మనసి దర్శనా చ్ఛబ్దాచ్చ" (బ్ర సూ 4-2-1) వాగాది ఇంద్రియములును జీవోపాధులగు భూతసూక్ష్మములు కూడ కలసికొని మనస్సునందును, మనస్సు ప్రాణమునందును, ప్రాణము జీవునియందును చేరి, జీవుడు హృదయమునందు ప్రవేశించును (బ్ర.సూ 4-2-2,3,4) అచట నుండి మానవుని కర్మానుసారముగ జీవుడు బయటికి నిర్గమించును పైన చెప్పిన వాగాది ఇంద్రియములు మనస్సున లయించునను మాటకు అర్థము వృత్తిలయమే కాని స్వరూపలయము కాదని విశదము చేయబడినది.

హృదయమునందు నూటొకనాడు లున్నవి. అందు నూట ఒకటవనాడి బ్రహ్మనాడి (సుషుమ్న) యనబడును. ఈ బ్రహ్మనాడి హృదయమునుండి శిరస్సునకు వ్యాపించి యుండును. మనుష్యుడు వాని జీవితకాలమునందు వానిచే నాచరింపబడిన కర్మల ననుసరించి తదనుసారముగ ఈ నాడులయందు ఏదేని ఒక నాడి వికాసము చెందియుండును. జీవితకాలమున సగుణ బ్రహ్మోపాసకులకు బ్రహ్మనాడి విచ్చియుండును. యోగాభ్యాసులకు కూడ నట్లేయుండునని కొందఱందురు. ఉపాసకులు నియమితముగ హృదయమునుండి బ్రహ్మనాడీ ద్వారమున శిరమునుండియే నిర్గమింతురు. అజ్ఞాను లగువారు నేత్రాదులలో దేనియందుండియైనను నిర్గమింతురు. యోగాభ్యాసకులకును బ్రహ్మోపాసకులకును తదితరులకంటె ముందుగ మరణసమయము తెలిసియుండవచ్చును

దేహమునుండి నిర్గమించుటకు సిద్ధముగనున్న జీవుడు ఇంద్రియాదులతో చేరి మొదట హృదయమునందు ప్రశించుటయు హృదయముయొక్క అగ్రము వికాసము జెందుటయు ననువఱకును అజ్ఞానులకు బ్రహ్మోపాసకులకు సమానమే. ఉపాసకులు తామదివఱకు ఉపాసించిన హృదయాంతర్వర్తియగు దేవుని అనుగ్రహముచే బ్రహ్మనాడీ మార్గమున శిరమునుండి బ్రహ్మరంధ్ర

ద్వారమున నియతముగ నిర్గమింతురు అజ్ఞానులు నేత్రాదులయందు దేనినుండియైనను నిర్గమింతురు (బ్ర సూ 4-2-17)

ఉపాసకుడు జీవించియుండు కాలమున ఏసగుణబ్రహ్మము నుపాసించెనో హృదయస్థితుండైన అట్టిబ్రహ్మముచే అనుగ్రహింపబడినవాడై నట ఒకటవ నాడియగు సుషుమ్నునుండి బ్రహ్మరంధ్రమును భేదించి నిష్క్రమించుచున్నాడు కనుక అర్చిరాది మార్గమున పోవుచున్నాడు. అగ్నిదేవత అట్టివానికే స్వాగత మిచ్చుచున్నది లేదా అట్టివానినే ఆద్వారమున నిర్గమింప జేయుచున్నది విద్వాంసునకును, అవిద్వాంసునకును, నుత్క్రాంతికి హృదయాగ్ర ప్రద్యోతనమును తత్ప్రవేశిత ద్వారత్వమును సమానమే యైనను, విద్వాంసు (ఉపాసకు) నకు వాని హృదయమున వసించునట్టి ఉపాస్యమగు బ్రహ్మముయొక్క అనుగ్రహ మున్నది. అవిద్వాంసునకు అట్టిది లేదు. అందువలన అవిద్వాంసుడు ఇతరనాడులనుండి నిష్క్రమించుచున్నాడు ఇందుకు శ్రుతి

మం॥ "శతం చైకా చ హృదయస్య నాడ్య
స్తాసాం మూర్ధాన మభినిస్సృతైకా
తయోర్ధ్వ మాయన్నమృతత్వమేతి
విష్వఙ్ఙన్యా ఉత్క్రమణే భవన్తి". (కఠ 2-3-16)

తా : హృదయముయొక్క నాడులు నూటయొక్కటి కలవు. ఆనూటయొక్క నాడులలో నూట ఒకటవదియగు సుషుమ్నయను నాడి మూర్ధమునుగూర్చి బయలు వెడలినది ఆ సుషుమ్నా నాడిచేత ఊర్ధ్వమునుగూర్చి వచ్చినవాడై అమృతత్వమును పొందుచున్నాడు. ఇతర నాడులనుండి ఉత్క్రమణము నొందినయెడల నానావిధగతులు కలుగుచున్నవి - ఇదే అర్థము గల మంత్రము ఛాందోగ్యము నందును గలదు (ఛాం 8-6-6).

గీతయం దిట్లున్నది :

"ఓఅర్జునా! ఎవడు అంత్యకాలమునందు ఏయేభావము (ఏ దేవతావిశేషము) ను చింతించుచున్నవాడై శరీరమును విడుచుచున్నాడో వాడు ఎల్లప్పుడు తద్భావ భావితులైన యాదేవతల స్వరూపమును పొందుచున్నాడు. (గీత 8-6). ఇందువలన తేలినదేమన, జీవితకాలమంతయు బ్రహ్మభావన (సగుణబ్రహ్మోపాసన) కలిగినవానికే అంత్యకాలమున ఆ భావము

కలుగును. మరణకాలమందు పురుషునకు కర్మానుగుణముగ సంకల్పము జనించును. ఆ సంకల్పానుసారము ఆయా నాడీమార్గమున దేహమునుండి నిర్గమింతురని సిద్ధాంతము ఉపాసకులుగాని యోగాభ్యాసపరులుగాని బ్రహ్మరంధ్రమును భేదించి దేవయానమున పోవుట మందబ్రహ్మవిద్యాధికారుల విషయమేనని, ఇది ముఖ్యబ్రహ్మవేత్తలకు సంబంధించినది కాదని భాష్యకారులమతము. భాస్కరాచార్యులు మాత్రము ముఖ్యబ్రహ్మవేత్తలకు సంబంధించినదని చెప్పినట్లు తెలియుచున్నది.

బ్రహ్మలోకమునకు పోవువారు పగలు, శుక్ల పక్షము, ఉత్తరాయణము- ఈ కాలములయందే మరణింపవలెనని లోకాచారము కలదు. కాని పగలు, శుక్లపక్షము, ఉత్తరాయణము - ఇవి కేవలము కాలములు కావనియు, ఆయా కాలముల నభిమానించు దేవతలనియు చెప్పబడెను. "**అతివాహికాస్తల్లిం గాత్**". (బ్ర.సూ. 4-3 ,4) అని బ్రహ్మసూత్రములయందు అతివాహికములు (Vehicles)గ చెప్పబడెను. జీవులు, దేజస్సు, సూక్ష్మము, గమనము గల వారయ్యు౯, వారిని బ్రహ్మలోకమును చేర్చుటకు సాధనము (Vehicle) ఉండవలయును కదా, అట్టి సాధనము అచేతనమైనదిగాక చేతనుడుగా నుండవలయును. అందువలన ఉత్తరాయణాదులు అధిదేవతా పురుషులేయని బ్రహ్మసూత్రకారుల నిశ్చయము.

గీతయందు భగవానుడు "ఓ అర్జునా! ఏకాలమునందు మృతిచెందినవారు పునరావృత్తి లేని బ్రహ్మలోకమునకు పోవుదురో ఆ కాలమును నీకు చెప్పెదనని పగలు. శుక్లపక్షము, ఉత్తరాయణము చెప్పియున్నాడు" (గీ.అ. 8-23 నుండి 25). " ఇది యోగుల నుద్దేశించి చెప్పబడినది. ఈ యోగసాంఖ్యములు స్మృతిసిద్ధము లేగాని శ్రుతిసిద్ధములు గావు. స్మార్తములగు కాలనియమము శ్రౌతములగు ఉపాసనలయందు ప్రవేశము లేద"ని (బ్ర.సూ. 4-2-21)లో వివరింపబడెను. "**యత్రకాలే త్వనావృత్తి మావృత్తితం చైవయోగినః**" అనియును "**తం కాలం**" అనియును కాలశబ్దము ప్రయోగింపబడినప్పటికిని, కాలమునుగాక అచట ఆయా కాలాభిమనదేవతలే చెప్పబడిరని శ్రీ శంకరాచార్యులు గీతాభాష్యమునందు అర్థము చెప్పిరి. భీష్ముడు శరతల్పగతుడై ఉత్తరాయణ కాలముకొఱకు నిరీక్షించినట్లు మహాభారతమున కలదుకదా యనిన అది లోకాచారమును పాటించుటకే వారట్లు చేసిరని మఱియొక కారణము కాదని

చెప్పబడెను" "**అతశ్చాయనేఽపిదక్షిణే**" (బ్ర.సూ 4-2-20) దక్షిణాయనము నందైనను, ఇతరకాలములయం దైనను మృతులైన విద్వాంసులు విద్యాఫలమగు బ్రహ్మలోకమును పొందుదురు. కాలనియమము అజ్ఞానులకొఱకు చెప్పబడినదే కాని జ్ఞానులకొఱకుగాని, ఉపాసకులకొఱకుగాని చెప్పబడియుండ లేదని బ్రహ్మసూత్ర శాంకరభాష్యమున వివరింపబడెను. (బ్ర సూ. 4-2-20).

## (11) బ్రహ్మవేత్తకు ఉత్క్రాంతి లేదు

ఇదివఱకు దేవయానమున బ్రహ్మలోకప్రాప్తియు క్రమముక్తియు చెప్పబడెను. ఇప్పుడు సద్యోముక్తి అనగా సాక్షాన్ముక్తిని గుఱించి విచారింప వలయును. ఇదివఱకు చెప్పిన అర్చిరాది మూడుమార్గములును కానిస్థితి మఱియొకటి కలదు నిర్గుణబ్రహ్మవిదుడగు పురుషుడు దేవయానమునందు ప్రయాణము చేయుట లేదు. నిర్గుణ బ్రహ్మవేత్తకు *ఉత్క్రాంతియే లేదు (బ్ర.సూ. 4-2-12) అతని ప్రాణములు నిర్గమింపవు. ఈ విశ్వమంతయు నతడే అతడే యీ విశ్వము. అతడే సర్వవ్యాపి బ్రహ్మమే అతడు అతడు ఎచటనుండి ఎచటికిపోవును? లోకమే యాతనికి ఛాయామాత్రమై యుండును. అతడు నిరంతరము బ్రహ్మానుభవమునందే యుండును అతనికి భూతముల యెడల భయములేదు. భూతము లాతనిని చూచి భయము నొందవు సర్వభూతములకు నాతడు సుహృత్తువు. అతనికి భయ మనునదియే లేదు "**....అభయం వై జనక ప్రాప్తోఽసీతి.....**" (బృహదా 6-2-4) ఓ జనకుడా! భయములేనివాడ వైతివి భయము లేనివానికి మృత్యు వెచటినుండి వచ్చును?

"**....అథా కామాయమానో యోఽకామో నిష్కామ ఆప్తకామ ఆత్మకామః న తస్య ప్రాణా ఉత్క్రామంతి బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి**" (బృహదా. 6-4-6)

ఎవడు కోర్కెలు లేనివాడో, యతడు కోరుచున్నవాడుకాడు ఏలయన అతడు నిష్కాముడు. వానినుండి కామములు నిర్గతములు అందువలన అతడు ఆప్తకాముడు ఎవడు ప్రాప్తములైన కామములు గలవాడో అతడాప్త కాముడు. అతడాత్మనుతప్ప అన్యమును కామించడు. ఆత్మకాముడగుటచే నిష్కాముడు గనుక ముక్తుడు." అట్టి వానికి ఎచ్చటికైనను పోవలయునను

* బ్రహ్మవేత్తలయందు జీవన్ముక్తులనియు విదేహముక్తులనియు ఇరుతెగలు కలరు అందు జీవన్ముక్తుడు విదేహముక్తునికంటె గొప్పవాడు వీరిని గుఱించి జ్ఞానభూమికలయందు చెప్పబడెను రాబోవు ప్రకరణము నందును చర్చింపబడును.

కోర్కె లేదు. ఎచటికిని పోడు. బ్రహ్మమును ఇచటనే పొందుచున్నాడు ఒక బాలుడు బొంగరమును త్రిప్పినయెడల దానివడి యెంతయున్నదో అంతవఱకు నది తిరిగి పడిపోవునట్లు ప్రారబ్ధ కర్మాధీనమైన శరీరము, ప్రారబ్ధము నశింపగనే కాలానుసారముగ శరీరము వదలును దీనిని సద్యోముక్తి యందురు. ఇదియే విదైహ కైవల్యము. ఈమహాత్ముడు జీవించియున్నను నతడున్నా డనియు లేడనియు కూడ చెప్పుటకు వీలులేదు. ఇతనికి శరీరము ఉన్నను లేదనియే చెప్పవచ్చును

ఇట్టివానినిగుఱించి జనకరాజు సభయందు ఆర్తభాగుడను బ్రాహ్మణునకును యాజ్ఞవల్క్యునకును జరిగిన సంవాదమునందు బ్రహ్మవేత్తయగు ముక్తపురుషుడు ఎప్పుడు మృతినొందుచున్నాడో అప్పుడు వానియొక్క వాగాది ప్రాణములు పైకి పోవుచున్నవా? లేదా? యని ఆర్తభాగుడు ప్రశ్నింపగా యాజ్ఞవల్క్యుడిట్లు సమాధానము చెప్పెను. "జ్ఞానియొక్క ప్రాణములు శరీరము నందే (పరమాత్మయందే అలలు జలమునందు కలియునట్లు) లయమొందుచున్నవి. అప్పుడు మృతినొందెనని చెప్పవచ్చునా? అతడు మృతుడు కాడు తిత్తివలె బయటివాయువు చేత పూరింపబడినవాడై ఉబ్బినవాడై చేష్టలు లేక శయనించియున్నాడు" (బృహదా 5-2-11) ఈయర్థమే జ్ఞానవాసిష్ఠమునందిట్లుచెప్పబడెను ఎట్లనగా - మనము విసన కఱ్ఱతో విసురుకొనునపుడు కదలుచున్నగాలి. విసరుకొనుటను, మానివేసినపుడెట్లు నిశ్చలత్వము నొందునో యట్లే యతడును నిశ్చలత్వము నొందును మనుష్యు డాచరించిన కర్మల ఫలితములే అతనిని తీసికొనిపోవుచున్నవి. ఇచట జీవన్ముక్తుని తీసికొని పోవుటకు కర్మలులేవు. చిత్తము సంకల్పవివర్జితము బ్రహ్మాకారమును పొందినది.

మం॥ "ఘటే నష్టే యథా వ్యోమ వ్యోమైవ భవతి స్వయమ్,
తథైవోపాధివిలయే బ్రహ్మైవ బ్రహ్మవి త్స్వయమ్ ।
క్షీరం క్షీరే యథా క్షిప్తం తైలం తైలే జలం జలే,
సంయుక్త మేకతాం యాతి తథాఽఽత్మన్యాత్మవిన్మునిః ॥
ఏవం విదేహకైవల్య సన్మాత్రత్వ మఖండితమ్"॥ (ఆత్మోపనిషత్తు)

తా : ఘటము నష్టమైనపుడు తద్ఘటాకాశము మహాకాశమున కలియునట్లు; క్షీరము క్షీరమునందును, తైలము తైలమునందును, జలము జలమునందును, కలిసి యేవిధముగ వేఱుగాక ఒక్కటే యైనట్లు బ్రహ్మవేత్త బ్రహ్మమునందు

కలిసిపోవుచున్నాడు. అఖండమును సత్తామాత్రంబుననగు విదేహకైవల్య మిదియే -"తద్ధామ పరమం మమ" (గీ. 8-21, 15-6) లో చెప్పిన స్థానమది

ఇట్టివారి యింద్రియములు ప్రాణము మొదలగునవి యే యే భూతములయందుండి పుట్టినవో వాటియందు కలిసిపోవునని కొందఱు చెప్పుదురు ఇది వ్యావహారికస్థితిని బోధించుచున్నది. ఇది సామాన్యముగ చెప్పుమాటయే గాని శాస్త్రసమ్మతము కాదు మఱేమనగా "న తస్య ప్రాణ ఉత్క్రామంతి బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి" (బృహదా. 6-4-6) అని చెప్పినట్లు అతని ప్రాణములు నిర్గమింపవు. బ్రహ్మమునే పొందుచున్నాడు అతని ప్రాణాదులు ఎచ్చటికిని పోవు. అవన్నియు పరమేశ్వరునియందే లయమగునని బ్రహ్మ సూత్రముల తాత్పర్యము. (బ్ర.సూ. 4-2-13 నుండి 16) ఇచట చెప్పబడిన లయము నిరవశేష మగునది. అజ్ఞానుల విషయమున చెప్పబడిన లయము సావశేష మైనది. ఈయర్థమే కఠోపనిషత్తు 2-3-14 నందు చెప్పబడినది.

ఇచట గమనింపదగిన విషయమిది పురుష డాచరించిన కర్మలఫలితమే అతని శరీరమునందుండి జీవుని తీసికొనిపోవు చున్నది జ్ఞానివిషయమున కర్మలు లేవు కనుక చిత్తము సంకల్ప వివర్జితము. ఇట్లు శరీరమును వదలిన జ్ఞాని కైవల్యము చెందుచున్నాడు. ముక్తుడగు పురుషుడు బ్రహ్మరంధ్రము నుండియే నియతముగ ప్రాణోత్క్రమణము చేయవలయు ననియు అట్లు చేయనివాడు ముక్తుడు కాడనియు లోకులనుకొందురు. కాని అది శాస్త్రసమ్మతముగాదు. జ్ఞాని ఏదేశమునందు, ఏకాలమునందు, ఏరోగముతో, ఏయవస్థతో శరీరత్యాగము చేసినను కైవల్యము చెందుచున్నాడు. ఎప్పుడు జ్ఞానముకలిగెనో అప్పుడే ముక్తికలిగెను

***1.శ్లో॥ తీర్థే వా శ్వపచగృహే వా నష్టస్మృతి ర్వా పరిత్యజన్ దేహమ్ ।**
**జ్ఞానఫలకాల సమయే కైవల్యం యాతి విగత శోకః ॥**

తా · పుణ్యభూమియందైనను, · శ్వపచుని యింటియందైనను, తెలివితప్పియైనను శరీరము వదలిన యోగి సమస్త దుఃఖములను వదలి ముక్తుడగుచున్నాడు. అతనికి జ్ఞానము కలిగిన కాలమునందే.ముక్తికలిగినది.

---

* 1, 2 శ్లోకములు శంకరులవారి అపరోక్షానుభూతికి తెనుగు పద్యములు రచియించిన శ్రీ॥శ్రీ॥ కోవూరు పట్టాభిరామశర్మగారి గ్రంథమునందున్నవి "వావిళ్ళ" వారి ప్రతియందు లేవు

2.శ్లో॥ రథ్యాంతరే మూత్ర పురీష మధ్యే
చాండాల వేశ్మ న్యథవా శ్మశానే ।
కృత ప్రయత్నో హ్యకృత ప్రయత్నో
దేహావసానే లభతే చ మోక్షం ॥

తా : మార్గమధ్యమందుకాని చండాల గృహమునందుగాని యత్న పూర్వకముగనో యత్నములేకనో దేహము వదలిన యోగి ముక్తుడే యగును.

## (12) అధికార పురుషులు

జి : పురాణములయందు కొన్నిచోట్ల బ్రహ్మవేత్తలకు పునర్జన్మము చెప్పబడినది. బ్రహ్మవేత్తలకు పునర్జన్మ మెట్లు కలుగును?

వే : విష్ణుదేవుని అనుజ్ఞచే అపాంతరతముడను పురాణఋషి, కృష్ణద్వైపాయనుడై జన్మించెను. నిమిశాపము వలన బ్రహ్మమానస పుత్రుడైన వసిష్ఠమహాముని మిత్రావరుణులవలన ఊర్వశికి జన్మించెను భృగువు బ్రహ్మమానస పుత్రుడయ్యును వరుణుని యజ్ఞమునందు జన్మించెను. ఈ విధముగనే సనత్కుమారుడు తాను రుద్రునకు వర మొసగుట వలన స్కందుండై జన్మించెను. దక్షనారదాదులకు కొన్ని కారణములవలన కొన్ని జన్మములు కలిగెననియును చెప్పుదురు. వీరిలో కొందఱు మాతృగర్భమునుండియు, మఱికొందఱు గర్భనరకము ననుభవింపకయే స్వసంకల్పముతో పూర్వదేహమును విడిచి మరల దేహములను ధరించినట్లును కలదు. కొంద ఱీదేహము నిలిచియుండగనే అనేక దేహదానన్యాయముచే (ఒకడేయగు పురుషుడు అనేక దేహధారణములు చేయు మాయావివలె) పెక్కు దేహములు ధరించినట్లును కలదు వీరు లోకోద్ధరణకై పరమేశ్వరునిచేత నియుక్తులై ఈవిధముగ జన్మించిరనియు వీరు 'అధికారపురుషు' లనియు చెప్పబడిరి. వీరు సర్వజ్ఞులు వీరికి ముక్తి కరతలామలకము.

జ్ఞానులకు పునర్జన్మము లేదు. పునర్జన్మ హేతువగు కర్మలు (ప్రారబ్ధము తప్ప) జ్ఞానాగ్ని చేత దగ్ధమైనవి కదా? అనుసంశయము సహజముగ కలుగుచున్నది దీనికి సమాధాన మిట్లు చెప్పబడినది. వీరు (పైన చెప్పబడినవారు) జ్ఞానము కలుగుటకు పూర్వము ఐశ్వర్యాది ఫలముల నిచ్చు నట్టి వేర్వేరు ఉపాసనలు చేసి, పిమ్మట ఐశ్వర్యములకు నాశనము

కలదని తెలిసికొని విరక్తులై బ్రహ్మజ్ఞానమును సంపాదించియుందురు. కాని వారు జ్ఞానార్జనకు పూర్వము చేసిన యుపాసనల ఫలముగా పరమేశ్వరుడు వారికి వేదప్రవర్తనాదులగు నధికారముల నిచ్చియున్నాడు. ఎంతపర్యంతము వీరికి ఉపాసనవలన కలిగిన ప్రారబ్ధముండునో అంతపర్యంతము వీరు జన్మల నెత్తుచుందురు ప్రారబ్ధము నశింపగనే కైవల్యమును పొందుదురు

కైవల్యప్రాప్తి కలుగువఱకు వారికి గల భోగమును నశింపజేయుచు, మనుష్యుడొక గృహమునుండి మఱియొక గృహమునకును, అందుండి వేరొక గృహమునకును మారునట్లు; దేహములు గ్రహించుచు తమ యధికారమును నిర్వర్తించుకొనుచుందురు. కాని, అజ్ఞానులవలె కర్మవశమున వీరికి జన్మలు కలుగవు. అయినను వీరు లోపింపని జ్ఞానము కలవారై దేహేంద్రియాదులను వశపఱచుకొని యుందురు. వారు మున్నెవ్వరో వారే తామను పూర్వజన్మజ్ఞానము కలవారు కారు

సూ|| **యావ దధికార మనస్థితి రాధికారికాణాం** (బ్ర.సూ. 3-3-32) అను సూత్రమునకు శాంకరభాష్యమున పై విషయములు వివరింపబడెను

సంసార మిట్టిదని విచారించితిమి. ఇట్టి జననమరణ రూపసంసారము, పరమాత్మ జ్ఞానముతో నివర్తించుచున్నది "సర్వజ్ఞమును శ్రేష్ఠమును, నగు బ్రహ్మమును చూచినంతనే హృదయగ్రంథి నశించుచున్నది. సర్వసంశయములు తొలగిపోవుచున్నవి. సర్వకర్మలు క్షీణించుచున్నవి" (ము. 2-2-9) అని చెప్పిన మహాత్ములకు నమస్కారము.

పునరపి జననం పున రపి మరణమ్
పునరపి జననీజఠరే శయనమ్ |
ఇహ సంసారే బహుదుస్తారే
కృపయా పారే పాహి మురారే || (భజగోవిందమ్)

ఇది పరమేశ్వరానుగ్రహమువలన మఱ్ఱిబోయిన రామసుబ్బయ్యచే రచియింపబడిన "బ్రహ్మజిజ్ఞాస" యందలి 'సంసారము-ముక్తి' అను మూడవ ప్రకరణముతో ప్రథమభాగము సంపూర్ణము

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః**

* * *

T T D Religious Publications Series No 241
Price Rs. 15/ 50 = 00

Printed and Published by Dr P Krishnaiah, I A S , Executive Officer,
T T Devasthanams, Tirupati and Printed at T T D Press, Tirupati